సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 18+32 పేజీల ఆదివారం అనుబంధం | వెల: ₹ 7.00 | సంపుటి: 16 | సంచిక: 232

ఆదివారం 12-11-2023




'ప్రజా ప్రతినిధులు చేయాల్సింది రెండే, ప్రజా సేవలో సమర్థతను చాటుకోవడమా! లేక తప్పుకోవడమా!'



విజయంతో ముగించిన ఇంగ్లండ్

వరల్డ్ కప్‌లో తమ చివరి లీగ్ మ్యాచ్‌లో పాకిస్తాన్‌పై 93 పరుగుల తేడాతో గెలుపు. మరో మ్యాచ్‌లో ఆస్ట్రేలియా 8 వికెట్ల తేడాతో బంగ్లాదేశ్‌ను చిత్తు చేసింది. నేడు బెంగళూరులో జరిగే పోరులో నెదర్లాండ్స్‌తో భారత జట్టు తలపడుతుంది. -IVలో

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL




ఓన్లీ చంద్రమోహన్

పాలూ మీగడ... పెరుగూ ఆవడా..
'నేను.. మా ఆవిడా' అన్న
తెలుగు సినిమా మధ్యతరగతి భర్త.
'సీతాపతి సంసారం' చేసి
ఆనాటి గృహిణులను
నవ్వుల్లో ముంచెత్తాడు.
ఏ వూరి 'సీతామాలక్ష్మి' ఐనా ఇష్టపడే
బంగారు కొండయ్య ఇతడే.
'కలికాలం' ధాటికి తల్లడిల్లిన
మధ్యతరగతి తండ్రి.
ఉత్త 'సగటు మనిషి'.
తెలుగు సినిమా ప్రేక్షకుడు
ప్రతి 'శుభోదయాన' తలుచుకోదగ్గ
నట త్రివిక్రముడు.
ఓన్లీ చంద్రమోహన్.


రంగుల రాట్నం



గోపాలరావు గారి అమ్మాయి
















చంద్రమోహన్ తిని అరాయించుకోని క్యారేజీ లేదు. చేసి నిభాయించని క్యారెక్టరూ లేదు.

•••

అగ్రికల్చర్ బిఎస్సీ అంటే వ్యవసాయ విద్య.
పంటలు పండించడం తెలియాలి.
చంద్రమోహన్ ఆ విద్య చదివాడు.
అందుకేనేమో తెర మీద ప్రతి పాత్రా పండించాడు.

•••

నటులు అయ్యాము, అయిపోయాము, అవ్వాలనుకుంటున్నాము అనుకున్నవారు ఇది ట్రై చేయండి. 'నిన్నే పెళ్లాడతా' సినిమా చూడండి. అందులో చలపతిరావు, చంద్రమోహన్ చాలా స్నేహితులు. పక్కపక్క ఇళ్లల్లో ఉంటారు. కుటుంబాలతో కలిసి అన్నవరం వెళితే ఏనాడో విడిపోయిన చలపతిరావు చెల్లెలు మంజుభార్గవి కనిపిస్తుంది. అయినాసరే చలపతిరావు పలకరించడు. అందుకు లక్ష్మి అభ్యంతరపెడితే చలపతిరావు చెయ్యెత్తుతాడు. చంద్రమోహన్ అడ్డుపడితే– 'ఇది మా ఇంటి వ్యవహారం' అంటాడు చలపతిరావు. అందరూ ఊరికి తిరిగొచ్చాక ,ఇంటి తలుపులు తీసి లోపలికి వచ్చాక, చంద్రమోహన్ తన భార్యతో 'పద మనింటికి' అంటాడు. అందరూ 'ఏంటిది కొత్తగా' అన్నట్టు చూస్తే ఆ క్షణం చంద్రమోహన్ 'అక్కడ నన్ను అంతమాట అంటారా' అన్నట్టు ఒక ఎక్స్‌ప్రెషన్ ఇస్తాడు. ప్రేక్షకుడికి చివుక్కు మంటుంది. ఆ ఎక్స్‌ప్రెషన్ ఎవరైతే ఇవ్వగలరో వారంతా నటులైపోయినట్టే లెక్క.

•••

ఏలూరులో 'అగ్రికల్చరల్ ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్'గా ఉద్యోగం వచ్చాక పెళ్లిసంబంధాల గోల మొదలైంది చంద్రమోహన్‌కి. కాని తన తర్వాత 8 మంది చెల్లెళ్లు, ఒక తమ్ముడు ఉన్నారు. అప్పటికే తండ్రి చనిపోవడంతో భారమంతా తనదే. కాని నాటకాలంటే ఇష్టం. శరీరాన్ని కండలు తిప్పడం ఇష్టం. సినిమాల్లో చేయాలని కోరిక. ఆదుర్తి తీస్తున్న 'లేత మనసులు' కోసం ప్రయత్నించాడు. కాని కృష్ణ, రామ్మోహన్‌లకు చాన్స్ పోయింది. ఇంకో సినిమా సెలక్షన్‌కు బెజవాడకు పరిగెడితే అక్కడ ఒక పొడవైన మనిషి తనలాగే వచ్చి ఉన్నాడు. తలెత్తి చూసిన చంద్రమోహన్ 'మీ పేరేమిటండి' అనడిగితే 'కృష్ణంరాజు' అన్నాడు. ఇలాంటి ఆజానుబాహులు ఉండగా నాకెందుకు వేషం ఇస్తారు అని అదే పోత.
కాని అవకాశం వెతుక్కుంటూ వచ్చింది.
ఇచ్చినవాడు సాక్షాత్ బి.ఎస్.రెడ్డి.
సినిమా పేరు 'రంగుల రాట్నం'.
అది 1966వ సంవత్సరం.
తెలుగు వెండితెర మీద ఈ రెండార్ల సంవత్సరంలో ఆరారు కాలాలు నిలబడే నటుడు పుట్టాడు.

•••

'కోరిక ఒకటి జనించు.. తీరక ఎడద దహించు
కోరనిదేదో వచ్చు... శాంతి సుఖాలను ఇచ్చు
ఇంతేరా ఈ జీవితం... తిరిగే రంగుల రాట్నము'...

'రంగులరాట్నం'లో పాట ఇది. కాని చంద్రమోహన్‌కు కోరిందే జరిగింది... శాంతి సుఖాలను ఇచ్చింది. మహా దర్శకుడు బి.ఎస్.రెడ్డి ఈ 'పమిడి ముక్కల పొట్టివాడు' మహా గట్టివాడు అని గ్రహించాడు. ఉద్యోగం మాన్పించి, రిస్క్ చేసి, తొలి అవకాశం ఇచ్చాడు. సినిమా పెద్ద హిట్ అయ్యింది. 'ఎవరీ చంద్రమోహన్... ఇది మొదటి సినిమానా?... మొదటి సినిమాలో ఎవరైనా ఇంత బాగా చేయగలరా?' అని అంతా ఆశ్చర్యపోవడమే. మొదటి సినిమాకే చంద్రమోహన్‌కు 'బంగారు నంది' వచ్చింది. అంతా బాగానే ఉంది... అయినా సరే నిలదొక్కుకోలేకపోతే? అని భయం. నంది అవార్డుల ఉత్సవంలో నాటి ముఖ్యమంత్రి కాసు బ్రహ్మానంద రెడ్డి చేతుల మీద నంది అందుకుంటూ 'సార్... నా కెరీర్ అటూ ఇటూ అయితే మళ్లీ మీరు నాకు వ్యవసాయ శాఖలోనే ఏదో ఒక ఉద్యోగం వేయించాలి' అని వేడుకున్నాడు చంద్రమోహన్. ఆయన నవ్వి 'మా బి.ఎస్ లాంచ్ చేస్తే ఫెయిల్ అవడం ఉండదు లేవయ్యా. భయపడకు' అని భరోసా ఇచ్చారు.
పెద్దల మాట చెక్కుల మూట అన్నారు.
వేషాలూ చెక్కులూ ఆ తర్వాత అలాగే వచ్చి పడ్డాయి.

•••

ఎన్టీఆర్, ఏఎన్ఆర్, కాంతారావుల తర్వాత ఎవరు అనుకుంటున్న కాలం అది. హరనాథ్, బాలయ్య ఒకవైపు కృష్ణ, శోభన్‌బాబు, కృష్ణంరాజు మరోవైపు అదృష్టాన్ని పరీక్షించుకుంటూ ఉంటే చంద్రమోహన్ ఎంట్రీ ఇచ్చాడు. 'ఒక జానెడు ఎత్తుంటే మా అందరినీ తినేస్తావయ్యా' అని ఎస్.వి.ఆర్, ఏ.ఎస్.ఆర్ ఆ తర్వాతి రోజుల్లో పదే పదే అన్నా చంద్రమోహన్‌కు ఒక జాన తక్కువ ఉండటమే లాభించింది. అతను మిడిల్‌క్లాస్ కథలకు సరిపోయాడు. చిన్న సినిమాల బడ్జెట్‌కు సరితూగాడు. 1970ల నాటికి మధ్యతరగతి తన ఉనికి చాటుకుంటూ భార్యాభర్తలు సంసారాలు ఈదడానికి అవస్థలు పడుతూ ఉన్నప్పుడు వారి సంసారాలకు, వాటిలోని సనిదపనిలకు చంద్రమోహన్ తెర రూపం అయ్యాడు. 'ఇంటింటి రామాయణం', 'తాయారమ్మ-బంగారయ్య', 'ఒక చల్లని రాత్రి', 'కోరికలే గుర్రాలైతే', 'శుభోదయం', 'నేను- మా ఆవిడ', ' కలహాల కాపురం'... ఎన్నని.

చంద్రమోహన గీతాలు - హిట్ సాంగ్స్ - 10

1. మేడంటే మేడా కాదు – సుఖ దు:ఖాలు
2. ఝుమ్మంది నాదం సయ్యంది పాదం – సిరిసిరిమువ్వ
3. మావిచిగురు తినగానే – సీతామాలక్ష్మి
4. నాగమల్లివో తీగమల్లివో – నాగమల్లి
5. కంచికి పోతావా కృష్ణమ్మ – శుభోదయం
6. కలనైనా క్షణమైనా – రాధా కల్యాణం
7. దాసోహం దాసోహం దాసోహం – పెళ్లిచూపులు
8. లేత చలిగాలులు – మూడుముళ్లు
9. పంటచేలో పాలకంకి నవ్వింది – పదహారేళ్ల వయసు
10. నీ తీయని పెదవులు అందకపోతే – కాంచన గంగ

•••

ఆ రోజుల్లో రేడియో వినడం మధ్యతరగతి వారికి దినచర్య.
'సీతాపతి సంసారం'లో భార్యను ఉద్యోగానికి పంపి, ఇంట్లో హౌస్ హజ్బెండ్‌గా చంద్రమోహన్ రేడియోలో వనితావని కార్యక్రమం కింద వెంకాయమ్మ గారు చెప్పే వంకాయకూర వండబోతాడు. కాని స్టేషన్లు జామ్ అయ్యి యోగా కార్యక్రమం కూడా మధ్యలో వినిపిస్తూ ఉంటుంది. 'వంకాయలను తరిగాక'... ఒక స్టేషన్... 'మెడను ముందూ వెనక్కూ మూడుసార్లు ఊపి'... ఇంకో స్టేషన్... ఒకటే నవ్వులు. ఈ సంసారం చూద్దామని ఆ రోజుల్లో మహిళా ప్రేక్షకులు మొగుళ్లను వెంటబెట్టుకుని ఎన్ని హౌస్‌ఫుల్స్ చేశారో!

•••

దర్శకుడు బాపు 'బంగారు పిచుక' (1968) తీశారు చంద్రమోహన్‌తో. 'సుఖఃదుఖాలు' (1968) లాంటి పెద్ద హిట్ పడ్డాక 'బంగారు పిచుక' హిట్ అయి ఉంటే చంద్రమోహన్ కెరీర్ ఇంకెంత స్పీడ్‌గా ఉండేదో. కాని అవలేదు. కాలం కంటే ముందు తీసిన కథ అది. ఆ దెబ్బతో చంద్రమోహన్ పొట్టగడవడానికి తోచిన పాత్ర చేయాల్సి వచ్చింది. అదే బాపు తీసిన 'సంపూర్ణ రామాయణం'లో చిన్నపాటి భరతుడి పాత్ర కూడా వేయాల్సి వచ్చింది. కాని వరుసకు అన్నయ్య అయ్యే కె.విశ్వనాథ్ తన తమ్ముణ్ణి గట్టిగా నిలబెట్టాలనుకున్నాడు. నిర్మాతను కన్విన్స్ చేసి, తన ఇమేజ్ అడ్డు వేసి 'సిరిసిరిమువ్వ' (1976)లో హీరోని చేశాడు. జయప్రదకు కూడా అది హీరోయిన్‌గా మొదటి సినిమా. విడదలయ్యాక సినిమా పెద్ద హిట్ అయ్యింది. 'గజ్జె ఘల్లుమంటుంటే... గుండె ఝల్లుమంటోంది'.


సిరిసిరి మువ్వ

•••

1978. చంద్రమోహన్ స్థానాన్ని తెలుగు సినిమాల్లో ఖరారు చేసిన సంవత్సరం. ఆ సంవత్సరమే మురారి తీసిన కె.విశ్వనాథ్ సినిమా 'సీతామాలక్ష్మి' వచ్చింది. అదే సంవత్సరం కె.రాఘవేంద్రరావు తీసిన 'పదహారేళ్ల వయసు' వచ్చింది. 'సీతామాలక్ష్మి' అంటే తెలిసిందే. కె.విశ్వనాథ్ ఎలాగూ హిట్ చేస్తాడు. కాని 'పదహారేళ్ల వయసు' సినిమాయే కత్తి మీద సాము. అది తమిళంలో భారతీరాజా తీసిన 'పదారు వయతినిలే'కి రీమేక్. అందులో పల్లెటూరి వెంగళాయి పాత్రను కమల్ హాసన్ చేశాడు. డీ గ్లామరైజ్డ్ రోల్. చంద్రమోహన్ అలా గోచి కట్టుకుని ఆ పాత్ర చేస్తే మిగిలేది గోచే అని అంతా భయపెట్టారు. తట్టాబుట్టా సర్దుకోవాల్సిందే అన్నారు. అప్పుడే చంద్రమోహన్ తన కొత్తింట్లోకి మారాడు. 'ఈ సినిమా పోతే సెంటిమెంట్ ప్రకారం పాత ఇంట్లోకి వెళ్లిపోదాం' అని భార్య జలంధరతో చెప్పాడు. మొత్తానికి 'పదహారేళ్ల వయసు' రిలీజైంది. ఒకే సంవత్సరం 'సీతామాలక్ష్మి', 'పదహారేళ్ల వయసు' సిల్వర్‌జూబ్లీలు ఇచ్చిన హీరో చంద్రమోహన్. ఎన్టీఆర్, అక్కినేని వంటి టాప్‌స్టార్ల మధ్యలో ఈ వామనస్టార్ కూడా ఉన్నాడు.'పదహారేళ్ల వయసు' తెలుగులో సూపర్ హిట్ అయ్యిందని తెలిసి ప్రత్యేకంగా చూసిన కమలహాసన్ 'మీరు చేసిన దాంట్లో పది శాతం కూడా నేను చేయలేకపోయాను' అన్నాడు. వజ్రం విలువ వజ్రానికే కదా తెలుస్తుంది.

•••

సవాలు విసిరే వేషాలు ఎప్పుడూ చంద్రమోహన్‌నే వరించాయి. తమిళంలో కె.భాగ్యరాజా వచ్చి తనే హీరోగా, దర్శకుడుగా గొప్ప గొప్ప సినిమాలు చేశాడు. అతనితో మేచ్ అయ్యే నటుడు తెలుగులో ఎవరు? చంద్రమోహనే. 'రాధా కల్యాణం' (అంద 7 నాటకల్), 'పెళ్లిచూపులు' (తూరల్ నిన్ను పోచ్చు), 'మూడుముళ్లు' (ముందానై ముడిచ్చు) ఈ భాగ్యరాజ్ సినిమాలన్నీ చంద్రమోహన్ సూపర్‌హిట్ చేశాడు. మెహమూద్ హిందీలో 'పడోసన్' తీసి హిట్ కొడితే దాని రీమేక్ 'పక్కింటి అమ్మాయి' చంద్రమోహన్ హిట్ కొట్టాడు. హిందీ 'హీరో'ను నాగార్జునతో తెలుగులో 'విక్రమ్' పేరుతో తీస్తున్నప్పుడు ఒరిజినల్‌లో ఎంతో ముఖ్యమైన పాత్ర సంజీవ్ కుమార్ చేస్తే అందుకు సరిజోడును దర్శకుడు వి. మధుసూదనరావు, నిర్మాత అక్కినేని వెతికి వెతికి చివరకు చంద్రమోహన్ దగ్గరికే వచ్చారు. 'అమర్ అక్బర్ ఆంథోని' రీమేక్ తెలుగులో 'రామ్ రాబర్ట్ రహీమ్'గా తీయాలనుకున్నప్పుడు తెలుగు వారి రిషి కపూర్ ఎవరు? ఇంకెవరు చంద్రమోహన్.

ఎన్.టి.ఆర్‌తో చిన్నపాటి విభేదం


ఎమ్జీఆర్‌తో...

చంద్రమోహన్‌కు ఎన్.టి.ఆర్‌కు ఆది నుంచి స్నేహం ఎందుకనో కుదరలేదు. చంద్రమోహన్ అక్కినేనితో దాదాపు 40 సినిమాలు చేస్తే ఎన్టీఆర్‌తో వేళ్ల మీద లెక్కించేన్ని సినిమాలే చేశారు. నిజానికి మేకప్‌మేన్ పీతాంబరం ఎన్టీఆర్‌తో 'యాదోంకి బారాత్' రీమేక్ 'అన్నదమ్ముల అనుబంధం' తీయాలనుకున్నప్పుడు చిన్న తమ్ముడి పాత్రకు చంద్రమోహన్‌ను, పెద్ద తమ్ముడి పాత్రకు మురళీమోహన్‌ను తీసుకున్నారు. అయితే ఎన్టీఆర్ చివరి నిమిషంలో ఆ పాత్రను బాలకృష్ణకు ఇచ్చారు. పీతాంబరం ఇరకాటంలో పడ్డారు. షూటింగ్ రోజున మేకప్ వేసుకోవడానికి చంద్రమోహన్ వస్తే అప్పటికే ఆ పాత్ర బాలకృష్ణకు వెళ్లిందని తెలిసింది. ఆ రోజు నుంచి చాలా రోజుల పాటు ఎన్టీఆర్ పట్ల చంద్రమోహన్ కినుకతోనే ఉన్నారు. మరోవైపు నష్టనివారణ కోసం పీతాంబరం అదే యాదోంకి బారాత్‌ను తమిళంలో ఎం.జి.ఆర్‌తో తీస్తే అందులో తమ్ముడి పాత్రను చంద్రమోహన్‌కు ఇప్పించారు– జరిగిన విషయం ఎం.జి.ఆర్‌కు చెప్పి. తమిళ యాదోంకి బారాత్‌లో పెద్దన్న, పెద్ద తమ్ముడిగా ఎం.జి.ఆర్ డబుల్ యాక్షన్ చేశారు. చంద్రమోహన్ ఎం.జి.ఆర్ తమ్ముడిగా చేసి హిట్ కొట్టారు.

•••

అన్నవరం సత్యనారాయణ స్వామికి ప్రసిద్ధి.
అన్నవరం ప్రసాదానికి ప్రసిద్ధి.
అన్నవరం చంద్రమోహన్‌కి కూడా ప్రసిద్ధి.
ఏనాడైతే ఆ మెట్ల మీద చంద్రమోహన్, రాజ్యలక్ష్మిలతో 'శంకరాభరణం'లో అందమైన ప్రేమ చూపులను దర్శకుడు కె.విశ్వనాథ్ తీశాడో ఆ రోజు అన్నవరం ఎవరు వెళ్లినా భక్తితో పాటు శంకరాభరణం కూడా గుర్తు చేసుకుంటారు. ఒక్క సీన్‌తో చంద్రమోహన్ చేసిన మేజిక్ అది. అతని చేతిలో నుంచి నీళ్ల గ్లాసు ఊరికూరికే జారిపోతే ప్రేక్షకులకు ఊరికూరికే నవ్వు వచ్చింది.

కనీ వినీ ఎరగని భోజన ప్రియుడు



చంద్రమోహన్ కనీవినీ ఎరగని భోజన ప్రియుడు. సాధారణంగా సినిమా వారు మితంగా తింటారు. కాని అదృష్టవశాత్తు చంద్రమోహన్ శరీర తత్వానికి ఆయన ఎంత తిన్నా ఏమీ ఒళ్లు పెరిగేది కాదు. షూటింగుల్లో ఆయనకు ఐదు డబ్బాల భారీ క్యారేజీ వచ్చేది. అల్లూరి సీతారామ రాజు ఔట్‌డోర్‌లో బ్రేక్‌ఫాస్ట్‌లో చంద్రమోహన్ నలభై యాభై ఇడ్లీలు తినడం చూసి గుమ్మడి, పి.జె.శర్మలాంటి వారు నోరెళ్లబెట్టారు. 'ఆకాశంలో ఎగిరేవన్నీ తిన్నాను.. నేల మీద పాకేవన్నీ తిన్నాను... నీళ్లలో ఈదేవన్నీ తిన్నాను' అని సరదాగా తన భోజనప్రియత్వాన్ని అతిశయోక్తితో ఒక ఇంటర్వ్యూలో చెప్పారు చంద్రమోహన్. అందుకే ఆయన తిని అరాయించుకోని క్యారేజీ లేదు.. వేసి నిభాయించని క్యారెక్టరూ లేదు.

•••

ఎన్టీఆర్ ఏఎన్ఆర్‌ల హయాంలో, కృష్ణ శోభన్ బాబుల హయాంలో, చిరంజీవి బాలకృష్ణల హయాంలో, రాజేంద్రప్రసాద్ రాజశేఖర్‌ల హయాంలో కూడా హీరోగా హిట్స్ ఇచ్చినవాడు చంద్రమోహన్. 'చిన్నోడు-పెద్దోడు' (1988) వరకూ హిట్స్ ఇస్తూనే ఉన్నాడు. ఆ తర్వాత 'అల్లుడు గారు' (1990)తో కేరెక్టర్ ఆర్టిస్ట్‌గా తన సత్తాను నిరూపించుకుంటూ వెళ్లాడు. అతను హీరో అయినా జనం చూశారు. కేరెక్టర్ ఆర్టిస్ట్ అయినా చూశారు. ఉదయ్‌కిరణ్, తరుణ్‌లకు తండ్రిగా వేసినా చూశారు. కృష్ణవంశీ 'గులాబీ' తక్కిన కారణాల రీత్యా ఎంత హిట్టో సరదా తండ్రిగా వేసిన చంద్రమోహన్ వల్ల అంత హిట్టు.

•••

'మీ అభిమాన నటుడు ఎవరు' అని జయసుధను అడిగితే 'ఇంకెవరు చంద్రమోహన్' అంటుందామె తడుముకోకుండా. జయసుధతో దాదాపు 25 సినిమాల్లో హీరోగా చేశాడు అతను. చంద్రమోహన్ పక్కన యాక్ట్ చేస్తే సూపర్‌స్టార్లు అవుతారనే సెంటిమెంట్ హీరోయిన్లకు ఉండేది. వాణిశ్రీ, లక్ష్మి, జయసుధ, జయప్రద, కవిత, సులక్షణ, సుహాసిని, రాధిక, విజయశాంతి... వీరంతా చంద్రమోహన్‌తో చేశాక స్టార్లు అయ్యారు. 'పదహారేళ్ల వయసు' తర్వాత శ్రీదేవి మళ్లీ ఆయనతో చేయలేనంత పెద్ద హీరోయిన్.


భార్య జలంధరతో...


•••

మిమిక్రీ ఆర్టిస్టులు అందరినీ అనుకరిస్తారు గాని చంద్రమోహన్‌ని కాదు. అతనిలాగా చేయగల వాడు అతనొక్కడే. ఆ డైలాగ్ మాడ్యులేషన్, ముఖంలో పలికించగల ఎమోషన్, కామిక్ టైమింగ్... ఇతరులకు ఎప్పటికీ రావు. కాని చంద్రమోహన్‌లో ఒక్కటే చిన్న లోపం ఉంది. బి.ఎస్.రెడ్డి గారు హెచ్చరించినా.. మార్చాలని చూసినా మారనిది– చేతులు ఊపనిదే డైలాగ్ చెప్పలేకపోవడం. చంద్రమోహన్‌ది ఎడమచేతి వాటం. ఎడమ చేతిని వేగంగా కదిలిస్తూ ఇరు చేతులూ కదిలిస్తూ డైలాగ్ చెబుతాడు.

•••

చంద్రమోహన్‌కు అవార్డులు గివార్డులు పట్టవు. సన్మానాలు గిన్మానాలు నచ్చవు. సినిమా చేశామా... ఇంటికి వెళ్లామా ఇదే ధ్యాస. అందరికీ బిరుదులిచ్చే టి.సుబ్బరామిరెడ్డి ఒకసారి ఆయనకు భారీ బిరుదు ఇచ్చి సత్కారం చేస్తానంటే 'మీరు ఇచ్చిన వెంటనే దానికి తిలోదకాలు ఇస్తాను' అని హెచ్చరించినవాడు చంద్రమోహన్. పేరుకు ముందు నట అది.. నట ఇది అని బిరుదులు వేయడం కూడా ఆయనకు ఇష్టం లేదు.
'చంద్రమోహన్‌లా వచ్చాను... చంద్రమోహన్‌లా వెళ్లిపోతాను' అనేవాడాయన.
ఎస్. అలాగే వెళ్లాడు.
హి ఈజ్ ఓన్లీ చంద్రమోహన్.

- ఖదీర్


'పారదర్శకతతో పథకాలు అమలు చేస్తే చిట్టచివరి వ్యక్తికి కూడా సంక్షేమం అందుతుంది'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 18+32 పేజీల ఆదివారం అనుబంధం

వెల: ₹ 7.00

సంపుటి: 16

సంచిక: 232

ఆదివారం 12-11-2023

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL

దీపావళి ప్రత్యేకం

వెలుగుల ఉషస్సు

చీకటి, వెలుగు అనే మాటలని కాంతి అనే సందర్భంలోనే కాక ఎన్నింటికో ఉపయోగిస్తుంటాము. లోకంలో కావలసిన వాటిని కోరుకోదగిన వాటిని వెలుగుగాను, పనికి రానివాటిని, హాని కలిగించే వాటిని చీకటిగాను చెప్పుతుంటాము. అవిద్య, అజ్ఞానం, అనారోగ్యం, దుఃఖం, బాధ, చికాకు, దరిద్రం, అపకీర్తి, అవమానం, పాపం మొదలైన మనిషి నాశనానికి, నిరాశా నిస్పృహలకి హేతువులైన వన్నీ చీకటిగాను, జ్ఞానం, ఆరోగ్యం, సంతోషం, ఆనందం, ఆహ్లాదం, కీర్తి, పుణ్యం మొదలైన మానవునికి కోరుకోదగిన, ఉపయోగపడే వన్ని వెలుగుగాను సంకేతించటం జరిగింది. అందువలననే అన్నివిధాలైన చీకట్లను పోగొట్టే వెలుగు అంటే ఇష్టపడే జాతి భారతజాతి. కనుకనే దీపాన్ని ఆరాధిస్తాము. పూజిస్తాము.

"దీపం జ్యోతి పరమ్ బ్రహ్మ
దీపం సర్వ తమోపహమ్
దీపేన సాధ్యతే సర్వం
సంధ్యాదీపం నమోస్తుతే!"

అని దీపాన్ని ప్రార్థిస్తాము. ఇది నిత్యకృత్యం. వరుసలుగా వందలాది, వేలాది దీపాలు వెలిగించటానికి ఎంతటి సంతోషం ఉప్పొంగి ఉండాలో కదా!

అటువంటి సందర్భం ద్వాపరయుగం చివర లో వచ్చింది. దానికి బీజం కృతయుగంలోనే పడి త్రేతా యుగంలో మొలకెత్తింది. యజ్ఞవరాహమూర్తిగా తనను ఉద్ధరించిన మహావిష్ణువుని చూసి వలచింది భూదేవి. తనకు కుమారుని ప్రసాదించమని కోరింది. ఆ సమయంలో గర్భధారణ జరిగితే అసుర లక్షణాలతో... లోక కంటకుడు అయిన కుమారుడు జన్మిస్తాడని అన్నాడు విష్ణువు. భూదేవి తమకంతో బలవంతం చేసింది. తప్పలేదు.

లోకకంటకుడు భూదేవి గర్భంలో ఉన్నాడని తెలిసిన దేవతలు ఆ బాలుడు గర్భంలో నుండి బయటకు రాకుండా చూశారు. భూదేవి విష్ణువుని వేడుకుంది. త్రేతాయుగం చివరలో కుమారుడు ఉదయిస్తాడని అభయం ఇచ్చాడు. ఆ బాలుడే నరకుడు. అతడికి పదహారు సంవత్సరాలు వచ్చిన తరువాత బ్రహ్మపుత్రానది పరీవాహక ప్రాంతంలో ప్రాగ్జ్యోతిషం రాజధానిగా కామరూపదేశానికి రాజుని చేస్తూ, ధర్మం తప్పవద్దని, గోబ్రాహ్మణులకు హాని తలపెట్టవద్దని, అలా చేస్తే కీడు వాటిల్లుతుందని హెచ్చరించాడు. ఆ మాట ననుసరించి

> "సాజ్యం
> త్రివర్తి సంయుక్తం
> వహ్నినా యోజితం మయా
> గృహాణ మంగళం దీపం
> త్రైలోక్య తిమిరాపహం!"
>
> మన ఇంట్లో వెలిగించింది ఒక్క దీపమైనా ముల్లోకాల చీకట్లను పోగొట్టాలన్నది భారతీయుల ఆశంస. ప్రపంచంలోని అన్ని దేశాలవారు, అన్ని జాతుల వారు ఏదో ఒక సందర్భంలో దీపాల పండగ చేసుకుంటారు. చీకటి అంటే ఎవరికీ ఇష్టం ఉండదు కదా! ఎవరు ఏ కారణంగా జరుపుకున్నా మనస్సులలో ఉన్న ఆనందాన్ని వ్యక్తపరచటానికి సంకేతంగా దీపాలను వెలిగిస్తారు. లోపల ఉన్న ఆనందమనే వెలుగుని బహిర్గతం చేసి, పరిసరాలని వెలిగేలా చేయటం దీపం వెలిగించటంలోని ఉద్దేశం.

చాలా కాలం భుజబలంతో తనకెవ్వరు ఎదురు లేని విధంగా ధర్మబద్ధంగానే పరిపాలించాడు. కాని, ద్వాపర యుగం చివరలో అతడిలోని అసురలక్షణాలు బహిర్గత మయ్యాయి. వేద ధర్మానికి దూరమై, తాంత్రికసాధన సత్వర ఫలవంతమని అనుసరించటం మొదలుపెట్టాడు. దానికోసం కామాఖ్యా దేవికి బలి ఇవ్వటానికి ఎంతోమంది రాజకుమారులను, పదునారు వేలమంది రాజకుమార్తెలను చెరపట్టి ఉంచాడు. అదితి కుండలాలను, వరుణుని ఛత్రాన్ని హరించాడు. దేవతలకు నిలువ నీడ లేకుండా చేశాడు. మరెన్నో దురంతాలు చేయసాగాడు.

ఇంద్రుడి అభ్యర్థన మేరకు శ్రీ కృష్ణుడు నరకునిపై యుద్ధానికి వెడుతుంటే భూదేవి అవతారమైన సత్యభామ తానూ వెంట వస్తానని ముచ్చట పడింది. అక్కడ కృష్ణుడు మూర్ఛపోతే అతడికి సేదతీర్చుతూనే యుద్ధంలో నరకుని నిలువరించింది. సత్యభామ ఉపచారాలతో తేరుకున్న కృష్ణుడు చక్రంతో నరకుని తెగటార్చాడు. అది ఆశ్వయుజ కృష్ణ చతుర్దశి. సత్యభామ కోరిక మేరకు ఆ రోజుని నరకుడి పేరుతో నరక చతుర్దశి అని పిలవటం జరిగింది. ఆ మరునాడు, అంటే, అమావాస్య నాడు ప్రజలందరు దీపాలు వెలిగించుకొని సంబరాలు చేసుకున్నారు.

ఏదైనా శుభ సంఘటన జరిగినప్పుడు కాని, ఎవరైనా మహానుభావులు పుట్టినప్పుడు కాని పండుగలు, వేడుకలు, సంబరాలు చేసుకుంటారు. కాని, ఈ సందర్భంలో ఒకరు చనిపోతే అతడి పేరు మీద చేసుకోవటం జరుగుతోంది. అతడి చావు ఎందు కంతగా సంతోషప్రదమయింది?

నరకుడు భూదేవి పుత్రుడు. భూమి వసుంధర. అన్ని రకాలైన ఓషధులు, ఖనిజాలు ఇచ్చేది భూదేవియే. భూపుత్రుడైన నరకునికి వాటన్నిటి మీద వారసత్వపు అధికారం ఉంది. కాని అతడు ఆ అధికారాన్ని దుర్వినియోగం చేశాడు. సంపదలతో పాటు వెలుగుని కూడా ఎవరికీ అందకుండా తానే స్వంతం చేసుకున్నాడు. ప్రాగ్జ్యోతిషమంటే ముందుగా వెలుగు ప్రసరించే ప్రాంతం. భారతదేశంలో మొదటి సూర్యకిరణం భూమిని సోకేది అక్కడే కదా!

ముందుగా తనకి అందిన వెలుగుని ఇతరులకి చేరకుండా అడ్డుపడేవాడట!

నరకుని భయానికి పగటిపూట బయటకు రావటానికి భయం. వద్దామన్నా వెలుగు లేదు. రాత్రిపూట దీపం వెలిగిస్తే తమ ఉనికి తెలుస్తుందనే భయం. మొత్తానికి చీకట్లో, భయమనే చీకట్లో మగ్గారు. భయ కారణం పోగానే ఇన్నాళ్ళ దీపాలు, కరువుతీరా వెలిగించుకొని పండుగలు, వేడుకలు, సంబరాలు చేసుకున్నారు. ఆ శుభ సంఘటనని స్మరించుకుంటూ ప్రతి సంవత్సరం ఆశ్వయుజ కృష్ణ అమావాస్యనాడు దీపాలు వెలిగించటం సంప్రదాయం అయింది.

ఆశ్వయుజ బహుళ అమావాస్య నాడు లక్ష్మీదేవి క్షీరసాగరం నుండి ఆవిర్భవించి, విష్ణువుని వివాహ మాడింది. దానితో దేవతలకు పోయిన స్వర్గలక్ష్మి లభించింది. కనుక దేవతలు కూడా దీపావళిని ఆనందంగా జరుపుకుంటారు. మనలోనూ, కుటుంబంలోనూ, సమాజంలోనూ, దేశంలోనూ, భూమండలం అంతా కప్పిన అన్నివిధాలైన అంధకారాలు పటాపంచాలు అయ్యే విధంగా దీపాలని వెలిగించి దీపావళిని దివ్య దీపావళిగా ఆనందోత్సాలతో జరుపుకుందాం. వెలుగులని పంచుదాం.

– డా. ఎన్.అనంతలక్ష్మి



నరకుని సంహరించినదెవరు?

స్వంత కొడుకునైనా దుష్టుడైతే సంహరించటానికి అంగీకరించే, సహకరించే ఉత్తమ మాతృ హృదయానికి సంకేతం సత్యభామ. సౌందర్యానికి, స్వాభిమానానికి, మితిమీరిన కృష్ణుడి పట్ల ఉన్న ప్రేమకి, పరాక్రమానికి పరాకాష్ఠగా మాత్రమే సత్యభామ ప్రసిద్ధం. కాని, మూర్తీభవించిన మాతృత్వం కూడా. ఒక్క దుష్టుడైన కుమారుడు లేకపోతే కోటానుకోట్ల బిడ్డలకి మేలు కలుగుతుంది అంటే అతడిని శిక్షించటానికి అంగీకరించేది విశ్వమాతృ హృదయం. ఆ శిక్ష అతడు మరిన్ని దుష్కృత్యాలు చేసి, మరింత పాపం మూట కట్టుకోకుండా కాపాడుతుంది. ఇది బిడ్డపై ఉన్న ప్రేమ కాదా! బిడ్డ సంహారాన్ని ప్రత్యక్షంగా చూడటమే కాదు, ప్రోత్సహించి, సహాయం చేసిన కారణంగా కాబోలు, నరకాసురుణ్ణి సత్యభామయే సంహరించింది అనే అపోహ ఉన్నది.

లక్ష్మీపూజ ఎందుకు?

దీపావళి నాడు లక్ష్మీదేవిని పూజించటం సంప్రదాయం. ఆనాడు లక్ష్మీదేవి పాలసముద్రం నుండి ఆవిర్భవించి, నారాయణుణ్ణి చేపట్టింది. వ్యాపారస్తులు లక్ష్మీదేవిని పూజించి ఈ రోజే కొత్త లెక్కల పుస్తకాలు మొదలుపెడతారు. లక్ష్మీదేవి ఆ నాడు సంధ్యాసమయం తరువాత తన వాహనమైన గుడ్లగూబని అధిరోహించి విహారానికి బయలుదేరి, తన స్వరూపాలైన దీపాలు ఉన్న ఇంట ప్రవేశిస్తుంది. కనుక లక్ష్మీదేవికి ఆహ్వానం పలుకుతూ ఎన్నో దీపాలు వెలిగిస్తారు. తరువాత బాణసంచా పేలుస్తారు. దీపాలు వరుసగా వెలిగిస్తారు కనుక ఈ పండగను దీపావళి అంటారు.

జ్ఞాన జ్యోతులు

అన్ని సంప్రదాయాల వారు దీపావళి జరుపుకోవటానికి వారి కారణాలు వారికి ఉన్నాయి. ఎవరు ఏ కారణంగా జరుపుకున్నా మనస్సులలో ఉన్న ఆనందాన్ని వ్యక్తపరచటానికి సంకేతంగా దీపాలను వెలిగిస్తారు. లోపల ఉన్న ఆనందమనే వెలుగుని బహిర్గతం చేసి, పరిసరాలని అంతా వెలిగేట్టు చేయటం దీపం వెలిగించటంలోని ప్రధాన ఉద్దేశం. ముందురోజు నరకచతుర్దశి నాడు తెల్లవారుజామున చంద్రుడు ఉండగా నువ్వులనూనెతో అభ్యంగన స్నానం చేస్తారు. పెద్దలు యముడికి తర్పణాలు ఇస్తారు. పిండివంటలు, కొత్తబట్టలతో ఆనందంగా గడుపుతారు. మరునాడు దీపావళి. అమావాస్య పితృతిథి. పైగా దక్షిణాయనం. కనుక మధ్యాహ్న సమయంలో పితృదేవతలకు తర్పణాలు ఇస్తారు.



సాక్షి స్పోర్ట్స్



ఆర్చరీలో తొలి ఒలింపిక్స్ బెర్తు తెచ్చిన ధీరజ్

ఆంధ్రప్రదేశ్ ఆర్చర్ బొమ్మదేవర ధీరజ్ ఆర్చరీలో తొలి ఒలింపిక్స్ కోటా బెర్తును తెచ్చిపెట్టాడు. బ్యాంకాక్‌లో జరుగుతున్న ఆసియా కాంటినెంటల్ క్వాలిఫికేషన్ టోర్నమెంట్‌లో ధీరజ్ రజతం సాధించాడు. ఫైనల్లో స్వర్ణ పతకంపై గురిపెట్టిన 22 ఏళ్ల తెలుగు కుర్రాడు 5-6తో జి సియాంగ్ లిన్ (చైనీస్ తైపీ) చేతిలో ఓడి... రజతంతో సరిపెట్టుకున్నాడు. అంతకుముందు క్వార్టర్స్‌లో ధీరజ్ 6-0తో సాదిగ్ అష్రాఫి బవిలి (ఇరాన్)పై, సెమీ ఫైనల్లో 6-0తో మొహమ్మద్ హొస్సేన్ గొల్షాని (ఇరాన్)పై విజయం సాధించాడు. ఈ ఈవెంట్‌లో ఫైనల్ చేరిన ఇద్దరికి మాత్రమే ఒలింపిక్స్ కోటా బెర్తు లభిస్తుంది. మహిళల విభాగంలో అంకిత భకత్ క్వార్టర్ ఫైనల్లోనే ఓడిపోవడంతో బెర్తు దక్కలేదు.

ప్రపంచకప్ సెమీ ఫైనల్

భారత్ X న్యూజిలాండ్
నవంబర్ 15 (ముంబై)

ఆస్ట్రేలియా X దక్షిణాఫ్రికా
నవంబర్ 16 (కోల్‌కతా)

మిచెల్ మార్ష్ వీరవిహారం



- 132 బంతుల్లో 17 ఫోర్లు, 9 సిక్సర్లతో 177 నాటౌట్
- విజయంతో ముగించిన ఆస్ట్రేలియా
- 8 వికెట్లతో బంగ్లాదేశ్ చిత్తు

పుణే: ఐదు సార్లు విజేత ఆస్ట్రేలియా ప్రపంచకప్‌లో లీగ్ దశను ఘనంగా ముగించింది. ఆరంభంలో తడబడి రెండు మ్యాచ్‌లు ఓడినా...ఆ తర్వాత ప్రతీ మ్యాచ్‌కు తమ ఆటను మెరుగుపర్చుకుంటూ వచ్చింది. సెమీఫైనల్ స్థానం ఖాయమైన తర్వాతా అదే దూకుడును కనబర్చి ఏడో విజయాన్ని తమ ఖాతాలో వేసుకుంది. శనివారం జరిగిన పోరులో ఆసీస్ 8 వికెట్ల తేడాతో బంగ్లాదేశ్‌ను చిత్తు చేసింది.

టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన బంగ్లాదేశ్ 50 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 306 పరుగులు చేసింది. తౌహీద్ హ్రిదయ్ (79 బంతుల్లో 74; 5 ఫోర్లు, 2 సిక్స్‌లు), నజ్ముల్ హొస్సేన్ (57 బంతుల్లో 45; 6 ఫోర్లు) రాణించగా...తన్‌జిద్ (36), లిటన్ దాస్ (36), మహ్మదుల్లా (32), మెహదీ హసన్ మిరాజ్ (29) ఫర్వాలేదనిపించారు. ఆ తర్వాత ఆస్ట్రేలియా 44.4 ఓవర్లలో 2 వికెట్లకు 307 పరుగులు చేసి విజయాన్నందుకుంది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' మిచెల్ మార్ష్ (132 బంతుల్లో 177 నాటౌట్; 17 ఫోర్లు, 9 సిక్సర్లు) విధ్వంసకర బ్యాటింగ్ ప్రదర్శన కనబర్చగా, స్టీవ్ స్మిత్ (64 బంతుల్లో 63 నాటౌట్; 4 ఫోర్లు, 1 సిక్స్) అతనికి అండగా నిలిచాడు. వీరిద్దరు మూడో వికెట్‌కు 22.3 ఓవర్లలోనే అభేద్యంగా 175 పరుగులు జోడించారు. డేవిడ్ వార్నర్ (61 బంతుల్లో 53; 6 ఫోర్లు) కూడా అర్ధసెంచరీ చేశాడు.

స్కోరు వివరాలు

బంగ్లాదేశ్ ఇన్నింగ్స్: తన్‌జిద్ (సి) అండ్ (బి) అబాట్ 36; లిటన్ (సి) లబుషేన్ (బి) జంపా 36; నజ్ముల్ రనౌట్ 45; తౌహిద్ (సి) లబుషేన్ (బి) స్టొయినిస్ 74; మహ్మదుల్లా రనౌట్ 32; ముష్ఫికర్ (సి) కమిన్స్ (బి) జంపా 21; మెహిదీ హసన్ మిరాజ్ (సి) కమిన్స్ (బి) అబాట్ 29; నజుమ్ రనౌట్ 7; మెహదీ హసన్ నాటౌట్ 2; తస్కిన్ నాటౌట్ 0; ఎక్స్‌ట్రాలు 24; **మొత్తం (50 ఓవర్లలో 8 వికెట్లకు) 306. వికెట్ల పతనం:** 1-76, 2-106, 3-170, 4-214, 5-251, 6-286, 7-303, 8-304. **బౌలింగ్:** హాజల్‌వుడ్ 7-1-21-0, కమిన్స్ 8-0-56-0, అబాట్ 10-0-61-2, మార్ష్ 4-0-48-0, జంపా 10-0-32-2, హెడ్ 6-0-33-0, స్టొయినిస్ 5-0-45-1.

ఆస్ట్రేలియా ఇన్నింగ్స్: హెడ్ (బి) తస్కిన్ 10; వార్నర్ (సి) నజ్ముల్ (బి) ముస్తఫిజుర్ 53; మార్ష్ నాటౌట్ 177; స్మిత్ నాటౌట్ 63; ఎక్స్‌ట్రాలు 4; **మొత్తం (44.4 ఓవర్లలో 2 వికెట్లకు) 307. వికెట్ల పతనం:** 1-12, 2-132. **బౌలింగ్:** తస్కిన్ అహ్మద్ 10-0-61-1, మెహిదీ హసన్ 9-0-38-0, నజుమ్ అహ్మద్ 10-0-85-0, మెహిదీహసన్ మిరాజ్ 6-0-47-0, ముస్తఫిజుర్ 9.4-1-76-1.

పరుగుల ధమాకాకు భారత్ సిద్ధం

- నేడు ప్రపంచకప్‌లో చివరి లీగ్ మ్యాచ్
- నెదర్లాండ్స్‌తో టీమిండియా పోరు
- మ.గం.2.00నుంచి స్టార్ స్పోర్ట్స్‌లో, హాట్ స్టార్‌లో ప్రత్యక్ష ప్రసారం



ఒక మ్యాచ్‌ను మించి మరో మ్యాచ్‌లో మెరుగైన ప్రదర్శన...ఒకరితో పోటీ పడి మరొకరు చెలరేగుతూ విజయాల్లో తమ భాగస్వామ్యం...ఎదురు లేని ఆటతో దూసుకుపోతున్న భారత జట్టు ప్రపంచకప్‌లో లీగ్ దశను అజేయంగా ముగించేందుకు సిద్ధమైంది. ఎనిమిది వరుస విజయాల తర్వాత చివరి పోరులోనూ నెగ్గి స్కోరును 9/9కు చేర్చాలని టీమిండియా పట్టుదలగా ఉంది. పెద్ద పెద్ద జట్లే రోహిత్ సేన ముందు నిలవలేకపోగా...బలహీనమైన నెదర్లాండ్స్ ఇప్పుడు ఎదురుగా ఉంది.

బెంగళూరు: వరల్డ్ కప్‌లో ఎప్పుడో సెమీస్ స్థానాన్ని ఖాయం చేసుకున్న టీమిండియా వరుసగా తొమ్మిదో విజయాన్ని ఆశిస్తోంది. 2003 ప్రపంచకప్‌లో భారత్ వరుసగా 8 మ్యాచ్‌లు నెగ్గింది. ఇప్పుడు మరో మ్యాచ్‌లో గెలిస్తే కొత్త ఘనత నమోదవుతుంది. ఈ ప్రపంచకప్‌లోనే ఆఖరి లీగ్ మ్యాచ్ (45వ)లో నేడు నెదర్లాండ్స్‌తో భారత్ తలపడుతుంది. బలాబలాలు, అంచనాల ప్రకారం టీమిండియా డచ్‌కంటే ఎన్నో రెట్లు మెరుగైన స్థితిలో ఉంది. పిచ్ బ్యాటింగ్‌కు బాగా అనుకూలం. ఈ వరల్డ్ కప్‌లో కూడా భారీ స్కోర్లే నమోదు కాగా, మ్యాచ్ రోజు వర్షసూచన లేదు.

ప్రసిధ్‌కు అవకాశం...

భారత జట్టు జైత్రయాత్ర చూస్తే తుది జట్టులో నిజానికి ఎలాంటి మార్పులు అవసరం లేదు. బుధవారం న్యూజిలాండ్‌తో జరిగే సెమీ ఫైనల్ పోరు గురించే ప్రస్తుతం భారత జట్టు ఆలోచిస్తోంది. అయితే ప్రస్తుత ప్రత్యర్థిని బట్టి చూస్తే ఒకటి రెండు మార్పులతో బరిలోకి దిగవచ్చు. పేసర్లలో ఒకరిని పక్కన పెట్టిన కొత్తగా జట్టులోకి చేరిన ప్రసిధ్ కృష్ణకు అవకాశం కల్పించవచ్చు. కర్నాటకకే చెందిన ప్రసిధ్ బరిలోకి దిగితే అతనికి ఇదే తొలి వరల్డ్ కప్ మ్యాచ్ అవుతుంది. చెన్నైలో ఆస్ట్రేలియాపై తొలి మ్యాచ్ ఆడిన తర్వాత మిగిలిన 7 మ్యాచ్‌లలో స్పిన్నర్ అశ్విన్‌కు చోటు దక్కలేదు. ఇక్కడ కుల్దీప్ స్థానంలో అతడిని ఆడించేందుకు అవకాశం ఉంది. మరో వైపు ఐపీఎల్‌లో విరాట్ కోహ్లి సొంత మైదానమైన చిన్నస్వామి స్టేడియంలో అతని ఆట కోసం అభిమానులు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. కోల్‌కతాలో 49వ సెంచరీతో సచిన్ రికార్డు సమం చేసిన కోహ్లి ఇక్కడ 50వ శతకం బాదుతాడా అనేది ఆసక్తికరం.



పోటీనిచ్చేనా...

అక్కడక్కడా కొన్ని మెరుపులు మినహా ఓవరాల్‌గా నెదర్లాండ్స్ ఆటతీరు సాధారణంగా ఉంది. పటిష్టమైన భారత్‌కు ఈ టీమ్ ఏమాత్రం పోటీనివ్వగలదనేది చూడాలి. ఓపెనర్లు డౌడ్, బరెసి శుభారంభంతో పాటు కెప్టెన్ ఎడ్వర్డ్స్, అకెర్‌మన్, డి లీడ్ బ్యాటింగ్‌లో... మీకెరెన్, వాన్ బీక్ బౌలింగ్‌లో అంచనాలకు తగినట్లుగా రాణిస్తే కొంత పోరాడవచ్చు. మరో వైపు ఆంధ్రప్రదేశ్‌లోని విజయవాడలో పుట్టి ఆపై న్యూజిలాండ్‌కు వలస వెళ్లి ప్రస్తుతం నెదర్లాండ్స్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్న తేజ నిడమనూరు తొలిసారి స్వదేశంలో భారత జట్టుపై ఆడనున్నాడు. ఈ క్షణం కోసం తాను ఉద్వేగభరితంగా ఎదురు చూస్తున్నట్లు అతను చెప్పాడు.

ఘన విజయంతో ఇంగ్లండ్ ఇంటికి



- రాణించిన స్టోక్స్, విల్లీ
- 93 పరుగులతో బట్లర్ సేన గెలుపు
- ఓటమితో పాక్ నిష్క్రమణ

కోల్‌కతా: డిఫెండింగ్ చాంపియన్‌గా ఈ వరల్డ్ కప్‌లో అడుగు పెట్టిన ఇంగ్లండ్ టోర్నీలో చెత్త ప్రదర్శనతో విమర్శలపాలైంది. వరుస ఓటములతో ఎప్పుడో సెమీస్ అవకాశాలు కోల్పోయిన ఆ జట్టు చివరకు విజయంతో టోర్నీని ముగించి ఇంటిముఖం పట్టింది. శనివారం ఈడెన్ గార్డెన్స్‌లో పాకిస్తాన్‌తో జరిగిన ఆఖరి లీగ్‌లో ఇంగ్లండ్ 93 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. టాస్ గెలిచి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన ఇంగ్లండ్ నిర్ణీత 50 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 337 పరుగుల భారీ స్కోరు చేసింది. బెన్ స్టోక్స్ (76 బంతుల్లో 84; 11 ఫోర్లు, 2 సిక్స్‌లు), జో రూట్ (72 బంతుల్లో 60; 4 ఫోర్లు), బెయిర్ స్టో (61 బంతుల్లో 59; 7 ఫోర్లు, 1 సిక్స్) అర్ధ సెంచరీలతో రాణించారు. టాస్ గెలిచి ఇంగ్లండ్ బ్యాటింగ్ ఎంచుకోవడంతోనే పాకిస్తాన్ సెమీస్ ఆశలు పూర్తిగా గల్లంతయ్యాయి. అయితే 'నామ్‌కే వాస్తే' తరహాలో లక్ష్యాన్ని లెక్క కట్టి చూస్తే... సెమీస్‌కు అర్హత సాధించాలంటే 6.4 ఓవర్లలో 338 పరుగులు చేయాలి. ఇది అసాధ్యం కావడంతో పాక్ ఊరట విజయంపై దృష్టి పెట్టింది. కానీ భారీ లక్ష్యాన్ని ఛేదించేందుకు బరిలోకి దిగిన పాక్ 43.3 ఓవర్లలో 244 పరుగుల వద్ద ఆలౌటైంది. ఆగా సల్మాన్ (45 బంతుల్లో 51; 6 ఫోర్లు, 1 సిక్స్) అర్ధ సెంచరీ సాధించగా, కెప్టెన్ బాబర్ ఆజమ్ (45 బంతుల్లో 38; 6 ఫోర్లు), రిజ్వాన్ (51 బంతుల్లో 36; 2 ఫోర్లు) కాస్త మెరుగ్గా ఆడారు. 191 పరుగులకే 9 వికెట్లు కోల్పోగా 11వ స్థానంలో బ్యాటింగ్‌కు దిగిన రవూఫ్ (23 బంతుల్లో 35; 3 ఫోర్లు, 3 సిక్సర్లు) కాసేపు మెరిపించాడు. వన్డే కెరీర్‌లో ఆఖరి మ్యాచ్ ఆడిన డేవిడ్ విల్లీ 3 వికెట్లు పడగొట్టి 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్'గా నిలిచాడు. వన్డే ప్రపంచకప్‌ల చరిత్రలో ఒక టోర్నీలో పాక్ 5 మ్యాచ్‌ల్లో ఓటమి పాలవడం ఇదే మొదటిసారి.

స్కోరు వివరాలు

ఇంగ్లండ్ ఇన్నింగ్స్: మలాన్ (సి) రిజ్వాన్ (బి) ఇఫ్తికార్ 31; బెయిర్‌స్టో (సి) సల్మాన్ (బి) రవూఫ్ 59; రూట్ (సి) షాదాబ్ (బి) షాహిన్ 60; స్టోక్స్ (బి) షాహిన్ 84; బట్లర్ రనౌట్ 27; బ్రూక్ (సి) షాహిన్ (బి) రవూఫ్ 30; అలీ (బి) రవూఫ్ 8; వోక్స్ నాటౌట్ 4; విల్లీ (సి) ఇఫ్తికార్ (బి) వసీమ్ 15; అట్కిన్సన్ (బి) వసీమ్ 0; రషీద్ నాటౌట్ 0; ఎక్స్‌ట్రాలు 19; **మొత్తం (50 ఓవర్లలో 9 వికెట్లకు) 337. వికెట్ల పతనం:** 1-82, 2-108, 3-240, 4-257, 5-302, 6-308, 7-317, 8-336, 9-336. **బౌలింగ్:** షాహిన్ 10-1-72-2, రవూఫ్ 10-0-64-3, ఇఫ్తికార్ 7-0-38-1, వసీమ్ 10-0-74-2, షాదాబ్ 10-0-57-0, సల్మాన్ 3-0-25-0. **పాకిస్తాన్ ఇన్నింగ్స్:** షఫీక్ (ఎల్బీ) (బి) విల్లీ 0; ఫఖర్ (సి) స్టోక్స్ (బి) విల్లీ 1; బాబర్ (సి) రషీద్ (బి) అట్కిన్సన్ 38; రిజ్వాన్ (బి) అలీ 36; షకీల్ (బి) రషీద్ 29; సల్మాన్ (సి) స్టోక్స్ (బి) విల్లీ 51; ఇఫ్తికార్ (సి) మలాన్ (బి) అలీ 3; షాదాబ్ (బి) రషీద్ 4; షాహిన్ (ఎల్బీ) (బి) అట్కిన్సన్ 25; వసీమ్ నాటౌట్ 16; రవూఫ్ (సి) స్టోక్స్ (బి) వోక్స్ 35; ఎక్స్‌ట్రాలు 6; **మొత్తం (43.3 ఓవర్లలో ఆలౌట్) 244. వికెట్ల పతనం:** 1-0, 2-10, 3-61, 4-100, 5-126, 6-145, 7-150, 8-186, 9-191, 10-244. **బౌలింగ్:** విల్లీ 10-0-56-3, వోక్స్ 5.3-0-27-1, రషీద్ 10-0-55-2, అట్కిన్సన్ 8-0-45-2, అలీ 10-0-60-2.

ప్రపంచకప్ పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	పా	నె.ర.రే.
భారత్	8	8	0	16	2.456
దక్షిణాఫ్రికా	9	7	2	14	1.261
ఆస్ట్రేలియా	9	7	2	14	0.841
న్యూజిలాండ్	9	5	4	10	0.743
పాకిస్తాన్	9	4	5	8	-0.199
అఫ్గానిస్తాన్	9	4	5	8	-0.336
ఇంగ్లండ్	9	3	6	6	-0.572
బంగ్లాదేశ్	9	2	7	4	-1.087
శ్రీలంక	9	2	7	4	-1.419
నెదర్లాండ్స్	8	2	6	4	-1.635

నోట్: ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, పా-పాయింట్లు, నె.ర.రే-నెట్ రన్‌రేట్


'ప్రతి రైతూ వాణిజ్యవేత్తగా మారాలి'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 18+32 పేజీల ఆదివారం అనుబంధం
వెల: ₹ 7.00
సంపుటి: 16
సంచిక: 232



ఆదివారం 12-11-2023

పాఠకులు, ఏజెంట్లు, ప్రకటనకర్తలు, శ్రేయోభిలాషులకు
సాక్షి దీపావళి శుభాకాంక్షలు

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



డబ్బిచ్చే వాడిదే తప్పు

ఎన్నికల్లో డబ్బిచ్చే నాయకులదే తప్పని ప్రముఖ దర్శకుడు ఆర్.నారాయణమూర్తి 'సాక్షి' ప్రత్యేక ఇంటర్వ్యూలో చెప్పారు.

- వివరాలు 7లో



బీజేపీకి భయపడుతున్న కేసీఆర్

కమ్యూనిస్టులను కేసీఆర్ దూరం పెట్టడానికి ప్రధాన కారణం బీజేపీకి భయపడటమేనని తమ్మినేని వీరభద్రం వ్యాఖ్యానించారు.

- వివరాలు 14లో



అయోధ్యలో 22 లక్షల దీపాలు

అయోధ్యలోని సరయూ నదీ తీరం 22 లక్షల దీపాలతో జరిగిన దీపోత్సవం గిన్నిస్ రికార్డు సృష్టించింది.

- వివరాలు 6లో



గాల్లో వేలాది ప్రాణాలు!

ఇజ్రాయెల్ ప్రతీకార దాడులు గాజాలోని ఆస్పత్రుల ముంగిట్లోకి చేరడంతో పరిస్థితి దారుణంగా దిగజారుతోంది.

- వివరాలు 6లో

శనివారం సికింద్రాబాద్ పరేడ్‌గ్రౌండ్స్‌లో మాదిగ, ఉపకులాల విశ్వరూప మహాసభకు తరలివచ్చిన ప్రజలు. వేదికపై భావోద్వేగానికి గురైన మంద కృష్ణ మాదిగను ఓదారుస్తున్న ప్రధాని మోదీ





ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణకు బీజేపీ, కేంద్ర ప్రభుత్వం తరఫున సంపూర్ణ మద్దతు ఇస్తాం. త్వరలోనే మాదిగల ఆకాంక్షను తీర్చేందుకు కృషి చేస్తాం. ఇందుకోసం ప్రత్యేకంగా కమిటీని ఏర్పాటు చేస్తాం. తెలంగాణలో దళితులకు తీరని అన్యాయం జరిగింది. కేసీఆర్ అధికారం చేపట్టిన మొదటి రోజే దళిత సీఎం హామీని తొక్కేసి.. వారి కుర్చీని కబ్జా చేశారు. దళితబంధు పేరిట పార్టీ నేతల అనుచరులకు వేలకోట్లు పంచారు. కాంగ్రెస్ పార్టీ దళితులను ఎన్నోరకాలుగా అవమానపర్చింది.

- ప్రధాని మోదీ

దళితుల ఆకాంక్షలు నెరవేర్చేది ప్రధాని మోదీ మాత్రమే. ఆయనకు సామాజిక స్పృహ ఉంది. అందుకే మాదిగ ఉపకులాల సభకు వచ్చారు. కేసీఆర్ మంత్రివర్గంలో ఒక్క మాదిగ వ్యక్తి లేరు. తక్కువ జనాభా ఉన్న కులాలకు మాత్రం ఎక్కువ మంత్రి పదవులు ఇచ్చారు. విద్య, ఉద్యోగాలు, రాజకీయాల్లో మాదిగలకు అన్యాయం జరుగుతోంది. ఎస్సీ వర్గీకరణ జరిగితేనే ఫలాలు అందుతాయి. ప్రధాని మోదీ ఎన్నో చేశారు. ఈ సమస్యను కూడా పరిష్కరించాలని కోరుతున్నా..

- మంద కృష్ణమాదిగ

ఎస్సీ వర్గీకరణకు త్వరలో కమిటీ

కేంద్రం ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తాం ● మాదిగ ఉపకులాల విశ్వరూప మహాసభలో ప్రధాని హామీ

- ఎస్సీ వర్గీకరణకు బీజేపీ ప్రభుత్వం సంపూర్ణ మద్దతు ఇస్తుంది
- ప్రస్తుతం ఈ అంశం సుప్రీంకోర్టు పరిధిలో ఉంది
- న్యాయపరమైన చిక్కులు అధిగమించేందుకు చర్యలు చేపడతాం
- దళితులకు ఇవ్వాల్సిన సీఎం కుర్చీని కేసీఆర్ కబ్జా చేశారు
- అధికారంలోకి వచ్చిన తొలిరోజునే హామీని తొక్కేశారు
- దళితబంధు నిధులను పార్టీ నేతల అనుచరులకు పంచిపెట్టారు
- దశాబ్దాలపాటు పాలించిన కాంగ్రెస్ దళితులను దగా చేసింది
- అంబేడ్కర్‌ను ఎన్నో రకాలుగా అవమానపర్చింది
- ఆప్, బీఆర్ఎస్ లిక్కర్ మాఫియాగా ఎదిగాయని ఆరోపణ

- వివరాలు 2లో

ఎస్సీ వర్గీకరణ సమస్య ఏమిటి?

- వివరాలు 2లో



చంద్రమోహన్ ఇక లేరు

కన్నుమూసిన సినీ 'ఆల్‌రౌండర్'

- కొన్నాళ్లుగా గుండె, కిడ్నీ సంబంధిత వ్యాధులకు చికిత్స
- పరిస్థితి విషమించడంతో అపోలో ఆస్పత్రిలో తుదిశ్వాస
- 900కుపైగా సినిమాల్లో నటన.. తొలి చిత్రానికే నంది అవార్డు
- తొలి తరం హీరో నుంచి నేటి తండ్రి క్యారెక్టర్ దాకా విభిన్నమైన పాత్రలు
- పార్థివదేహం వద్ద నివాళులు అర్పించిన ప్రముఖులు
- రేపు మధ్యాహ్నం అంత్యక్రియలు

3లో

ఓన్లీ చంద్రమోహన్

-ఫ్యామిలీలో

న్యూస్‌రీల్

గజ్వేల్‌లో 145 .. కామారెడ్డిలో 92



రాష్ట్రంలోని 119 శాసనసభ నియోజకవర్గాల్లో 4,798 మంది అభ్యర్థులు నామినేషన్ వేశారు. మొత్తం 5,716 సెట్ల నామినేషన్లు దాఖలయ్యాయి. సీఎం కేసీఆర్ సొంత నియోజకవర్గమైన గజ్వేల్‌లో రాష్ట్రంలోనే అత్యధికంగా 145 మంది అభ్యర్థులు నామినేషన్ వేశారు. కామారెడ్డిలోనూ 92 మంది నామినేషన్ వేయడం గమనార్హం.

- వివరాలు 5లో

కేసీఆర్‌కు రెండుచోట్లా ఓటమి తథ్యం



అసెంబ్లీ ఎన్నికల్లో గజ్వేల్, కామారెడ్డి రెండు చోట్లా సీఎం కేసీఆర్‌కు ఓటమి తప్పదని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి వ్యాఖ్యానించారు. సిరిసిల్లలో మంత్రి కేటీఆర్ కూడా ఓడిపోతారన్నారు. బీజేపీ అభ్యర్థుల చేతుల్లోనే వారిద్దరూ ఓడిపోతారన్నారు.

- వివరాలు 2లో

పరీక్షలపై పరేషాన్!



రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఈసారి టెన్త్, ఇంటర్ పరీక్షల నిర్వహణలో మార్పులుండే అవకాశం కనిపిస్తోంది. పరీక్షల నిర్వహణపై అధికారులు ఇప్పటికే పలు దఫాలుగా సమీక్షించారు. అకడమిక్ క్యాలెండర్ ప్రకారం 2024 మార్చి, ఏప్రిల్‌లలో ఇంటర్ పరీక్షలు జరగాల్సి ఉంది. ఏప్రిల్‌లో టెన్త్ పరీక్షలు నిర్వహించాల్సి ఉంది.

- వివరాలు 3లో

సెలవు

దీపావళి సందర్భంగా నేడు సాక్షి కార్యాలయానికి సెలవు. కావున సోమవారం సంచిక వెలువడదు. పునర్దర్శనం మంగళవారం.

ఇదండీ సంగతి



రాబందుల కాలం పోయి.. రైతుబంధు రాజ్యం

కరెంటు కావాలా.. కాంగ్రెస్ కావాలా: కేటీఆర్

- 3 గంటల కరెంటు చాలంటున్న రేవంత్‌ను ప్రశ్నించాలి
- రాష్ట్రంలో పెండింగ్ ప్రాజెక్టులు రన్నింగ్ ప్రాజెక్టులు అయ్యాయి
- ధరణితో రైతుల భూములకు రక్షణ కవచం ఏర్పాటు చేశాం
- కాంగ్రెస్ ఉదయ్‌పూర్ డిక్లరేషన్ ఉదయించకుండానే అస్తమించింది



సాక్షి, హైదరాబాద్: ఇప్పుడిప్పుడే కుదుట పడుతున్న తెలంగాణ రైతాంగాన్ని తిరిగి పదేళ్ల క్రితం నాటి అంధకారంలోకి నెట్టేందుకు కాంగ్రెస్ కుట్రలు పన్నుతోందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతాంగం పట్ల పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి తన అవగాహన లేమి ని బయటపెట్టుకుంటూ వ్యవసాయానికి మూడు గంటల కరెంటు సరిపోతుందని నిస్సిగ్గుగా చెబుతున్నారన్నారు. కాంగ్రెస్ అంటే కరెంటు కోతలు.. బీఆర్ఎస్ అంటే పంట కోతలు అని అన్నారు. తెలంగాణలో రాబందుల కాలం పోయి రైతుబంధు రాజ్యం వచ్చిందని, రైతుబంధు పథకాన్ని రాష్ట్రాలతో పాటు ప్రధాని మోదీ కూడా కాపీ కొట్టారన్నారు. తెలంగాణ భవన్‌లో

మిగతా 2వ పేజీలో ▶

రాష్ట్రంలో మార్పు తప్పదు

ఈసారి బైబై కేసీఆర్‌కు.. అధికారం కాంగ్రెస్‌కు..

రామగుండం, ధర్మపురి, బెల్లంపల్లి విజయభేరి సభల్లో టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి

- కాంగ్రెస్ పార్టీపై కేసీఆర్‌వన్నీ మతిలేని విమర్శలే..
- గెలిచే పరిస్థితి లేకనే సింగరేణి ఎన్నికలు వాయిదా
- కాళేశ్వరం ప్రాజెక్టులో లక్ష కోట్ల అవినీతి
- అందువల్లే మేడిగడ్డ కుంగింది.. అన్నారం పగిలింది
- కేసీఆర్ కుటుంబానికి పదవులు ఇచ్చేందుకే ప్రజలు ఉన్నారా?
- అధికారంలోకి రాగానే ఆరు గ్యారంటీలు అమలు చేస్తామని హామీ

12లో




బెల్లంపల్లి విజయభేరి సభలో మాట్లాడుతున్న రేవంత్‌రెడ్డి

ఉత్తరాఖండ్‌లో ఉమ్మడి పౌరస్మృతి!

నివేదిక సమర్పించనున్న దేశాయ్ కమిటీ

- ఆ వెంటనే అసెంబ్లీ ఆమోదం, చట్టబద్ధత
- అమలు చేస్తే దేశంలో తొలి రాష్ట్రంగా రికార్డు
- త్వరలోనే బీజేపీ పాలిత గుజరాత్‌లో కూడా!
- గోవాలో ఇప్పటికే అమల్లో ప్రత్యేక పౌరస్మృతి

6లో



క్లుప్తంగా...

గవర్నర్ తమిళిసై దీపావళి శుభాకాంక్షలు



సాక్షి, హైదరాబాద్: దీపావళి పర్వదినం సందర్భంగా రాష్ట్ర ప్రజలకు గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ శుభాకాంక్షలు తెలిపారు. చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా దీపావళి పండుగ జరుపుకుంటారని పేర్కొన్నారు. ఆధునిక సమాజంలోని చెడులపై విజయం సాధించి, శాంతి, మతసామరస్యం, సోదరభావంతో కూడిన సమాజనిర్మాణానికి ఈ పండుగ స్ఫూర్తిని కలిగిస్తుందని అన్నారు. ఆత్మనిర్భర్ భారత్ స్ఫూర్తితో పండుగ సందర్భంగా స్థానిక ఉత్పత్తులను కొనుగోలు చేసి ఇక్కడి ఉత్పత్తిదారులకు చేయూతనివ్వాలని పిలుపునిచ్చారు. దీపావళి పండుగ అందరి జీవితాల్లో వెలుగులు నింపాలని, సుఖసంతోషాలను తీసుకురావాలని ఆకాంక్షించారు.

నరకాసురులతో అప్రమత్తంగా ఉండాలి

రాష్ట్ర ప్రజలకు దీపావళి శుభాకాంక్షలు తెలుపుతూ సీఎం కేసీఆర్ సూచన



సాక్షి, హైదరాబాద్: 'మనం పయనించే ప్రగతిపథంలో అడుగడుగునా అడ్డుపడే నరకాసురులపట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి' అని ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు రాష్ట్ర ప్రజలకు సూచించారు. దీపావళి పండుగను పురస్కరించుకొని ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా, చీకటిని పారద్రోలే వెలుగుల పండుగగా దీపావళికి హిందూసంస్కృతిలో విశేషమైన ప్రాశస్త్యముందన్నారు. జీవానికి సంకేతమైన అగ్ని కొలువైన దీపాల వెలుగులు మనలో అజ్ఞానాంధకారాన్ని తొలగించి, చైతన్యాన్ని రగిలించి నూతనోత్తేజంతో ముందడుగు వేసేలా ప్రేరణనిస్తాయని తెలిపారు. ప్రజల సంక్షేమాన్ని కోరి ప్రభుత్వం జారీచేసిన మార్గదర్శకాలకు అనుగుణంగా పటాకులు కాలుస్తూ దీపావళి పండుగ జరుపుకోవాలని పిలుపునిచ్చారు. లక్ష్మీదేవి కృపాకటాక్షాలు తెలంగాణ ప్రజలపై ఉండాలనీ, ప్రతి ఇల్లు సకల శుభాలు, సిరి సంపదలతో విరాజిల్లాలని ఆకాంక్షించారు.

తెలుగు ప్రజలకు సీఎం జగన్ దీపావళి శుభాకాంక్షలు



సాక్షి, అమరావతి: ఏపీ ప్రజలకు, ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలుగువారందరికీ ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి దీపావళి సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు శనివా రం ముఖ్యమంత్రి కార్యాలయం ఒక ప్రకటన విడుదల చేసింది. దీపావళి అంటేనే కాంతి వెలుగు, చీకటిపై వెలుగు, చెడుపై మంచి, అజ్ఞానంపై జ్ఞానం, దుష్టశక్తులపై దైవశక్తి సాధించిన విజయాలకు ప్రతీకగా జరుపుకునే పండుగ అని సీఎం వైఎస్ జగన్ గుర్తు చేశారు. దీపావళి సందర్భంగా తెలుగు ప్రజలందరికీ సకల శుభాలు, సంపదలు, సౌభాగ్యాలు, విజయాలు కలగాలని ఆకాంక్షించారు. ప్రజలందరి జీవితాలు శోభాయమానంగా వెలుగొందాలని.. ప్రతి ఇంటా ఆనంద కాంతులు విరజిల్లాలన్నారు.

రేవంత్ దీపావళి శుభాకాంక్షలు

దీపావళి పండుగను రాష్ట్ర ప్రజలు సుఖశాంతు లతో ఘనంగా జరుపుకోవాలని టీపీసీసీ అధ్యక్షుడు ఎ.రేవంత్‌రెడ్డి ఆకాంక్షించారు. ఈ మేర కు ప్రజలకు ఆయన శుభాకాంక్షలు తెలిపారు. చెడుపై మంచి సాధించిన విజయంగా దీపావ ళి పండుగను జరుపుకుంటామని, రాబోయే ఎన్నికలలో తెలంగాణకు పట్టిన చీకటి పోయి వెలుగులు రావడం ఖాయమని పేర్కొన్నారు.

ఎస్సీ వర్గీకరణకు మద్దతిస్తే బీజేపీని ఓడిస్తాం

మాల ప్రజా సంఘాల జేఏసీ హెచ్చరిక



మాలల యుద్ధభేరి సభలో అభివాదం చేస్తున్న మాల సంఘాల జేఏసీ నేతలు

కవాడిగూడ (హైదరాబాద్): ఎస్సీ వర్గీకరణ విషయంలో మాల, మాదిగల మధ్యన చిచ్చుపెట్టి ఎన్నికల్లో లబ్ధి పొందేందుకు ప్రధాని మోదీ ప్రయత్నిస్తున్నారని మాల ప్రజా సంఘాల జేఏసీ చైర్మన్ జి.చెన్నయ్య ఆరోపించారు. ఎస్సీ వర్గీకరణకు మద్దతు ప్రకటిస్తే బీజేపీ నేతలను రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిస్తామని హెచ్చరించారు. ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా మాల ప్రజా సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో శనివారం ఇందిరాపార్కు ధర్నా చౌక్ వద్ద మాలల యుద్ధభేరి సభ నిర్వహించారు. ఈ సందర్భంగా చెన్నయ్య మాట్లాడుతూ, తెలంగాణలో మాదిగల కంటే మాలలు అన్ని రంగాల్లో వెనుకబడి ఉన్నారన్నారు. కొన్ని రాజకీయ పార్టీలు ఉమ్మడి ఏపీలోని లెక్కలను బూచిగా చూపుతూ మాల, మాదిగలను విడగొట్టి రాజ్యాధికారం వైపు ఆలోచించకుండా వర్గీకరణ అస్త్రాన్ని ప్రయోగిస్తున్నాయని మండిపడ్డారు. దళిత జాతిని ఐక్యంగా ఉంచేందుకు ఎలాంటి త్యాగానికైనా మాలలు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. సమావేశంలో మాల ప్రజాసంఘాల జేఏసీ వర్కింగ్ చైర్మన్లు బి. వెంకటేశ్వర్లు, ఎం.శ్రీధర్‌రావు తదితరులు పాల్గొన్నారు.



విశ్వరూప సభకు హాజరైన ప్రజలకు మందకృష్ణతో కలిసి అభివాదం చేస్తున్న ప్రధాని మోదీ. చిత్రంలో కిషన్‌రెడ్డి, ఈటల, బంగారు శ్రుతి, కె.లక్ష్మణ్ తదితరులు

ఎస్సీ వర్గీకరణకు త్వరలో కమిటీ

కేంద్రం ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తాం.. మాదిగ ఉపకులాల విశ్వరూప మహాసభలో ప్రధాని హామీ

సాక్షి, హైదరాబాద్: ఎస్సీ రిజర్వేషన్లను వర్గీకరించాలనే మాదిగ ఉపకులాల కోరిక అత్యంత న్యాయమైనదని, వారి ఉద్యమానికి బీజేపీ పార్టీతోపాటు కేంద్ర ప్రభుత్వం తరపున సంపూర్ణ మద్దతు ఇస్తామని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ప్రకటించారు. మూడు దశాబ్దాలుగా ఎమ్మార్పీఎస్ (మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి) చేస్తున్న ఉద్యమం సరైనదని, త్వరలో మాదిగల ఆకాంక్షను తీర్చేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఇందుకోసం కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ప్రత్యేకంగా కమిటీని ఏర్పాటు చేస్తామన్నారు. ఎస్సీ వర్గీకరణ అంశంపై సుప్రీంకోర్టులో కేసు విచారణలో ఉందని, ఈ క్రమంలో న్యాయపరమైన చిక్కులను అధిగమించేందుకు ప్రత్యేక చొరవ తీసుకుంటానని తెలిపారు. ఎస్సీ రిజర్వేషన్లలో మాదిగలు, మాదిగ ఉపకులాలకు తీరని అన్యాయం జరుగుతోందని, ఎస్సీ జాబితాలో ఉన్న కులాలకు జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లలో వాటా ఇవ్వాలని డిమాండ్ చేస్తూ శనివారం సికింద్రాబాద్ పరేడ్‌గ్రౌండ్స్‌లో మాదిగ, ఉపకులాల విశ్వరూప మహాసభ జరిగింది. ప్రధాని మోదీ ఇందులో ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. వివరాలు ఆయన మాటల్లోనే..

"ఎన్నో ఉద్యమాల ఫలితంగా తెలంగాణ ఏర్పాటైంది. ఈ పదేళ్లలో బీఆర్ఎస్ దళితులకు తీరని అన్యాయం చేసింది. అధికారం చేపట్టిన మొదటిరోజే దళిత సీఎం హామీని తొక్కేశారు. దళితులకు ఇవ్వాల్సిన సీఎం కుర్చీని కేసీఆర్ కబ్జా చేశారు. దళితబంధు అంటూ వేలకోట్ల రూపాయలను తమ పార్టీ నేతల విధేయులు, కార్యకర్తలకు పంచిపెట్టారు. ఈ పథకం కింద ఎలాంటి శాస్త్రీయత లేకుండా అర్హుల ఎంపిక చేపట్టడం విస్మయం కలిగించింది. దళితులకు మూడెకరాల భూమి పథకం జాడే లేదు. రైతులకు రుణమాఫీ చేస్తామన్న హామీ కూడా మోసపూరితమే. ప్రస్తుతం తెలంగాణ సంకట స్థితిలో ఉంది.

దళితులను గౌరవించేది బీజేపీ ఒక్కటే..

కాంగ్రెస్ పార్టీ దళితులను ఎన్నోరకాలుగా అవమానపర్చింది. అంబేడ్కర్‌ను రెండుసార్లు ఎన్నికల్లో ఓడించింది. పాత పార్లమెంట్‌లో అంబేడ్కర్ చిత్రపటం కూడా పెట్టలేదు. ఆయనకు భారతరత్న ఇవ్వలేదు. దళిత నేత బాబూ జగ్జీవన్‌రామ్‌ను కాంగ్రెస్ వేధించింది. బీజేపీ అధికారంలోకి వచ్చాక అంబేడ్కర్ ఫొటో పెట్టాం. భారతరత్న ఇచ్చాం. దళిత వ్యక్తి రాష్ట్రపతి కావడం కాంగ్రెస్‌కు ఇష్టం లేకున్నా రామ్‌నాథ్ కోవింద్‌ను రాష్ట్రపతిని చేశాం. బిహార్ అసెంబ్లీలో దళితబిడ్డ జితన్‌రామ్ మాంఝీని కాంగ్రెస్ మద్దతుదారు నితీశ్‌కుమార్ అవమానించారు. దళితులు అంటే వారికి చిన్నచూపు. దళితులను గౌరవించే పార్టీ బీజేపీ మాత్రమే.

ఆ పార్టీలు అవినీతిలో మునిగిపోయాయి

ఢిల్లీలో స్నేహపూర్వక పార్టీలు ఆప్, కాంగ్రెస్. ఢిల్లీలో అధికారంలో ఉన్న ఆప్‌తో బీఆర్ఎస్ జతగట్టి లిక్కర్ దందా చేస్తోంది. ఇవి దేశంలో లిక్కర్ మాఫియాగా ఎదిగాయి. ప్రజాధనాన్ని బీఆర్ఎస్ నేతలు లూటీ చేశారు. ఎన్నో రకాలుగా అవినీతికి పాల్పడ్డ పార్టీల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి.

పేదల అభివృద్ధే మా నినాదం

పేదలు అభివృద్ధి చెందాలనేదే మా ప్రభుత్వ నినాదం. కేంద్ర ప్రభుత్వ పథకాల ద్వారా ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలవారే ఎక్కువగా లబ్ధి పొందుతున్నారు. 13 లక్షల మంది దళిత విద్యార్థులకు రూ.వెయ్యి కోట్లు ఉపకార వేతనాలు అందించాం. రైతులకు అండగా ఉండేందుకు వరికి మద్దతు ధర పెంచాం. రబీ సీజన్‌లో తెలంగాణ నుంచి 20 లక్షల టన్నుల ఉప్పుడు (బాయిల్డ్) బియ్యం కొనేందుకు కేంద్రం నిర్ణయం తీసుకుంది. గరీబ్ కల్యాణ్ అన్న యోజన పథకం డిసెంబర్‌లో ముగియాల్సింది. దాన్ని మరో ఐదేళ్లపాటు కొనసాగించాలని నిర్ణయం తీసుకున్నాం.." అని ప్రధాని మోదీ తెలిపారు.

మీ ఉద్యమం స్ఫూర్తినిచ్చింది

"స్వాతంత్య్రం వచ్చాక అనేక ప్రభుత్వాలను చూశాం. ఆ ప్రభుత్వాలకు, మా ప్రభుత్వానికి తేడా గమనించాలి. మా ప్రభుత్వం సబ్‌కా సాథ్.. సబ్‌కా వికాస్.. సబ్‌కా విశ్వాస్ అనే నినాదంతో ముందుకు సాగుతుంది. సామాజిక న్యాయం చేసేందుకే మా ప్రభుత్వం ఉంది. దళితులు, గిరిజనులు, ఇతర అణగారిన వర్గాల అభ్యున్నతే మా లక్ష్యం. తెలుగు కవి గుర్రం జాషువా కవితల ప్రేరణతో పాలన సాగిస్తున్నాం. ఎస్సీ వర్గీకరణ కోసం మంద కృష్ణ మూడు దశాబ్దాలుగా పోరాడుతున్నారు. ఈ ఉద్యమానికి నా సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నా. పేదరిక నిర్మూలనే మా ప్రథమ ప్రాధాన్యం. నేను మీ నుంచి ఏమీ ఆశించి రాలేదు. మీ బాధలు తెలుసుకునేందుకే వచ్చా. దళితులకు న్యాయం చేస్తామంటూ పలు పార్టీలు మిమ్మల్ని ఓట్ల రూపంలో వాడుకున్నాయి. కానీ మీరు వన్ లైఫ్.. వన్ మిషన్‌లా చేస్తున్న ఉద్యమం నాకు స్ఫూర్తినిచ్చింది" అని మోదీ పేర్కొన్నారు.

మా ఆకాంక్షలు నెరవేర్చేది మోదీయే: మంద కృష్ణ

దళితుల ఆకాంక్షలు నెరవేర్చేది ప్రధాని మోదీ మాత్రమేనని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ పేర్కొన్నారు. బడుగులు, బలహీన వర్గాలకు అండగా ఉండే పార్టీ బీజేపీ మాత్రమేనని చెప్పారు. తెలంగాణలో బీసీని సీఎం చేస్తామని ప్రకటించింది ఒక్క బీజేపీయే అన్నారు. ప్రధాని మోదీకి సామాజిక స్పృహ ఉందని, అందుకే మాదిగ ఉపకులాల సభకు వచ్చారని చెప్పారు. కేసీఆర్ మంత్రివర్గంలో ఒక్క మాదిగ వ్యక్తి లేరని, తక్కువ జనాభా ఉన్న కులాలకు ఎక్కువ మంత్రి పదవులు ఇచ్చారని మండిపడ్డారు. కర్ణాటక నుంచి నారాయణ స్వామిని కేంద్ర మంత్రిని చేసిన ఘనత మోదీదేనని ప్రశంసించారు. విద్య, ఉద్యోగాలు, రాజకీయాల్లో మాదిగలకు అన్యాయం జరుగుతోందని, ఎస్సీ వర్గీకరణ జరిగితేనే ఫలాలు అందుతాయని స్పష్టం చేశారు. ప్రధాని మోదీ ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లు తీసుకువచ్చారని, ఏళ్ల తరబడి కాంగ్రెస్ ఊరించిన మహిళా బిల్లును అమల్లోకి తెచ్చారని చెప్పారు. ఎస్సీ వర్గీకరణ సమస్యను కూడా పరిష్కరించాలని కోరారు. ఎస్సీ వర్గీకరణకు సహకరించే మోదీకి దక్షిణాదిలోని మాదిగలంతా అండగా ఉంటారని, తాను కూడా ఓ లక్ష్మణుడిలా వెంట నిలుస్తానని చెప్పారు.

ఒకే నెలలో ఐదు సార్లు రాష్ట్రానికి!

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ప్రధాని మోదీ రాష్ట్రంలో వరుస పర్యటనలు చేపడుతున్నారు. ఇప్పటికే ఈ నెల ఏడో తేదీన, తాజాగా శనివారం హైదరాబాద్‌లో నిర్వహించిన బహిరంగ సభలకు హాజరయ్యారు. ఈ నెల 25, 26, 27 తేదీల్లోనూ బహిరంగసభలు, రోడ్‌షోలలో పాల్గొనేందుకు రాష్ట్రానికి రానున్నట్టు తెలిసింది. ఈనెల 28న ఎన్నికల ప్రచారం ముగుస్తున్న నేపథ్యంలో.. బీజేపీకి ఊపు తెచ్చేందుకు 25న కరీంనగర్, 26న నిర్మల్ బహిరంగ సభల్లో, 27న హైదరాబాద్‌లో నిర్వహించే రోడ్‌షోలో మోదీ పాల్గొననున్నట్టు పార్టీవర్గాలు చెప్తున్నాయి. ఈ పర్యటన షెడ్యూల్ ఖరారైతే.. ప్రధాని మోదీ నెల రోజుల్లోనే ఐదుసార్లు రాష్ట్రానికి వచ్చినట్టు అవుతుంది. అయితే ప్రధాని గత నెల 1, 3వ తేదీల్లో మహబూబ్‌నగర్, నిజామాబాద్‌లలో నిర్వహించిన బహిరంగ సభల్లో పాల్గొన్నారు. అవి కూడా కలిపితే రెండు నెలల్లో ఏడుసార్లు రాష్ట్రానికి వచ్చినట్టు అవుతుంది.

ఎన్నికల నేపథ్యంలో వరుసగా మోదీ పర్యటనలు

- ఇప్పటికే 7వ తేదీన, శనివారం సభల్లో పాల్గొన్న ప్రధాని
- 25న కరీంనగర్, 26న నిర్మల్‌లలో సభలు.. 27న హైదరాబాద్‌లో రోడ్‌షోకు ప్లాన్
- గత నెలలోని రెండు పర్యటనలు కలిపితే ఏడుసార్లు రాష్ట్రానికి..

దీపావళి దాటగానే జోరు

అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా దీపావళి పండుగ దాటగానే జోరు పెంచాలని బీజేపీ నిర్ణయించింది. దీపావళి తర్వాత పార్టీ ఎన్నికల మేనిఫెస్టోను విడుదల చేయనున్నారు. ఆరోజు నుంచి ప్రచార గడువు ముగిసే 28వ తేదీ వరకు ఉధృతంగా కార్యక్రమాలు చేపట్టనున్నారు. కేంద్ర హోంమంత్రి అమిత్‌షా, పార్టీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా, కేంద్ర మంత్రి రాజ్‌నాథ్‌సింగ్, యూపీ, మహారాష్ట్ర, అస్సాం, గోవా సీఎంలు యోగి ఆదిత్యనాథ్, ఏక్‌నాథ్ షిండే, హిమంత బిశ్వశర్మ, ప్రమోద్ సావంత్‌లతోపాటు పలువురు కేంద్ర మంత్రులు, పార్టీ జాతీయ నేతలు ప్రచార కార్యక్రమాల్లో పాల్గొననున్నారు.

..రైతుబంధు రాజ్యం

▶ మొదటి పేజీ తరువాయి

శనివారం పార్టీ నేతలతో కలిసి కేటీఆర్ మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో 95 శాతం చిన్న, సన్నకారు రైతులు ఉన్నారని, వ్యవసాయంలో ఎన్ని హెచ్‌పీల సామర్థ్యం ఉన్న మోటార్లు వాడతారో కూడా రేవంత్‌కు అవగాహన లేదని దుయ్యబట్టారు. గతంలో రైతులకు క్రాప్ హాలిడేలు, పరిశ్రమలకు పవర్ హాలిడేలు ప్రకటించిన చరిత్ర కాంగ్రెస్ పార్టీదన్నారు. రైతులకు 24 గంటలపాటు ఉచితంగా నాణ్యమైన విద్యుత్ ఇస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ మాత్రమేనని పేర్కొన్నారు. ఉచిత విద్యుత్ కోసం ప్రభుత్వం ప్రతి నెలా రూ.వేయి కోట్లు ఖర్చు చేస్తోందని చెప్పారు. వ్యవసాయ మోటార్లకు మీటర్లు బిగించాలని కేంద్రంలోని మోదీ ప్రభుత్వం తెలంగాణ సర్కారు మెడపై కత్తి పెట్టినా కేసీఆర్ తిరస్కరించారని స్పష్టం చేశారు. కాంగ్రెస్ తెలంగాణను నాశనం చేసిందని, కరెంటుపై కాంగ్రెస్ విధానమేంటో రాహుల్ గాంధీ స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. ఉచిత విద్యుత్ వద్దంటున్న కాంగ్రెస్ నేతలను తరిమికొట్టాలని, రేవంత్ తెలంగాణ రైతులకు క్షమాపణ చెప్పాలన్నారు. కాంగ్రెస్ ఉదయ్‌పూర్ డిక్లరేషన్ ఉదయించకుండానే అస్తమించిందన్నారు. కాంగ్రెస్ కావాలో.. కరెంటు కావాలో ప్రజలు ఆలోచించుకోవాలని చెప్పారు.

ప్రతీ నీటి బొట్టును ఒడిసి పట్టి...

తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తర్వాత ప్రతీ నీటి బొట్టును ఒడిసి పట్టి సాగు అవసరాలకు మళ్లించేందుకు తమ ప్రభుత్వం ప్రాజెక్టులను నిర్మించిందని కేటీఆర్ అన్నారు. పెండింగ్ ప్రాజెక్టులన్నీ రన్నింగ్ ప్రాజెక్టులు కావడంతో దేశం ఆశ్చర్యపోయే రీతిలో ధాన్యం పండించడంలో తెలంగాణ అగ్రస్థానానికి చేరిందన్నారు. పాలమూరు ఎత్తిపోతల పథకంతో 14 లక్షల ఎకరాలకు సాగు నీరు ఇస్తామన్నారు. గతంలో 60 లక్షల టన్నుల ధాన్యం పండే తెలంగాణలో ప్రస్తుతం మూడున్నర కోట్ల టన్నుల దిగుబడి వస్తోందన్నారు. గుంట భూమి ఉన్న రైతులకు కూడా తెలంగాణ ప్రభుత్వం రైతుబీమాను ఇస్తోందని, ఈ పథకం కోసం రూ.5,300 కోట్ల ప్రీమియం చెల్లించిందని చెప్పారు. రైతుల భూములకు రక్షణ కవచంలా ధరణి పోర్టల్ తెచ్చామని ఆయన పేర్కొన్నారు. సమావేశంలో ఎమ్మెల్సీ తాతా మధు, పార్టీ నేతలు పొన్నాల లక్ష్మయ్య, దాసోజు శ్రవణ్, ప్రొఫెసర్ శ్రీనివాస్‌రెడ్డి, కర్నె ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ ఎన్నికల ఖర్చు కోసం శంకరమ్మ విరాళం

సాక్షి, హైదరాబాద్: భారత్ రాష్ట్ర సమితి ఎన్నికల ప్రచార ఖర్చుల కోసం తెలంగాణ అమరవీరుడు శ్రీకాంతాచారి తల్లి శంకరమ్మ తన వంతుగా లక్ష రూపాయల చెక్కును ఆపార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీరామారావుకు అందజేశారు. శనివారం ఆమె హైదరాబాద్‌లో కేటీఆర్, మంత్రి జగదీశ్‌రెడ్డిలను కలిసి ఈ ఆర్థిక సాయాన్ని అందించారు. ఎన్నికల అనంతరం ఏర్పడే బీఆర్ఎస్ ప్రభుత్వంలో శంకరమ్మను మరింత గౌరవప్రదమైన స్థానంలో నిలిపే బాధ్యతను తాను స్వయంగా తీసుకుంటానని ఈ సందర్భంగా కేటీఆర్ చెప్పారు. తెలంగాణ కోసం ప్రాణత్యాగం చేసిన అమరవీరుల ఆశయాల సాధన కోసం మరోసారి బీఆర్ఎస్ పార్టీ గెలవాల్సిన అవసరం ఉందని శంకరమ్మ అన్నారు.



మంత్రి కేటీఆర్ సమక్షంలో పార్టీలో చేరిన వివిధ పార్టీల ఖమ్మం జిల్లా నేతలు. చిత్రంలో ఎంపీ వద్దిరాజు రవిచంద్ర

ఎంపీ వద్దిరాజు నేతృత్వంలో బీఆర్ఎస్‌లో చేరికలు

రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర నేతృత్వంలో ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని అశ్వారావుపేట, సత్తుపల్లి, ఇల్లందు నియోజకవర్గాలకు చెందిన పలువురు నాయకులు పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ములకలపల్లి జెడ్పీటీసీ, కాంగ్రెస్ సీనియర్ నాయకురాలు సున్నం నాగమణి, సత్తుపల్లి కాంగ్రెస్ నాయకుడు కొండూరి సుధాకర్, ఇల్లందుకు చెందిన తెలుగుదేశం సీనియర్ నాయకుడు బండి సత్యనారాయణ తదితరులు బీఆర్ఎస్‌లో చేరిన వారిలో ఉన్నారు. ఈ మేరకు కేటీఆర్ వారికి గులాబీ కండువాలు కప్పి బీఆర్ఎస్‌లోకి ఆహ్వానించారు.

చోటా భాయ్.. పెద్దన్న.. భావోద్వేగం



ఉద్వేగానికి లోనైన మందకృష్ణను ఓదారుస్తున్న మోదీ

- సభావేదికపైకి ప్రధాని మోదీ రాగానే వారంతా లేచి రెండు చేతులు పైకెత్తి మాదిగ దండోరా ఆకాంక్షను ఆయనకు వినిపించారు.
- ప్రధాని మోదీ తన ప్రసంగంలో 'మేరా చోటా భాయ్.. చోటా భాయ్' అంటూ పలుమార్లు మంద కృష్ణమాదిగను ప్రస్తావించారు. తర్వాత మంద కృష్ణ తన ప్రసంగంలో పదే పదే మోదీని ఉద్దేశిస్తూ 'పెద్దన్న..' అంటూ సంబోధించారు.
- మంద కృష్ణమాదిగ ప్రసంగిస్తున్న సమయంలో తీవ్ర భావోద్వేగానికి లోనయ్యారు. ఎస్సీ వర్గీకరణ కోసం 30 ఏళ్లుగా తను చేస్తున్న పోరాటం, అరెస్టులు, అణచివేతలను ప్రస్తావిస్తూ.. ఈ అంశానికి ప్రధాని మోదీ పరిష్కారం చూపాలంటూ మంద కృష్ణ కన్నీటి పర్యంతమయ్యారు. ఆయనను వేదికపై ఉన్న బండి సంజయ్, ఇతర నేతలు ఓదార్చారు. ప్రధాని మోదీ అయితే మంద కృష్ణను గుండెలకు హత్తుకుని ఓదార్చారు.

మహాసభకు పోటెత్తిన మాదిగలు

విశ్వరూప మహాసభకు పెద్ద సంఖ్యలో మాదిగ, ఉపకులాలవారు హాజరై కదం తొక్కారు. గ్రేటర్ హైదరాబాద్‌తోపాటు తెలుగు రాష్ట్రాల్లోని వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చారు. 'జై మాదిగ.. జైజై మాదిగ' నినాదాలు.. డప్పు, దండోరాలతో హోరెత్తించారు. ఎస్సీ వర్గీకరణ ప్రక్రియను వెంటనే ప్రారంభించాలని నినదించారు. ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు నాగరాజు మాదిగ అధ్యక్షతన నిర్వహించిన ఈ సభలో ప్రధాని మోదీతోపాటు మంద కృష్ణ మాదిగ, కేంద్ర మంత్రులు మురుగన్, నారాయణ స్వామి, జి.కిషన్‌రెడ్డి, లక్ష్మణ్, సంజయ్, ఈటల, చింతా సాంబమూర్తి, బంగారు శృతి, ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొప్పు బాషా, ఏపీ ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు సురేశ్ మాదిగ, తెలంగాణ ఎమ్మార్పీఎస్ నాయకుడు నరేశ్ మాదిగ పాల్గొన్నారు.

తెలుగులో ప్రసంగం మొదలుపెట్టి..

'సమ్మక్క సారలమ్మకు, యాదాద్రి లక్ష్మీనరసింహస్వామికి.. అణగారిన వర్గాలకు.. విశ్వరూప మహాసభకు విచ్చేసిన ఆత్మ బంధువులకు నమస్కారం..'' అంటూ ప్రధాని మోదీ తెలుగులో తన ప్రసంగాన్ని ప్రారంభించారు. తర్వాత హిందీలో కొనసాగించారు. ఎస్సీ వర్గీకరణకు మద్దతిస్తామని ఆయన ప్రకటించినప్పుడు సభికుల నుంచి పెద్ద ఎత్తున హర్షం వ్యక్తమైంది. మోదీ.. మోదీ.. అంటూ నినాదాలు హోరెత్తాయి. ఓ మహిళా కార్యకర్త పబ్లిక్ గ్యాలరీలో లైటింగ్ కోసం ఏర్పాటు చేసిన స్టాండ్స్‌పైకి ఎక్కి ఎస్సీ వర్గీకరణ వెంటనే చేపట్టాలని డిమాండ్ చేసింది. అది గమనించిన మోదీ.. ''బిడ్డా కరెంట్ షాక్ కొడుతుంది. కిందికి దిగు. మీకోసమే నేను వచ్చాను..'' విజ్ఞప్తి చేయడంతో ఆమె కిందకు దిగింది.

మోదీకి విజయశాంతి స్వాగతం

విశ్వరూప సభ కోసం హైదరాబాద్ వచ్చిన ప్రధాని మోదీకి బేగంపేట విమానాశ్రయంలో బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యురాలు విజయశాంతి, ఇతర నేతలు స్వాగతం పలికారు. కొంత కాలం నుంచి పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటున్న విజయశాంతి బీజేపీని వీడుతున్నట్టు ప్రచారం జరుగుతున్న సమయంలో ఇది ప్రాధాన్యత సంతరించుకుంది.

ఎస్సీ వర్గీకరణ సమస్య ఏంటి?

షెడ్యూల్డ్ క్యాస్ట్ (ఎస్సీ) కింద గుర్తింపు పొందిన కులాల్లో కొందరికే రిజర్వేషన్ల ఫలాలు దక్కుతున్నాయని.. ముఖ్యంగా మాదిగ, దాని ఉపకులాలకు ప్రయోజనం కలగడం లేదని చాలా ఏళ్లుగా వాదన ఉంది. ఈ క్రమంలోనే ఎస్సీ ఉపకులాలను వర్గీకరించి, వాటి జనాభా ఆధారంగా రిజర్వేషన్ల వాటాను పంచాలన్న డిమాండ్ ఉంది. ఈ క్రమంలోనే మంద కృష్ణమాదిగ 'మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి (ఎమ్మార్పీఎస్)'ను నెలకొల్పి పోరాటం ప్రారంభించారు.

ఎస్సీ వర్గీకరణకు సంబంధించి కీలక పరిణామాలు ఇవీ..

- ఎస్సీల్లోని వెనుకబడిన కులాలకు రిజర్వేషన్లు కల్పించేందుకు రామచంద్ర కమిషన్ నివేదిక మేరకు 1996లో అప్పటి రాష్ట్ర ప్రభుత్వం జీవో జారీ చేసింది.
- దీనిపై మాల మహానాడు హైకోర్టును ఆశ్రయించగా.. జీవో రాజ్యాంగ విరుద్ధమంటూ కొట్టివేసింది.
- 2000లో ఆర్డినెన్స్ రూపంలో ఎస్సీ వర్గీకరణకు చట్టరూపం తెచ్చారు. దాన్ని సవాల్ చేస్తూ మాల మహానాడు సుప్రీంకోర్టును ఆశ్రయించింది.
- ఎస్సీ వర్గీకరణ చేపట్టే అధికారం రాష్ట్ర ప్రభుత్వానికి లేదంటూ ఆ ఆర్డినెన్స్‌ను సుప్రీంకోర్టు అదే ఏడాది కొట్టివేసింది.
- 2005లో కేంద్ర ప్రభుత్వం ఈ అంశంలో ఉషా మెహ్రా కమిషన్‌ను నియమించింది.
- ఈ కమిషన్ 2008లో 2008లో కేంద్రానికి నివేదిక ఇచ్చింది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 341ను సవరించి వర్గీకరణ చేయొచ్చని సూచించింది. కానీ ఆ నివేదిక అమలుకు నోచుకోలేదు.
- 2020లో కర్ణాటక రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగి ఒకరు పదోన్నతుల్లో ఎస్సీ వర్గీకరణ అమలు చేసి న్యాయం చేయాలని సుప్రీంకోర్టును ఆశ్రయించారు.
- ఐదుగురు న్యాయమూర్తుల ధర్మాసనం దీనిపై విచారణ జరిపినా.. పరిష్కారం కోసం ఏడుగురు సభ్యులతో కూడిన విస్తృత ధర్మాసనానికి సిఫార్సు చేసింది.
- ప్రస్తుతం ఆ విస్తృత ధర్మాసనం వద్ద కేసు పెండింగ్‌లో ఉంది.
- తాజాగా ప్రధాని మోదీ ఎస్సీ వర్గీకరణకు మద్దతు ఇవ్వడంతోపాటు కమిటీని ఏర్పాటు చేస్తామని ప్రకటించారు.

కేసీఆర్‌కు రెండుచోట్లా ఓటమి తథ్యం

- కేటీఆర్‌కు కూడా బీజేపీ చేతిలోనే పరాభవం: కిషన్‌రెడ్డి జోస్యం
- మజ్లిస్‌తో బీజేపీ దోస్తీ అంటూ కాంగ్రెస్ నేతలవి సిగ్గులేని మాటలు
- సూర్యుడు పడమట ఉదయించినా ఎంఐఎంతో కలవబోమని స్పష్టీకరణ
- బీజేపీలో చేరిన ప్రేమ్‌సింగ్ రాథోడ్



ప్రేమ్‌సింగ్ రాథోడ్‌ను పార్టీలోకి ఆహ్వానిస్తున్న కిషన్‌రెడ్డి. చిత్రంలో రాజాసింగ్

సాక్షి, హైదరాబాద్: అసెంబ్లీ ఎన్నికల్లో గజ్వేల్, కామారెడ్డి రెండు నియోజకవర్గాల్లోనూ సీఎం కేసీఆర్‌కు ఓటమి తప్పదని కేంద్రమంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి వ్యాఖ్యానించారు. సిరిసిల్లలో మంత్రి కేటీఆర్ కూడా ఓడిపోతారన్నారు. బీజేపీ అభ్యర్థుల చేతుల్లోనే వారికి పరాభవం వస్తుందని జోస్యం చెప్పారు. ఎన్నికల్లో బీజేపీకి ఇన్ని సీట్లు, అన్ని సీట్లు అని కేటీఆర్ చెబుతున్నారని, ఆయన చెబుతున్న దానికి పూర్తి విరుద్ధంగా పరిస్థితులున్నాయన్నారు. శనివారం కిషన్‌రెడ్డి, రాజాసింగ్ సమక్షంలో మాజీ ఎమ్మెల్యే ప్రేమ్‌సింగ్ రాథోడ్, సుదర్శన్ సింగ్ రాథోడ్, విద్యావేత్త బాలాజీ నాయక్, బీఆర్ఎస్ నాయకులు జబ్బార్ నాయక్, శ్రీరాములు తదితరులు బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడుతూ...బీఆర్ఎస్ పాలనలో రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ సర్వనాశనమైందని ధ్వజమెత్తారు. రాష్ట్రంలో కచ్చితంగా బీజేపీ అధికారంలోకి వస్తుందని, కేసీఆర్ కుటుంబం, బీఆర్ఎస్ నేతల అక్రమ సంపాదనను కక్కిస్తామన్నారు. తెలంగాణలో అవినీతి, మాఫియా, కుటుంబపాలనతో కూడిన చీకట్లను తరిమి.. బీజేపీని అధికారంలోకి తేవడం ద్వారా డిసెంబర్ 3న నిజమైన దీపావళి రావాలని కోరుకుంటున్నామన్నారు. బీఆర్ఎస్ పాలనలోని కారు చీకటి పోయి, మరో కమ్ముకున్న చీకటి (కాంగ్రెస్) రాకుండా కమలం పువ్వుతో లక్ష్మీదేవి వచ్చేలా చూడాలని చెప్పారు.

భూములు అమ్మితేనే జీతాలు

సీఎం కేసీఆర్ స్వార్థ రాజకీయాల కోసం తెలంగాణను దగా చేశారని కిషన్‌రెడ్డి విమర్శించారు. మద్యం అమ్మకాలు, హైదరాబాద్ చుట్టుపక్కల భూములు అమ్మితే తప్ప ఉద్యోగులకు నెలవారీ జీతాలు ఇవ్వలేని పరిస్థితి ఏర్పడిందన్నారు. అలాంటి బీఆర్ఎస్ పోయి ఇక్కడ కాంగ్రెస్ వస్తే రాష్ట్ర పరిస్థితి మరింత దారుణంగా ఉంటుందని చెప్పారు. పదేళ్లుగా అధికారంలో లేమని కాంగ్రెస్ నేతలు ఆవురావురు మంటున్నారని, రాష్ట్రాన్ని ఎక్కడికక్కడ దోచుకునే పరిస్థితి ఉంటుంది కాబట్టి ప్రజలు జాగ్రత్త వహించాలన్నారు. ప్రజలను మభ్యపెట్టి బీజేపీపై కాంగ్రెస్, బీఆర్ఎస్ అబద్ధపు ప్రచారం చేస్తున్నాయని మండిపడ్డారు. మజ్లిస్, బీజేపీ రెండూ ఒకటేనంటూ కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ, ఇతరనాయకులు సిగ్గులేని మాటలు మాట్లాడుతున్నారన్నారు. ఎంఐఎంను పెంచి పోషించి లాభపడింది కాంగ్రెస్ కాగా, ఇప్పుడు బీఆర్ఎస్ మజ్లిస్‌ను మోస్తోందని విమర్శించారు. సూర్యుడు పడమట ఉదయించినా ఎంఐఎంతో బీజేపీ కలిసే ప్రసక్తే లేదన్నారు. మతతత్వ, రజాకార్ల పార్టీతో బీజేపీ కలవబోదన్నారు. కర్ణాటకలో ఐదు నెలల పాలనలోనే ఐదేళ్ల అసంతృప్తిని, వైఫల్యాలను కాంగ్రెస్ ప్రభుత్వం మూటగట్టుకుందని ధ్వజమెత్తారు. ఐదు గ్యారంటీలంటూ కర్ణాటక ప్రజల తలలపై భస్మాసుర హస్తం పెట్టి కాంగ్రెస్ మొత్తం వ్యవస్థనే భ్రష్టు పట్టించిందన్నారు. ఆ పార్టీ ట్రాక్‌రికార్డ్ ఘోరంగా ఉంటే ఆరు గ్యారంటీలతో తెలంగాణలోనూ అధికారంలోకి వస్తామంటూ గొప్పలకు పోతోందన్నారు.

చంద్రమోహన్ మృతి పట్ల ప్రధాని సంతాపం

సాక్షి, హైదరాబాద్/ న్యూఢిల్లీ, అమరావతి: సినీ నటుడు చంద్రమోహన్ మృతిపట్ల ప్రధాని నరేంద్ర మోదీ సంతాపం వ్యక్తం చేశారు. 'ప్రముఖ తెలుగు నటుడు చంద్రమోహన్ మృతి చెందడం అత్యంత బాధాకరం. వారి ఉత్తమ నటన, ప్రత్యేకమైన తేజస్సు తరతరాలుగా ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేశాయి. వారి నిష్క్రమణ సృజనాత్మక ప్రపంచంలో పూరించలేని ఒక శూన్యతను కలిగించింది. ఓం శాంతి' అంటూ 'ఎక్స్'లో ప్రధాని మోదీ సంతాపం తెలిపారు. వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

విలక్షణమైన నటనతో అలరించారు: సీఎం కేసీఆర్

ప్రముఖ సినీ నటుడు చంద్రమోహన్ మృతి పట్ల ముఖ్యమంత్రి కె.చంద్రశేఖరరావు సంతాపం తెలిపారు. విభిన్నమైన పాత్రలతో, విలక్షణమైన నటనతో, దశాబ్దాలుగా ప్రేక్షకులను అలరించిన చంద్రమోహన్ మరణం, తెలుగు చిత్రసీమకు తీరని లోటని ఆయన విచారం వ్యక్తం చేశారు. తెలుగుతో పాటు పలు భాషల్లో లక్షలాదిమంది అభిమానాన్ని చంద్రమోహన్ సొంతం చేసుకున్నారని చెప్పారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

ప్రజల హృదయాల్లో చెరగని ముద్ర వేశారు: ఏపీ సీఎం జగన్

ప్రజల హృదయాల్లో ప్రత్యేక స్థానం దక్కించుకున్న ప్రముఖ సినీనటుడు చంద్రమోహన్ మృతి పట్ల ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంతాపం వ్యక్తం చేశారు. 'చంద్రమోహన్ అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతూ కన్నుమూయడం బాధాకరం. తొలి సినిమాకే నంది అవార్డును గెలుచుకున్న ఆయన.. తెలుగు, తమిళ భాషల్లో వందలాది సినిమాల్లో నటించి.. తెలుగు ప్రజల హృదయాల్లో చెరగని ముద్ర వేసుకున్నారు. చంద్రమోహన్ కుటుంబసభ్యులకు నా ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ, ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను' అని జగన్ పేర్కొన్నారు.

ఆప్యాయంగా పలకరించేవారు: దత్తాత్రేయ

సినీనటుడు చంద్రమోహన్ మృతిపై హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. రంగులరాట్నం సినిమాతో సినీ అరంగ్రేటం చేసిన చంద్రమోహన్ అనేక చిత్రాల ద్వారా ప్రేక్షకులకు దగ్గరయ్యారని పేర్కొన్నారు. పలు సందర్భాల్లో తనని కలిసినప్పుడు చాలా ఆప్యాయంగా పలకరించేవారని గుర్తు చేసుకున్నారు. ఆయన మృతి తనని కలచివేసిందన్నారు. చంద్రమోహన్ ఆత్మకు శాంతి చేకూరాలని దత్తాత్రేయ తెలిపారు.

చంద్రమోహన్ మృతిపట్ల కిషన్‌రెడ్డి సంతాపం

కుటుంబ కథాచిత్రాల నటుడు, విలక్షణ హీరో చంద్రమోహన్ మృతిపట్ల కేంద్రమంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి సంతాపం ప్రకటించారు. చంద్రమోహన్ ఆత్మకు శాంతి చేకూరాలని కోరుకుంటూ, ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

చంద్రమోహన్ ఇక లేరు

ఆస్పత్రిలో తుది శ్వాస విడిచిన సినీ 'ఆల్‌రౌండర్'



చంద్రమోహన్ పార్థివదేహం



సాక్షి, హైదరాబాద్: కథానాయకుడిగా, సహాయ నటుడిగా, హాస్యనటుడిగా, కొన్ని చిత్రాల్లో ప్రతినాయకుడిగానూ నటించిన 'ఆల్ రౌండర్' చంద్రమోహన్ (82) ఇక లేరు. కొన్నాళ్లుగా ఆయన గుండె, కిడ్నీ సంబంధిత, మధుమేహం వ్యాధులతో బాధపడుతున్నారు. శనివారం ఉదయం తీవ్ర అస్వస్థతకు గురికాగా.. కుటుంబ సభ్యులు హైదరాబాద్‌లోని అపోలో ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఉదయం 9.45కు చంద్రమోహన్ తుదిశ్వాస విడిచారు. తర్వాత ఆయన భౌతికకాయాన్ని ఫిలింనగర్‌లోని స్వగృహానికి తీసుకెళ్లారు. అక్కడ చిత్ర పరిశ్రమ ప్రముఖులు, అభిమానులు చంద్రమోహన్ పార్థివదేహానికి నివాళులు అర్పించారు. చంద్రమోహన్‌కు భార్య జలంధర, కుమార్తెలు మధుర మీనాక్షి, మాధవి ఉన్నారు. జలంధర ప్రముఖ రచయిత్రికాగా.. మధుర మీనాక్షి సైకాలజిస్ట్‌గా అమెరికాలో స్థిరపడ్డారు. రెండో కుమార్తె మాధవి చెన్నైలో డాక్టర్‌గా పనిచేస్తున్నారు. అమెరికాలో ఉన్న మధుర మీనాక్షి వచ్చాక సోమవారం మధ్యాహ్నం చంద్రమోహన్ అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు ఆయన మేనల్లుడు, ప్రముఖ నిర్మాత శివలెంక కృష్ణప్రసాద్ తెలిపారు.

'రంగుల రాట్నం'తో మొదలై..

ఏపీలోని కృష్ణా జిల్లా పమిడిముక్కలలో మల్లంపల్లి వీరభద్రశాస్త్రి, శాంభవి దంపతులకు 1942 మే 23న జన్మించారు చంద్రమోహన్. ఆయన అసలు పేరు మల్లంపల్లి చంద్రశేఖర్‌రావు. బాపట్ల వ్యవసాయ కళాశాలలో డిగ్రీ పూర్తి చేశారు. ప్రఖ్యాత దర్శకుడు కె.విశ్వనాథ్ తమకు దగ్గరి బంధువు కావడంతో.. సినిమాల్లో నటించాలనే ఆసక్తితో చెన్నై వెళ్లారు. బీఎన్ రెడ్డి దర్శకత్వం వహించిన 'రంగుల రాట్నం'(1966) సినిమాతో హీరోగా వెండితెరకు పరిచయం అయ్యారు. హీరోగా సుమారు 175కుపైగా సినిమాలు చేశారు. మొత్తంగా తన 55 ఏళ్ల సినీ కెరీర్‌లో కథానాయకుడిగా, క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా, హాస్యనటుడిగా ఇలా దాదాపు 900కుపైగా చిత్రాల్లో విభిన్నమైన పాత్రలు పోషించారు. తనదైన నటనతో ప్రేక్షకుల మనసులో చిరస్థాయిగా నిలిచిపోయారు. పలు తమిళ సినిమాల్లోనూ నటించారు.

చంద్రమోహన్ మృతిపట్ల చిరంజీవి, వెంకటేష్‌లతోపాటు పలువురు సినీ ప్రముఖులు సంతాపం వ్యక్తంచేశారు. తెలుగు చలన చిత్ర వాణిజ్య మండలి, తెలుగు నిర్మాతల మండలి సంతాపం వ్యక్తం చేశాయి.

విభిన్న పాత్రలతో.. ఎన్నో అవార్డులతో..

'సుఖదుఃఖాలు, కాలం మారింది, ఓ సీత కథ, సిరిసిరిమువ్వ, సీతామాలక్ష్మి, పదహారేళ్ల వయసు, శంకరా భరణం' వంటి క్లాసిక్ చిత్రాల్లో మెప్పించారు చంద్రమోహన్. 'గంగ మంగ', 'లక్ష్మణ రేఖ'వంటి చిత్రాల్లో కాస్త నెగెటివ్ షేడ్స్ ఉన్న పాత్రలు చేశారు. శ్రీకాంత్ హీరోగా నటించిన 'కోతల రాయుడు' (2022) తెలుగులో చంద్రమోహన్ చివరి చిత్రం. తొలిచిత్రం 'రంగుల రాట్నం'కు నంది అవార్డు అందుకున్నారు. 1987లో 'చందమామ రావే' సినిమాకు ఉత్తమ హాస్యనటుడిగా, 2005లో 'అతనొక్కడే' చిత్రానికి ఉత్తమ సహాయనటుడిగా నంది అవార్డులు అందుకున్నారు. 'పదహారేళ్ల వయసు, సిరిసిరిమువ్వ' సినిమాలకు ఉత్తమ నటుడిగా ఫిలింఫేర్ అవార్డులు అందుకున్నారు.

పరీక్షలపై పరేషాన్!

ఎన్నికల నేపథ్యంలో కొనసాగని బోధన

- పోలింగ్ విధుల్లో నిమగ్నమైన అధికారులు
- ఇంకా మొదలవని ప్రశ్నపత్రాల తయారీ
- ఈసారి టెన్త్, ఇంటర్ పరీక్షల్లో స్వల్ప మార్పులకు అవకాశం



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఈసారి టెన్త్, ఇంటర్ పరీక్షల నిర్వహణలో మార్పులుండే అవకాశం కనిపిస్తోంది. పరీక్షల నిర్వహణపై అధికారులు ఇప్పటికే పలు దఫాలుగా సమీక్షించారు. అకడమిక్ క్యాలెండర్ ప్రకారం 2024 మార్చి, ఏప్రిల్‌లలో ఇంటర్ పరీక్షలు జరగాల్సి ఉంది. ఏప్రిల్‌లో టెన్త్ పరీక్షలు నిర్వహించాల్సి ఉంది. అయితే అనేక కారణాల వల్ల టెన్త్, ఇంటర్ సిలబస్ అనుకున్న మేర పూర్తి కాలేదు. గత మూడు వారాలుగా ప్రభుత్వ యంత్రాంగం ఎన్నికలపై దృష్టి పెట్టింది. పోలింగ్ ప్రక్రియపై ఎన్నికల కమిషన్ అధికారులకు శిక్షణ అందించింది. రాష్ట్రస్థాయిలో శిక్షణ పొందిన వారు క్షేత్రస్థాయి సిబ్బందికి శిక్షణ ఇస్తున్నారు. దీంతో ప్రభుత్వ స్కూళ్లు, కాలేజీల్లో బోధన కుంటుపడుతోంది. నవంబర్ నెలాఖరు వరకూ పోలింగ్ విధుల్లోనే అధికారులు ఉండనున్నారు. బోధన, బోధనేతర సిబ్బంది సైతం ఇదే పనిలో నిమగ్నం కానున్నారు. దీంతో డిసెంబర్ మొదటి వారం వరకు విద్యాసంస్థల్లో బోధన పూర్తిస్థాయిలో సాగే అవకాశం కనిపించట్లేదని ఇంటర్ బోర్డు, టెన్త్ పరీక్షల విభాగం భావించాయి.

సిలబస్ కాకుండా టెన్త్ పరీక్షలెలా?

టెన్త్ పబ్లిక్ పరీక్షలకు రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 5 లక్షల మంది విద్యార్థులు హాజరు కానున్నారు. ఇందులో 2 లక్షల మంది ప్రభుత్వ స్కూళ్లలో చదువుతున్నారు. కానీ ప్రభుత్వ పాఠశాలల్లో ఇప్పటివరకు 40 శాతం సిలబస్ కూడా పూర్తికాలేదు. పుస్తకాల సరఫరాలో జాప్యం, ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల అంశం కొంతకాలం కొనసాగడం వల్ల బోధనకు ఆటంకం ఏర్పడింది. దీనికితోడు దసరా తర్వాత నుంచి ఎన్నికల కోలాహలమే నెలకొంది. వాస్తవానికి జనవరి నాటికి టెన్త్ సిలబస్ పూర్తవ్వాలి. జనవరి రెండో వారంలో పునశ్చరణ చేపట్టాలి. కానీ ప్రస్తుతం డిసెంబర్ మధ్య వరకు బోధనే కొనసాగకపోతే సిలబస్ ఎలా పూర్తవుతుందని టీచర్లు ప్రశ్నిస్తున్నారు. సిలబస్ పూర్తికాకుండా పరీక్షలు పెడితే ప్రభుత్వ స్కూళ్ల విద్యార్థులు నష్టపోయే ప్రమాదం ఉందని ఉన్నతాధికారులకు తెలియజేశారు. దీన్ని దృష్టిలో పెట్టుకొని పరీక్షలను మరో నెలపాటు వాయిదా వేసే అంశాన్ని ఉన్నతాధికారులు పరిశీలిస్తున్నారు.

ఇంటర్‌లోనూ అదే జాప్యం...

ఇంటర్‌లోనూ ఇదే పరిస్థితి నెలకొంది. నవంబర్ మొదటి వారం వరకు ఇంటర్ ఫస్టియర్ అడ్మిషన్ల ప్రక్రియ కొనసాగింది. ఆలస్యంగా చేరిన వారికి ఇప్పటికీ పుస్తకాలు అందలేదు. చాలా చోట్ల ఒక్కో సబ్జెక్టులో కనీసం ఒక్క చాప్టర్ కూడా బోధించలేదని అధ్యాపకులు అంటున్నారు. ఈ ఏడాది ఇంగ్లిష్‌లో ప్రాక్టికల్స్ నిర్వహించాలని భావించారు. కానీ ఇప్పటికీ ఈ ప్రక్రియపై అధ్యాపకులకే శిక్షణ నిర్వహించలేదు. ఇలాంటి పరిస్థితుల్లో పరీక్షలు రాస్తే ప్రైవేటు కాలేజీల విద్యార్థులతో పోటీ పడలేరని ప్రభుత్వ కాలేజీల లెక్చరర్లు అంటున్నారు. ఈ అంశాలపై ఇంటర్ బోర్డు అధికారులు తర్జనభర్జనపడుతున్నారు. పరీక్షల తేదీలను పొడిగించే అంశాన్ని పరిశీలిస్తున్నామని ఓ సీనియర్ అధికారి తెలిపారు.

ప్రశ్నపత్రాల తయారీలోనూ ఆలస్యం...

అక్టోబర్, నవంబర్‌లలోనే ప్రశ్నపత్రాల కూర్పుపై ఇంటర్, టెన్త్ పరీక్షల విభాగాలు దృష్టి పెట్టాల్సి ఉంటుంది. ఒక్కో సబ్జెక్టు నుంచి 12 మంది నిపుణులను ఎంపిక చేసుకొని గోప్యంగా ప్రశ్నపత్రాలు తయారు చేయించి వాటిల్లోంచి మూడు సెట్లను ఉన్నతాధికారులు ఎంపిక చేస్తే ఆ తర్వాత అవి ప్రింటింగ్‌కు వెళ్లాల్సి ఉంది. ఈ పరీక్షలకు సంబంధించి మార్కుల క్రోడీకరణకు సాంకేతిక ఏర్పాట్లు కూడా డిసెంబర్ నాటికి చేపట్టాలి. కానీ ప్రస్తుతం సిబ్బంది ఎన్నికల విధుల్లో ఉండడంతో ప్రశ్నపత్రాలపై ఇప్పటికీ దృష్టి పెట్టలేదని అధికార వర్గాలు అంటున్నాయి.

వీరంతా బీజేపీ అభ్యర్థులేనా?

- 111 మంది అభ్యర్థుల్లో 30 మంది మాత్రమే పాతనేతలు
- పార్టీ జాబితాపై రగులుతున్న పాతకాపులు, ఏబీవీపీ, యువమోర్చా విభాగాలు
- దీపావళి తర్వాత తదుపరి కార్యాచరణ



సాక్షి, హైదరాబాద్: బీజేపీ అభ్యర్థుల జాబితాపై పార్టీలోని పాతకాపులతోపాటు ఏబీవీపీ, యువమోర్చా విభాగాల్లోని వారు అగ్గి మీద గుగ్గిలం అవుతున్నారు. పార్టీ ప్రకటించిన 111 మంది అభ్యర్థుల్లో 30–35 మంది మాత్రమే పాతనేతలు, పార్టీ సిద్ధాంత భూమిక ఉన్నవారని.. ఇలాంటి పరిస్థితుల్లో సైద్ధాంతిక భూమిక ఉన్న పార్టీగా ప్రజలకు ఏరకమైన సందేశాన్నిస్తారని నిలదీస్తున్నారు. అసలు ఈ అభ్యర్థులను బీజేపీ వారిగా భావించవచ్చా? ఎన్నికలు ముగిసి, ఫలితాలు వెలువడ్డాక వీరిలో ఎంత మంది పార్టీలో మిగులుతారనే ప్రశ్నలను సంధిస్తున్నారు. పార్టీలో ప్రస్తుత ముఖ్యనేతలు, మరీ ముఖ్యంగా బయట నుంచి వచ్చిన నేతలు వర్గాల వారీగా విడిపోయి తమ అనుయాయులకు పెద్దసంఖ్యలో టికెట్లు ఇప్పించుకున్నారని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. టికెట్ల ఖరారులో డబ్బులు చేతులు మారాయనే ఆరోపణలతో బీజేపీ విమర్శల పాలైందంటూ ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కొందరు జాతీయ కార్యవర్గ సభ్యులు, రాష్ట్రపార్టీలోని ముఖ్యనేతలు తమ వారికి టికెట్లు ఇప్పించుకునేందుకు చేసిన హెచ్చరికలకు జాతీయ, రాష్ట్రనాయకత్వాలు లొంగిపోవడం ఎలాంటి సంకేతాలిస్తాయంటూ ప్రశ్నిస్తున్నారు. రాష్ట్ర పార్టీలో ముందు నుంచి ఉన్న ముఖ్యనేతలు, ఇతర పార్టీల నుంచి వచ్చిన వారు కొందరు వర్గాలుగా విడిపోయి టికెట్ల కేటాయింపులో తమ పట్టును నిలుపుకునేలా ఒత్తిళ్లు తెచ్చి పైచేయి సాధించడం వంటి పరిణామాలను ఎలా అర్థం చేసుకోవాలో తెలియడం లేదంటున్నారు.

ఏళ్లకు ఏళ్లు పనిచేసినా...

నల్లగొండ, చేవెళ్ల, మహబూబాబాద్ ఎంపీ సీట్ల పరిధిలోని అసెంబ్లీ స్థానాల్లో ఒక్కటి కూడా పాతకాపులు, పార్టీ సిద్ధాంతాలు నమ్ముకుని ఏళ్లకు ఏళ్లుగా పనిచేస్తున్న వారికి అవకాశం లభించలేదని వారు వాపోతున్నారు. ఈ స్థానాల్లో కొత్తగా పార్టీలో చేరిన వారికి, ఇతర పార్టీల నుంచి వచ్చిన వారికి ఇవ్వడాన్ని జీర్ణించుకోలేక పోతున్నామంటున్నారు. రెండు, మూడువారాల వ్యవధిలోనే పార్టీలో చేరిన పది, పదిహేను మందికి సీట్లు ఇవ్వడం పట్ల విస్మయం వ్యక్తంచేస్తున్నారు. ఈ స్థానాల్లో వీరంతా కచ్చితంగా గెలుస్తారని నాయకత్వం చెప్పగలదా అని ప్రశ్నిస్తున్నారు. అలాంటపుడు అన్నిచోట్లా కాకపోయినా వీలున్న చోట్ల అయినా పార్టీని నమ్ముకున్న వారికి పార్టీకి బలపడేందుకు అవకాశం ఉండేదని వాదిస్తున్నారు. మొత్తంగా 111 స్థానాల వారీగా పార్టీ ఖరారు చేసిన అభ్యర్థుల పూర్వాపరాలు, గతంలో ఉన్న పార్టీలు వంటి వాటిని పరిశీలిస్తే... వీరిలో చాలామంది రెండు, మూడుపార్టీలు మారిన వారేనని విశ్లేషిస్తున్నారు. ఈ నేపథ్యంలో దీపావళి తర్వాత సమావేశమై భవిష్యత్ కార్యాచరణ సిద్ధం చేసుకోవాలనే యోచనలో దీర్ఘకాలం పార్టీలో పనిచేసిన పలువురు ఉన్నట్లు తెలుస్తోంది.



వంచకుడై ధనము సంపాదించిన వానికంటె,
యథార్థముగా ప్రవర్తించు దరిద్రుడు వాసి.
– క్రైస్తవ ధర్మం

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు
ఆశ్వయుజ మాసం, **తిథి:** బ.చతుర్దశి ప.1.47 వరకు, తదుపరి అమావాస్య, **నక్షత్రం:** స్వాతి రా.3.01 వరకు, తదుపరి విశాఖ,
వర్జ్యం: ఉ.7.35 నుండి 9.16 వరకు,
దుర్ముహూర్తం: సా.3.52 నుండి 4.35 వరకు, **అమృతఘడియలు:** సా.5.43 నుండి 6.54 వరకు, నరకచతుర్దశి, దీపావళి పండగ.

సూర్యోదయం : 6.06
సూర్యాస్తమయం : 5.22
రాహుకాలం : సా.4.30 నుంచి 6.00 వరకు
యమగండం : ప.12.00 నుంచి 1.30 వరకు

సచిన్ పైలట్ (కాంగ్రెస్ లీడర్)
రాయని డైరీ

మాధవ్ శింగరాజు

రాజస్థాన్‌లో గత 25 ఏళ్లలో వరుసగా రెండోసారి బీజేపీ గెలవకపోబట్టి సరిపోయింది. లేకుంటే పాతికేళ్ల పాటు అశోక్ గెహ్లోతే కాంగ్రెస్ సీఎంగా ఉండిపోయేవారు. ఇప్పుడీ ఎన్నికలను కూడా కలుపుకొంటే ఈ 72 ఏళ్ల వయసులో సీఎంగా ఆయన తన 26వ ఏట లోకి ప్రవేశిస్తూ ఉండేవారు!

ఇరవై ఏళ్లకు మించి పార్టీ అధ్యక్షురాలిగా కొనసాగడానికి సోనియాజీ అయినా కాస్త మొహమాట పడ్డారు కానీ, 25 ఏళ్లుగా – పదవిలో ఉన్నా, లేకున్నా – సీఎం సీటును అంటిపెట్టుకునే ఉన్న గెహ్లోత్‌కి చిన్న ఫీలింగ్ కూడా ఏమీ ఉన్నట్లు లేదు! 'మళ్లీ నేనే సీఎం' అంటున్నారు.

అసలు మొట్టమొదట తన 47 ఏళ్ల లేబ్రాయంలో తనెలా సీఎం అయిందీ ప్రతి ఐదేళ్లకొకసారి మీడియా సమావేశం ఏర్పాటు చేసి మరీ చెబుతుంటారు గెహ్లోత్. సోనియాజీ పార్టీ అధ్యక్షురాలు అవగానే తీసుకున్న తొలి నిర్ణయం తనను సీఎం చేయడమేనట!

"అప్పడసలు నేను సీఎం క్యాండిడేట్‌ని కూడా కాదు. అయినప్పటికీ సోనియాజీ



పట్టుబట్టి, 'నేను చేయలేను మేడమ్' అంటున్నా వినకుండా నన్ను మందలించి మరీ సీఎంని చేశారు.." అని చెప్పుకోవటాన్ని ఆయన ఎంత గానో ఇష్టపడతారు.

ఇప్పుడు కొత్తగా మరొకటి మొదలు పెట్టారు. సీఎం సీటును వదిలేద్దామని తను ఎంత అనుకున్నా, సీఎం సీటు తనను ఎంతకూ వదలడం లేదట. ఇకముందు కూడా వదలదట! "అందుకే రాజస్థాన్‌లో వరుసగా రెండోసారి కాంగ్రెస్‌ను గెలిపించి ఆ చరిత్రాత్మక విజయాన్ని సోనియాజీకి గిఫ్ట్‌గా ఇస్తాను.." అని గెహ్లోత్ అంటున్నారు! ఆయనొక్కరే గెలిపిస్తారా రాజస్థాన్‌లో కాంగ్రెస్‌ని వరుసగా రెండోసారి? గెలిపించ డానికి పార్టీలో ఇంకెవరూ లేరా?!

నేనంటే పడని వాళ్లకు టికెట్ ఇచ్చి, నా వెంట ఉండే వాళ్లను పార్టీ వదిలి వెళ్లేలా చేసి.. "సచిన్‌కి, నాకు మధ్య విభేదాల్లేవ్.." అని చెప్పుకుంటున్నారు గెహ్లోత్!

విభేదాలు లేకుంటే... "నేను ఇవ్వొద్దని చెప్పినా శాంతి ధరీవాల్‌కి టికెట్ ఎందుకు ఇచ్చినట్లు? విభేదాలు లేకుంటే.. జ్యోతీ ఖండేల్ వాల్‌కు, పండిట్ సురేష్ మిశ్రాకు ఎందుకు టికెట్ ఇవ్వనట్లు?

టికెట్ ఇవ్వలేదని జ్యోతి, మిశ్రా ఇద్దరూ బీజేపీలోకి వెళ్లిపోయారు. ముందు మిశ్రా వెళ్లిపోయారు. తర్వాత జ్యోతి వెళ్లిపోయారు. వెళ్లిపోయే ముందు మిశ్రాజీ నాతో అన్న మాట చాలా పదునుగా ఉంది.

"ఏం చెయ్యమంటారు సచిన్‌జీ? పార్టీలో మీ మాటకే విలువ లేనప్పుడు నాకు వేరే దారి ఏముంటుంది చెప్పండి?" అన్నారాయన!

అదే మాటను జ్యోతి వేరేలా అన్నారు. "పార్టీ కోసం ఎవరు ఎంత చేస్తున్నారన్నది కాంగ్రెస్‌కి లెక్క కాదు. పార్టీలో ఎవరు, ఏ లీడర్ వైపు ఉన్నారన్నది ముఖ్యం. ఆ లీడరంటే పైవారికి పడకపోతే ఇక ఆ లీడర్ వైపు ఉన్నవారికి పార్టీలో చిన్న పని కూడా దొరకదు..." అని ఆమె ఆవేదన చెందారు.

"కలిసి పని చేస్తున్నాం..." అని చెబుతూనే, గెహ్లోత్ తను చేసేది తను చేసుకుపోతున్నారు. సీఎం కుర్చీని పట్టుకుని వేళ్లాడుతూనే, కుర్చీనే తనను సీఎం అనే తాడుతో గట్టిగా కట్టేసు కుంది అని చెబుతున్నారు!

ఈ ఉదయం కొంతమంది అభ్యర్థులు నన్ను కలిసేందుకు వచ్చారు. "దీపావళి శుభాకాంక్షలు సచిన్‌జీ..." అంటూ.. "నిజమైన దీపావళి మీరు వేరే పార్టీ పెట్టినప్పుడే సచిన్ జీ..." అన్నారు! నన్నెంతగానో అభిమానించే నా అనుచరులు వాళ్లంతా.

"ఖర్గేజీ కాదు, గెహ్లోత్ కాదు... మీరే మా నాయకుడు సచిన్‌జీ..." అని కూడా వారు అన్నారు!! వారికి నాపై అంత అభిమానం ఉన్నప్పుడు... నాలో కొంచెమైనా ఆత్మాభిమానం లేకపోతుందా?


నవ్వాను. ఆలింగనం చేసుకున్నాను. "దీపావళి శుభాకాంక్షలు ఆత్మీయులారా..." అని చెప్పాను.

పల్లవి... కాంగ్రెస్, చరణం... చంద్రబాబు!

జనతంత్రం



వర్ధెల్లి మురళి



తెలంగాణా కాంగ్రెస్ పార్టీ స్వరం మారుతున్నది. గాత్రంలో కొత్త గమకాలు పుట్టుకొస్తున్నాయి. లక్ష్యసిద్ధి కోసం బొంత పురుగునైనా ముద్దాడాలనేది కేసీఆర్ నుడివిన సూక్తి. దాన్ని మరింత ముందుకు తీసుకొనిపోతూ భస్మాసురుడి కౌగిట్లో చేరడానికి సిద్ధపడింది... గత ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీతో కూటమి కట్టి తెలుగుదేశం పార్టీ పోటీ చేసింది. కనాకష్టంగా 3 శాతం ఓట్లు సంపాదించింది. ఆ మూడు శాతం ముచ్చట కోసం కాంగ్రెస్ పార్టీ తన తెలంగాణ రిమోట్ కంట్రోల్‌ను చంద్రబాబు చేతిలో పెట్టినట్టు కనిపిస్తున్నది.

కాంగ్రెస్ గెలుపు కోసం తెలుగుదేశం పోటీ నుంచి తప్పుకున్నది. ఈ సంగతి స్వయంగా చంద్రబాబే తనకు చెప్పినట్టు అప్పటి తెలంగాణా యూనిట్ అధ్యక్షుడు కాసాని జ్ఞానేశ్వర్ స్పష్టంగా చెప్పారు. పైకి కనిపించే దృశ్యం ఇది. దీపం ముందు శలభంలా కాంగ్రెస్ కోసం తెలుగుదేశం ఒక సారో పాత్రలో కనిపిస్తున్నది. కానీ సారం మాత్రం అది కాదు. పోచమ్మ గుడి ముందు కట్టేసిన బలి పొట్టేలు కాంగ్రెస్ పార్టీయే! లేని విశ్వసనీయతను చంద్రబాబుకు కట్టబెట్టడం కోసం, ఆయనకు తెలంగాణలో 'హోమ్లీ ఫీలింగ్'ను కలుగజేయడం కోసం కాంగ్రెస్ పార్టీ ప్రయత్నిస్తున్నది. ఇందుకోసం తనను తాను హననం చేసుకోవడానికి కూడా అది వెనుకాడటం లేదు.

తెలంగాణ ఎన్నికల సందర్భాన్ని పురస్కరించుకొని 'ఇండియా టుడే' జాతీయ న్యూస్ ఛానల్ వాళ్లు హైదరాబాద్‌లో ఒక రౌండ్ టేబుల్ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ప్రదేశ్ కాంగ్రెస్ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి కూడా ఇతర పార్టీల నాయకులతోపాటు పాల్గొన్నారు. ఈ సమావేశంలో ఆయన రెండు వివాదాస్పదమైన వ్యాఖ్యలు చేశారు. వీటిపై తెలంగాణాలో విస్తృతంగా చర్చ జరుగుతున్నది. '1995లో చంద్రబాబు ప్రారంభించిన ఐటీ, ఫార్మా, ఔటర్ రింగ్ రోడ్, మెడికల్ హబ్ వంటి కార్యక్రమాలను కాంగ్రెస్ కొనసాగించింద'ని ఆయన చెప్పారు. ఇదొక చర్చనీయాంశం.

భూ సమీకరణ (ల్యాండ్ పూలింగ్) పద్ధతులతో రాచకొండ ప్రాంతంలో ఒక కొత్త నగరాన్ని 50 వేల ఎకరాల్లో నిర్మించడం రెండో వివాదాస్పద వ్యాఖ్య. చంద్రబాబు విఫల ప్రయోగం అమరావతిని ఈ సమీకరణ గుర్తుకు తెస్తున్నది. ఏదో యథాలాపంగా రేవంత్ రెడ్డి నోటి వెంట ఈ మాటలు వచ్చి ఉంటాయనుకోవడానికి వీలు లేదు. ఎందుకంటే రేవంత్ రెడ్డి వైపు నుంచి ఆ తర్వాత ఎటువంటి వివరణ రాలేదు. రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ నాయకులెవరూ ఖండించలేదు. ఒక్క రేవంత్ రెడ్డికి మాత్రమే రెండు చోట్ల, అందులో ఒకటి ముఖ్యమంత్రి స్థానంలో పోటీ చేసే అవకాశం కల్పించిన కాంగ్రెస్ అధిష్ఠానానికి కూడా రేవంత్ వ్యాఖ్యల్లో అభ్యంతరాలు కనిపించలేదు.

ఉమ్మడి రాష్ట్రంలో ఐటీ రంగానికి పాదు చేసిందెవరు? ఎనభయ్యో దశకం నాటి నుంచే తెలుగునాట సమాచార రంగంలో యెల్లో మీడియా గుత్తాధిపత్యాన్ని సంపాదించింది. అప్పటి నుంచి యెల్లో మీడియాకు తాను వలచింది రంభ, తాను మునిగింది గంగ! తెలుగు ప్రజలందరూ ఇటువంటి అభిప్రాయాలనే కలిగివుండి తీరాలి. వేరే మార్గం లేదు! ఆ దశలో చంద్రబాబు అనే కొయ్యగుర్రాన్ని సృష్టించి పరుగులరాణి పంచకల్యాణిగా లోకానికి పరిచయం చేశారు. 'ఐటీ రంగ సృష్టికర్త అతనే' అని డప్పు వేయించారు. ఈ డప్పుల మోత ఎంత ఉన్మాద స్థాయికి చేరిందంటే – చివరికి చంద్రబాబే అవన్నీ నమ్మి, తనను తాను ఐన్‌స్టీన్‌కు అన్నయ్యగా, న్యూటన్‌కు పాఠం చెప్పిన గురువుగా భ్రమపడేంతగా! రెండు దశాబ్దాలు దాటినా ఇప్పటికీ సెల్‌ఫోన్, కంప్యూటర్ వగైరా వగైరాలను తానే కనిపెట్టాననే అపస్మారక మాటల నుంచి ఆయన బయటపడలేక పోవడానికి యెల్లో మీడియా డప్పుల మోతే కారణం.

వాస్తవానికి హైదరాబాద్‌లో ఐటీ రంగానికి ఆద్యులెవరు? భవిష్యత్తులో ఐటీ రంగం పోషించబోయే పాత్రను అర్థం చేసుకున్న దార్శనికుడు... నాటి ప్రధాని పీవీ నరసింహారావు. 'సాఫ్ట్‌వేర్ పార్క్స్ ఆఫ్ ఇండియా' పేరుతో ఐదారు నగరాల్లో ఐటీ పార్కులను ఏర్పాటు చేయాలని సంకల్పించారు. సహజంగానే ఆయనకు హైదరాబాద్‌పై ఉండే మక్కువతో మొదటి పార్క్‌ను హైదరాబాద్‌కు కేటాయించారు. ఇప్పుడు 'సైబర్ టవర్స్'గా మనం పిలుచుకుంటున్న భవంతికి 1993లోనే నాటి ముఖ్యమంత్రి నేదురుమల్లి జనార్దన్ రెడ్డి (కాంగ్రెస్) శంకుస్థాపన చేశారు. దాన్ని మరుగుపరిచి, ఆ ప్రాంతంలో తనకు కావలసిన వారు, బినామీలు భూములు కొనుగోలు చేసేంత వరకు మూడు నాలుగేళ్ల పాటు చంద్రబాబు జాగు చేశారు. ఈ ఆలస్యం కారణంగా ఐటీలో తొలిస్థానంలో ఉండవలసిన హైదరాబాద్‌ను బెంగళూరు అధిగమించింది. ఆ రకంగా హైదరాబాద్ ఐటీ రంగానికి చంద్రబాబు చేసిన ద్రోహం!

వడ్డించేవాడు మనవాడైతే కడ పంక్తిన

వాస్తవానికి హైదరాబాద్‌లో ఐటీ రంగానికి ఆద్యులెవరు? భవిష్యత్తులో ఐటీ రంగం పోషించబోయే పాత్రను అర్థం చేసుకున్న దార్శనికుడు... నాటి ప్రధాని పీవీ నరసింహారావు. 'సాఫ్ట్‌వేర్ పార్క్స్ ఆఫ్ ఇండియా' పేరుతో ఐదారు నగరాల్లో ఐటీ పార్కులను ఏర్పాటు చేయాలని సంకల్పించారు. సహజంగానే ఆయనకు హైదరాబాద్‌పై ఉండే మక్కువతో మొదటి పార్క్‌ను హైదరాబాద్‌కు కేటాయించారు. ఇప్పుడు 'సైబర్ టవర్స్'గా మనం పిలుచుకుంటున్న భవంతికి 1993లోనే నాటి ముఖ్యమంత్రి ఎన్. జనార్దన్ రెడ్డి (కాంగ్రెస్) శంకుస్థాపన చేశారు. దాన్ని మరుగుపరిచి, ఆ ప్రాంతంలో తనకు కావలసినవారు, బినామీలు భూమలు కొనుగోలు చేసేంత వరకు మూడు నాలుగేళ్ల పాటు చంద్రబాబు జాగు చేశారు. ఈ ఆలస్యం కారణంగా ఐటీలో తొలిస్థానంలో ఉండవలసిన హైదరాబాద్‌ను బెంగళూరు అధిగమించింది. ఆ రకంగా హైదరాబాద్ ఐటీ రంగానికి చంద్రబాబు చేసిన ద్రోహం!
వడ్డించేవాడు మనవాడైతే కడ పంక్తిన కూర్చున్నా ధోకా లేదంటారు. వర్తమాన చరిత్రను రికార్డు చేసే వార్తాపత్రికలకు చంద్రబాబు కావల్సినవాడయ్యారు. కనుక ఐటీని కనిపెట్టినవాడనే భుజకీర్తులను ఆయనకు తగిలించారు. 'కామమ్మ మొగుడంటే కామోసు' అనుకున్నట్టు ఆయన నిజంగానే తాను ఐటీ ఫౌండర్‌నని నమ్మడం మొదలుపెట్టారు.

కూర్చున్నా ధోకా లేదంటారు. వర్తమాన చరిత్రను రికార్డు చేసే వార్తాపత్రికలకు చంద్రబాబు కావల్సినవాడయ్యారు. కనుక ఐటీని కనిపెట్టినవాడనే భుజకీర్తులను ఆయనకు తగిలించారు. 'కామమ్మ మొగుడంటే కామోసు' అనుకున్నట్టు ఆయన నిజంగానే తాను ఐటీ ఫౌండర్‌నని నమ్మడం మొదలు పెట్టారు. కానీ కాంగ్రెస్ పార్టీ వారైనా వాస్తవాలను వెలుగులోకి తెచ్చి ఆ క్రెడిట్‌ను తీసుకోవాలి కదా? విచిత్రంగా కాంగ్రెస్ ప్రధాన ప్రత్యర్థి అయిన బీఆర్ఎస్ వాళ్లే దీన్ని గుర్తించి క్రెడిట్‌ను కాంగ్రెస్‌కు ఇస్తున్నారు. కానీ కాంగ్రెస్ వాళ్లు మాత్రం అందుకు ఒప్పుకోవడం లేదు. ఈ గజమాల చంద్రబాబు మెడలోనే ఉండాలని తెగ ఉబలాటపడుతున్నారు. దాని కొనసాగింపే నిన్నటి 'ఇండియా టుడే' సమావేశంలో రేవంత్ చెప్పిన మాటలు.

చంద్రబాబు ప్రారంభించిన ఐటీతో పాటు ఔటర్ రింగ్ రోడ్డును కూడా తాము కొనసాగించామని రేవంత్ చెప్పారు. సైబర్ టవర్స్‌కు కాంగ్రెస్ వాళ్లు శంకుస్థాపన చేస్తే, ఆలస్యం చేసైనా చంద్రబాబు నిర్మించి ప్రారంభించాడు. ఐటీ ప్రారంభంలో చంద్రబాబు పాత్ర కూడా ఉన్నదని చెబితే ఎంతో కొంత అతుకుతుంది. ఔటర్ రింగురోడ్డును బాబు తలకు ఎట్లా చుట్టేస్తారు? 2004 ఎన్నికలకు ముందు చంద్రబాబు ప్రభుత్వం ఒక నోటిఫికేషన్ విడుదల చేసింది. దానిప్రకారం మియాపూర్ నుంచి శంషాబాద్ వరకు 150 అడుగుల వెడల్పుతో రోడ్డును నిర్మించాలి. మియాపూర్ నుంచి గచ్చిబౌలి వరకు అప్పటికే రోడ్డు ఉన్నది. దాన్ని కొంచెం వెడల్పు చేస్తే సరిపోతుంది. అక్కడ నుంచి శంషాబాద్ వరకు 150 అడుగుల వెడల్పుతో 27 కి.మీ. రోడ్డును కొత్తగా వేయాలి. ఇది ప్రకటన మాత్రమే! కాగితం కదిలిందీ లేదు. సర్వే జరిగిందీ లేదు. ఈ నోటిఫికేషన్ కూడా హైదరాబాద్ పడమటి ప్రాంతాన్ని మాత్రమే కవర్ చేస్తుంది.

నగరం చుట్టూ ఔటర్ రింగ్ రోడ్డును అంతర్జాతీయ స్థాయిలో నిర్మించాలనే ప్రతిపాదన వైఎస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు జీవం పోసుకున్నది. 500 అడుగుల వెడల్పుతో, 175 కి.మీ. పొడవునా నిర్మించాలని సంకల్పించి, సర్వేలను ముగించి, శరవేగంగా భూసేకరణను కూడా పూర్తి చేసింది ఆయన హయాంలోనే! ఈ భూసేకరణ సమయంలోనే రాష్ట్ర ప్రభుత్వంతో రామోజీరావు కయ్యానికి దిగి, 'పెద్దలా? గద్దలా..?' పేరుతో విషప్రచారాన్ని ప్రారంభించారు. ఆయన భూముల్లో కొద్ది భాగం రోడ్డు కోసం సేకరించవలసి వచ్చింది. దాన్ని మినహాయించాలంటే రోడ్డు వంకర తిరగాలి. సాంకేతికంగా ఇది సాధ్యమయ్యే పని కాదు గనుక ఆయన సలహాను వైఎస్సార్ ప్రభుత్వం మన్నించలేకపోయింది. దాంతో ప్రభుత్వంపై ఆయన యుద్ధాన్ని ప్రకటించారు. భూసేకరణ దశలోనే జరిగిన ఈ రభస ఇప్పటికే చాలామందికి గుర్తే!

భూసేకరణ పూర్తి చేయడమే గాక రోడ్డు నిర్మించడంలో కూడా 90 శాతాన్ని రాజశేఖరరెడ్డి పూర్తి చేశారు. ఇప్పుడున్న ప్రభుత్వం మిగతా భాగాన్ని పూర్తి చేసి సుందరీకరణ, విద్యుదీకరణ వంటి పనులను చేపట్టింది. వాస్తవాలు ఇలా వుంటే ఔటర్ రింగ్ రోడ్డులో ఎటువంటి పాత్ర లేని చంద్రబాబు ఖాతాలో దాన్ని వేయడం యెల్లో మీడియాకు, తెలుగుదేశం వీరాభిమానులకు మాత్రమే సాధ్యమయ్యే సాహసం. ఈ సాహస పోటీలో వాళ్లను తలదన్నేలా రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ వ్యవహరిస్తున్నది. తాము మాత్రమే సొంతం చేసుకోవాల్సిన ప్రతిష్ఠలో అర్ధ భాగాన్ని చంద్రబాబుకు సమర్పించేందుకు వారు సిద్ధపడుతున్నారు.

మహాభారతంలో ద్రోణాచార్యుడు, పాంచాల రాజైన ద్రుపదుడు బాల్యస్నేహితులు. కష్టాల్లో ఉన్న ద్రోణుడు ఒకసారి సాయం కోసం ద్రుపదుడి దగ్గరకు వెళ్లాడట. ద్రుపదుడు అవమానించి పంపాడు. ఆ కోపాన్ని చానాళ్లపాటు ద్రోణుడు కడుపులో దాచుకున్నాడు. కురు, పాండవ రాకుమారులకు విద్య నేర్పిన తర్వాత కడుపులోని అక్కసును వాళ్ల ముందు ద్రోణాచార్యుడు వెళ్లగక్కాడు. వెంటనే అర్జునుడు బయల్దేరి ద్రుపదుణ్ణి బంధించి తెచ్చి గురువు ముందు నిలబెడతాడు. ఆ విధంగా గురుదక్షిణ చెల్లిస్తాడు. చంద్రబాబు తాను వేసుకున్న విజనరీ ముసుగుకు అమరావతి రియల్ ఎస్టేట్ వెంచర్‌లో ఘోర అవమానం జరిగింది. ఆ ప్రాజెక్టు ఆచరణ సాధ్యమయ్యేది కాదన్న అభిప్రాయం రోజురోజుకూ బలపడుతున్నది. తనను నమ్మి పెట్టుబడులు పెట్టిన కష్టమర్ల నుంచి ఒత్తిడి ఎదురవుతున్నది. ఈ దశలో ప్రాజెక్టు ఆచరణ సాధ్యమేనన్న ఊరట దొరకాల్సిన అవసరం బాబుకు ఏర్పడి ఉండవచ్చు.

ఆంధ్రప్రదేశ్ ఎన్నికలకు ముందు తెలంగాణ ప్రభుత్వం భూసేకరణ ద్వారా ఓ గ్రీన్ ఫీల్డ్ సిటీ ఏర్పాటును ప్రకటిస్తే చంద్రబాబుకు బోలెడంత ఊరట. తన విజన్‌ను పక్క రాష్ట్రాలు

ఆంధ్రప్రదేశ్ ఎన్నికలకు ముందు తెలంగాణ ప్రభుత్వం భూసేకరణ ద్వారా ఓ గ్రీన్ ఫీల్డ్ సిటీ ఏర్పాటును ప్రకటిస్తే చంద్రబాబుకు బోలెడంత ఊరట. తన విజన్‌ను పక్క రాష్ట్రాలు కూడా అనుసరిస్తున్నాయని చెప్పుకోవచ్చు. కేవలం ప్రకటన చాలు. ఆ తర్వాత కొంచెం ప్రచారం చాలు. అంతకు మించి అది ముందుకు కదిలే అవకాశాలు లేవు. ఈ ప్రకటనతో లాభపడే మొదటి వ్యక్తి రామోజీరావు. ఔటర్ రింగ్ రోడ్డుకూ, రాచకొండ గుట్టలకు మధ్యన రామోజీ ఫిలిం సిటీ ఉంటుంది. పక్కనే రాచకొండ నగరం ప్రచారంతో తన ఫిలిం సిటీ భూముల విలువ పెరుగుతోంది. ఒకప్పుడు లక్ష నాగళ్లతో ఫిలిం సిటీని దున్నేయాలన్న నినాదాల బదులు లక్షల కోట్ల విలువైన ల్యాండ్ బ్యాంక్‌గా అది మారుతోంది. ఆ భూముల చట్టబద్ధత, వివాదాలు వగైరా వేరే అంశం.
తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ సారథి రేవంత్ రెడ్డికి పూర్వాశ్రమంలో చంద్రబాబు గురువు. చంద్రబాబుకు రామోజీ గురువు. రాచకొండ నగర ప్రకటన ఈ గురుపరంపర కోరిన దక్షిణ కావచ్చు. ఇంత జరుగుతున్నా కాంగ్రెస్ అధిష్ఠానానికీ, రాష్ట్రంలోని కాంగ్రెస్ నేతలకూ ఎందుకు పట్టడం లేదు? ఎవరి అవసరాలు వారివి!

కూడా అనుసరిస్తున్నాయని చెప్పుకోవచ్చు. కేవలం ప్రకటన చాలు. ఆ తర్వాత కొంచెం ప్రచారం చాలు. అంతకు మించి అది ముందుకు కదిలే అవకాశాలు లేవు. ఈ ప్రకటనతో లాభపడే మొదటి వ్యక్తి రామోజీరావు. ఔటర్ రింగ్ రోడ్డుకూ, రాచకొండ గుట్టలకూ మధ్యన ఫిలిం సిటీ ఉంటుంది. పక్కనే రాచకొండ నగరం ప్రచారంతో తన ఫిలిం సిటీ భూముల విలువ పెరుగుతోంది. ఒకప్పుడు లక్ష నాగళ్లతో ఫిలిం సిటీని దున్నేయాలన్న నినాదాల బదులు లక్షల కోట్ల విలువైన ల్యాండ్ బ్యాంక్‌గా అది మారుతోంది. ఆ భూముల చట్టబద్ధత, వివాదాలు వగైరా వేరే అంశం.

తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ సారథికి పూర్వాశ్రమంలో చంద్రబాబు గురువు. చంద్రబాబుకు రామోజీ గురువు. రాచకొండ నగర ప్రకటన ఈ గురుపరంపర కోరిన దక్షిణ కావచ్చు. ఇంత జరుగుతున్నా కాంగ్రెస్ అధిష్ఠానానికీ, రాష్ట్రంలోని కాంగ్రెస్ నేతలకూ ఎందుకు పట్టడం లేదు? ఎవరి అవసరాలు వారివి! గత సాధారణ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి చంద్రబాబు భారీగా ఆర్థిక సాయాన్నందించినట్టు వార్తలు వచ్చిన విషయం తెలిసిందే. అంతకు ముందు జరిగిన తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లోనూ ఖర్చు బాధ్యతను ఆయన తీసుకున్నందువల్లనే పొత్తు కుదిరిందన్న విషయం కూడా విదితమే. ఇప్పుడు కూడా ఆ బాధ్యతను కర్ణాటక కాంగ్రెస్‌తో పాటు బాబు వర్గం కూడా తీసుకున్నట్టు సమాచారం.

ఇటీవల కొందరు సినీ ప్రముఖులు, వ్యాపారులు, ఇతర రంగాల వారూ సుమారు 150 మంది హైదరాబాద్‌లోని ఓ క్లబ్‌లో సమావేశమై రాజకీయ చర్చలు జరిపినట్టు సమాచారం వచ్చింది. వీరిలో కొందరు అమరావతి రియల్ ఎస్టేట్ వెంచర్‌లో భూములు కొనుగోలు చేసినవారున్నారు. ఇంకొందరు తెలుగుదేశం పార్టీతో వ్యాపార, సామాజిక సంబంధాలున్నవారు. తెలంగాణ ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపునకు కృషి చేయాలనీ, అందుకు అవసరమైన 'సహకారాన్ని' అందించాలనీ కూడా వారు తీర్మానించినట్టు తెలిసింది. ఇందుకు ప్రతిఫలంగా వారు ఆశించేది కూడా వచ్చే ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీని కొంచెం పైకి లేపే జాకీ కావాలి. అమరావతి వెంచర్‌లో చిన్నపాటి కదలికైనా రావాలి. కర్ణుడి చావుకు ఆరు కారణాలన్నట్టు రాచకొండ ప్రకటనకు కూడా ఇటువంటి అనేక కారణాలుండవచ్చు. నగర రియల్ ఎస్టేట్ అవసరాలకు అత్యంత చేరువలో ట్రిపుల్ వన్ జీవో పరిధిలో లక్ష ఎకరాలు సిద్ధమవుతున్న సమయంలో డిమాండ్‌ను మించిన సప్లై అందుబాటులోకి వచ్చింది. రాచకొండ సిటీ ఆచరణాత్మకమవుతుందని ఎవరూ భావించడం లేదు. భావించాల్సిన అవసరం కూడా లేదు. రియల్ ఎస్టేట్ వ్యాపారులకు కావలసింది అరచేతిలో వైకుంఠం చూపడమే! అమరావతిలో బాబు చూపిన వైకుంఠం వికటించింది. ఇప్పుడు కాంగ్రెస్ 'హస్తం'లో దాన్ని కొత్తగా చూపించాలి. మెడికల్ బెయిల్ మీద హైదరాబాద్‌లో ఉన్న చంద్రబాబు తక్షణ మిషన్ ఇదే! క్యాటరాక్ట్ ఆపరేషన్ కోసం నాలుగు వారాల సమయం కావాలని బాబు న్యాయవాదులు గట్టిగా వాదించి 28వ తేదీ దాకా మెడికల్ బెయిల్ తెచ్చుకున్నారు. తెలంగాణలో ఎన్నికల ప్రచార ఘట్టం ఆ రోజున పూర్తవుతుంది.

vardhelli1959@gmail.com

ఇరాక్‌తో ఒకలా! ఇజ్రాయెల్‌తో మరోలా!!

అభిప్రాయం



సంగిరెడ్డి హనుమంత రెడ్డి

పాలస్తీనాలో భాగమైన గాజా రాజ్యరహిత పరిస్థితి... దాన్ని పాలిస్తున్న హమాస్‌ను తీవ్రవాదంలోకి నెట్టింది. ఇజ్రాయెల్‌లోని పాలస్తీనా బందీలను వదలమన్న ఐక్య రాజ్య సమితి 194వ తీర్మానాన్ని ఇజ్రాయెల్ ఖాతరు చేయలేదు. పైగా పాలస్తీనాను ఆక్రమించింది. తీవ్ర నిరసనలతో 2023 అక్టోబర్ ఏడున హమాస్ ఇజ్రాయెల్‌పై దాడి చేసింది. ఇజ్రాయెల్ గాజాపై ప్రతీకార యుద్ధానికి దిగింది. ఈ చర్యను అనేక దేశాలు ఖండించాయి.

గతంలో భద్రతా మండలి 1441వ తీర్మానాన్ని 2002 నవంబర్ 8న ఏకగ్రీవంగా ఆమోదించింది. అనేక తీర్మానాల్లో నిర్ధారించినట్లు తన నిరాయుధీకరణ బాధ్యత నిర్వహణకు సద్దాం హుస్సేన్‌కు ఈ తీర్మానం తుది అవకాశాన్నిచ్చింది. 687వ తీర్మాన యుద్ధ విరమణ ఆదేశాన్ని ఇరాక్ పాటించలేదనీ, విధ్వంసక నిషిద్ధ ఆయుధాలను సంపాదించి, నిషేధిత క్షిపణులను తయారు చేసిందనీ, 1990–91లో కువైట్ ఆక్రమణలో తన సైనిక దోపిడీకి పరిహారం నిరాకరించిందనీ ఆరోపించింది. ఇరాక్ తప్పుడు వ్యాఖ్యానాలు, సమర్థనలు, ఈ తీర్మాన అమలు వైఫల్యం ఇరాక్ బాధ్యతల ఉల్లంఘన అని హెచ్చరించింది.

ఈ తీర్మానంలో ఇరాక్‌పై యుద్ధ ప్రసక్తి లేదు. ఐరాస పర్యవేక్షణ, పరిశీలన, తనిఖీ కమిషన్, అంతర్జాతీయ అణుశక్తి సంస్థ తనిఖీలను ఇరాక్ అనుమతించాలని పేర్కొన్నారు. 2002 సెప్టెంబర్‌లో అమెరికా అధ్యక్షుడు జార్జ్ డబ్ల్యు. బుష్ ఐరాస సాధారణ సభలో ఇరాక్ తప్పులను చదివారు. ఆ తప్పులు: ఐరాస భద్రతా సమితి 1373వ (ఉగ్రవాద నిరోధక) తీర్మానాన్ని ఇరాక్ ఉల్లంఘించింది. ఇరాన్, ఇజ్రాయెల్, పాశ్చాత్య దేశాలపై దాడులకు పాల్పడుతున్న ఉగ్రవాద సంస్థలకు మద్దతిస్తోంది. అఫ్గానిస్తాన్ నుంచి తప్పించుకున్న అల్ ఖైదా ఉగ్రవాదులు ఇరాక్‌లో ఉన్నారు. ఐరాస మానవ హక్కుల కమిషన్ 2001లో ఇరాక్‌లో తీవ్ర మానవ హక్కుల ఉల్లంఘనలను గమనించింది. ఇరాక్‌లో జీవ, రసాయన ఆయుధాలు, దీర్ఘ లక్ష్య క్షిపణుల తయారీ, ఉపయోగం ఐరాస తీర్మానాల అతిక్రమణ. ఐరాస పథకం ఆహారానికి చమురు డబ్బుతో ఇరాక్ ఆయుధాల కొనుగోలు.

భద్రతా మండలిలో వీటో హక్కు, శాశ్వత సభ్యత్వమున్న రష్యా, చైనా, ఫ్రాన్స్‌లకు ఇరాక్‌పై అమెరికా యుద్ధానికి దిగుతుందన్న అనుమానముంది. తీర్మానంలో తీవ్ర పరిణామాలు, పాదార్థిక ఉల్లంఘనలు వంటి పదాలు యుద్ధానికి దారితీయరాదని, ఇరాక్‌పై చర్యకు మరొక తీర్మానం అవసరమని రష్యా, ఫ్రాన్స్‌లు వాదించాయి. 1441వ తీర్మాన ముసాయిదాను తయారుచేసిన అమెరికా,



ఇంగ్లండ్‌లు, తీర్మానానికి అనుకూలంగా ఓటేసిన ఏకైక అరబ్బు దేశం సిరియా, ఈ తీర్మాన లక్ష్యం ఇరాక్ నిరాయుధీకరణని, దానికి ఇరాక్ సహకరించకపోతే భద్రతా మండలి తర్వాతి కార్యక్రమాన్ని నిర్ణయించాలని అన్నాయి. ఇరాక్ 2002 నవంబర్ పదమూడున తీర్మానాన్ని అంగీకరించింది. అమెరికా (ఐరాస) తీర్మాన ఆరోపణలు రుజువు కాలేదని ఐరాస తనిఖీ అధికారులు 2002 నవంబర్‌లో నివేదించారు. అదే ఏడాది డిసెంబర్‌లో ఇరాక్ 12 వేల పేజీల ఆయుధ నివేదికను ఇచ్చింది. ఏ ఐరాస సభ్య దేశమూ యుద్ధానికి అనుకూలం కాదు. అమెరికా, ఇంగ్లండ్‌లు చాలా తారుమారు పనులు చేశాయి. ఒకటి రెండు దేశాలు ఐరాస భద్రతా మండలిని ఆదేశించలేవని ఐరాస సభ్య దేశాలు ప్రకటించాయి. ఇరాక్‌పై యుద్ధం అసమ్మతమని న్యాయ కోవిదులు తమ అభిప్రాయాలను తెలిపారు. అయినా 2003 మార్చి 19న అమెరికా ఇరాక్‌పై యుద్ధానికి దిగింది. ఇంగ్లండ్, ఆస్ట్రేలియా, పోలండ్‌లు ఇరాక్‌పై యుద్ధం చేశాయి. 2003 మే వరకు వరకు యుద్ధం సాగింది. ఇరాక్ సర్వనాశనమైంది. సద్దాం హుస్సేన్‌ను బంధించి ఉరితీశారు. ఐరాస ప్రధాన కార్యదర్శి కోఫీ అన్నన్ ఇరాక్‌పై యుద్ధం చట్టవ్యతిరేకమనీ, ఐరాస వ్యవస్థాపక ఒప్పంద ఉల్లంఘననీ 2004 సెప్టెంబర్‌లో ప్రకటించారు.

యుద్ధనివారణ కోసం ఐరాస సభ్య దేశాలు ఒక దేశంపై మరొక దేశం దాడిని ఆపాలన్నది రెండవ ప్రపంచ యుద్ధ విధ్వంసం తర్వాత ఏర్పడ్డ ఐరాస ప్రధాన లక్ష్యం. ఇజ్రాయెల్ ఐరాస సభ్య దేశం. పాలస్తీనా, వాటికన్ నగరం ఐరాస పరిశీలన దేశాలు. యుద్ధ నిరోధంలో పాలస్తీనా కంటే ఇజ్రాయెల్‌పై ఎక్కువ బాధ్యత ఉంది.

అంతర్జాతీయ మానవత్వ చట్టాలను పాటించి, మానవత్వంతో గాజాలో ఇజ్రాయెల్ యుద్ధాన్ని ఆపాలనీ, ప్రజలకు అత్యవసర ఆహార, ఔషధాలను అందించాలనీ, బందీలను వదలాలనీ ఐరాస సర్వసభ్య సాధారణ సభ 2023 అక్టోబర్ 27న తీర్మానించింది. ఈనాటికీ ఈ తీర్మానాన్ని ఇజ్రాయెల్ అమలు చేయలేదు. యుద్ధాన్ని ఆపలేదు. అమెరికా... ఇజ్రాయెల్ పక్షం వహిస్తోంది. కనీసం తాత్కాలిక విరామాన్ని పాటించమని అమెరికా మిత్ర దేశాలే కోరాయి. ఐరాస 1441వ తీర్మాన చట్టవ్యతిరేక దుర్వినియోగానికి, ఐరాస ఒప్పంద ఉల్లంఘనకు పాల్పడ్డ అమెరికా, అలాగే ఇరాక్‌పై యుద్ధంలో పాల్గొన్న ఇంగ్లండ్, ఆస్ట్రేలియా, పోలండ్‌లు నేటి ఐరాస తీర్మానాన్ని ఎందుకు అమలు చేయించవు? ఇరాక్‌ను కక్షతో శిక్షించిన అమెరికా మానవత్వంతో ఇజ్రాయెల్‌ను ఎందుకు దండించదు?

వ్యాసకర్త ఆల్ ఇండియా ప్రోగ్రెసివ్ ఫోరం జాతీయ కార్యదర్శి । 9490 20 4545

అభేదం

సహజ కవి, భక్త కవి బమ్మెర పోతన పరమ శివ భక్తుడు. అయినా మహా భాగవత రచన చేయాలనే సంకల్పంతో ఒకరోజు పవిత్ర గౌతమీ గంగలో స్నానం చేసి, ఎత్తయిన ఇసుక తిన్నె మీద మహేశ్వర ధ్యానంలో నిశ్చలంగా కూర్చున్నాడు. సీతా సమేతుడైన రామచంద్రుడు పోతన ధ్యానంలో సాక్షాత్కరించాడు. తనకు అంకితంగా మహా భాగవతాన్ని తెలుగు చేయమన్నాడు. పోతన భాగవతం రచించి 'హరికి నందగోకుల విహారికి' శ్రీకృష్ణునికి సమర్పణం చేశాడు. ఇది అత్యద్భుతం. ఆశ్చర్యకరం.

జ్యోతిర్మయం

శ్రీమన్నారాయణుని కథలు రాయాలనుకున్న పోతన తన ఇష్ట దైవం శివుని ధ్యానించాడు. శివుని ధ్యానిస్తున్న అతనికి శ్రీరాముడు ఎలా ప్రత్యక్షమయ్యాడు? శ్రీరాముడు తన కివ్వమన్న కృతిని పోతన కృష్ణునికి అంకితం చేయటం ఏమిటి? ఈ మహా మాయా నాటకమంతా శ్రీహరికి, శివునికి, రాముడికి, కృష్ణునికి అభేదం చెప్పటానికే! దేవుడు ఒక్కడే. ఆ యా రూపాలన్నీ దుష్ట శిక్షణ, శిష్ట రక్షణలకు భగవంతుడు ఆ యా సందర్భాలలో దాల్చిన రూపాలే అని చెప్పటానికే!

ఆనాటి సమాజంలో చెలరేగిన శైవ, వైష్ణవ పరస్పర సంఘర్షణను శాంతింప చేయటానికి, సమరస భావాన్ని నెలకొల్పటానికి పోతన హరిహరాద్వైత భావనను చెప్పాడు. తిక్కన హరి హర నాథునికి తన భారతాన్ని అంకితం చేసి శివ కేశవ అభేదాన్ని చాటి చెప్పాడు. మహా కవుల చర్యలు, రచనలు సమాజ శ్రేయస్సు, లోక కల్యాణాల కోసమే!

– డాక్టర్ చెంగల్వ రామలక్ష్మి

క్లుప్తంగా...

ఎన్నికల ప్రచారంలో బీఆర్‌ఎస్ 'బలగం'

సాక్షి, హైదరాబాద్: ఇటీవలి కాలంలో భారీగా ప్రేక్షకాదరణ చూరగొన్న 'బలగం'సినిమా ఇతివృత్తం, నటులతో బీఆర్‌ఎస్ రూపొందించిన ఎన్నికల ప్రచార వీడియోలను తాజాగా శనివారం విడుదల చేసింది. బలగం సినిమాలో నటించిన పలువురు నటులతో రూపొందించిన వీడియోలతో ఓటర్లకు చేరువయ్యేలా ఈ ప్రకటనలు రూపొందించారు. బలగం ఇతివృత్తంతో మొత్తం 5 ప్రచార వీడియోలు రూపొందించగా, ఇందులో తొమ్మిదేళ్లలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం సాధించిన విజయాలు, అమలు చేస్తున్న పథకాలు సామాన్యులకు అర్థమయ్యే రీతిలో వివరించారు. బలగం సినిమా తెలంగాణ పల్లె వాతావరణం, కుటుంబ, సామాజిక సంబంధాలకు అద్దం పట్టగా, అదే రీతిలో రూపొందించిన ఎన్నికల ప్రచార వీడియోలను బీఆర్‌ఎస్ పార్టీ టీవీ, సినిమా థియేటర్లతో పాటు వివిధ డిజిటల్ మీడియా వేదికలపై ప్రదర్శించేందుకు సన్నాహాలు చేస్తోంది.

తెలంగాణలో బీజేపీ ఆటలు సాగవు: అసదుద్దీన్



గోల్కొండ: రాష్ట్రంలో బీజేపీ ఆటలు సాగవని ఎంఐఎం పార్టీ అధినేత అసదుద్దీన్ ఒవైసీ అన్నారు. శనివారం హైదరాబాద్‌లోని హకీంపేట్ సాలార్ బ్రిడ్జి వద్ద జరిగిన ఎన్నికల సభలో ఆయన మాట్లాడారు. కాషాయజెండాను అమలుపరుస్తూ దేశప్రజలను విడగొట్టేవిధంగా బీజేపీ పనిచేస్తోందని ఆరోపించారు. పార్టీలు వేరైనా భారతీయులందరూ ఒక్కటే నన్న సిద్ధాంతాన్ని ప్రగాఢంగా నమ్ముతానన్నారు. అయితే బీజేపీ ఇందుకు విరుద్ధంగా మైనార్టీలను రెండోశ్రేణి పౌరులుగా చూస్తోందని ఆరోపించారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ముస్లింలు, దళితులపై దాడులు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణలో మాత్రం ప్ర జలు కలిసిమెలిసి శాంతియుతవాతావరణంలో జీవిస్తున్నారని పేర్కొన్నారు.

21 కులాలు ఏపీ అంతటా బీసీలే

- వాటి ఉప కులాలకు సైతం ప్రాంతం, భౌగోళిక పరిమితి తొలగింపు
- ఆ కులాల వారికీ బీసీ ధ్రువపత్రాల జారీలో ఇబ్బందులు లేకుండా ఆదేశాలు
- 2008లో పలు కులాలకు ప్రాంతాలవారీగా బీసీ అవకాశం ఇచ్చిన వైఎస్
- తాజాగా రాష్ట్రమంతటా పరిధి విస్తరిస్తూ సీఎం జగన్ ఆదేశాలు



సాక్షి, అమరావతి: కొన్ని ప్రాంతాలకే వెనుకబడిన తరగతులు (బీసీ)గా పరిమితమైన 21 కులాలు, వాటి ఉప కులాలకు ప్రాంతం, భౌగోళిక పరిమితులను తొలగించి ఏపీ అంతటా బీసీలుగానే పరిగణిస్తూ వైఎస్ జగన్ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి.అనంత రాము ఉత్తర్వులు జారీ చేశారు. వెనుకబడిన తరగతుల జాబితాలో ఉన్న 138 కులాల్లో 31 కులాలు వాటి కార్యకలాపాలపై ప్రాంతం, భౌగోళిక పరిమితులను కలిగి ఉన్నాయి. వాటిలో పది బీసీ కులాలు తెలంగాణలో, 21 ఆంధ్రప్రదేశ్‌లో ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్‌లోని 21 కులాలను కోస్తా ఆంధ్ర, రాయలసీమ ప్రాంతాల్లో బీసీలుగా పరిగణిస్తున్నారు. ఈ విషయంలో వచ్చిన అనేక అభ్యర్థనలను పరిశీలించిన ప్రభుత్వం ఈ 21 కులాలకు ప్రాంతం, భౌగోళిక పరిమితిని తొలగించడం ద్వారా రాష్ట్రం అంతటా బీసీలుగా గుర్తించే అవకాశం దక్కింది. ఆ కులాలకు ఇకపై రాష్ట్రవ్యాప్తంగా బీసీ కుల ధ్రువీకరణ పత్రాలు జారీ చేయాలని జిల్లా కలెక్టర్లకు ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చింది. కల్లుగీతపై ఆధారపడిన శెట్టి బలిజ కులానికి మాత్రం రాయలసీమ ప్రాంతంలో ఇది వర్తించదు. రాష్ట్రంలో వెనుకబడిన తరగతులకు చెందిన అనేక కులాలకు కొన్ని ప్రాంతాల్లో బీసీ రిజర్వేషన్లు పొందేలా 2008లో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి అవకాశం కల్పిస్తే, ఇప్పుడు 21 కులాలకు, వాటి ఉప కులాలకు రాష్ట్రమంతటా బీసీలుగా పరిగణిస్తూ సీఎం వైఎస్ జగన్ ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం పట్ల సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది.

21 కులాలు ఇవీ..

- బీసీ–ఏ గ్రూప్‌లో ఆరు కులాలు, వాటి ఉపకులాలు ఉన్నాయి. అవి కురకుల, పొండర, సామాంతుల (సామంత, సొంటియా), పాల ఏకరీ, ఏకిల, వ్యాకుల, ఏకిరి, నయనివారు, పాలేగారు, తొలగరి, కవలి, ఆసాదుల, కెవుట (కెవుటో, కెవిటి) కులాలు ఉన్నాయి.
- బీసీ–బీ గ్రూపులో నాలుగు కులాలు, వాటి ఉప కులాలు ఉన్నాయి. వాటిలో అచ్చుకట్లవాండ్లు, గౌడ (ఈడిగ, గౌడ, గమల్లా), కలాలీ, గౌండ్ల, శెట్టి బలిజ (రాయలసీమ మినహా అంతటా), కుంచిటి వక్కలింగ (వక్కలింగ, కుంచిటిగ), గుడ్ల (గుడ్లయ) కులాలు ఉన్నాయి.
- బీసీ–డీ గ్రూపులో 11 కులాలు, వాటి ఉప కులాలు ఉన్నాయి. వాటిలో మున్నూరు కాపు, పోలినాటి వెలమ, సదర, అరవ, అయ్యరక, నగరాలు, ముదలర్, ముదిలియర్, బెరి వైశ్య (బెరి శెట్టి), అతిరాస, కుర్మి, కలింగ కోమటి(కలింగ వైశ్య) కులాలు ఉన్నాయి.

కాంగ్రెస్ 'స్టార్ క్యాంపెయినర్లు' వీరే..

- ఖర్గే, సోనియా, రాహుల్, ప్రియాంక సహా 40 మందితో జాబితా







సాక్షి, న్యూఢిల్లీ: అసెంబ్లీ ఎన్నికల ప్రచారాన్ని మరింత ఉధృతం చేసేందుకు కాంగ్రెస్ పార్టీ సిద్ధమైంది. రాష్ట్రవ్యాప్తంగా ప్రచారం చేసేందుకు మల్లికార్జున ఖర్గే, సోనియా, రాహుల్, ప్రియాంక సహా కీలక నేతలతో స్టార్ క్యాంపెయినర్ల జాబితాను ప్రకటించింది. ఈ మేరకు కేంద్ర ఎన్నికల సంఘానికి ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి తారిఖ్ అన్వర్ జాబితాను అందించారు. ఆ నేతలు వీరే..

మల్లికార్జున్ ఖర్గే, సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ, కేసీ వేణుగోపాల్, సిద్ధరామయ్య, భూపేశ్ బఘేల్, డీకే శివకుమార్, అశోక్ చవాన్, మాణిక్‌రావ్ ఠాక్రే, రేవంత్‌రెడ్డి, మల్లు భట్టి విక్రమార్క, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, సల్మాన్ ఖుర్షీద్, టి. జీవన్‌రెడ్డి, జైరాం రమేశ్, రమేష్ చెన్నితల, దీపా దాస్‌మున్షీ, రేణుకా చౌదరి, కె.మురళీధరన్, సయ్యద్ నసీర్ హుస్సేన్, ఇమ్రాన్ ప్రతాప్‌గర్హి, దామోదర రాజనర్సింహ, చల్లా వంశీచంద్‌రెడ్డి, వి.హనుమంతరావు, పోరిక బలరాంనాయక్, కుందూరు జానారెడ్డి, మధుయాష్కీగౌడ్, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వర్‌రావు, కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, మహమ్మద్ అజారుద్దీన్, సీతక్క, బెల్లయ్యనాయక్, పీసీ విష్ణునాథ్, మన్సూర్ అలీఖాన్, రోహిత్ చౌదరి, మహేశ్‌కుమార్‌గౌడ్ తదితరుల పేర్లు జాబితాలో ఉన్నాయి.

క్రిస్ సిటీ నిర్మాణానికి దిగ్గజ సంస్థల పోటీ

- తుది బిడ్డింగ్ పోరులో నిలిచిన మూడు ప్రముఖ నిర్మాణ సంస్థలు
- రూ.1,021 కోట్లతో 'క్రిస్'సిటీ నిర్మాణానికి ఏపీఐఐసీ టెండర్లు
- కృష్ణపట్నం వద్ద తొలిదశలో క్రిస్ సిటీ కింద 2,500 ఎకరాల అభివృద్ధి



సాక్షి, అమరావతి: చెన్నై–బెంగళూరు పారిశ్రామిక కారిడార్‌లో కృష్ణపట్నం వద్ద అభివృద్ధి చేయనున్న పారిశ్రామిక నగరం 'క్రిస్'సిటీ నిర్మాణానికి దిగ్గజ సంస్థలు పోటీపడుతున్నాయి. తొలిదశలో రూ.1,503.16 కోట్లతో 2,500 ఎకరాల అభివృద్ధికి ఏపీ ప్రభుత్వం పరిపాలన అనుమతులివ్వడంతో ఈపీసీ విధానంలో రూ.1,021.41 కోట్ల విలువైన పనులకు టెండర్లు ఆహ్వానించింది. తుది బిడ్డింగ్‌లో మూడు కీలక సంస్థలు అర్హత సాధించినట్లు ఏపీఐఐసీ వీసీఎండీ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. ప్రస్తుతం ఈ టెండర్ల మదింపు జరుగుతోందని, అర్హత సాధించిన తర్వాత వెంటనే నిర్మాణ పనులు ప్రారంభించే విధంగా ప్రణాళికలు సిద్ధంచేసినట్లు ఆయన తెలిపారు. చెన్నై–బెంగళూరు కారిడార్‌లో భాగంగా కృష్ణపట్నం వద్ద 10,834.5 ఎకరాల్లో పారిశ్రామిక పార్కును రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధి చేస్తోంది. ఇందుకోసం కేంద్ర ప్రభుత్వానికి చెందిన నేషనల్ ఇండస్ట్రియల్ కారిడార్ డెవలప్‌మెంట్ అండ్ ఇంప్లిమెంటేషన్ ట్రస్ట్ (నిక్‌డిక్ట్)తో కలిసి ఏపీఐఐసీ నిక్‌డిక్ట్–కృష్ణపట్నం ఇండస్ట్రియల్ సిటీ డెవలప్‌మెంట్ లిమిటెడ్ (క్రిస్‌సిటీ) పేరుతో ప్రత్యేక కంపెనీని ఏర్పాటుచేసింది. పూర్తిస్థాయిలో తొలిదశ అందుబాటులోకొస్తే 78,900 మందికి ఉపాధి లభిస్తుందని అంచనా.

విద్యా తేజం ఆంధ్రా విశ్వవిద్యాలయం

- ఆంధ్రా వర్సిటీకి తొలిసారిగా ఏ డబుల్ ప్లస్ గ్రేడ్
- కీలకమైన గ్రేడ్ కేటాయించిన నాక్



సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం: ఉన్నతమైన, ప్రకాశవంతమైన చదువులకు ప్రతీకగా 'తేజస్వినావధీతమస్తు'అనే నినాదంతో ఏటా వేలాది విద్యార్థులను మేధావులుగా తీర్చిదిద్దుతున్న ఆంధ్రా విశ్వవిద్యాలయం దేశంలోనే అత్యున్నత వర్సిటీల్లో ఒకటిగా నిలిచింది. సాగర తీరంలో, విశాలమైన ప్రాంగణంలో, ప్రశాంత వాతావరణంలో అత్యున్నత వసతులు, ప్రమాణాలతో విద్యనందిస్తూ నేషనల్ అసెస్మెంట్ అండ్ అక్రిడిటేషన్ కౌన్సిల్ (నాక్)ను మెప్పించి, ఏ డబుల్ ప్లస్ గ్రేడ్ పొందింది. నాక్ ఏయూలోని వసతులను ప్రత్యక్షంగా పరిశీలించి ఏ ప్లస్ ప్లస్ గ్రేడ్‌ను మంజూరు చేసింది. దేశంలో అత్యున్నత కోర్సులు, బోధన, సౌకర్యాలు, కలిగిన అతి కొద్ది యూనివర్సిటీలకు దక్కే ఈ గ్రేడ్‌ను ఏయూ కూడా సాధించడం విశేషం. దేశంలో 3.74 స్కోర్ బెంగళూరు, ఎస్ఆర్ఎం యూనివర్సిటీలతో పాటు ఆంధ్రా యూనివర్సిటీకి మాత్రమే దక్కింది. టాప్ స్కోర్ దక్కిన నేపథ్యంలో 2030 వరకూ వర్సిటీకి ఏ ప్లస్ ప్లస్ గ్రేడ్ ఉండనుంది. ఈ ర్యాంకులను అధికారికంగా ఈ నెల 14న ప్రకటించనున్నట్టు తెలిసింది.

ఊపందుకుంటున్న ధాన్యం కొనుగోళ్లు

- వానాకాలం సీజన్‌లో కోటి మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ లక్ష్యం
- 7,040 కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు నిర్ణయం
- 2,522 కేంద్రాలలో మొదలైన కొనుగోళ్లు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని పలు జిల్లాల్లో వానాకాలం సీజన్ ధాన్యం కొనుగోళ్లు ఊపందుకుంటున్నాయి. 17 జిల్లాల్లో ఇప్పటి వరకు కొనుగోళ్ల ప్రక్రియ ప్రారంభం కాగా, మిగతా జిల్లాల్లో ఏర్పాట్లు జరుగుతున్నాయి. ముందుగా కోతలు జరిగే ఉమ్మడి నిజామాబాద్, కరీంనగర్, నల్లగొండ జిల్లాల్లో భారీగా కొనుగోళ్లు సాగుతున్నాయి. పంట సాగు విస్తీర్ణాన్ని బట్టి ఈసారి అటూ ఇటుగా కోటి మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వస్తుందని అంచనా వేయగా, ఇప్పటి వరకు రాష్ట్రంలో 2,522 కొనుగోలు కేంద్రాల ద్వారా 6.21 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించారు. సేకరించిన ధాన్యం విలువ రూ.1,368.22 కోట్లు కాగా, ఇప్పటి వరకు రూ.286.49 కోట్లు రైతులకు చెల్లించారు. కాగా గత సంవత్సరం వానాకాలం సీజన్‌లో ప్రభుత్వం 70 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేయడం గమనార్హం.

7,040 కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు నిర్ణయం: కోటి మెట్రిక్ టన్నుల వరకు ధాన్యాన్ని సేకరించేందుకు హైదరాబాద్ మినహా మిగతా జిల్లాల్లో 7,040 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని అధికారులు నిర్ణయించారు. ఇందులో భాగంగా ఇప్పటి వరకు 4,156 కేంద్రాలను ప్రారంభించగా, 2,522 కేంద్రాల్లో మాత్రమే కొనుగోళ్ల ప్రక్రియ మొదలైంది. రెవెన్యూ యంత్రాంగం పూర్తిగా ఎన్నికల విధుల్లో బిజీగా ఉండగా, పౌరసరఫరాల శాఖ, సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ల అధికారులు పూర్తి స్థాయిలో కొనుగోళ్ల ప్రక్రియను పర్యవేక్షిస్తున్నారు.

నిజామాబాద్ నుంచి అత్యధికంగా...: రాష్ట్రవ్యాప్తంగా కోటి మెట్రిక్ టన్నుల ధాన్యం వస్తుందని అంచనా వేస్తుండగా, ఇందులో అత్యధికంగా నిజామాబాద్ జిల్లా నుంచి 8 లక్షల మెట్రిక్ టన్నులను సేకరించాలని పౌరసరఫరాల సంస్థ ప్రణాళిక రూపొందించింది. నిజామాబాద్ తరువాత నల్లగొండ జిల్లా నుంచి 6.75 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించనున్నారు. తరువాత స్థానాల్లో కామారెడ్డి (6.5 ఎల్ఎంటీ), జగిత్యాల (5.58 ఎల్ఎంటీ) నుంచి భారీ ఎత్తున ధాన్యం సేకరించాలని భావిస్తున్నారు. కాగా, రాష్ట్రంలోనే అత్యల్పంగా ఆదిలాబాద్ జిల్లాలో కేవలం మూడు కొనుగోలు కేంద్రాల ద్వారా 3,363 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించే అవకాశం ఉన్నట్లు పౌరసరఫరాల సంస్థ లెక్కలు వేసింది.

గజ్వేల్‌లో 145 .. కామారెడ్డిలో 92

- సీఎం కేసీఆర్ పోటీచేసే స్థానాల్లో పోటెత్తిన నామినేషన్లు
- మొత్తం 119 స్థానాల్లో 4,798 మంది నామినేషన్
- రేపు నామినేషన్ల పరిశీలన

సాక్షి, హైదరాబాద్: ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ శుక్రవారంతో ముగిసిపోగా, రాష్ట్రంలోని మొత్తం 119 శాసనసభ నియోజకవర్గాల్లో 4,798 మంది అభ్యర్థులు నామినేషన్ వేశారు. మొత్తం 5,716 సెట్ల నామినేషన్లు దాఖలయ్యాయి. సీఎం కేసీఆర్ సొంత నియోజకవర్గం గజ్వేల్‌తో పాటు కామారెడ్డి నుంచి పోటీ చేస్తుండగా, గజ్వేల్‌లో రాష్ట్రంలోనే అత్యధికంగా 145 మంది అభ్యర్థులు నామినేషన్ వేశారు. కామారెడ్డిలో సైతం 92 మంది నామినేషన్ వేయడం గమనార్హం. మేడ్చల్ నియోజకవర్గంలో 116 మంది, ఎల్బీనగర్ నుంచి 77 మంది, మునుగోడు నుంచి 74 మంది, సూర్యాపేట నుంచి 68 మంది, మిర్యాలగూడ నుంచి 67 మంది, నల్లగొండ నుంచి 64 మంది, సిద్దిపేట నుంచి 62 మంది, కోదాడ నుంచి 61 మంది నామినేషన్ వేశారు. అత్యల్పంగా నారాయణపేట్ స్థానం నుంచి 13 మంది మాత్రమే నామినేషన్లు వేశారు. ఈ నెల 13న నామినేషన్ల పరిశీలన నిర్వహించనుండగా, 15వ తేదీతో నామినేషన్ల ఉపసంహరణకు గడువు ముగియనుంది.

పోస్టల్ బ్యాలెట్ కోసం 31,551 దరఖాస్తులు

పోస్టల్ బ్యాలెట్ సదుపాయం కోసం భారీ సంఖ్యలో ఓటర్లు దరఖాస్తు చేసుకున్నారు. దివ్యాంగులు, వయోజనులు, ఎన్నికలతో సంబంధం లేని అత్యవసర సేవల్లో ఉండే ఓటర్లు కలిపి మొత్తం 31,551 మంది పోస్టల్ బ్యాలెట్ సదుపాయం కోసం దరఖాస్తు చేసుకున్నారు. అత్యధికంగా సిద్దిపేట నుంచి 757 మంది, అత్యల్పంగా మక్తల్ నియోజకవర్గం నుంచి 5 మంది దరఖాస్తు చేసుకున్నారు. వయోజన, దివ్యాంగ ఓటర్లకు ఇంటి వద్దే పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటేసేందుకు అవకాశం కల్పించనున్నారు.

3.26 కోట్లకు పెరిగిన ఓటర్లు

ఈ నెల 5న తుది ఓటర్ల జాబితాను ప్రకటించగా, ఆ తర్వాత వచ్చిన ఓటర్ల నమోదు దరఖాస్తులను పరిష్కరించి శుక్రవారం అనుబంధ ఓటర్ల జాబితాను ప్రకటించారు. దీంతో రాష్ట్రంలో ఓటర్ల సంఖ్య 3,26,18,205కి పెరిగింది. అందులో 1,62,98,418 మంది పురుషులు, 1,63,01,705 మంది మహిళలు, 2,676 మంది థర్డ్ జెండర్ ఓటర్లు ఉన్నారు. తొలిసారిగా మహిళా ఓటర్ల సంఖ్య పురుష ఓటర్లకు మించిపోయింది. 15,406 మంది సర్వీసు ఓటర్లు, 2,944 మంది ఓవర్సీస్ ఓటర్లున్నారు. 2023 జనవరితో పోల్చితే తాజాగా రాష్ట్రంలో 8.75 శాతం మంది ఓటర్లు పెరిగారు. 80 ఏళ్లకు పైబడిన ఓటర్లు 44,371 మంది ఉండగా, వికలాంగ ఓటర్లు 506921 మంది ఉన్నారు. 18–19 ఏళ్ల యువ ఓటర్ల సంఖ్య 9,99,667 కాగా, మొత్తం ఓటర్లలో వీరి శాతం 3.06గా ఉంది.

బీజేపీ ప్రొటోకాల్ సెల్ కో కన్వీనర్‌గా డా.రాహుల్

సాక్షి, హైదరాబాద్: బీజేపీ రాష్ట్ర ప్రొటోకాల్ సెల్ కో కన్వీనర్‌గా డా.రాహుల్ సరిదేనా నియమితులయ్యారు. శనివారం ఈ మేరకు కేంద్రమంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి ఈ నియామకం చేసినట్టు పార్టీ ప్రధానకార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు.

క్లుప్తంగా...

14 గంటల్లో 800 సార్లు భూప్రకంపనలు

- ఐస్‌ల్యాండ్‌లో అత్యయక స్థితి

న్యూయార్క్: అట్లాంటిక్ మహాసముద్రంలోని ద్వీపదేశం ఐస్‌ల్యాండ్ వందలాది చిన్నపాటి భూప్రకంపనలతో వణికిపోయింది. స్థానిక కాలమానం ప్రకారం శుక్రవారం అర్ధరాత్రి నుంచి శనివారం మధ్యాహ్నం రెండింటివరకు అంటే 14 గంటల వ్యవధిలో ఏకంగా 800 సార్లు భూప్రకంపనలు సంభవించాయి. దీంతో భూకంప కేంద్ర సమీప ప్రాంత ప్రజలు భయంతో వణికిపోయారు. వారికి సురక్షిత ప్రాంతానికి తరలించేందుకు ప్రభుత్వం ఏర్పాట్లుచేస్తోంది. ఎక్కువ ప్రకంపనలు నమోదైన ప్రాంతానికి మూడు కిలోమీటర్ల దూరంలో 4,000 మంది జనాభా ఉన్న గ్రిండావిక్ గ్రామం ఉంది. అక్కడి వారిని వేరే చోటుకు తరలిస్తున్నారు. 800 భూకంపాల్లో పెద్దదైన భూకంపం గ్రిండావిక్‌కు ఉత్తర దిశలో రిక్టర్‌స్కేలుపై 5.2గా నమోదైంది. నైరుతి ఐస్‌ల్యాండ్‌లోని రీక్‌జేన్స్ అనే ప్రాంతంలో ఎక్కువ ప్రకంపనలు కనిపించాయి. అగ్నిపర్వతాల వ్యవస్థలమయమైన ఐస్‌ల్యాండ్‌లో భూకంపాల ధాటికి సుందన్‌జుకాగిగార్ ప్రాంతంలో అగ్నిపర్వతాలు బద్దలయ్యే ప్రమాదముందని అక్కడి పౌర రక్షణ, అత్యవసర విభాగం ఒక ప్రకటనలో పేర్కొంది.

ఆరుగురు అలీగఢ్ వర్సిటీ విద్యార్థుల అరెస్ట్

- ఐసిస్ నెట్‌వర్క్ బట్టబయలు

లక్నో: ఉగ్రవాద సంస్థ ఇస్లామిక్ స్టేట్(ఐసిస్) తరఫున పనిచేస్తున్నారనే ఆరోపణలపై యూపీ పోలీసులు అలీగఢ్ ముస్లిం యూనివర్సిటీకి చెందిన ఆరుగురు విద్యార్థులను అరెస్ట్ చేశారు. నిందితులందరికీ అలీగఢ్ యూనివర్సిటీ విద్యార్థుల సంఘమైన స్టూడెంట్స్ ఆఫ్ అలీగఢ్ యూనివర్సిటీ(సము)తో సంబంధాలున్నట్లు పోలీసులు తెలిపారు. వీరు తరచుగా సమావేశాలు నిర్వహిస్తూ, ఐసిస్‌లోకి కొత్త వారిని చేర్చుకుంటున్నారని ఉత్తరప్రదేశ్ యాంటీ టెర్రర్ స్క్వాడ్(ఏటీఎస్) విభాగం తెలిపింది. దేశంలో భారీ ఉగ్రదాడికి వీరు కుట్ర పన్నుతున్నారని వెల్లడించింది. అరెస్టయిన వారిలో రకీమ్ ఇనామ్, నవీద్ సిద్దిఖి, మహ్మద్ నొమాన్, మహ్మద్ నజీమ్ అనే నలుగురిని గుర్తించింది. వీరందరినీ రాష్ట్రంలోని వేర్వేరు ప్రాంతాల్లో అరెస్ట్ చేసినట్లు వివరించింది. ఇప్పటికే ఈ విద్యార్థి సంఘం కార్యకలాపాలపై కేంద్ర నిఘా వర్గాలు ఓ కన్నేసి ఉంచాయని కూడా పేర్కొంది.

'ల్యాండ్ ఫర్ జాబ్స్' కుంభకోణం.. లాలూ సన్నిహితుడి అరెస్ట్

న్యూఢిల్లీ: 'ల్యాండ్ ఫర్ జాబ్స్'కుంభకోణం కేసులో మనీ ల్యాండరింగ్ ఆరోపణలపై ఆర్‌జేడీ చీఫ్ లాలూ ప్రసాద్ యాదవ్, ఆయన కుమారుడు తేజస్వీ యాదవ్‌ల సన్నిహితుడు అమిత్ కట్యాల్‌ను ఈడీ అధికారులు అరెస్ట్ చేశారు. విచారణకు హాజరు కావాలంటూ పలుమార్లు సమన్లు జారీ చేసినా అతడు తప్పించుకు తిరుగుతున్నాడని ఈడీ తెలిపింది. కోర్టులో హాజరుపరిచి విచారణ కోసం రిమాండ్ కోరుతామని ఈడీ వివరించింది. ఈ కేసులో ఈడీ సమన్లను కొట్టివేయాల్సిందిగా అతడు వేసిన పిటిషన్‌ను ఢిల్లీ హైకోర్టు ఇటీవల కొట్టివేసినట్లు సమాచారం. ఈ ఏడాది మార్చిలో లాలూ, తేజస్వీ యాదవ్, లాలూ కుమార్తెలు తదితరులతోపాటు కట్యాల్ ఇంటిపైనా ఇళ్లపై ఈడీ దాడులు జరిపింది. యూపీఏ ప్రభుత్వ హయాంలో లాలూ ప్రసాద్ రైల్వే మంత్రిగా ఉండగా ఈ కుంభకోణం జరిగినట్లు ఈడీ ఆరోపిస్తోంది.

ఢిల్లీలో స్వల్ప భూకంపం

న్యూఢిల్లీ: దేశ రాజధానిలో మరోసారి భూకంపం సంభవించింది. శనివారం మధ్యాహ్నం 3.36 గంటల సమయంలో వచ్చిన ఈ భూకంప తీవ్రత రిక్టర్ స్కేలుపై 2.6గా నమోదైనట్లు జాతీయ భూకంప పరిశోధన కేంద్రం వెల్లడించింది. ఢిల్లీకి 20 కిలోమీటర్ల దూరంలోని బురారిలో భూకంప కేంద్రం ఉందని వివరించింది.

ఉదయం నడక మానండి.. టపాసులు కాల్చకండి..

- ఢిల్లీ ప్రజలకు ఆరోగ్య శాఖ సూచన

న్యూఢిల్లీ: ఉదయం నడక మానండి..టపాసులు కాల్చకండి..ప్రజా రవాణా వ్యవస్థను ఉపయోగించుకోండి.. వాయు కాలుష్యం కొనసాగుతున్న వేళ దేశ రాజధాని వాసులకు ఢిల్లీ ఆరోగ్య శాఖ జారీ చేసిన సూచనలివి. శనివారం అన్ని ప్రధాన వార్తాపత్రికల్లో ఈ మేరకు సూచనలు ప్రచురించింది. ఇక కాలుష్యంతో రెండు వారాలుగా ఇబ్బంది పడుతున్న జనానికి వర్షం ఊరట ఇచ్చింది. దేశ రాజధాని ప్రాంతంలో గురువారం వాయు నాణ్యత ఇండెక్స్(ఏక్యూఐ) 437 కాగా, శనివారం ఉదయం ఏక్యూఐ 219కి పడిపోయింది.

పుతిన్ క్షమాభిక్ష... ఎందుకంటే..!

మాస్కో: గర్ల్‌ఫ్రెండ్ తిరస్కరించిందనే కక్షతో ఆమెపై అత్యాచారానికి పాల్పడటంతోపాటు చిత్రహింసలు పెట్టి, ఏకంగా 111 సార్లు పొడిచి అత్యంత క్రూరంగా హత్య చేశాడో యువకుడు. అయినా సరే, కటకటాల వెనుక ఏడాది కూడా గడపకుండానే విడుదలయ్యాడు. రష్యాకు చెందిన వ్లాడిస్లావ్ కన్యూస్ అనే యువకుడు వెరా పెఖ్తెలెవాను ప్రేమించాడు. ఆ తర్వాత ఆమె అతడిని దూరంగా పెట్టింది. దాంతో ఆమెను బంధించి మూడున్నర గంటలపాటు చిత్రహింసలు పెట్టి చంపేశాడు. కోర్టు అతడికి 17 ఏళ్ల జైలు శిక్ష విధించింది. కానీ ఉక్రెయిన్‌తో యుద్ధంలో పాల్గొనేందుకు అతను అంగీకరించడంతో అధ్యక్షుడు పుతిన్ క్షమాభిక్ష ప్రకటించారు. కన్యూస్‌ను విడుదల చేసి ఉక్రెయిన్‌తో సరిహద్దుల్లోని రోస్తోవ్ నగరానికి తీసుకెళ్లారు.

ఉత్తరాఖండ్‌లో ఉమ్మడి పౌర స్మృతి!

- నివేదిక సమర్పించనున్న దేశాయ్ కమిటీ
- ఆ వెంటనే అసెంబ్లీ ఆమోదం, యూసీసీకి చట్టబద్ధత
- అమలు చేస్తే దేశంలో తొలి రాష్ట్రంగా రికార్డు
- త్వరలోనే బీజేపీ పాలిత గుజరాత్‌లో కూడా!
- గోవాలో ఇప్పటికే అమల్లో ప్రత్యేక పౌర స్మృతి



కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన నాటినుంచీ దేశవ్యాప్తంగా విస్తృతంగా చర్చల్లో నిలుస్తూ వస్తున్న ఉమ్మడి పౌర స్మృతి (యూనిఫాం సివిల్ కోడ్-యూసీసీ)ని హిమాలయ రాష్ట్రం ఉత్తరాఖండ్ త్వరలో అమలు చేయనున్నట్టు సమాచారం. వచ్చే వారమే ఈ దిశగా చర్యలు చేపట్టబోతోందని తెలుస్తోంది. తద్వారా దేశంలో యూసీసీని అమలు చేస్తున్న తొలి రాష్ట్రంగా అది నిలవనుంది. యూసీసీపై సుప్రీంకోర్టు రిటైర్డ్ న్యాయమూర్తి జస్టిస్ రంజనా ప్రకాశ్ దేశాయ్ సారథ్యంలో ఏర్పాటైన కమిటీ ఒకట్రెండు రోజుల్లో సీఎం పుష్కర్‌సింగ్ ధామికి నివేదిక సమర్పించనుంది. దీపావళి అనంతరం రాష్ట్ర అసెంబ్లీ ప్రత్యేకంగా సమావేశమై యూసీసీ బిల్లును ఆమోదించనుంది. తద్వారా దానికి చట్టబద్ధత కల్పించనుంది.

ఎన్నికల వాగ్దానం: ఉత్తరాఖండ్‌లో గతేడాది జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ చేసిన ఎన్నికల వాగ్దానాల్లో యూసీసీ అమలు ప్రధానమైనది. ఆ మేరకు జస్టిస్ దేశాయ్ సారథ్యంలో ఐదుగురు సభ్యులతో కమిటీ ఏర్పాటు చేస్తూ తొలి కేబినెట్ భేటీలోనే సీఎం ధామీ నిర్ణయం తీసుకున్నారు. డ్రాఫ్ట్ తయారీ కోసం రాష్ట్రంలో దాదాపు 2.3 లక్షల మందితో కమిటీ చర్చలు జరిపింది. యూసీసీ డ్రాఫ్ట్ కమిటీలో కూడా ఆమె సభ్యురాలు.

ఉత్తరాఖండ్‌లో యూసీసీ అమలైతే..

- యూసీసీ అమల్లో భాగంగా బహుభార్యత్వాన్ని ఉత్తరాఖండ్ సంపూర్ణంగా నిషేధించనుందని చెబుతున్నారు. ఇంకా...
- సహజీవనం చేసే జంటలు దాన్ని అధికారికంగా నమోదు చేసుకునే సదుపాయం కల్పిస్తారు.
- కుమారుడితో సమానంగా కూతురికి కూడా సంపూర్ణ వారసత్వహక్కులు సంక్రమిస్తాయి.

పార్టీల్లో భిన్నాభిప్రాయాలు...

యూసీసీ అమలుపై రాజకీయ పక్షాల్లో భిన్నాభిప్రాయాలున్నాయి. బీజేపీ దీన్ని గట్టిగా సమర్థించడమే గాక అధికారంలోకి వస్తే దేశమంతటా యూసీసీని కచ్చితంగా అమలు చేస్తామని 2019 లోక్‌సభ ఎన్నికల మేనిఫెస్టోలో హామీ కూడా ఇచ్చింది. ఇక కాంగ్రెస్, మజ్లిస్ తదితర పక్షాలు యూసీసీని వ్యతిరేకిస్తున్నాయి...

- ప్రధాని మోదీ తొలినుంచీ యూసీసీ అమలును గట్టిగా సమర్థిస్తూ వస్తున్నారు. రెండు రకాల చట్టాలతో దేశం ఎలా నడుస్తుందని మధ్యప్రదేశ్ ఎన్నికల ప్రచారంలో కూడా ప్రశ్నించారు.
- ఉపరాష్ట్రపతి జగ్‌దీప్ ధన్‌ఖడ్ తదితరులు కూడా పలు సందర్భాల్లో యూసీసీని సమర్థించారు. ''దేశ పౌరులందరికీ ఉమ్మడి పౌర స్మృతి ఉండాలన్నదే మన రాజ్యాంగ నిర్మాతల ఉద్దేశం కూడా. దాని అమలుకు ఇదే సమయం'' అని ధన్‌ఖడ్ అభిప్రాయపడ్డారు.
- యూసీసీ పేరుతో ద్రవ్యోల్బణం, అవినీతి, నిరుద్యోగం, ధరల పెరుగుదల వంటి పెను సమస్యల నుంచి ప్రజల దృష్టి మళ్లించడమే మోదీ లక్ష్యమని కాంగ్రెస్ దుయ్యబడుతోంది.
- రాజ్యాంగంలోని 29వ అధికరణానికి యూసీసీ విరుద్ధమని మజ్లిస్ అధినేత అసదుద్దీన్ ఒవైసీ ఆక్షేపించారు. ''బహుళత్వం, వైవిధ్యమే మన దేశ సంపద. యూసీసీ పేరుతో వాటికి తూట్లు పొడిచేందుకు మోదీ ప్రయత్నిస్తున్నారు'' అంటూ మండిపడ్డారు.
- యూసీసీ వస్తే తమ సాంప్రదాయిక ఆచారాలకు అడ్డుకట్ట పడుతుందేమోనని దేశవ్యాప్తంగా 30 పై చిలుకు గిరిజన సంఘాలు కూడా ఇప్పటికే సందేహం వెలిబుచ్చాయి.

– సాక్షి, నేషనల్ డెస్క్

ఏమిటీ ఉమ్మడి పౌర స్మృతి?

- కులం, మతం, ఆడ–మగ వంటి తేడాలు, లైంగిక ప్రవృత్తులతో నిమిత్తం లేకుండా దేశ పౌరులందరికీ ఒకే రకమైన వ్యక్తిగత చట్టాలను వర్తింపజేయడం ఉమ్మడి పౌర స్మృతి ప్రధానోద్దేశం.
- ఇది అమలైతే ప్రస్తుతం అమల్లో ఉన్న పలు మత, ఆచార, సంప్రదాయ ఆధారిత వ్యక్తిగత చట్టాలన్నీ రద్దవుతాయి.
- వివాహాలు, విడాకులు, వారసత్వం, దత్తత తదితరాలతో పాటు పలు ఇతర వ్యక్తిగత అంశాలు కూడా యూసీసీ పరిధిలోకి వస్తాయి.
- రాజ్యాంగంలోని 44వ అధికరణం ఆధారంగా దీన్ని తెరపైకి తెచ్చారు.
- 2024 లోక్‌సభ ఎన్నికలకు ముందే బీజేపీ పాలిత గుజరాత్ కూడా ఉమ్మడి పౌర స్మృతిని అమలు చేయనుందని చెబుతున్నారు!
- గోవాలో ఇప్పటికే గోవా పౌర స్మృతి అమల్లో ఉంది. ఇది చాలా రకాలుగా యూసీసీని పోలి ఉంటుంది.

రాజ్యాంగం ఏమంటోంది?

''దేశవ్యాప్తంగా పౌరులందరికీ ఉమ్మడి పౌర స్మృతిని అమలు చేయాలి'' అని రాజ్యాంగంలోని 4వ భాగం స్పష్టంగా నిర్దేశిస్తోంది. అయితే దీన్ని రాజ్యాంగంలో ఆదేశిక సూత్రాల్లో భాగంగా పేర్కొన్నారు. కనుక దీని అమలు తప్పనిసరి కాదు. ఆ దృష్ట్యా యూసీసీ అమలుకు కోర్టులు ఆదేశించజాలవు.

సుప్రీంకోర్టు కూడా...

అత్యున్నత న్యాయస్థానం కూడా పలు తీర్పుల సందర్భంగా యూసీసీ అమలు ఆవశ్యకతను నొక్కిచెప్పింది. అయితే 2018లో మోదీ ప్రభుత్వ విజ్ఞప్తి మేరకు యూసీసీపై లోతుగా పరిశీలించిన కేంద్ర లా కమిషన్ మాత్రం భిన్నాభిప్రాయం వెలిబుచ్చడం విశేషం. ''ఈ దశలో దేశానికి ఉమ్మడి పౌర స్మృతి అవసరమూ లేదు. అభిలషణీయమూ కాదు'' అంటూ కేంద్రానికి ఏకంగా 185 పేజీల నివేదిక సమర్పించింది!



శనివారం ఢిల్లీలోని తన నివాసంలో భార్య, కుమారుడితో 'చోటీ దివాలీ' వేడుకల్లో సిసోడియా

జైలు నుంచి ఇంటికెళ్లిన సిసోడియా

భార్యను చూసేందుకు ఓకే చెప్పిన ఢిల్లీ సిటీ కోర్టు

సాక్షి, న్యూఢిల్లీ: మద్యం కుంభకోణం కేసులో తీహార్ జైల్లో జ్యుడీషియల్ కస్టడీలో ఉన్న ఢిల్లీ మాజీ ఉప ముఖ్యమంత్రి మనీష్ సిసోడియాకు కొద్దిసేపు ఉపశమనం లభించింది. అనారోగ్యంతో బాధపడుతున్న భార్యను ఓదార్చేందుకు ఆరు గంటలపాటు ఇంటికి వెళ్లేందుకు సిసోడియాకు ఢిల్లీ సిటీ కోర్టు శుక్రవారం అనుమతి మంజూరు చేసింది. తిహార్ జైలు నుంచి ఢిల్లీలోని మధుర రోడ్డులో గల నివాసానికి శనివారం ఉదయం 10గంటలకు చేరుకున్నారు. సాయంత్రం నాలుగింటివరకు ఆయనకు అనుమతి ఇచ్చింది. కొంతకాలంగా సిసోడియా భార్య సీమా అనారోగ్యంతో బాధ పడుతున్న విషయం తెల్సిందే. ఇంటికి వెళ్లేందుకు అనుమతి కావాలంటూ సిసోడియా గతంలో కోర్టును కోరిన విషయం విదితమే. దీంతో ఆయనకు కోర్టు ఇలా కొద్దిగంటలపాటు ఉపశమనం కల్పించింది. అయితే బయట ఉన్న సమయంలో రాజకీయ ఉపన్యాసాలు చేయొద్దని, మీడియాతో మాట్లాడొద్దని, సమావేశాల్లో పాల్గొనవద్దని ఆదేశించింది. గతంలోనూ భార్యను కలిసేందుకు ఢిల్లీ హైకోర్టు అనుమతిచ్చినా ఇంటికొచ్చే సమయానికి ఆస్పత్రికి తీసుకెళ్లడంతో కలవలేకపోయారు.

దాల్ సరస్సులో ఘోర అగ్ని ప్రమాదం

- హౌస్‌బోట్లలో చెలరేగిన మంటలు
- ముగ్గురు పర్యాటకులు సజీవదహనం
- మృతులంతా బంగ్లాదేశీయులే
- ఆస్తి నష్టం రూ.కోట్లలో ఉంటుందన్న అధికారులు

శ్రీనగర్: శ్రీనగర్‌లోని ప్రముఖ పర్యాటక కేంద్రం దాల్ సరస్సు హౌస్‌బోట్లలో శనివారం సంభవించిన భారీ అగ్నిప్రమాదంలో విదేశీ ముగ్గురు పర్యాటకులు మృతి చెందారు. మాడి మసైన హౌస్‌బోట్ శిథిలాల నుంచి గుర్తుపట్టలేని విధంగా కాలిన మూడు మృతదేహాలను వెలికి తీసినట్లు అధికారులు తెలిపారు. మృతులు బంగ్లాదేశ్‌కు చెందిన వారని అధికారులు తెలిపారు. వీరిని అనిందయ కౌశల్, మహ్మద్ మొయినుద్, దాస్ గుప్తా అని తెలిసిందన్నారు. వీరున్న సఫీనా అనే హౌస్‌బోట్ పూర్తిగా దగ్ధమైందన్నారు. డీఎన్ఏ పరీక్షల అనంతరం మృతదేహాలను వారి కుటుంబీకులకు అందజేస్తామని తెలిపారు. ఈ ప్రమాదంలో మొత్తం అయిదు హౌస్‌బోట్లు, వాటికి పక్కనే ఉన్న ఏడు నివాస కుటీరాలు, కొన్ని ఇళ్లు కూడా పూర్తిగా కాలిబూడిదయ్యాయి. ఘటనలో కోట్లలో ఆస్తినష్టం సంభవించింది. తొమ్మిదో నంబర్ ఘాట్‌లో అగ్ని ప్రమాదంపై ఉదయం 5.15 గంటల సమయంలో ఫోన్‌లో సమాచారం అందగానే రంగంలోకి దిగి, ఎనిమిది మంది పర్యాటకులను రక్షించగలిగామని స్టేషన్ హౌస్ ఆఫీసర్(ఫైర్ సర్వీస్) ఫరూక్ అహ్మద్ తెలిపారు. ఒక హౌస్‌బోట్‌లో చెలరేగిన మంటలు వేగంగా మిగతా బోట్లకు వ్యాపించాయన్నారు. అతికష్టమ్మీద మంటలను అదుపులోకి తేగలిగామని వివరించారు. ప్రమాదానికి కచ్చితమైన కారణం తెలియనప్పటికీ.. ఒక బోటులోని హీటింగ్ పరికరాల్లో లోపం కారణంగానే మంటలు అంటుకున్నట్లు పోలీసులు ప్రాథమిక దర్యాప్తులో వెల్లడైంది. 2022లోనూ దాల్, నగీన్ సరస్సుల్లో సంభవించిన అగ్ని ప్రమాదంలో ఏడు హౌస్‌బోట్లు బూడిదగా మారాయి. అప్పటి ఘటనలో ఎవరికీ ఎటువంటి ప్రమాదం జరగలేదు.



శనివారం అయోధ్యలో లక్షలాది దీపాల వెలుగుల్లో సరయూ నదీ తీరం

22 లక్షల దీపాల వెలుగుల్లో అయోధ్య

స్వీయ గిన్నిస్ రికార్డునే బద్దలు కొట్టిన దీపోత్సవం

లక్నో/అయోధ్య: అయోధ్యలోని సరయూ నదీ తీరం వెలుగులతో నిండిపోయింది. శనివారం అత్యంత వైభవంగా 22 లక్షల దీపాలతో జరిగిన దీపోత్సవం ప్రపంచ రికార్డు సృష్టించింది. ఒకే చోట ఒకేసారి అత్యధిక సంఖ్యలో దీపాలను వెలిగించిన ఘటనగా స్వీయ గిన్నిస్ రికార్డునే బద్దలు కొట్టింది. సరయూ నది ఒడ్డున 51 ఘాట్లలో 25 వేల మంది వలంటీర్లు 22.23 లక్షల మట్టి ప్రమిదలను వెలిగించారు. గిన్నిస్ బుక్ వరల్డ్ రికార్డ్స్ ప్రతినిధులు డ్రోన్ల సాయంతో దీపాలను లెక్కించి, ప్రపంచ రికార్డుగా ధ్రువీకరించడంతో నగరం 'జై శ్రీరామ్' నినాదాలతో మారుమోగింది. గిన్నిస్ బుక్ వరల్డ్ రికార్డ్స్ ప్రతినిధులు ఈ మేరకు సీఎం యోగీ ఆదిత్యనాథ్‌కు సర్టిఫికెట్‌ను అందజేశారు. గతేడాది ఈ వేడుకలో 15.76 లక్షల ప్రమిదలు వెలిగించడం తొలిసారి గిన్నిస్ రికార్డులకెక్కింది. 2017లో యూపీలో బీజేపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి అయోధ్యలో ఏటా దీపోత్సవం జరుగుతోంది. శనివారం సీఎం ఆదిత్యనాథ్, గవర్నర్ ఆనందీబెన్ పటేల్, కేబినెట్ మంత్రులు కూడా దీపాలు వెలిగించి, సరయూ నది ఒడ్డున పూజలు చేశారు. దీపోత్సవం 100 దేశాల్లో ప్రత్యక్ష ప్రసారమైంది.

గాల్లో వేలాది ప్రాణాలు!

- గాజాలో ఆస్పత్రుల ముంగిట మోహరించిన ఇజ్రాయెల్ సైన్యం
- ప్రధానాసుపత్రి షిఫాలో కరెంటు బంద్
- ఐసీయూ యూనిట్‌పై బాంబు దాడి
- పూర్తిగా నిలిచిపోయిన వైద్య సేవలు
- అత్యధిక ఆస్పత్రుల్లో అదే పరిస్థితి
- అల్లాడుతున్న రోగులు, పసికందులు
- వైద్యమందక 100కు పైగా మృతి!
- మృత్యుముఖంలోకి వేలాది మంది రోగులు

దెయిర్ అల్‌బలాహ్ (గాజా): గాజాలో మానవీయ సంక్షోభం క్రమంగా తీవ్ర రూపు దాలుస్తోంది. ఇజ్రాయెల్ ప్రతీకార దాడులు ఆస్పత్రుల ముంగిట్లోకి చేరడంతో పరిస్థితి దారుణంగా దిగజారుతోంది. ఇజ్రాయెల్ అష్టదిగ్బంధం దెబ్బకు కనీస సౌకర్యాలన్నీ నిలిచిపోవడంతో గాజాలో 20 ఆస్పత్రులు ఇప్పటికే పూర్తిగా స్తంభించిపోయాయి. మిగిలిన 15 ఆస్పత్రులూ అదే బాటన ఉన్నట్టు వార్తలొస్తున్నాయి. కరెంటు సరఫరా లేక ప్రధాన ఆస్పత్రి అల్ షిఫాలో తశనివారం వైద్య పరికరాలన్నీ మూగవోయాయి. దాంతో వైద్య సేవలన్నీ పూర్తిగా నిలిచిపోయాయి. అల్ ఖుద్స్ ఆస్పత్రిలోనూ ఇదే పరిస్థితి. ఆ ఆస్పత్రికి ఏకంగా 20 మీటర్ల సమీపం దాకా సైన్యం చొచ్చుకొచ్చిందని తెలుస్తోంది! దాంతో అందులోని 14 వేల మంది రోగులు, శరణార్థుల ప్రాణాల్లో గాల్లో దీపంగా మారాయి. విరామం లేకుండా దూసుకొస్తున్న తూటాలు, బాంబు వర్షం కారణంగా అల్ షిఫా ఆస్పత్రిలోని వేలాది మంది కూడా ప్రాణ భయంతో వణికిపోతున్నారు. అందులో 1,500 మందికి పైగా రోగులు, అంతే సంఖ్యలో వైద్య సిబ్బంది, 15 వేలకు పైగా శరణార్థులున్నట్టు చెబుతున్నారు. వైద్య సేవలతో పాటు కరెంటు, ఆక్సిజన్ సరఫరాలు పూర్తిగా నిలిచిపోవడంతో పలు ఆస్పత్రుల్లో ఐసీయూల్లోని రోగులు, ఇంక్యుబేటర్లలోని చిన్నారులు నిస్సహాయంగా మృత్యుముఖానికి చేరువవుతున్నారు. ఇలా ఇప్పటికే 200 మందికి పైగా మరణించారని, మరికొన్ని వందల మంది మృత్యువుతో పోరాడుతున్నారని హమాస్ ఆరోగ్య శాఖ వర్గాలు చెబుతుండటం ఆందోళన కలిగిస్తోంది! ఈ పరిణామాలపై అంతర్జాతీయ సమాజం గగ్గోలు పెడుతున్నా ఇజ్రాయెల్ మాత్రం దాడులాపేందుకు ససేమిరా అంటోంది. కనీసం వాటికి విరామమిచ్చేందుకు కూడా ప్రధాని బెంజమిన్ నెతన్యాహూ మరోసారి నిరాకరించారు.

షిఫా.. శిథిల చిత్రం

అల్ షిఫా ఆస్పత్రిలో తాగునీటితో పాటు ఆహార పదార్థాలు కూడా పూర్తిగా నిండుకున్నాయి. దాంతో వైద్యంతో సహా ఏ సేవలూ అందక రోగులు నిస్సహాయంగా మృత్యువాత పడుతున్నారు. శనివారమే 100 మందికి దుర్మరణం పాలైనట్టు హమాస్ పేర్కొంది. వీటికి తోడు ఐసీయూ విభాగంపై బాంబు దాడి జరిగింది. ఆస్పత్రిని ఇజ్రాయెల్ సైన్యం అన్నివైపుల నుంచీ దిగ్బంధించింది. అక్కడ హమాస్ ఉగ్రవాదులతో భీకరంగా పోరాడుతున్నట్టు ప్రకటించింది. ఆస్పత్రి ప్రాంగణంతో పాటు పరిసరాలన్నీ బాంబు మోతలతో దద్దరిల్లుతున్నాయి. బాంబు దాడుల్లో రెండు అంబులెన్సులు తునాతునకలయ్యాయి. కనీసం రోగులు, క్షతగాత్రులను ఆస్పత్రి నుంచి మరో చోటికి తరలించే పరిస్థితి కూడా లేకుండా పోయింది. అడుగు కదిపినా స్నైపర్ల తూటాలు దూసుకొస్తున్నట్టు ఆస్పత్రి సిబ్బంది వాపోతున్నారు. ఈ ఆస్పత్రి కిందే ఉగ్రవాద సంస్థ హమాస్ ప్రధాన కార్యాలయముందని ఇజ్రాయెల్ మొదటినుంచీ ఆరోపిస్తుండటం తెలిసిందే. అయితే అంతర్జాతీయ ఖండనల నేపథ్యంలో శనివారం సాయంత్రానికల్లా ఇజ్రాయెల్ మాట మార్చింది. అల్ షిఫా ఆస్పత్రిపై దాడులు జరపడం లేదని, అక్కణ్నుంచి వెళ్లిపోవాలనుకున్న వారికోసం కారిడార్ తెరిచే ఉంచామని చెప్పుకొచ్చింది. దాడుల్లో గాయపడుతున్న రెండు రోజులుగా ప్రధానంగా అల్ అహిల్ ఆస్పత్రికి తరలిస్తున్నారు. కానీ అక్కడ కూడా మౌలిక సదుపాయాలేవీ లేకపోవడంతో పరిస్థితి దారుణంగా మారింది. కారిడార్లతో పాటు ఎక్కడ పడితే అక్కడ రోగులను నిస్సహాయంగా వదిలేసిన దృశ్యాలు హృదయాలను కలచివేస్తున్నాయి.

పడకేసిన వైద్యం

గాజా అంతటా వైద్య సేవలు పూర్తిగా పడకేసి నట్టేనని అక్కడ సహాయక చర్యలు చేపడుతున్న ఐరాస సంస్థలు కూడా స్పష్టం చేస్తున్నాయి. ''గాజాలోని మొత్తం 35 ఆస్పత్రులూ చేతులెత్తేసినట్టే. పరిస్థితి పూర్తిగా చేయి దాటిపోయింది'' అని అవి చెబుతుండటం తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. ఉత్తర గాజాలోని అల్ నస్ర్, అల్ రంటిసి సహా చాలా ఆస్పత్రులు సైనిక దిగ్బంధంలో ఉన్నాయి. దీనికి తోడు గాజావ్యాప్తంగా ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో అత్యధికం ఎప్పుడో మూతబడ్డాయి.

రాజస్తాన్‌లో అమానుషం

- నాలుగేళ్ల చిన్నారిపై ఎస్సై అత్యాచారం
- ఉదంతంపై పెల్లుబికిన ప్రజాగ్రహం
- ఎన్నికల వేళ ఘటన.. కాంగ్రెస్‌పై బీజేపీ నేతల విమర్శనాస్త్రాలు

జైపూర్: రాజస్తాన్‌లోని దౌసాలో దారుణం చోటుచేసుకుంది. కామంతో కళ్లు మూసుకుపోయిన పోలీస్ సబ్ ఇన్‌స్పెక్టర్ అభంశుభం తెలియని నాలుగేళ్ల చిన్నారిపై అఘాయిత్యానికి పాల్పడ్డాడు. ఘటనపై ప్రజాగ్రహం వెల్లువెత్తింది. దళిత బాలికపై దారుణానికి తెగించిన సబ్ ఇన్‌స్పెక్టర్‌పై జనం దాడి చేసి, కొట్టారు. ఎన్నికల వేళ జరిగిన ఘటనపై అధికార కాంగ్రెస్‌పై బీజేపీ దుమ్మెత్తి పోసింది. లాల్‌సోత్ ఏరియాలో శుక్రవారం ఈ ఘటన చోటుచేసుకుంది. దారుణానికి పాల్పడిన సబ్ ఇన్‌స్పెకర్ భూపేంద్ర సింగ్‌ను వెంటనే సస్పెండ్ చేస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. ఎన్నికల విధుల్లో ఉన్న భూపేంద్ర సింగ్ శుక్రవారం మధ్యాహ్నం మాయమాటలతో బాలికను తన గదికి తీసుకువచ్చి, దారుణానికి పాల్పడినట్లు ఏఎస్‌పీ రామచంద్ర సింగ్ నెహ్రా పీటీఐకి చెప్పారు. ఘటన విషయం తెలిసి కోపోద్రిక్తులైన ప్రజలు పోలీసులకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ రహువాస్ పోలీస్ స్టేషన్‌ను చుట్టుముట్టారు. ఎస్ఐ భూపేంద్ర సింగ్‌ను రోడ్డుపైకి లాగి బట్టలు చిరిగేలా రాళ్లు, కర్రలతో కొట్టారు. ఇందుకు సంబంధించిన వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. ప్రజలు అనంతరం పోలీసులకు అప్పగించారు. బాధితురాలి తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు భూపేంద్ర సింగ్‌పై పోక్సో చట్టం, ఎస్‌సీ, ఎస్‌టీ చట్టం కింద కేసులు పెట్టామని ఎస్‌పీ వందితా రాణా చెప్పారు. అతడిని అరెస్ట్ చేసి, ఘటనపై దర్యాప్తు చేపట్టామని తెలిపారు. బాధిత బాలికను వైద్య పరీక్షలకు పంపామన్నారు. ఆమె పరిస్థితి నిలకడగా ఉందన్నారు. ఆమె వాంగ్మూలం ఆధారంగా తదుపరి చర్యలు ఉంటాయని వివరించారు.

ఇది కూడా కాంగ్రెస్ గ్యారంటీయే: బీజేపీ

కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం బాలికలను కాపాడాలి (బేటీ బచావో) అని నినదిస్తుండగా రాష్ట్రంలోని అశోక్ గెహ్లోత్ సర్కారు మాత్రం రేపిస్టులను కాపాడాలి(రేపిస్టు బచావో) అని అంటోందని బీజేపీ ప్రతినిధి షెహజాద్ పూనావాలా ఢిల్లీలో వ్యాఖ్యానించారు. ఈ ఘటన రాజస్తాన్‌కు మాత్రమే కాదు, మొత్తం దేశానికే అవమానకరమని విమర్శించారు. పోలీసులు, ఇతర అధికారులు మహిళలు, బాలికలపై పాల్పడిన అఘాయిత్యాలకు సంబంధించిన అనేక ఘటనలను పూనావాలా ఉదహరించారు. ఎన్నికల వేళ కూడా రేపిస్టులు ఎంతో ధీమాతో ఉన్నట్లు దీనితో అర్థమవుతోందని ఆరోపించారు. తాజా ఘటన కూడా కాంగ్రెస్ ఎన్నికల గ్యారంటీయేనని వ్యాఖ్యానించారు. దళితులు, మహిళలపై జరుగుతున్న దారుణాల్లో రాజస్తాన్ మొదటి స్థానంలో నిలిచిందని విమర్శించారు. దారుణాన్ని గవర్నర్ కల్‌రాజ్ మిశ్రా తీవ్రంగా ఖండించారు. ఘటనకు కారకులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డీజీపీ ఉమేశ్ మిశ్రాను ఆయన ఆదేశించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న బీజేపీ ఎంపీ కిరోడి లాల్ మీనా మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలోని అశోక్ గెహ్లోత్ ప్రభుత్వం చేతకానితనంతో పోలీసులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. బాధిత బాలిక కుటుంబానికి పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు.

వివాదంలో ఏఆర్ రెహ్మాన్

నజ్రుల్ గీతం ట్యూన్ మార్చారు • తొలగించాలి: కుటుంబం

కోల్‌కతా: ప్రముఖ సినీ సంగీత దర్శకుడు ఏఆర్ రెహ్మాన్ వివాదంలో చిక్కుకున్నారు. ప్రఖ్యాత బెంగాలీ కవి కాజీ నజ్రుల్ ఇస్లాం రచించిన ప్రఖ్యాత స్వాతంత్ర్యోద్యమ గీతం 'కరార్ ఓయ్ లౌహో కొపట్'ను తాజాగా విడుదలైన బాలీవుడ్ సినిమా పిప్పాలో వాడుకున్నారాయన. దాని ట్యూన్ మార్చడం ద్వారా తమతో పాటు అసంఖ్యాకులైన అభిమానుల మనోభావాలను రెహ్మాన్ దెబ్బ తీశారంటూ నజ్రుల్ కుటుంబసభ్యులు శనివారం దుయ్యబట్టారు. ''రెహ్మాన్ కోరిన మీదట ఆ గీతాన్ని వాడుకునేందుకు అనుమతించాం. కానీ దాని ట్యూన్, లయ పూర్తిగా మార్చేయడం చూసి షాకయ్యాం'' అంటూ నజ్రుల్ మనవడు, మనవరాలు తదితరులు మండిపడ్డారు. ''ఈ వక్రీకరణను అనుమతించేది లేదు. తక్షణం ఆ గీతాన్ని సినిమా నుంచి తొలగించాలి. పబ్లిక్ డొమైన్‌లో కూడా అందుబాటులో లేకుండా చర్యలు తీసుకోవాలి'' అని వారు డిమాండ్ చేశారు. ట్యూన్ మార్పును నిరసిస్తూ బెంగాలీ గాయకులు, కళాకారులతో కలిసి నిరసనకు దిగుతామని ప్రకటించారు. బెంగాలీలు కూడా దీనిపై భగ్గుమంటున్నారు. రెహ్మాన్ వంటి సంగీత దర్శకుడి నుంచి ఇది ఊహించలేదంటూ బంగ్లాదేశ్‌కు చెందిన ప్రముఖ రచయిత్రి తస్లీమా నస్రీన్ తదితరులు విమర్శించారు. రెహ్మాన్ తీరుపై ఇంటర్నెట్లో కూడా విమర్శల వర్షం కురుస్తోంది. స్వాతంత్ర్యోద్యమ కాలంలో నజ్రుల్ ఇస్లాం గీతాలు, పద్యాలు బెంగాల్లోనే దేశమంతటా మారుమోగాయి. టాగూర్ గీతాల తర్వాత అత్యంత ప్రసిద్ధి పొందాయి.

సాక్షి, హైదరాబాద్

బతుకుదెరువు కోసం వలస వెళ్లిన ఓటర్లే ఈ ఎన్నికల్లో తమ భవితవ్యాన్ని మారుస్తారని బరిలో ఉన్న పలువురు అభ్యర్థులు భావిస్తున్నారు. వారి ప్రసన్నం కోసం అనేక ప్రయత్నాలు చేస్తున్నారు. కొన్ని నియోజకవర్గాల్లో వలస వెళ్లిన ఓటర్లు పదివేల మందికిపైనే ఉంటారు. వీరి ఓటింగ్ అభ్యర్థి గెలుపోటములను ప్రభా వితం చేసే వీలుంది. దీంతో పోటాపోటీ ఎన్నికలు జరిగే స్థానాల్లో ఏ ఒక్క ఓటును తేలికగా విడిచిపెట్టకూడదని అభ్యర్థులు నిర్ణయించుకున్నారు. ఈక్రమంలో దూర ప్రాంతాల నుంచి వారిని రప్పించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. ఇందుకోసం ప్రతీ పది మందికి ఓ సమన్వయకర్తను నియమిస్తున్నారు. సంబంధిత గ్రామాల్లో కార్యకర్తలకు ఈ బాధ్యతలు అప్పగిస్తున్నారు.

వలస ఓటర్ల వేట

పోలింగ్ నాడు ఇక్కడికి రప్పించేందుకు ప్రత్యేక యంత్రాంగం

ముందే డబ్బులు పంపుతున్న నేతలు

వారిని తీసుకొచ్చే బాధ్యత గ్రామ నేతలకు

..ప్రతీ ఓటు కీలకంగా భావిస్తున్న అభ్యర్థులు

బతుకుదెరువు కోసం వేరే ఊళ్లకు వెళ్లిన ఓటర్లకు ఎర



రంగంలోకి ప్రత్యేక బృందాలు

రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి ఏదో ఒక ఉద్యోగం కోసమో, పిల్లల చదువుల కోసమో హైదరాబాద్ వచ్చిన వాళ్ళున్నారు. వీళ్ళకు ఇప్పటికీ ఓట్లు, రేషన్ కార్డులు వారి సొంత గ్రామాల్లోనే ఉన్నాయి. ఇప్పుడు ఈ వలస ఓటర్లను రప్పించేందుకు అభ్యర్థులు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసుకుంటున్నారు. వారి చిరునామా, ఫోన్ నంబరుతో ఓ డేటాబేస్ రూపొందించడానికి సాంకేతిక నిపుణులూ ఇందులో ఉంటున్నారు. వివిధ పార్టీల నుంచి అందిన సమాచారాన్ని బట్టి ప్రతీ రెండు గ్రామాలకు ఒక్కో బృందం పనిచేస్తోంది. ఒక్కో బృందంలో ఐదుగురు సభ్యులుంటున్నారు. నియోజకవర్గం వారీగా వలస ఓటర్ల వివరాలను కంప్యూటరీకరణ చేసేందుకు మరో పది మంది డేటా ఆపరేటర్లను ఏర్పాటు చేసుకుంటున్నారు. వీరితో మాట్లాడటం, వారికి ఫోన్‌పే, గూగుల్ పే ద్వారా డబ్బులు పంపే యంత్రాంగం కూడా ప్రత్యేకంగా ఉంటోంది. ఓటరు కచ్చితంగా ఏ పార్టీకి ఓటు వేస్తాడనే అంచనాలను ఆయా ప్రాంతాల్లోని నాయకుల ద్వారా సేకరిస్తున్నారు. ఇక పూణే, షోలాపూర్, సూరత్ వంటి ప్రాంతాలకు అభ్యర్థుల ప్రతినిధులు స్వయంగా వెళ్ళి వలస ఓటర్లను కలుస్తున్నారు. ఎన్నికలకు కనీసం రెండు రోజుల ముందే గ్రామాలకు రప్పించాలని నేతలు భావిస్తున్నారు.

ఏయే నియోజకవర్గాల్లో ఎక్కువంటే..

- ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని మునుగోడు, దేవరకొండ, భువనగిరి, ఆలేరు, తుంగతుర్తి, నాగార్జునసాగర్ నియోజకవర్గాల్లోనే 2 లక్షల మంది ఓటర్లు వివిధ ప్రాంతాల్లో ఉన్నట్టు గుర్తించారు. ఒక్క మునుగోడు నియోజకవర్గంలోనే 40 వేలమందికి పైగా వలస ఓటర్లున్నట్టు లెక్కగట్టారు. వీళ్లంతా హైదరాబాద్, భీవండి, ముంబై, సూరత్, షోలాపూర్ ప్రాంతాల్లో వివిధ పనులు చేసుకుంటున్నారు.
- దేవరకొండ నియోజకవర్గంలో 25 వేల మంది వరకూ వలస ఓటర్లున్నట్టు తెలుసుకున్నారు. వీళ్లు హైదరాబాద్, మాచర్ల, విజయవాడ, విశాఖపట్నం తదితర ప్రాంతాల్లో ఉపాధి కోసం వెళ్లారు. భువనగిరి, ఆలేరుల్లో దాదాపు 20 వేల మంది, తుంగతుర్తి, సాగర్, సూర్యాపేటల్లో పదివేలకు తక్కువ కాకుండా వలస ఓటర్లు ఉంటారని ప్రధాన పార్టీలు లెక్కలేశాయి.
- ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో వెనుకబడిన ప్రాంతంగా చెప్పుకునే ఓ నియోజకవర్గంలో 18 వేల వలస ఓటర్లు ఉంటాయని ఓ ప్రధాన పార్టీ లెక్కలేసింది. ముంబై, సోలాపూర్, పుణేలో వివిధ పనులు చేసుకునే వీళ్ల కోసం ఆయా సామాజిక వర్గం నుంచే కొంతమందిని బృందంగా ఏర్పాటు చేసి, పోలింగ్‌కు రప్పించే ప్రయత్నం చేస్తున్నారు. పాలమూరు నియోజకవర్గంలోని రెండు మండలాల పరిధిలో 6 వేలమంది వలస ఓటర్లున్నారు. అక్కడ ఈ ఓట్లే కీలకంగా భావిస్తున్నారు. దీంతో ప్రధాన పార్టీలు పోటీ పడుతున్నాయి. వారిని రప్పించేందుకు రేషన్ డీలర్ల సాయం కూడా తీసుకుంటున్నారు.
- నారాయణపేట, కొడంగల్, వనపర్తి నియోజకవర్గాల్లో వలస ఓటర్లు 15 వేలకు పైగానే ఉంటారు. మహబూబ్ నగర్, దేవరకద్ర, మక్తల్, అచ్చంపేట, నాగర్ కర్నూల్ నియోజకవర్గాల్లోనూ 10 వేల ఓట్లరు ఉంటారని అంచనా. నారాయణపేట నియోజకవర్గంలోని నారాయణపేట, ధన్వాడ, కోయిల కొండ ప్రాంతాలకు చెందిన వలస కార్మికులు ఎక్కువగా ఉన్నారు. కొడంగల్ నియోజకవర్గంలోని మద్దూరు, కోస్గి, బొంరాస్‌పేట మండలాల ప్రజలు ఇతర రాష్ట్రాల్లో స్థిరపడ్డారు. మహబూబ్‌నగర్ జిల్లాలోని గండీడ్, మహ్మదాబాద్, హన్వాడ మండలాలకు చెందిన తండాలకు చెందిన వలస కార్మికులు భారీగా ఉన్నారు. వీరిని రప్పించేందకు ప్రయత్నాలు ముమ్మరం చేశారు.

Interview



ఎన్నికలను 'పీపుల్స్ ఎజెండా'గా మార్చాలి

డబ్బిచ్చే వాడిదే తప్పు..

బొల్లోజు రవి

'ప్రజాస్వామ్యం ధనస్వామ్యం, కార్పొరేట్ స్వామ్యం అయిపోయింది. ఓటుకు నోటు ఎప్పుడైతే వచ్చిందో ప్రజాస్వామ్యానికి అర్థం లేకుండా పోతోంది.. డబ్బు ఇస్తున్నవాడిది తప్పా.. తీసుకుంటున్న వాడిది తప్పా అంటే డబ్బు ఇచ్చే వాడిదే తప్పు. ఎందుకంటే నాయకుడనేవాడు ఆదర్శంగా ఉండాలి కాబట్టి డబ్బివ్వడం అనేది అతడి తప్పే అవుతుంది. ఈ ఎన్నికల్లో ప్రజల ఎజెండానే కీలకం కావాలి'అంటున్నారు సినీ విప్లవ దర్శకుడు, నటుడు ఆర్.నారాయణమూర్తి. 'దేశంలో పీడిత ప్రజల కోసం కమ్యూనిస్టులు చేసిన త్యాగాలు మహోన్నతం. తెలంగాణ సాయుధ పోరాటంలో వేలాది మంది అమరులయ్యారు. ప్రజా సమస్యలు ఎక్కడున్నా కమ్యూనిస్టులే ముందుకు వచ్చి పోరాటం చేస్తుంటారు' అని చెప్పిన ఆయన ఎన్నికల నేపథ్యంలో వివిధ అంశాలపై 'సాక్షి'కి ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు. వివరాలు ఆయన మాటల్లోనే..

ధన ప్రలోభాలు పెట్టే నేతలను బహిష్కరించాలి | కాంగ్రెస్, బీజేపీల్లోనూ వారసత్వ రాజకీయాలు

సీట్లు కాదు.. వామపక్షాలు కలిసి పోటీ చేయడం ముఖ్యం | కులగణన చేయని వారు బీసీని సీఎం చేస్తారా?

ఏపీలో ప్రతికూల ప్రభావం.. ఆ భయంతోనే తెలంగాణలో టీడీపీ పోటీ చేయడంలేదు

ప్రముఖ దర్శకుడు ఆర్. నారాయణమూర్తి



ప్రపంచ కమ్యూనిస్టుల్లారా ఏకం కండి..

దేశంలో మొదట్లో కాంగ్రెస్, కమ్యూనిస్టు పార్టీలు మాత్రమే ఉండేవి. తర్వాతి కాలంలో కమ్యూనిస్టు పార్టీలు అనేక చీలికలు పేలికలు అయ్యాయి. త్యాగాలు, సిద్ధాంతాలు గొప్పవైనా ఇప్పుడు అలా ఆ పార్టీలు ఉండకపోవడంపై చాలా బాధపడుతున్నాను. ఒకటా రెండా.. ఎన్ని సీట్లు గెలుస్తామన్నది ముఖ్యం కాదు. ఎన్నికల పోరాటంలో వామపక్షాలు కలిసి పోటీ చేయాలి. అందుకు ప్రపంచ కమ్యూనిస్టులంతా ఏకం కావాలి.

బీజేపీ కులగణనకు ముందుకొస్తే అప్పుడు నమ్ముతాం

అధికారంలోకి వస్తే తెలంగాణలో బీసీని సీఎం చేస్తామని బీజేపీ అంటోంది. మహిళా బిల్లు పెట్టి దాన్ని ఇంకా పాస్ చేయలేదు. కులగణన చేయమంటే చేయట్లేదు. అలాంటప్పుడు బీసీలకు వారేం న్యాయం చేయగలరు? బీసీలకు మన దేశంలో అన్యాయం జరుగుతోంది. పార్లమెంటులో 13-14 శాతానికి మించి బీసీలు లేరు. వాస్తవంగా దేశంలో బీసీల జనాభా 54 శాతంగా ఉంది. బీజేపీకి చిత్తశుద్ధి ఉంటే కులగణనకు ముందుకు రావాలి అప్పుడు బీసీ సీఎంను చేస్తామంటే మేం నమ్ముతాం.

భయంతోనే ఎన్నికల్లో వెనక్కి తగ్గిన టీడీపీ..

తెలుగుదేశం పార్టీ తెలంగాణలో పోటీ చేస్తామని చివరలో వెనక్కి తగ్గింది. టీడీపీ ఎన్నికల్లో నిలబడకుంటే ఆ పార్టీ క్యాడర్ నైరాశ్యానికి గురవుతుంది. వారు ఆ పార్టీలో మిగలరు. దాని పర్యవసానమే కాసాని జ్ఞానేశ్వర్ పార్టీ మారడం. ఇక్కడ సొంతంగానో, లేదా ఏదైనా పార్టీతో పొత్తుతోనే బరిలోకి దిగిన తర్వాత వ్యతిరేక ఫలితాలు వస్తే, ఆ ప్రభావం ఆంధ్రప్రదేశ్ మీద పడుతుందన్న భయం కూడా టీడీపీలో కనిపించింది. అందుకే వెనక్కి తగ్గింది.

అన్ని పార్టీల్లోనూ వారసులు..

వారసత్వం అనేది దేశవ్యాప్తంగా అన్ని పార్టీల్లో ఉంది. వారసత్వానికి మేం వ్యతిరేకం అని మోదీ చెబుతున్నారు కానీ బీజేపీ అధికారంలో ఉన్న అనేక రాష్ట్రాల్లో ఎంతోమంది వారసులు ఎమ్మెల్యేలుగా లేరా? సాక్షాత్తూ హోం మంత్రి అమిత్ షా తనయుడికి క్రికెట్ బోర్డులో కీలక పదవి ఇవ్వలేదా? ఇక రాహుల్‌గాంధీ సీఎం కేసీఆర్‌పై చేస్తున్న విమర్శల సందర్భంగా వారసత్వం ప్రస్తావించడం మరీ విచిత్రం. కాంగ్రెస్‌కు మించిన కుటుంబ పాలన ఇంకెక్కడ ఉంది? వారిది వారసత్వం కాదా?

పార్టీ మారే వారిని బహిష్కరించాలి..

పార్టీలు మారడం సులువైంది. ఒక పార్టీ నుంచి గెలిచాక మరో పార్టీలోకి వెళ్లిపోతున్నారు. ఇది దుర్మార్గం. దీన్ని నిరోధించడానికి పార్లమెంటులో బిల్లుపెట్టాలి. సిద్ధాంతం, పార్టీని చూసి ఓటు వేస్తే, ఆ తర్వాత పార్టీ మారితే అలాంటి వారిని నిలదీయాలి. పార్టీలను మారే వారిని బహిష్కరించాలి. రోజుకు మూడు పార్టీలు మారడమా? ఇదేం విచిత్రం? అలాగే డబ్బులిచ్చేందుకు వచ్చే వారినీ బహిష్కరించాలి.

ఏం చేస్తారో బాండ్ రాసివ్వాలి..

ఎన్నికల్లో వచ్చే నాయకులను తమకేం చేస్తారో బాండ్ పేపర్ మీద రాసి సంతకం చేయాలని ప్రజలు కోరాలి. గెలిపించిన తర్వాత బాండ్ పేపర్‌లో రాసిన హామీలు అమలు చేయకపోతే, కోర్టుకు వెళ్లాలి. అలా ఎన్నికలను పీపుల్స్ ఎజెండాగా మార్చాలి. పార్టీలు తమ ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన అన్నింటినీ నెరవేర్చేలా మనం ఒత్తిడి చేయాలి.

గాసిప్ టైమ్

పీసీసీ అధ్యక్షుడే పెద్ద బౌన్సర్

కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యాలయమైన గాంధీభవన్ ఎన్నికల వేళల్లో ఎప్పుడూ వార్తల్లోనే ఉంటుంది. టికెట్లు వచ్చినవారి సంతోషానికి, రాని వారి ఆవేదనకు ఇది వేదికవుతోంది. ఒక్కోసారి ఈ ఆవేదన ఆగ్రహంగా మారి పార్టీ కార్యాలయంలో మంటలు రేగిన సందర్భాలూ ఉన్నాయి. పగిలిన కిటికీలు, తలుపుల అద్దాలు చెల్లాచెదరై పడిపోయిన ఘటనలు, పార్టీ ఫ్లెక్సీలు, జెండాలు తగలబడిన ఉదంతాలు కూడా ఉన్నాయి. ఇక, గాంధీభవన్‌లోని ఓ ప్రధాన గేటుకు తాళం వేయడం అయితే తప్పనిసరి. అందుకేనేమో ఎప్పుడు అసెంబ్లీ టికెట్లు ప్రకటించినా కాంగ్రెస్ పార్టీ ఆఫీస్‌లో బౌన్సర్లు కనిపిస్తుంటారు. 2014, 2018లో బౌన్సర్ల పహారాలోనే గాంధీభవన్ ఉంది. కానీ, ఇప్పుడు టికెట్ల ప్రకటన పూర్తయిన తర్వాత కూడా బౌన్సర్ల జాడ లేదు. అయితే, ఈ బౌన్సర్ల గురించి పత్రికా విలేకరులో, కాంగ్రెస్ నేతలో ఆరా తీయలేదు. గాంధీభవన్ పర్యవేక్షకుడు, సీనియర్ నేతకు బౌన్సర్ల ఏజెంట్ నుంచి ఫోన్ వచ్చిందంట. 'ఏంటి సార్.. ఈసారి మాకు ఇంకా ఫోన్ రాలేదు' అని అడగడంతో అవాక్కయిన సదరు నేత 'ఈసారి అవసరం లేదండీ... ఎవరొచ్చినా పెద్దగా గొడవలేమీ జరగట్లేదు. అయినా ఇప్పుడు మాకు మీతో పన్లేదు.. మా పీసీసీ అధ్యక్షుడే పెద్ద బౌన్సర్'అంటూ బదులిచ్చారట.

జంగ్ తెలంగాణ

గుర్తుంచుకునేలా.. 193 రకాల వస్తువులను గుర్తులుగా కేటాయిస్తున్న ఎన్నికల సంఘం

సాక్షి మంచిర్యాల డెస్క్: ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులకు గుర్తు ప్రధానమైనది. రిజిష్టర్డ్ పార్టీలకు ఎన్నికల సంఘం కామన్ సింబల్‌ను కేటాయిస్తుంది. ఇక స్వతంత్ర అభ్యర్థులు బరిలో ఉంటే ఈసీ సూచించిన గుర్తుల్లో ఒకటి ఎంపిక చేసుకోవాల్సి ఉంటుంది. ఎయిర్ కండిషనర్, అల్మారా, ఆపిల్, ఆటోరిక్షా, బేబీవాకర్, బెలూన్, బ్యాంగిల్స్, బ్యాట్, బ్యాట్స్‌మెన్, బ్యాటరీ టార్చ్, బెల్ట్, బెంచ్, బ్రష్, బకెట్, కేక్, కెమెరా, డీజిల్ పంప్, ఫుట్‌బాల్, గ్యాస్ స్టౌవ్, గిఫ్ట్‌ప్యాక్, గ్రామఫోన్, హార్మోనియమ్, హాకీ అండ్ బాల్, లేడీ ఫింగర్, ల్యాప్‌టాప్, లెటర్ బాక్స్, లూడో, మిక్సీ, నెయిల్‌కట్టర్, పెన్‌డ్రైవ్, కుండ, టెలిఫోన్, టెలివిజన్, టూత్‌బ్రష్, టూత్‌పేస్ట్.. ఇలా ఏ అక్షర క్రమం నుంచి డబ్ల్యూ వరకు 193 రకాల వస్తువులను ఎన్నికల సంఘం గుర్తులుగా సూచించింది. స్వతంత్ర అభ్యర్థులకు గుర్తుల కేటాయింపులో ఈసీ కొన్ని విధానాలు అవలంభిస్తుంది. స్వతంత్ర అభ్యర్థులు మూడు గుర్తులను ప్రాధాన్యత క్రమంలో సూచించాల్సి ఉంటుంది. ఈ గుర్తులను మిగతా ఎవరూ ఎంపిక చేసుకోకుంటే వాటిలో ఒకటి కేటాయిస్తుంది. ఒకే గుర్తును ఎక్కువ మంది ఎంపిక చేసుకుంటే రిటర్నింగ్ అధికారి లాటరీ ద్వారా ఒకరికి కేటాయిస్తారు.

జనసేనకు 32 స్థానాల్లో కామన్ సింబల్

జనసేన పార్టీ విజ్ఞప్తి మేరకు ఎన్నికల సంఘం తెలంగాణలోని 32 అసెంబ్లీ స్థానాల్లో కామన్ సింబల్‌ను కేటాయిస్తూ ఈ ఏడాది సెప్టెంబర్ 18న ఉత్తర్వులు జారీ చేసింది. ఆ పార్టీకి గాజు గ్లాసు గుర్తును కేటాయించింది. కానీ, పొత్తులో భాగంగా బీజేపీ కేటాయించిన ఎనిమిది స్థానాల్లో మాత్రమే జనసేన పోటీ చేస్తోంది. ఈ స్థానాల్లో ఏడు చోట్ల మాత్రమే అభ్యర్థులకు గాజు గ్లాసు గుర్తు ఉంటుంది. జనసేన పార్టీ కోరిన 32 స్థానాల్లో తాండూర్ అసెంబ్లీ స్థానం లేకపోవడంతో ఎన్నికల సంఘం జాబితాలో లేదు. దీంతో ఇక్కడి అభ్యర్థి మరో గుర్తు ఎంచుకోవాల్సి ఉంటుంది.

రెండు చోట్ల ఎందుకు పోటీచేస్తారు?



కొమ్మినేని శ్రీనివాసరావు

ఎన్నికల్లో ఎవరైనా అభ్యర్థి రెండు, మూడుచోట్ల అసెంబ్లీ/లోక్‌సభ నియోజకవర్గాల్లో ఎందుకు పోటీచేస్తారు? దానివల్ల లాభనష్టాలేంటి? తెలంగాణ శాసనసభ ఎన్నికల నేపథ్యంలో మరోసారి ఈ అంశం చర్చకొచ్చింది. ఇక్కడ అత్యంత ఆసక్తికర అంశమేమిటంటే ముగ్గురు సీఎం అభ్యర్థులు రెండేసి చోట్ల పోటీలో ఉండటం, పరస్పరం పోటీ పడుతుండటం. ఇలా గతంలో ఉమ్మడి ఏపీలో ఎన్నడూ జరగలేదు. ఆ మాటకొస్తే ఇతర రాష్ట్రాల్లోనూ చాలా అరుదుగా జరుగుతుంటుంది. గతంలో వాజ్‌పేయి ప్రభుత్వం ఉన్నప్పుడు రెండేసి నియోజకవర్గాలకు పోటీచేసే అంశాన్ని నియంత్రించాలని ప్రతిపాదించారు. దీనివల్ల ఉప ఎన్నికలు జరపాల్సిన ఆవశ్యకత ఏర్పడి అనవసర వ్యయ భారం పడుతోందని భావించేవారు. ఈ ఖర్చును సంబంధిత అభ్యర్థి నుంచి వసూలు చేయాలని కూడా కొందరు వాదించేవారు. 1996కి ముందు మూడుచోట్ల పోటీ చేయడానికీ అవకాశం ఉండేది. అలా కొంతమంది చేశారు కూడా. ఆ తర్వాత దానిని రెండు నియోజకవర్గాలకు పరిమితం చేశారు. ఇలా రెండేసి చోట్ల పోటీచేసే వారిలో ప్రముఖ నేతలే ఎక్కువ. తమకు ప్రజల్లో ఉన్న అభిమానాన్ని చాటుకోవడానికి, ఒకచోట పోటీ చేస్తే ఓడిపోతామని అనుమానం వచ్చినా జాగ్రత్తపడటానికి, ఇతరత్రా రాజకీయ కారణాలతోనూ రెండేసి చోట్ల పోటీచేస్తుంటారు. కానీ ఈసారి తెలంగాణలో ఏకంగా ముగ్గురు నేతలు రెండేసి చోట్ల పోటీ చేయడం, పైగా వారు ముగ్గురు ఒకరిపై ఒకరు పోటీ పడటం ఈసారి ప్రత్యేకత అని చెప్పాలి.

కేసీఆర్ రెండు అసెంబ్లీ స్థానాల్లో పోటీచేయడం తొలిసారి..

తెలంగాణ సీఎం కేసీఆర్ గజ్వేల్, కామారెడ్డి నియోజకవర్గాల నుంచి రంగంలో దిగారు. గతంలో కేసీఆర్ రెండుసార్లు అసెంబ్లీ, లోక్‌సభ నియోజకవర్గాలకు పోటీ చేసి రికార్డు సృష్టించారు. కానీ ఇలా రెండు అసెంబ్లీ స్థానాల్లో ఒకేసారి పోటీచేయలేదు. కేసీఆర్‌పై కామారెడ్డిలో పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి పోటీకి దిగుతుండగా, గజ్వేల్‌లో బీజేపీ అగ్రనేత, ఒకప్పుడు కేసీఆర్ మంత్రివర్గంలో సభ్యుడైన ఈటల రాజేందర్ బరిలోకి దిగుతున్నారు. రేవంత్, ఈటల ఇద్దరూ తమ పార్టీల తరపున ముఖ్యమంత్రి అభ్యర్థులుగానే పరిగణనలో ఉన్నారు. కొడంగల్ సభలో రేవంత్ ఆ విషయం ప్రజలకు తెలియ చెప్పగా, ప్రధాని మోదీ పర్యటన సందర్భంలో బీజేపీ గెలిస్తే ఈటలను ముఖ్యమంత్రిని చేస్తామన్నారని వార్తలు వచ్చాయి. దానిని ధ్రువీకరిస్తూ ఈటల బహిరంగంగానే చెప్పేశారు. సాధారణంగా ఈ స్థాయి నేతలు ఇలా ఒకరిపై ఒకరు తలపడరు. ఎందుకంటే వారి రాజకీయ భవిష్యత్తు దెబ్బతినే అవకాశం ఉంటుంది. కానీ వీరిద్దరూ తమకు పట్టున్న వేరే నియోజకవర్గాల్లోనూ పోటీలో ఉన్నందున అసెంబ్లీకి ఎన్నికయ్యే అవకాశాన్ని పదిలపరచుకున్నారని భావించవచ్చు. రేవంత్ కొడంగల్ నుంచి, ఈటల హుజూరాబాద్ నుంచి కూడా పోటీ చేస్తున్నారు. కేసీఆర్ గజ్వేల్, కామారెడ్డిలో పోటీచేయడంలో ఉద్దేశం గజ్వేల్‌లో ఓటమి భయంతోనే అని ప్రత్యర్థి పార్టీలు ఆరోపిస్తున్నా, అంత ఓడిపోయే పరిస్థితి ఉందని చెప్పలేం. నిజంగానే అలా జరిగితే బీఆర్ఎస్ అధికారంలోకి రావడం కష్టమవుతుంది.పైగా గతంలో కేసీఆర్‌కు కాస్త పోటీ ఇచ్చిన ఒంటేరు ప్రతాపరెడ్డి ఇప్పుడు కేసీఆర్ పక్షానే ఉన్నారు. రెండో సీటుకు పోటీ చేయడం ద్వారా ఆ పరిసర నియోజకవర్గ ప్రజలపై ప్రభావం చూపే లక్ష్యం కూడా ఉంటుంది. ఉదాహరణకు 1983 శాసనసభ ఎన్నికల్లో కొత్తగా టీడీపీని స్థాపించిన ఎన్టీఆర్ గుడివాడతో పాటు తిరుపతిలో పోటీచేస్తారన్న సమాచారం రావడంతో ఆ ప్రాంతంలో విపరీత ప్రభావం చూపి ప్రత్యర్థి కాంగ్రెస్ తీవ్రంగా నష్టపోయింది.

ఉమ్మడి నిజామాబాద్ జిల్లాపై ప్రభావం చూపడానికేనా?


మూడు దశాబ్దాల తర్వాత తెలుగు నాయకుడొకరు రెండుచోట్ల పోటీ చేయడం అదే మొదలు కావడంతో అందరి దృష్టిని ఆకర్షించింది. బహుశా కేసీఆర్ కూడా ఉమ్మడి నిజామాబాద్ జిల్లాపై కొంత ప్రభావం చూపడానికి కామారెడ్డి నుంచి కూడా రంగంలో దిగి ఉండొచ్చు. కామారెడ్డిలో ఇంతవరకు బీఆర్ఎస్ ఎమ్మెల్యేగా ఉన్న గంప గోవర్ధన్ తప్పుకుని కేసీఆర్‌కు అవకాశం ఇచ్చారు. సీఎం ఈ సీటును గెలిచాక ఆయనకు అవకాశం ఇస్తారా? లేక తన కుమార్తె కవితకు ఇస్తారా అన్న చర్చ కూడా ఉంది. కాంగ్రెస్ నేత షబ్బీర్ అలీ ఈసారి కామారెడ్డిలో విజయం సాధించే పరిస్థితి ఉందన్న వార్తలు వస్తుండేవి. ఎప్పుడైతే కేసీఆర్ పోటీ చేస్తారని వార్తలొచ్చాయో సహజంగానే ఆయన విజయావకాశాలు దెబ్బతినే అవకాశం ఉంటుంది. అందుకే ఆయనను నిజామాబాద్ అర్బన్ నియోజకవర్గానికి పంపి, రేవంత్‌రెడ్డి రిస్కు తీసుకుంటున్నారు. తాను పోటీచేయడం ద్వారా కేసీఆర్‌ను కొంతమేర కామారెడ్డికి పరిమితం చేయొచ్చన్న ఆలోచన ఉండొచ్చు. కానీ కేసీఆర్ దానిని పట్టించుకోకుండా ,ఈ నెలాఖరు వరకు దాదాపు 94 నియోజకవర్గాల్లో ప్రచారానికి షెడ్యూల్ ఖరారు చేసుకున్నారు. రేవంత్ నిజానికి గత ఎన్నికల్లో కొడంగల్ నుంచి పోటీచేసి ఓడిపోయారు. కానీ తదుపరి మల్కాజిగిరి లోక్‌సభ స్థానానికి పోటీచేసి పుంజుకోగలిగారు. తనను గెలిపిస్తే సీఎం చాన్స్ ఉంటుందని చెప్పడంతోపాటు స్థానికంగా కొన్ని ఏర్పాట్లు చేసుకుని వివిధ నియోజకవర్గాల్లో ఆయన ప్రచారం చేయాల్సి ఉంటుంది.

రేవంత్ తలనొప్పి తెచ్చుకోవడమే...

రేవంత్ కామారెడ్డి నుంచి పోటీచేయడం వల్ల కేసీఆర్‌కు ఎంత ఇబ్బందో తెలియదు గానీ, ఆయన మాత్రం తలనొప్పి తెచ్చుకోవడమే. ఎందుకంటే కేసీఆర్‌పై గెలిస్తే సంచలనమే అవుతుంది. కానీ ఓటమిపాలై అది కూడా భారీ తేడాతో అయితే ప్రతిష్ఠ దెబ్బతింటుంది. అదే సమయంలో కొడంగల్‌కు ఎక్కువ టైమ్ కేటాయించలేకపోతే ఆయన ఇబ్బంది పడే అవకాశం ఉంటుంది. కొడంగల్‌లో తనను ఓడించడానికి కుట్ర జరుగుతోందని ఆయనే ఆరోపించారు. అలాగే ఈటల హుజూరాబాద్‌లో ఆరుసార్లు టీఆర్ఎస్ (బీఆర్ఎస్) నుంచి, ఒకసారి బీజేపీ పక్షాన గెలిచారు. టీఆర్ఎస్‌కు రాజీనామా చేశాక జరిగిన ఉప ఎన్నికలో భారీ విజయం సాధించడం ఆయనకు ప్రతిష్ఠ తెచ్చింది. అదే ఊపుతో గజ్వేల్ నుంచి కూడా ఆయన రంగంలో దిగారు. ఇక్కడ కేసీఆర్‌ను ఓడించడం అంత ఈజీ కాదు. అయినా ఒక చాన్స్ తీసుకుంటున్నారు. అదే టైమ్‌లో హుజూరాబాద్‌లో తన బేస్‌ను కూడా రక్షించుకోవాల్సి ఉంటుంది. లేకుంటే రెంటికి చెడ్డ రేవడి అయ్యే పరిస్థితి వస్తుంది.

ఓడిన ఘట్టాలు

రెండుచోట్ల పోటీచేసిన నేతలు గతంలో గెలిచిన సందర్భాలతోపాటు ఓడిన ఘట్టాలూ ఉన్నాయి. ఈ విషయంలో ఎన్టీఆర్‌ది ఒక రికార్డు అని చెప్పాలి. ఆయన 1983లో గుడివాడ, తిరుపతి, 1985లో నల్లగొండ, హిందూపూర్, గుడివాడ నుంచి పోటీచేసి చరిత్ర సృష్టించారు. కానీ 1989లో కల్వకుర్తి, హిందూపూర్ నుంచి పోటీచేసి కల్వకుర్తిలో ఓడిపోయారు. అప్పుడు పార్టీ కూడా అధికారంలోకి రాలేదు. 1994లో టెక్కలి, హిందూపూర్ నుంచి గెలిచారు. ఆ తర్వాత చిరంజీవి తిరుపతి, పాలకొల్లు నుంచి పోటీచేసి తిరుపతిలో మాత్రమే గెలవగలిగారు. ఆయన సోదరుడు జనసేన అధినేత పవన్ కల్యాణ్ గాజువాక, భీమవరం నుంచి పోటీచేసి రెండుచోట్లా ఓడిపోయారు. తెలంగాణలో పెండ్యాల రాఘవరావు అనే కమ్యూనిస్టు నేత 1952లో హన్మకొండ, వర్ధన్నపేట అసెంబ్లీ సీట్లకు, వరంగల్ లోక్‌సభ సీటుకు పోటీచేసి మూడుచోట్లా గెలిచారు. ఆ తర్వాత అసెంబ్లీ సీట్లు వదులుకుని లోక్‌సభను ఎంపిక చేసుకున్నారు. మరోనేత రాంగోపాల్ రెడ్డి 1962లో బోధన్, మేడారం నుంచి ఇండిపెండెంట్‌గా ఎన్నికవడం విశేషం. లోక్‌సభకు సంబంధించి తెలుగు రాష్ట్రాల్లో ఒకే ఎన్నికలో రెండుచోట్ల పోటీచేసిన నేతలు లేరనే చెప్పాలి. ఏదేమైనా తెలంగాణలో ఈసారి ముగ్గురు సీఎం అభ్యర్థులు ఎన్నికల గోదాలో దిగడం సంచలనమే. ఒక్కోసారి పెద్ద నేతలు చిన్న నేతల చేతిలో ఓడిపోతుండటం కూడా జరగవచ్చు. ఉదాహరణకు తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి కామరాజ్ నాడార్ ఎవరికీ పెద్దగా తెలియని శ్రీనివాసన్ చేతిలో ఓడిపోయారు. ఇందిరాగాంధీ రాయ్‌బరేలీలో రాజ్ నారాయణ అనే చిన్న నేత చేతిలో పరాజయం పాలయ్యారు. ముఖ్యమంత్రి కాకముందు టి.అంజయ్య ముషీరాబాద్‌లో కార్మిక నేత నాయిని నరసింహారెడ్డి చేతిలో ఓడిపోయారు. తర్వాత కాలంలో ఆయనకు సీఎం అవకాశం వచ్చినప్పుడు ఏకగ్రీవంగా నెగ్గారు. ఎన్టీఆర్‌ను చిత్తరంజన్ దాస్ అనే కాంగ్రెస్ నేత కల్వకుర్తిలో ఓడించారు. ప్రఖ్యాత నేతలు ప్రకాశం పంతులు, నీలం సంజీవరెడ్డి వంటివారు సైతం అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిన నేతలే. సంజీవరెడ్డి స్వయంగా తన బావమరిది తరిమెల నాగిరెడ్డి చేతిలో ఓడిపోయారు. ఇలా వివిధ రాష్ట్రాల్లో ఎన్నికల్లో పలు చిత్రాలు కూడా జరుగుతుంటాయి. మరి తెలంగాణలో ఎలాంటి ఫలితాలు వస్తాయో, ఎవరి భవిష్యత్తు ఎలా మారుతుందో చూద్దాం!



కరెంటిచ్చాం.. పవరివ్వండి..

ఖమ్మం బీఆర్ఎస్ అభ్యర్థి పువ్వాడ అజయ్‌కుమార్ ఖమ్మం 5వ డివిజన్‌లో శనివారం ఎన్నికల ప్రచారం చేస్తూ.. ఓ ఇస్త్రీ బండి వద్ద కాసేపు బట్టలు ఇస్త్రీ చేశారు. రజకులకు సీఎం కేసీఆర్ ఉచిత కరెంట్ ఇచ్చారని.. కారు గుర్తుకే ఓటు వేయాలని వారిని అభ్యర్థించారు.

\- ఖమ్మం అర్బన్

34 కాలనీలు.. 85 నామినేషన్లు

మేడ్చల్, బోడుప్పల్ వక్ఫ్ భూమి బాధితుల మూకుమ్మడి నామినేషన్



మేడ్చల్: ఏళ్ల క్రితం చట్ట ప్రకారంగా కొనుగోలు చేసిన భూముల్లో వారు స్థిర నివాసాలు ఏర్పాటు చేసుకుని జీవనం సాగిస్తున్నారు. అయితే ఓ వ్యక్తి ఫిర్యాదుతో వారి స్థలాలు వక్ఫ్ భూములని ప్రభుత్వం ప్రకటించింది. దీంతో తమ సమస్యలను పట్టించుకోవాలని మేడ్చల్ బోడుప్పల్ కార్పొరేషన్ పరిధిలోని 30 కాలనీల ప్రజలు 85 మందితో అసెంబ్లీ ఎన్నికల్లో నామినేషన్లు వేసి నిరసన తెలిపారు. బోడుప్పల్ ప్రాంతంలో ఆర్ఎన్ఎస్ కాలనీ, పెంటారెడ్డి కాలనీ, మారుతీనగర్, ఘట్‌కేసర్‌కు చెందిన మధురానగర్ తదితర 30 కాలనీల ప్రజలు నాలుగేళ్లుగా విచిత్ర సమస్యను ఎదుర్కొంటున్నారు. బోడుప్పల్ ప్రాంతంలో 30 సర్వే నంబర్లలో 300 ఎకరాలు, ఘట్‌కేసర్ పరిధిలో 10 ఎకరాలు భూమి ఉంది. 40 ఏళ్ల క్రితం అవన్నీ వెంచర్లుగా మారిపోయాయి. బోడుప్పల్, పీర్జాదీగూడ నగర శివారు ప్రాంతాలు కావడంతో శరవేగంగా అభివృద్ధి సాధించాయి. రియల్టర్లు భూములను కొనుగోలు చేసి వెంచర్లను ఏర్పాటు చేశారు. చట్టబద్ధంగా వినియోగదారులకు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్‌లు చేశారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి వలస వచ్చిన వారు ప్లాట్లు కొనుగోలు చేసి సొంతింటి కల నెరవేర్చుకున్నారు. దాదాపు 30 కాలనీలలో ఏడు వేల కుటుంబాలు నివసిస్తున్నాయి. 2018 వరకు అంతా సాఫీగానే ఉన్నా ఆ తర్వాతే అసలు కథ మొదలైంది. 2018లో ఓ వ్యక్తి కాలనీలు ఉన్న భూములన్నీ వక్ఫ్ భూములని ఫిర్యాదు చేయడంతో ఆ భూముల రిజిస్ట్రేషన్‌లు నిలిపివేశారు. దీంతో 7వేల కుటుంబాల వారు జేఏసీగా ఏర్పడి పోరాటం మొదలు పెట్టారు. 2022 సంవత్సరంలో 30 కాలనీల్లో ఉన్న భూములన్నీ ప్రభుత్వ నిషేధిత జాబితాలో చేర్చడంతో కాలనీలలో ఇల్లు కట్టుకున్న వారి భవిష్యత్ అంధకారంగా మారింది. జేఏసీ తరపున పోరాటాలు చేసినా పాలకుల నుంచి, ప్రభుత్వం నుంచి స్పందన రాకపోవడంతో వారి రోదన అరణ్య రోదనగా మారింది. తమ సమస్యను ఎమ్మెల్యే నుంచి ఎంపీ వరకు ఎవరికి విన్నవించుకున్నా పరిష్కారం కాకపోవడంతో వారు తమ సమస్యపై పాలకులు స్పందించాలని డిమాండ్ చేస్తూ ఏకంగా 88 నామినేషన్లు వేశారు. శుక్రవారం కాలనీల వాసులు కీసరలోని ఆర్డీఓ కార్యాలయానికి వెళ్లి నామినేషన్లను దాఖలు చేశారు. మేడ్చల్ నియోజకవర్గంలో మొత్తం 116 మంది నామినేషన్లు వేయగా అందులో 88 మంది బోడుప్పల్ 30 కాలనీలకు చెందిన వారే.

ప్రభుత్వానికి మా సమస్య తెలియాలనే..



మేం ఎన్నికలలో విజయం సాధిస్తామని నామినేషన్ వేయలేదు. మా సమస్య వచ్చే ప్రభుత్వానికి తెలియాలనే మూకుమ్మడి నామినేషన్లు వేశాం. ఎన్నికల ద్వారానైన మా సమస్య ప్రభుత్వం దృష్టికి పోతుందని అనుకుంటున్నాం.

\- శ్రీధర్‌రెడ్డి, ఐక్యకార్యాచరణ సమితి అధ్యక్షుడు

పాలకులు పట్టించుకోవడం లేదు..



పాలకులు పట్టించుకోకపోవడం వల్లే 88 మంది నామినేషన్లు వేశారు. సమస్యను మంత్రి మల్లారెడ్డికితో పాటు అందరు పాలకులకు విన్నవించినా ఎవరూ పట్టించుకోలేదు. మా సమస్య పట్టించుకోని నేతలకు ఓటు ద్వారా బుద్ధి చెబుతాం

\- కుంభం కిరణ్‌కుమార్, కార్పొరేటర్, జేఏసీ కోచైర్మన్

సంతకం ప్రత్యేకతను చాటుతుంది. అందుకేనేమో.. నాగార్జునసాగర్ అసెంబ్లీ సీటు నుంచి నామినేషన్ దాఖలుచేసిన జానారెడ్డి (కాంగ్రెస్), నోముల భగత్ (బీఆర్ఎస్).. ఇద్దరూ పత్రాలపై తెలుగులోనే సంతకాలు చేశారు. జానారెడ్డి 1982 నుంచి ఇదే ఆనవాయితీ పాటిస్తుండగా, భగత్ కూడా ఈసారి తెలుగులోనే సంతకం చేశారు. - నిడమనూరు





కాంగ్రెస్ 'పప్పెట్ షో'

ప్రధాని మోదీ హైదరాబాద్‌కు వచ్చిన వేళ కాంగ్రెస్ పార్టీ వినూత్న ప్రచారం చేపట్టింది. కేసీఆర్, ఒవైసీని తోలుబొమ్మల్ని చేసి మోదీ ఆడిస్తున్న చిత్రాలను హైటెక్‌సిటీ, బేగంపేట ప్రాంతాల్లోని ఫుట్ ఓవర్ బ్రిడ్జిలపై ప్రదర్శించింది. అలాగే, 'పదేళ్ల అహంకారం పోవాలి-పదేళ్ల అవినీతిని తరమాలి' నినాదంతో కూడిన కొత్త వీడియోను కాంగ్రెస్ పార్టీ శనివారం విడుదల చేసింది.



పొలిటికల్ దీపావళి... పార్టీల స్వగతాలు!



అదేంటోగానీ దీపావళి బాణాసంచాకు చెందిన అనేక అంశాలు ఈసారి ఎన్నికల్లో బాగా రెలెవెంట్ అయి నప్పాయి. ప్రముఖ నేతల, పార్టీల స్వగతాలూ, స్వభావాలూ, ఆలోచనలూ...ఇవన్నీ తమ స్వగతాలుగా బాణాసంచాల్లో రిఫ్లెక్ట్ అవుతున్న తీరు ఇది.

బీఆర్ఎస్ స్వగతం...

ఎప్పట్నుంచో మన పార్టీ దేదీప్యమానం. మనం జస్ట్ ఓ తాడు పేనితే, అవి 'దీపావళి తాళ్ల'లా మనకు వెలుగులూ, ప్రత్యర్థుల్ని కట్టడి చేసే మోకులయ్యాయి. మనం ఓ చిన్న గోలీ విసిరితే, అది నల్లగా పాంబిళ్లలా పాకి ప్రత్యర్థులను గజగజలాడించింది.

మనమింతగా వెలిగామా! ఎందుకోగానీ తీరా ఎన్నికల ముందే మనకు కొన్ని అపశకునాల బాంబుపేలుళ్లు! మేడిగడ్డను 'తాటాకు బాంబు'అంటూ ప్రాజెక్ట్ చేసినా, లక్ష్మి బ్యారేజీ కుంగి 'లక్ష్మి బాంబు'లా పేలింది. సరిగ్గా ఎలక్షన్ టైము చూసుకుని...సద్రుమంటూ కాళ్లకింది భూచక్రంలా గిర్రుమంది. కనీసం డిసెంబరు మూడు నాటికైనా ఈ గండాలన్నీ తొలగి, మనం మతాబులా వెలగాలి మునుపటిలాగే!

మన వారసులూ 'సిసింద్రీ'ల్లా నిలవాలి ఎప్పటిలాగే!!

కాంగ్రెస్ స్వగతం...

అదేంటోగానీ... నిక్కమైన చక్కటి 'బాంబు'ఒక్కటైన చాలు అని అధిష్ఠానం అనుకుంటుందా...ఒక్కో నియోజకవర్గంలో ఓ వెయ్యిమంది 'థౌజెండ్‌వాలా'ల్లా పటపటా పేల్తారు! అభ్యర్థి ఎంపిక అయ్యేదాకా అందరూ చిటపట, చిటపట, చిటపటలాడుతూనే ఉంటారు. అందర్నీ మనం మన కార్యకర్తలనుకుంటాంగానీ...తామూ నేతలమేనంటూ వాళ్లు 'టెన్ థౌజెండ్‌వాలా'లవుతారు. హమ్మయ్య ఎలాగోలా ఎంపిక పూర్తయ్యిందనుకుంటూ, హాయిగా నిట్టూర్చేలోపు...తోటి పోటీదారును సాటి సీఎంగా ఎంచి, ప్రతివాడూ ఎదుటివాడి సీటు కింద మంటపెట్టి వాణ్ని 'రాకెట్'లా ఎగరేయాలని చూస్తారు. ఒక్కొక్కడు పైపైకెగిరాక...అక్కడా అనేక విన్యాసాలతో రంగురంగుల గోళాల్ని విరజిమ్ముతుంటాడు. అవి ఉల్కాపాతాల్లా సీఎమ్ కుర్చీని తాకి, తమ అవకాశాల్నెక్కడ గండికొడతాయోనంటూ అందరూ భయపడతుంటారు.

కమ్యూనిస్టులు...

రాజకీయ దీపావళిలో మనకూ బోల్డంత ప్రాధాన్యముందని మనమూ అనుకుంటామా?! కానీ వాస్తవం వేరు. కనీసం మనల్ని దీపావళి అగ్గిపెట్టెలోని వెలుగుపూల అగ్గిపుల్లల్లాగా కూడా చూడరు. తమ సొంత బాణాసంచా పేలడానికి పనికొచ్చే కొవ్వొత్తిలా మాత్రమే చూస్తూ...

షుగర్ & పెప్పర్

..:: యాసీన్

మనకెలాంటి వెలుగులూ, శబ్దాలూ అక్కర్లేదనీ... కేవలం వాళ్ల కోసమూ, వాళ్ల బాణాసంచాలు వెలగడం కోసమే మనం కొవ్వొత్తుల్లా కాలి, కారి, కరిగిపోతూ త్యాగం చేయాలనుకుంటారు ఈ పొరుగు పార్టీల వాళ్లు. ప్చ్.

బీజేపీ...

అసలు...ఏ బాంబు వెలగాలన్నా కాకరపువ్వొత్తినే కాల్చి మంట అంటిస్తారు కదా. అసలీ కాకరపువ్వొత్తిని కాకరపువ్వొత్తి అనే ఎందుకనాలి? మన పార్టీ గుర్తు 'కమలం'కదా. కాబట్టి ఇకపై కాకరపువ్వొత్తిని 'కమలం పువ్వొత్తి'అనే అనాలంటూ... 'దీపావళి'సందర్భంగా ఓ రివల్యూషనరీ రిజల్యూషన్ తీసుకోవాల్సిందే మనం. అలా ఎలా కుదురుతుందంటూ మన కాళ్లలోనే పేలేలా ఎవ్వరూ బాంబులు పేల్చకండి. అసలిప్పటివరకు మనం మార్చని పేరంటూ ఏదైనా ఉందా? పథకాలూ, చట్టాల పేర్లూ, వీధుల-నగరాల పేర్లూ మార్చాం. ఆఖరికి...వాళ్లెవరో తమ కూటమికి పెట్టుకున్నారంటూ, ఇంగ్లిష్‌లో పలికాల్సిన సొంతదేశం పేరు కూడా ప్రాంతీయ భాషల్లోకే మార్చి పలుకుతున్నప్పుడు కాకరపువ్వొత్తిని... 'కమలం-పువ్వొత్తి'అని మార్చి పిలిస్తే పోయేదేముంది, ఒక కీలక బాణాసంచాకు మన పార్టీ గుర్తు పేరును చిరస్థాయిగా నిలిచిపోయేలా చేయడం తప్పా?

ఇక సామాన్యుడి స్వగతం...

సరే...అన్ని పార్టీలూ బాణాసంచా కాంతులతో ఏదోరకంగా వెలుగుతున్నవే కదా. మరి సామాన్యుడికి మిగిలేదేమిటి, దీపావళినాటి బాంబుల కాలుష్యపు పొగ, నుసి తప్ప! ఆ మర్నాడు వీధుల నిండా బాణాసంచాకు వాడిన కాగితాల చుట్టల వ్యర్థాలు తప్ప! అందుకే...ఇప్పటికైనా తమ బతుకులు వెలిగేపోయేలా ఆలోచించి ఓటేయ్యాలంటూ...ప్రతి సాటి ఓటరుకూ, మరో సామాన్య ఓటరు చేసుకుంటున్న విజ్ఞప్తులివి. తమ బతుకులు చీదేసిన చిచ్చుబుడ్డీలు కాకూడదంటూ చేస్తున్న వినతులివి.

జంగ్ తెలంగాణ పంచతంత్రం

మిజోరంలో అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ ఘట్టం ముగిసింది. మిగతా రాష్ట్రాల్లో ఎన్నికల వేడి పతాక స్థాయికి చేరింది. ఛత్తీస్‌గఢ్‌లో ఒకటో దశ పోలింగ్ ముగిసింది. అక్కడి మిగతా స్థానాలతో పాటు మధ్యప్రదేశ్‌లో మొత్తం సీట్లకు ఐదు రోజుల్లో పోలింగ్ జరగనుంది. ఆ రెండు రాష్ట్రాల్లో మాదిరిగానే రాజస్తాన్‌లో కూడా అధికార కాంగ్రెస్, బీజేపీ హోరాహోరీ తలపడుతున్నాయి. నవంబర్ 25వ తేదీన పోలింగ్. 10 రోజుల్లో ప్రచారానికి తెర కూడా పడనుంది. బీజేపీ తరఫున ప్రధాని మోదీతో పాటు అగ్ర నేతలంతా నెల రోజులుగా ప్రచార బరిలోనే ఉన్నారు. కొద్ది రోజులుగా రాష్ట్రమంతటా ముమ్మురంగా కలియదిరుగుతున్నారు. కానీ కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్‌గాంధీ మాత్రం ఇప్పటిదాకా రాజస్తాన్‌లో అసలు ప్రచారానికే రాకపోవడంపై సర్వత్రా చర్చ జరుగుతోంది. ఆయన దీపావళి తర్వాత బరిలో దిగుతారని కాంగ్రెస్ పైకి చెబుతున్నా, లోలోపల దీనిపై ఆ పార్టీ నేతల్లోనూ ఆవేదనే తొంగిచూస్తోంది. కాంగ్రెస్ ఓటమి ఖాయమని అర్థమయ్యే రాజస్థాన్‌కు రాహుల్ దూరంగా ఉంటున్నారంటూ బీజేపీ ఎద్దేవా చేస్తోంది. అందుకే సోదరి ప్రియాంకతో నామమాత్రంగా ప్రచారం చేయించి మమ అనిపిస్తున్నారంటోంది...

రాహుల్ ఎక్కడ?

రాజస్తాన్ ప్రచారంలో కాలుమోపని వైనం

- ప్రజలకు తప్పుడు సంకేతాలు పంపుతోంది
- కాంగ్రెస్ నేతలు, కార్యకర్తల్లో ఆవేదన
- ఓటమి ఖాయమనే ముఖం చాటు: బీజేపీ



రాజస్తాన్‌లో కాంగ్రెస్ పార్టీ స్టార్ ప్రచారకుల జాబితాలో పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, సోనియాగాంధీ తర్వాత మూడో స్థానంలో ఉన్నది రాహులే. ఖర్గే రెండు మూడుసార్లు రాష్ట్రంలో ప్రచారంలో పాల్గొన్నారు. ప్రియాంక గాంధీ కూడా రెండు ర్యాలీల్లో ప్రసంగించారు. కానీ రాహుల్ మాత్రం రాష్ట్రంలో అడుగు పెట్టి ఏకంగా నెలన్నర దాటింది! ఆయన చివరిసారిగా సెప్టెంబర్ 23న జరిగిన రాష్ట్ర కాంగ్రెస్ కార్యకర్తల భేటీలో పాల్గొన్నారు. ఇంత హోరాహోరీగా జరుగుతున్న ఎన్నికల్లో పార్టీ తరఫున అన్నీ తానై ప్రచార భారం మోయాల్సిన ఆయన ఎందుకిలా దూరంగా ఉంటున్నారన్న దానిపై రాష్ట్ర రాజకీయ వర్గాల్లో జోరుగా చర్చ జరుగుతోంది...

తెలంగాణకు వెళ్లారుగా: బీజేపీ

రాహుల్ గైర్హాజరీకి రాజస్తాన్ కాంగ్రెస్ వర్గాలు చెబుతున్న కారణాలు కూడా పెద్దగా నమ్మశక్యంగా లేవన్న అభిప్రాయం వినిపిస్తోంది. రాజస్తాన్ కంటే ముందుగా పోలింగ్ జరుగుతున్న మిగతా రాష్ట్రాల్లో ప్రచారంలో రాహుల్ బిజీగా ఉన్నారని ఆ రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి సుఖీందర్‌సింగ్ రణ్‌ధవా చెప్పుకొచ్చారు. అందుకే ప్రస్తుతానికి ఆయన రాష్ట్రంపై దృష్టి పెట్టడం లేదన్నారు. కానీ ఇది సాకు మాత్రమేనని బీజేపీ అంటోంది. రాజస్తాన్ తర్వాత ఐదు రోజులకు నవంబర్ 30న పోలింగ్ జరగనున్న తెలంగాణలో రాహుల్ ముమ్మరంగా ప్రచారంలో పాల్గొంటున్న విషయాన్ని ప్రస్తావిస్తోంది. రాజస్థాన్‌లో కాంగ్రెస్ విజయంపై రాహుల్‌కు పెద్దగా నమ్మకం లేనట్టుందన్న చర్చ కాంగ్రెస్ వర్గాల్లోనే సాగుతోంది! సెప్టెంబర్‌లో ఢిల్లీలో ఓ కార్యక్రమంలో రాహుల్ మాటలు కూడా దీన్ని బలపరిచేవిగానే ఉండటం విశేషం. 'మేం మధ్యప్రదేశ్, ఛత్తీస్‌ల్లో కచ్చితంగా గెలుస్తున్నాం. తెలంగాణలోనూ విజయ సూచనలున్నాయి' అని చెప్పిన ఆయన, 'రాజస్థాన్‌లో బహుశా గెలుస్తామేమో' అంటూ ముక్తాయించారు. ఆయన నుంచి ఇలాంటి వ్యాఖ్యలను ఊహించలేదంటూ అప్పట్లోనే రాజస్థాన్ కాంగ్రెస్ వర్గాలు ఆవేదన వెలిబుచ్చాయి!

ఆనవాయితీ మార్చాలనుకుంటే...

నిజానికి రాజస్తాన్‌లో ప్రతి ఐదేళ్లకూ ప్రభుత్వం మారడం ఆనవాయితీ. కానీ ఈసారి ఎన్నికలకు ముందు దాకా విపక్ష బీజేపీలో అంతర్గత పోరు గట్టిగానే కొనసాగింది. దానికి తోడు సీఎం అశోక్ గహ్లోత్ కొద్ది నెలలుగా వరుసబెట్టి ప్రజాకర్షక పథకాలను ప్రకటించారు. కనుక అధికార పార్టీ ఓడిపోయే ఆనవాయితీని ఈసారి మార్చగలమని రాష్ట్ర కాంగ్రెస్ కార్యకర్తలు అప్పట్లో భావించారు. తీరా ఎన్నికలు సమీపించే సమయానికి బీజేపీలో ఇంటి పోరు సద్దుమణిగింది. ఇటు చూస్తే ప్రధాన నాయకుడే రాష్ట్రం వైపు తొంగి కూడా చూడకపోవడం వారిలో నిరాశను పెంచుతోంది.

గెహ్లోత్-పైలట్ కుమ్ములాటలూ కారణమే!

రాజస్తాన్‌కు రాహుల్ కాస్త దూరంగా ఉండటానికి సీఎం గహ్లోత్, యువ నేత సచిన్ పైలట్ మధ్య తీవ్ర విభేదాలు కూడా కారణమని రాష్ట్ర కాంగ్రెస్ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. ఎవరికి పట్టున్న ప్రాంతంలో ప్రచారానికి వెళ్లినా రెండోవారిని బాధపెట్టినట్టు అవుతుందన్న భావన బహుశా ఆయనలో ఉండవచ్చని చెబుతున్నారు. పైగా గతేడాది కాంగ్రెస్ అధ్యక్ష పదవి చేపట్టాలన్న సోనియా ఆదేశాన్ని కూడా గెహ్లోత్ బేఖాతరు చేయడం తెలిసిందే. దీనిపైనా రాహుల్ అసంతృప్తిగా ఉన్నారని ఏఐసీసీ వర్గాలంటున్నాయి. కారణమేదైనా ప్రచార పర్వంలో రాహుల్ గైర్హాజరు ప్రజలకు తప్పుడు సంకేతాలు పంపడం ద్వారా కాంగ్రెస్ విజయావకాశాలను దెబ్బ తీస్తోందన్న ఆందోళన ఆ పార్టీ నేతలతో పాటు కార్యకర్తల్లో కూడా వ్యక్తమవుతోంది. ఈ పరిస్థితుల్లో ఆయన దీపావళి అనంతరం నిజంగానే ప్రచారానికి వచ్చినా పెద్దగా ఒరిగేదేమీ ఉండదంటూ పలువురు కాంగ్రెస్ నేతలు చేసిన వ్యాఖ్యలు ఆ నైరాశ్యానికి అద్దం పట్టేలానే ఉన్నాయి!

బస్తర్‌లో 404 సార్లు చక్కర్లుకొట్టాయి!

- ఎన్నికల సిబ్బందిని తరలించిన వాయుసేన హెలికాప్టర్లు
- ఆరు రోజులు అవిశ్రాంతంగా పనిచేసిన వైనం



రాయ్‌పూర్: నక్సల్ ప్రభావిత ఛత్తీస్‌గఢ్‌లోని బస్తర్ జిల్లాలో ఎన్నికల నిర్వహణ నిజంగా కత్తిమీద సామే. ఎన్నికల ప్రక్రియ సజావుగా సాగాలంటే ముందుగా ఎన్నికల సిబ్బందిని క్షేమంగా పోలింగ్ స్టేషన్‌లకు పంపించాలి. పోలింగ్ పూర్తయ్యాక ఈవీఎం యంత్రాలుసహా సిబ్బందిని తిరిగి సురక్షితంగా తీసుకురావాలి. నక్సల్స్ మందుపాతరలు, మెరుపుదాడులకు పేరుగాంచిన బస్తర్ జిల్లాలో సిబ్బంది తరలింపు సవాళ్లతో కూడుకున్నదే. అందుకే ఈసారీ రోడ్డు మార్గంలో కాకుండా వాయుమార్గంలో సిబ్బందిని తరలించి శెభాష్ అనిపించుకుంది భారత వాయుసేన. రాష్ట్రంలో తొలి దఫా ఎన్నికలు జరిగిన నవంబర్ 7వ తేదీన 20 నియోజకవర్గాలకు పోలింగ్ నిర్వహించడం తెల్సిందే. ఈ నియోజకవర్గాల్లో అత్యంత సమస్యాత్మకమైన పోలింగ్ స్టేషన్లకు 860 మందికి పైగా సిబ్బందిని తరలించేందుకు వాయుసేన తన ఎంఐ-17 హెలికాప్టర్లను రంగంలోకి దించింది. ఎనిమిది హెలికాప్టర్లు ఆరు రోజులపాటు ఇలా ఎన్నికల సిబ్బంది తరలింపులో అవిశ్రాంతంగా పని చేశాయి. 'సిబ్బంది తరలింపు కోసం హెలికాప్టర్లు 404 సార్లు రాకపోకలు సాగించాయి. విధి నిర్వహణలో పోలింగ్ సిబ్బంది మాత్రమే కాదు వాయుసేన హెలికాప్టర్లు తమ నిబద్ధతను మరోసారి చాటిచెప్పాయి' అని ప్రశంసిస్తూ ఛత్తీస్‌గఢ్ చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ తన సామాజిక మాధ్యమ ఖాతా 'ఎక్స్'లో ట్వీట్‌చేశారు. 'బస్తర్ ప్రాంతంలోని సుక్మా, బీజాపూర్, కాంకేర్, దంతేవాడ, నారాయణ్‌పూర్ జిల్లాలో 156 పోలింగ్ స్టేషన్లలో విధులు నిర్వర్తించిన 860కిపైగా సిబ్బందిని ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ తన హెలికాప్టర్లలోనే తరలించింది' అని ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ పి. సుందర్ రాజ్ చెప్పారు.

హెలికాప్టర్లపైకీ నక్సల్ కాల్పులు !

2008 అసెంబ్లీ ఎన్నికల్లో సిబ్బందిని తరలిస్తున్న హెలికాప్టర్లపైకీ నక్సల్స్ కాల్పులు జరిపారు. ఆనాడు బీజాపూర్ జిల్లాలోని పెడియా గ్రామంలో ఓటింగ్ యంత్రాలు, సిబ్బందితో వెళ్తున్న ఒక హెలికాప్టర్ పైకి నక్సల్స్ కాల్పులు జరపగా కాక్‌పిట్‌లోని ఫ్లైట్ ఇంజనీర్ సర్జెంట్ ముస్తఫా అలీ మరణించారు. వెంటనే అందులోని కెప్టెన్ స్క్వాడ్రాన్ లీడర్ టీకే చౌదరీ చాకచక్యంగా అది కూలిపోకుండా చూసి సురక్షితంగా జగ్దల్‌పూర్ పట్టణంలో ల్యాండ్‌చేశారు.

వరి, గోధుమలకు మరింత 'మద్దతు'



భోపాల్‌లో బీజేపీ మేనిఫెస్టోను విడుదలచేస్తున్న పార్టీ చీఫ్ నడ్డా, మధ్యప్రదేశ్ సీఎం శివరాజ్ తదితరులు

- 'లాడ్లీ బెహనా' లబ్ధిదారులకు పక్కా ఇళ్లు
- రూ.450కే వంట గ్యాస్ సిలిండర్
- మధ్యప్రదేశ్ ఎన్నికల మేనిఫెస్టోలో బీజేపీ కీలక హామీలు

భోపాల్: మధ్యప్రదేశ్ అసెంబ్లీకి ఈనెల 17న జరగనున్న ఎన్నికలకు గాను బీజేపీ మేనిఫెస్టో విడుదల చేసింది. కనీస మద్దతు ధర(ఎంఎస్‌పీ) గోధుమలకు రూ.2,700, వరి ధాన్యానికి రూ.3,100 చెల్లిస్తామని ప్రకటించింది. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న 'లాడ్లి బెహనా'పథకం లబ్ధిదారులకు పక్కా ఇళ్లు, ప్రతి కుటుంబంలో కనీసం ఒకరికి ఉద్యోగాలు, లేదా స్వయం ఉపాధికి అవకాశం. నిరుపేద కుటుంబాల బాలికలకు పోస్టు గ్రాడ్యుయేషన్ వరకు, పేద విద్యార్థులకు 12వ తరగతి వరకు ఉచిత విద్య, స్కూల్ యూనిఫాం, పుస్తకాలు, బ్యాగులు కొనుక్కునేందుకు ఏడాదికి రూ.1,200 అందజేత, లాడ్లి బెహనా, 'పీఎం ఉజ్వల'పథకాల లబ్ధిదారులకు రూ.450కే ఎల్పీజీ సిలిండర్ వంటి కీలక హామీలను రాష్ట్ర ప్రజలకు ఇచ్చింది.ఈ మేరకు ఎన్నికల హామీలతో కూడిన 96 పేజీల 'సంకల్ప్ పత్ర'ను బీజేపీ అధ్యక్షుడు జేపీ నడ్డా, రాష్ట్ర పార్టీ చీఫ్ వీడీ శర్మ, సీఎం చౌహాన్ తదితరుల సమక్షంలో శనివారం విడుదల చేశారు. బీజేపీకి మరోసారి అవకాశమిస్తే మేనిఫెస్టోలోని ప్రతి హామీనీ తు.చ. తప్పక అమలు చేస్తామన్నారు. మేనిఫెస్టో అమలుపై ప్రత్యేకంగా నిఘా ఉంచుతుందని తెలిపారు. మధ్యప్రదేశ్ అభివృద్ధికి మేనిఫెస్టోను రోడ్ మ్యాప్‌గా మారుస్తామని సీఎం శివరాజ్ సింగ్ చౌహాన్ చెప్పారు. అన్ని హామీలను అమలు చేయడం ద్వారా రాష్ట్ర ప్రజల ఆకాంక్షలను తీర్చేందుకు బీజేపీ ప్రభుత్వం ప్రయత్నిస్తుందని ప్రకటించారు.

- రాష్ట్రంలో ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఐఐటీ), ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(ఎయిమ్స్) ఏర్పాటు.
- గిరిజనుల సాధికారిత సాధనకు రూ.3 లక్షల కోట్లతో కొత్తగా ఆరు ఎక్స్‌ప్రెస్ వేల నిర్మాణం.
- సీఎం కిసాన్ కల్యాణ్ యోజన, పీఎం కిసాన్ సమ్మాన్‌ల ద్వారా రైతులకు ఏడాదికి రూ.12 వేలు పంపిణీ.
- ఆహార ధాన్యాలతో పాటు ఆవనూనె, పప్పులు, పంచదార సబ్సిడీపై అందజేత.
- అర్హులైన కుటుంబాలకు పీఎం ఆవాస్ యోజన, సీఎం జన్ ఆవాస్ యోజన కింద ఇళ్ల నిర్మాణం.
- రాష్ట్రంలో 13 సాంస్కృతిక కారిడార్ల ఏర్పాటు. శక్తి పీఠాల నవీకరణ
- మధ్యప్రదేశ్ ఆర్థిక వ్యవస్థను ఏడేళ్లలో రూ.45 లక్షల కోట్లకు పెంచడం.
- ప్రజల ఆదాయాన్ని రెట్టింపు చేయడం, రూ.20 లక్షల కోట్ల పెట్టుబడులను రప్పించడం.
- ప్రతి లోక్‌సభ నియోజకవర్గానికి ఒక వైద్య కళాశాల మంజూరు. అదనంగా 2వేల మెడికల్ సీట్ల మంజూరు.
- ప్రతి జిల్లాలో ఒక నర్సింగ్ కళాశాల స్థాపన.



సాక్షి హైదరాబాద్

ఆదివారం । 12 । నవంబర్ । 2023

రాష్ట్రంలో ఖరీదైన నియోజకవర్గం శేరిలింగంపల్లిలో పోటీ చేస్తున్న మూడు ప్రధాన పార్టీల అభ్యర్థుల స్థిరచరాస్తుల విలువ అక్షరాలా రూ.309 కోట్ల పైమాటే. గ్రేటర్‌లోని అభ్యర్థుల్లో అత్యధిక ఆస్తులున్న అభ్యర్థి రవికుమార్ యాదవ్‌దే. శేరిలింగంపల్లిలో బీజేపీ తరఫున బరిలోకి దిగిన ఆయన ఆస్తుల విలువ రూ.151 కోట్లు. ఇదే సెగ్మెంట్‌లో కాంగ్రెస్ అభ్యర్థి జగదీశ్వర్ గౌడ్ ఆస్తులు 113.20 కోట్లు, బీఆర్ఎస్ నుంచి పోటీ చేస్తున్న అరికెపూడి గాంధీ ఆస్తులు 44.79 కోట్లు. గోషామహల్ బీజేపీ అభ్యర్థి రాజాసింగ్ ఆస్తుల కంటే కేసులే ఎక్కువగా ఉన్నాయి. ఆయనపై 75 కేసులుండగా.. రెండింట్లో శిక్ష కూడా ఖరారు కావడం గమనార్హం. ఎన్నికల సంఘానికి సమర్పించిన అఫిడవిట్ల ప్రకారం గ్రేటర్ అభ్యర్థుల స్థిరచరాస్తులు, అప్పుల వివరాలివే. – సాక్షి, సిటీబ్యూరో

సిరిమంతులు!

- శేరిలింగంపల్లిలో ముగ్గురు అభ్యర్థుల ఆస్తులు రూ.309 కోట్లు
- రూ.151 కోట్ల ఆస్తులతో అగ్రస్థానంలో రవికుమార్ యాదవ్
- ఒక్క రూపాయి రుణం లేని సబిత, మైనంపల్లి, మాగంటి
- దానం, పైలెట్, రామచంద్రారెడ్డిలకు ఆస్తుల కంటే అప్పులే ఎక్కువ
- రాజాసింగ్‌పై అత్యధికంగా 75 కేసులు: రెండింట్లో శిక్ష ఖరారు

ఆస్తుల కంటే అప్పులెక్కువ..

సొంత కారు కూడా లేని దానం నాగేందర్‌కు ఆస్తి కంటే అప్పు ఎక్కువ. ఈయనతో పాటు ఖైరతాబాద్ అభ్యర్థి రామచంద్రారెడ్డి, తాండూరు అభ్యర్థి పైలెట్‌లకూ అంతే. దానంకు రూ.41.33 కోట్ల విలువ చేసే ఆస్తులుండగా.. రూ.47.55 కోట్లు అప్పు ఉంది. రామచంద్రారెడ్డికి రూ.8.60 కోట్లు స్థిరచరాస్తులు ఉండగా.. 8.43 కోట్లు రుణం ఉంది. పైలెట్ రోహిత్ రెడ్డికి రూ.2 కోట్ల విలువ చేసే ఆస్తులుండగా.. రూ.2.62 కోట్ల అప్పు ఉంది. మహేశ్వరం నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ కండువాతో బరిలోకి దిగిన ప్రముఖ బిల్డర్ లక్ష్మారెడ్డికి ఆస్తులు లక్షల్లో ఉంటే.. అప్పు కోట్లలో ఉంది. ఆయన ఆస్తుల మార్కెట్ విలువ రూ.30.75 లక్షలు కాగా.. రూ.5.98 కోట్ల రుణం ఉంది.

ఒక్క రూపాయి అప్పు లేదు..

మహేశ్వరం బీఆర్ఎస్ అభ్యర్థి సబితా ఇంద్రారెడ్డికి రూ.7.97 కోట్ల విలువ చేసే స్థిరచరాస్తులు ఉండగా. ఒక్క రూపాయి కూడా అప్పు లేదు. ఈమెతో పాటు మర్రి శశిధర్ రెడ్డి, మైనంపల్లి హన్మంతరావు, మధుయాష్కీ, మంచిరెడ్డి కిషన్‌రెడ్డి, మాగంటి సునీత, మాధవరం కృష్ణారావులకు అప్పు లేదు.

అభ్యర్థులు.. ఆస్తులు.. అంతస్తులు..

- **మర్రి శశిధర్ రెడ్డి** – సనత్‌నగర్ (బీజేపీ)
  స్థిరచరాస్తులు: రూ.24 కోట్లు
  అప్పు: లేదు
- **తలసాని శ్రీనివాస్ యాదవ్** – సనత్‌నగర్ (బీఆర్ఎస్)
  స్థిరచరాస్తులు: రూ.24.32 కోట్లు
  అప్పు: రూ.8.25 కోట్లు
- **అక్బరుద్దీన్ ఒవైసీ** – చాంద్రాయణగుట్ట (ఎంఐఎం)
  స్థిరచరాస్తులు: రూ.4.50 కోట్లు
  అప్పు: రూ.2.89 లక్షలు
- **సబితా ఇంద్రారెడ్డి** – మహేశ్వరం (బీఆర్ఎస్)
  స్థిరచరాస్తులు: రూ.7.97 కోట్లు
  అప్పు: లేదు
- **చామకూర మల్లారెడ్డి** – మేడ్చల్ (బీఆర్ఎస్)
  స్థిరచరాస్తులు: రూ.41.40 కోట్లు
  అప్పు: రూ.2.90 కోట్లు
- **మర్రి రాజశేఖర్ రెడ్డి** – మల్కాజిగిరి (బీఆర్ఎస్)
  స్థిరచరాస్తులు: రూ.34.19 కోట్లు
  అప్పు: రూ.6 కోట్లు
- **మైనంపల్లి హన్మంతరావు** – మల్కాజిగిరి (కాంగ్రెస్)
  స్థిరచరాస్తులు: రూ.3.82 కోట్లు
  అప్పు: లేదు
- **మంచిరెడ్డి కిషన్‌రెడ్డి** – ఇబ్రహీంపట్నం (బీఆర్ఎస్)
  స్థిరచరాస్తులు: రూ.42.51 కోట్లు
  అప్పు: లేదు
- **కేపీ వివేకానంద** – కుత్బుల్లాపూర్ (బీఆర్ఎస్)
  స్థిరచరాస్తులు: రూ.18.51 కోట్లు
  అప్పు: రూ.5.39 కోట్లు
- **సామ రంగారెడ్డి** – ఎల్బీనగర్ (బీజేపీ)
  స్థిరచరాస్తులు: రూ.15.45 కోట్లు
  అప్పు: రూ.14.44 లక్షలు
- **మధుయాష్కీ** – ఎల్బీనగర్ (కాంగ్రెస్)
  స్థిరచరాస్తులు: రూ.21.75 కోట్లు
  అప్పు: లేదు
- **దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి** – ఎల్బీనగర్ (బీఆర్ఎస్)
  స్థిరచరాస్తులు: రూ.4.03 కోట్లు
  అప్పు: రూ.23 లక్షలు
- **మహ్మద్ అజహరుద్దీన్** – జూబ్లీహిల్స్ (కాంగ్రెస్)
  స్థిరచరాస్తులు: రూ. 7.04 కోట్లు
  అప్పు: రూ.2.07 కోట్లు
- **బండి రమేష్** – కూకట్‌పల్లి (కాంగ్రెస్)
  స్థిరచరాస్తులు: రూ.55.41 కోట్లు
  అప్పు: రూ.16.54 కోట్లు



సభా వేదికపై కళాకారుల ఆటాపాట

మోదీ.. ఎ.బి.సి.డి



ఎస్సీ వర్గీకరణ నినాదాలతో సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్ దద్దరిల్లింది. జై మాదిగ నినాదాలతో.. డప్పు దరువులతో మార్మోగింది. ప్రధాని మోదీ, మందకృష్ణ మాదిగ భావోద్వేగ సన్నివేశాలు.. ఉద్విగ్న క్షణాలు.. ఉత్తేజభరిత ప్రసంగాలతో ప్రాంగణం హోరెత్తింది. దండోరా నాట్యమాడింది. ఏబీసీడీ వర్గీకరణ నినాదం జనరంజితమైంది. ప్రధాని హామీలతో మాదిగల్లో ఆత్మవిశ్వాసం ఇనుమడించింది. శనివారం తెలుగు రాష్ట్రాల్లోని వివిధ ప్రాంతాల నుంచి వేలాదిగా తరలి వచ్చిన మాదిగలు నగర వ్యాప్తంగా కదం తొక్కారు. ఎస్సీ వర్గీకరణను వెంటనే ప్రారంభించాలని నినదించారు. విశ్వరూప మహాసభను విజయవంతం చేశారు. –సాక్షి, సిటీబ్యూరో

చుక్కల్లో చక్రాలు!

ఎలక్షన్ ఎజెండా..

మహా నగరంలో అరకొరగా ప్రజా రవాణా

- సిటీ బస్సులు, ఎంఎంటీఎస్ తగ్గుముఖం
- గ్రేటర్‌లో 80 లక్షలు దాటిన వ్యక్తిగత వాహనాలు
- మెట్రో విస్తరణపైనే భవిష్యత్‌లో ఆశలు
- అధికారంలోకి వచ్చే పార్టీ నేతలు దృష్టి సారిస్తారా?

సాక్షి, సిటీబ్యూరో: ఏ ఎన్నికలు వచ్చినా రాజకీయ పార్టీలు ప్రజా సమస్యల పరిష్కారాన్నే ప్రధాన ఎజెండాగా ప్రకటిస్తాయి. హామీలు గుప్పిస్తాయి. ఎన్నికల్లో గెలిచిన తర్వాత ఏ మేరకు పరిష్కారం లభిస్తుంది? ఇచ్చిన హామీలు ఎంతవరకు అమలుకు నోచుకుంటాయి? అనే సంగతి పక్కనపెడితే ఎన్నికల వేళ ప్రజల దైనందిన జీవితాన్ని ప్రభావితం చేసే అనేక అంశాలు మాత్రం ప్రధానంగా చర్చనీయాంశం కావడం విశేషం. గ్రేటర్ హైదరాబాద్‌లో ప్రతీ సంవత్సరం నగరవాసులు ఎదుర్కొనే వర్ష బీభత్సం, వరదలు, ముంపు బాధితుల సమస్యలతో పాటు విస్తరణకు నోచుకోని ప్రజా రవాణా కూడా ఓ ప్రధానమైన సమస్యగానే మిగిలింది. గ్లోబల్ సిటీగా అవతరించిన నగరంలో ప్రజా రవాణా సదుపాయాలు ఇంకా అరకొరగానే ఉన్నాయి. ఈ ఎన్నికల్లో హైదరాబాద్‌లో ప్రజారవాణాకు పట్టం కట్టేదెవరు? అనేది కూడా ప్రధానమైన ఎజెండాగా చర్చల్లో ఉంది.



భారీగా తగ్గిన సిటీ బస్సులు..

- గ్రేటర్‌లో ఒక వైపు వాహన విస్ఫోటనం తారస్థాయికి చేరింది. కోటిన్నర దాటిన నగర జనాభాలో సుమారు 80 లక్షలకుపైగా వ్యక్తిగత వాహనాలు ఉన్నాయి. రోడ్లు, ఫ్లైఓవర్లను విస్తరించినప్పటికీ రోజు రోజుకు పెరుగుతున్న వాహనాల వినియోగం దృష్ట్యా ట్రాఫిక్ రద్దీ అతి పెద్ద సవాల్‌గా మారింది. రహదారులపై గంటల తరబడి వాహనాలు నిలిచిపోవడం నిత్యకృత్యమైంది. ఈ క్రమంలో మెట్రో, ఎంఎంటీఎస్ రైళ్ల కంటే నగరంలోని ప్రతీ మూలకు చేరుకొనేందుకు అవకాశం ఉన్న సిటీ బస్సుల సంఖ్య భారీగా తగ్గుముఖం పట్టడం అతి పెద్ద సమస్యగా మారింది. ఇప్పటి వరకు 72 కి.మీ మేర మెట్రో సేవలను విస్తరించినా నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి మెట్రో రైల్‌కు కనెక్టివిటీ లేకపోవడంతో ప్రజలు యథావిధిగా సొంత వాహనాలపై ఆధారపడాల్సివస్తోంది.
- నగరంలోని 29 డిపోల పరిధిలో గతంలో నిత్యం 3,850కి పైగా సిటీ బస్సులు నడిచేవి. ఇప్పుడు వీటి సంఖ్య 2,500కు పడిపోయింది. నిజానికి ఈ పదేళ్లలో నగరం శరవేగంగా విస్తరించింది. ఔటర్ వెలుపల వందలాది కాలనీలు కొత్తగా ఏర్పడ్డాయి. సిటీ బస్సులు మాత్రం అందుబాటులో లేవు. రవాణా రంగానికి చెందిన నిపుణుల అంచనాల మేరకు నగర జనాభా అవసరాల మేరకు కనీసం 10 వేల బస్సులు అవసరం. ఇప్పటికిప్పుడు 6 వేల బస్సులు కావాలి.

ఎంఎంటీఎస్ నిర్వీర్యం..

- రైల్వేశాఖ, రాష్ట్ర ప్రభుత్వ నిధులతో 2003లో ఆరంభమైన ఎంఎంటీఎస్ సేవలు రోజురోజుకు నీరుగారిపోతున్నాయి. ఇంచుమించు 10 ఏళ్లుగా ఎంఎంటీఎస్ రెండో దశ విస్తరణ కొనసాగుతోంది. ఇప్పటికీ పూర్తిస్థాయిలో రెండో దశ రైళ్లు అందుబాటులోకి రాలేదు. యాదాద్రి వరకు రైళ్లను విస్తరించడంతో భక్తులతో పాటు, సాధారణ ప్రజల రాకపోకలకు కూడా ఎంతో సౌలభ్యంగా ఉంటుంది. నగర శివార్లలో రాకపోకలు సాగించేందుకు అతి తక్కువ చార్జీల్లో ఎంఎంటీఎస్ సేవలు లభిస్తాయి. కానీ ఇప్పటి వరకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య సమన్వయం లేకపోవడంతో ఈ ప్రాజెక్టు పూర్తిగా నిర్వీర్యమవుతోంది. ఒకప్పుడు 1.5 లక్షల మంది ఎంఎంటీఎస్ సేవలను వినియోగించుకుంటే ఇప్పుడు ఈ సంఖ్య 30 వేల నుంచి 40 వేలకు పడిపోయింది.
- ప్రమాదకర స్థాయికి చేరుకున్న వాహన కాలుష్యానికి సహజ ఇంధనాలు, ఎలక్ట్రిక్ వాహనాలే ఏకైక పరిష్కారం. విద్యుత్ చార్జింగ్ సదుపాయం అందుబాటులో లేకపోవడం, ఎలక్ట్రిక్ వాహనాలకు సముచితమైన ప్రోత్సాహం లభించకపోవడంతో ప్రజలు పెట్రోల్, డీజిల్ వాహనాలనే ఎక్కువగా వినియోగిస్తున్నారు. గత రెండేళ్లుగా ఎలక్ట్రిక్ కార్లు, బైక్‌ల వినియోగం పెరిగింది. చార్జింగ్ కేంద్రాలు లేకపోవడంతో ఎక్కువ మంది వీటిని వినియోగించేందుకు వెనుకడుగు వేస్తున్నారు. మరోవైపు ఎలక్ట్రిక్ కార్లపై తిరిగి జీవితకాల పన్ను విధించడంతోనూ కొనుగోళ్లు తగ్గుముఖం పట్టాయి.

మెట్రోదే భవిత..

- మెట్రో విస్తరణపైనే హైదరాబాద్ ప్రజా రవాణా భవిష్యత్ ఆధారపడి ఉంది. ప్రస్తుతం 72 కిలోమీటర్ల వరకే మెట్రో ఉంది. 5 లక్షల మంది మెట్రో సేవలను వినియోగించుకుంటున్నారు. ప్రజా రవాణా రంగానికి చెందిన నిపుణుల అంచనాల మేరకు ఇప్పటికే హైదరాబాద్‌లో సుమారు 250 కి.మీ వరకు మెట్రో సేవలను విస్తరించాల్సి ఉంది.
- రాయదుర్గం నుంచి ఎయిర్‌పోర్టు వరకు అక్కడి నుంచి కందుకూరు వరకు, ఇటు ఈసీఐఎల్ వరకు, అటు శామీర్‌పేట్ వరకు మరోవైపు ఘట్కేసర్ వరకు దశలవారీగా మెట్రో విస్తరించేందుకు ప్రస్తుత ప్రభుత్వం ప్రణాళికలను రూపొందించింది. కానీ భవిష్యత్తులో అధికారంలోకి రానున్న ఏ పార్టీ అయినా మెట్రో విస్తరణకు కట్టుబడి ఉంటేనే ప్రజలకు మెరుగైన, నాణ్యమైన ప్రజారవాణా సదుపాయం లభిస్తుంది. అప్పుడు మాత్రమే హైదరాబాద్ మహానగరం అంతర్జాతీయ నగరాల సరసన గ్లోబల్ సిటీగా నిలుస్తుంది.

పబ్లి‘సిటీ’ బాంబ్స్!



దీపావళి తర్వాత సైతం ప్రతిపక్షాలపై విమర్శల బాంబులు

- గ్రేటర్ పరిధిలో ముమ్మరం కానున్న బీఆర్ఎస్ ప్రచారం
- 17 నుంచి కేటీఆర్ పర్యటనలు
- రోజుకు రెండు నియోజక వర్గాల్లో రోడ్‌షోలు

సాక్షి, సిటీబ్యూరో: దీపావళి పండగ తర్వాత ప్రజల ఇళ్లముందు మతాబుల వెలుగులు, పరిసరాల్లో బాంబుల మోతలు ఆగిపోనున్నాయి. కానీ.. వాటిని మించి వైరిపక్షాలపై మాటల తూటాలు.. విమర్శల బాంబులు దాదాపు నెలాఖరు వరకు పేలనున్నాయి. ఎదుటి వారిపై వీటిని విసిరేందుకు తగిన ప్రచార మందుగుండును సామగ్రి సిద్ధం చేసుకున్న నేతలు ఇక వాటిని వినియోగించనున్నారు. అధికార బీఆర్ఎస్ నేతలు ఇప్పటికే తాము చేసిన అభివృద్ధి కార్యక్రమాల కాకర పువ్వొత్తులు, సంక్షేమ కార్యక్రమాల మతాబులను వెలిగించనున్నారు. బీసీ బంధు, కల్యాణలక్ష్మి వంటి పథకాల ద్వారా ఆయా కుటుంబాల్లోని వెలుగు రేఖల్ని భూచక్రాలు, విష్ణుచక్రాల మాదిరిగా ప్రదర్శించనున్నారు. ప్రచార సభల్లో, బస్తీ పర్యటనల్లో, కాలనీ సమావేశాల్లో ఇవి ప్రతిబింబించనున్నాయి. విమర్శలు, ప్రతివిమర్శల రాకెట్లు దూసుకుపోనున్నాయి. అవినీతి బాంబులూ మోతెక్కిపోనున్నాయి. ఎవరికి వారుగా వైరిపక్షాల నరకాసుర ఆలోచనల నుంచి ప్రజలకు మేలు చేసే దీపావళి కోసం తమకు ఓటు వేయమని నేతలు విజ్ఞప్తులు చేయనున్నారు.

బీఆర్ఎస్ ప్రచారం ప్రారంభం

నామినేషన్ల ఘట్టం ముగిసిపోవడంతో ఎన్నికల రంగంలోని నేతలంతా ప్రచారంపై ప్రత్యేక దృష్టి సారించనున్నారు. సుడిగాలి పర్యటనలతో అన్ని ప్రాంతాల్లోని ప్రజలనూ చుట్టి రానున్నారు. ఇందులో భాగంగా బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు, మున్సిపల్ మంత్రి కేటీఆర్ రాష్ట్రంలోని ఇతర జిల్లాలతోపాటు గ్రేటర్ పరిధిలోని వివిధ నియోజకవర్గాల్లో ప్రచారం నిర్వహించనున్నారు. రోడ్‌షోలు చేయనున్నారు. కాలనీ సంఘాలు, రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్లతో సమావేశం కానున్నారు. ఇందులో భాగంగా ఇప్పటికే కొన్ని కార్యక్రమాలు నిర్వహించారు. తాజాగా శనివారం జేఆర్‌సీ కన్వెన్షన్ సెంటర్‌లో నిర్వహించిన రెసిడెంట్ వెల్ఫేర్ అసోసియేషన్ల ప్రతినిధుల సమావేశంలో పాల్గొన్నారు. గత అసెంబ్లీ ఎన్నికలతోపాటు జీహెచ్ఎంసీ ఎన్నికల్లోనూ ప్రచారానికి ఇదే విధానాన్ని అమలు చేశారు.

ప్రతిపక్షాలు సైతం

ప్రతిపక్ష పార్టీలు కాంగ్రెస్, బీజేపీలు సైతం ప్రచారాలకు ఏర్పాట్లు చేసుకుంటున్నాయి. ప్రభుత్వం ఏమీ చేయలేదనే విమర్శలతో పాటు తాము చేయబోయే సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల గురించి ఆ పార్టీల నేతలు ఎక్కువగా ప్రచారం చేయనున్నట్లు తెలుస్తోంది. ఆ పార్టీల రాష్ట్ర, జాతీయస్థాయి నేతలు సైతం ప్రచార కార్యక్రమాల్లో పాల్గొననున్నారు.

కేటీఆర్ టూర్ ఇలా..

మున్సిపల్, ఐటీ శాఖల మంత్రి కె.తారక రామారావు ఈ నెల 17వ తేదీ నుంచి 20వ తేదీ వరకు రోజూ రెండు నియోజకవర్గాల్లో కోర్‌సిటీలో రోడ్ షోలు నిర్వహించనున్నారు. సాయంత్రం 5 గంటల నుంచి ఒక నియోజకవర్గంలో రాత్రి 7 గంటల నుంచి మరో నియోజకవర్గంలో ఈ రోడ్‌షోల్లో పాల్గొననున్నారు. వివరాలిలా ఉన్నాయి.

తేదీ	నియోజకవర్గాలు
17	జూబ్లీహిల్స్, ఖైరతాబాద్
18	గోషామహల్, సికింద్రాబాద్
19	అంబర్‌పేట, ముషీరాబాద్
20	కంటోన్మెంట్, సనత్‌నగర్

వీటితోపాటు ఆయా తేదీల్లో శివారు నియోజకవర్గాల్లోనూ పర్యటించనున్నారు. కేటీఆర్ ఈ రోడ్‌షోలతో పాటు ఈ నెల 25వ తేదీన ముఖ్యమంత్రి పాల్గొనే బహిరంగ సభను నగరంలో నిర్వహించనున్నారు.

దీపావళి.. ఆనంద రవళి



చార్మినార్‌లో మట్టి ప్రమిదలు

సంబరాల వెలుగుల్ని అందించేందుకు ఆనంద దీపావళి అరుదెంచింది. ముంగిళ్లన్నీ దీప కాంతులతో మురిసిపోనున్నాయి. నగరంలో పండగ సందడి నెలకొంది. బాణాసంచా, స్వీట్లు, మట్టి ప్రమిదలు, పూలు, పండ్లు, బంగారం కొనుగోళ్లతో మార్కెట్లు కిటకిటలాడుతున్నాయి. బొమ్మల కొలువులు.. దివ్వెల వెలుగులతో ఇళ్లన్నీ నూతన శోభను సంతరించుకోనున్నాయి.



బేగంబజార్‌లో బాణా సంచా కొనుగోళ్లు



హిమాయత్ నగర్‌లో స్వీట్ షాపులో విక్రయాలు

నామినేషన్లు ఇలా..

సాక్షి, సిటీబ్యూరో: హైదరాబాద్ జిల్లాలోని 15 అసెంబ్లీ నియోజకవర్గాలకు గాను 438 మంది అభ్యర్థులు నామినేషన్లు వేశారు. వీరిలో కొందరు ఒకటి కంటే ఎక్కువ నామినేషన్ సెట్లు దాఖలు చేశారు. నాంపల్లి నుంచి అత్యధికంగా 45 మంది అభ్యర్థులు నామినేషన్లు వేయగా, అత్యల్పంగా బహదూర్‌పురా నుంచి 16 మంది అభ్యర్థులు మాత్రమే నామినేషన్లు వేశారు.

మేడ్చల్ జిల్లాలో 310..

మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా పరిధిలోని అయిదు అసెంబ్లీ నియోజకవర్గాల్లో మొత్తం 310 నామినేషన్లు దాఖలయ్యాయి. ఇందులో మేడ్చల్ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి అత్యధికంగా 116 నామినేషన్లు దాఖలు కాగా, మల్కాజిగిరి అసెంబ్లీ స్థానంలో 51, కూకట్‌పల్లిలో 47, ఉప్పల్‌లో 52, కుత్బుల్లాపూర్ అసెంబ్లీ నియోజకవర్గంలో 44 నామినేషన్లు దాఖలయ్యాయి.

రంగారెడ్డిలో 280..

రంగారెడ్డి జిల్లాల్లో ఎనిమిది నియోజకవర్గాల నుంచి 280 మంది అభ్యర్థులు నామినేషన్లు వేశారు. వీరిలో ఇబ్రహీంటపట్నం నియోజకవర్గం నుంచి 39 మంది, ఎల్బీనగర్ నుంచి 62 మంది, మహేశ్వరం నుంచి 34 మంది, రాజేంద్రనగర్ నుంచి 33 మంది, శేర్‌లింగంపల్లి నుంచి 41 మంది, చేవెళ్ల నుంచి 19 మంది, కల్వకుర్తి నుంచి 28 మంది, షాద్‌నగర్ నుంచి 24 మంది అభ్యర్థుల చొప్పున నామినేషన్లు దాఖలు చేశారు.

కొత్త ఓటర్లు 93,990 మంది



గత నెల అక్టోబర్ 5 నుంచి 31వ తేదీ వరకు హైదరాబాద్ జిల్లాలో కొత్తగా 93,990 మంది తమ పేరును ఓటరు జాబితాలో నమోదు చేయించుకున్నారు. సెకండ్ సమ్మరీ రివిజన్‌లో భాగంగా అక్టోబర్ 4న వెలువరించిన తుది జాబితాలో జిల్లాలో 44,42,862 మంది ఓటర్లుండగా, ఆ తర్వాత ఓటరుగా నమోదుకోసం దరఖాస్తు చేసుకున్న వారిలో అర్హులైన 93,990 మందిని జాబితాలో చేర్చారు. దీంతో జిల్లాలో ఓటర్ల సంఖ్య 45,36,852కు చేరింది. వీరందరూ ఈ నెల 30న జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో ఓటు వేయవచ్చు. తాజాగా వెలువరించిన వివరాల మేరకు హైదరాబాద్ జిల్లాలో ఓటర్ల వివరాలిలా ఉన్నాయి. పురుషులు : 23,22,623, మహిళలు: 22,13,902, థర్డ్‌జెండర్: 327, మొత్తం ఓటర్లు: 45,36,852. కాగా ఓటర్లలో ఎన్ఆర్ఐలు 883 మంది, సర్వీసు ఓటర్లు 404 మంది ఉన్నారు. దివ్యాంగులు 20,207 మంది, 80 ఏళ్ల వయసు పైబడిన సీనియర్ సిటిజెన్లు 80,037 మంది ఉన్నట్లు హైదరాబాద్ జిల్లా ఎన్నికల అధికారి రోనాల్డ్‌రాస్ ఒక ప్రకటనలో తెలిపారు. – సాక్షి, సిటీబ్యూరో

కారుకు రాథోడ్ రాంరాం..



మాజీ ఎమ్మెల్యే, గోషామహల్ నియోజకవర్గ బీఆర్ఎస్ నాయకుడు ప్రేమ్‌సింగ్ రాథోడ్ బీజేపీలో చేరారు. గోషామహల్ నుంచి బీఆర్ఎస్ టికెట్ ఆశించిన ఆయనకు అది దక్కకపోవడంతో శనివారం పార్టీకి రాజీనామా చేశారు. సాయంత్రం కేంద్రమంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి సమక్షంలో బీజేపీ తీర్థం పుచ్చుకున్నారు. కార్యక్రమంలో గోషామహల్ ఎమ్మెల్యే బీజేపీ అభ్యర్థి రాజాసింగ్ తదితరులు పాల్గొన్నారు. –అబిడ్స్

జీతే రహో బేటా!

బోరబండ డివిజన్ బంజారానగర్‌లో జూబ్లీహిల్స్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి మహమ్మద్ అజహరుద్దీన్ శనివారం ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి తనకు ఓటు వేయాలని అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఓ ముస్లిం వృద్ధ మహిళ జీత్‌రహో బేటే అంటూ అజహరుద్దీన్‌ను ఆశీర్వదించారు. – రహమత్‌నగర్



జూపార్క్‌కు ఐఎస్‌ఓ సర్టిఫికెట్

వరుసగా నాలుగోసారి

బహదూర్‌పురా: నెహ్రూ జూలాజికల్ పార్కు ప్రణాళికబద్ధమైన మెరుగైన నిర్వహణ, వన్యప్రాణుల సంరక్షణ, అంతరించిపోతున్న వన్యప్రాణుల సంతానోత్పత్తితో పాటు జూలో చేపట్టిన పలు కార్యక్రమాలకు జూపార్కుకు నాలుగోసారి హెచ్‌వైఎం ఇంటర్నేషనల్ సర్టిఫికెట్ లభించింది. జూపార్కులో ఆన్‌లైన్ టికెట్ విధానాన్ని అమలు చేస్తున్నందుకు ఈ సర్టిఫికెట్ లభించిందని జూపార్కు అధికారులు పేర్కొన్నారు. వరుసగా నాలుగోసారి జూపార్క్‌కు అంతర్జాతీయ ప్రమాణాల సర్టిఫికెట్ లభించడం అభినందనీయమన్నారు. ఈ సర్టిఫికెట్‌ను హెచ్‌వైఎం మేనేజింగ్ డైరెక్టర్ ఎ.శివయ్య జూపార్కు క్యూరేటర్ హిరేమత్‌కు అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ సునీల్ మాట్లాడుతూ... అంతరించిపోతున్న వన్యప్రాణుల సంరక్షణ, మెరుగైన నిర్వహణ ద్వారా వన్యప్రాణులను సంరక్షిస్తూ ప్రణాళికబదద్ధమైన సంతానోత్పత్తి, పరిశోధన, సామర్థ్యాన్ని పెంపొందించడం తదితర కార్యక్రమాలను జూ పార్కులో కొనసాగించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.



ఐఎస్‌ఓ సర్టిఫికెట్‌ను క్యూరేటర్‌కు అందజేస్తున్న హెచ్‌వైఎం ప్రతినిధులు

పార్సిల్‌లో బుల్లెట్ పంపి ..

- తోటి వ్యాపారికి బెదిరింపులు
- ఇద్దరి అరెస్ట్

చాంద్రాయణగుట్ట: వ్యాపారంలో వచ్చిన నష్టాల నుంచి బయట పడేందుకు తోటి వ్యాపారికి పార్సిల్‌లో బుల్లెట్ పంపి బెదిరింపులకు పాల్పడిన ఘటనలో ఇద్దరు వ్యక్తులను చాంద్రాయణగుట్ట పోలీసులు అరెస్ట్ చేసి శనివారం రిమాండ్‌కు తరలించారు. ఇన్‌స్పెక్టర్ గురునాథ్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. చాంద్రాయణగుట్టలో మంద మోహన్ రెడ్డి అనే వ్యక్తి ఎంఆర్‌ఎఫ్ టైర్స్ షోరూం నిర్వహిస్తున్నాడు. ఇతని మాదిరిగానే మహ్మద్‌నగర్‌లో ఫిరోజ్ ఖాన్ కూడా 'ఖాన్ సాబ్ డీలర్ మల్టీ బ్రాండ్ టైర్స్' పేరుతో దుకాణాన్ని నిర్వహించేవాడు. వ్యాపారంలో నష్టం రావడంతో అప్పులపాలయ్యాడు. వాటి నుంచి గట్టెక్కేందుకు మోహన్ రెడ్డిని బెదిరించి డబ్బులు వసూలు చేయాలని నిర్ణయించుకున్నాడు. ఇందులో భాగంగా మోహన్ రెడ్డికి ఇంటర్నెట్ కాల్ చేసి 'ధనం-గుప్త నిధులు' ఉన్నాయని బెదిరించి డబ్బులు డిమాండ్ చేశాడు. ఇందుకు గాను అదే ప్రాంతానికి చెందిన సాలంకి విఠల్ రావు సహాయం కోరారుడ. రుణదాతల నుంచి ప్రాణహాని ఉందని దేశవాళీ తుపాకీ తెచ్చివ్వాలని కోరుతూ రూ.80 వేలు ఇవ్వడంతో అతను నాసిక్ నుంచి అతడు పిస్తోల్ తెచ్చిఇచ్చాడు. పథకంలో భాగంగా పార్సిల్‌లో బుల్లెట్‌ను పంపిన ఫిరోజ్ ఖాన్ రూ.50 లక్షలు ఇవ్వకపోతే చంపేస్తామని మోహన్ రెడ్డికి ఫోన్ చేసి బెదిరించాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టిన పోలీసులు ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. వారి నుంచి దేశవాళీ పిస్తోల్, ఫోర్డ్ కారు, మూడు సెల్‌ఫోన్లు, రూ.10 వేల నగదు స్వాధీనం చేసుకున్నారు.సమావేశంలో డీఐ కె.రఘు కుమార్ తదితరులు పాల్గొన్నారు.



వివరాలు వెల్లడిస్తున్న ఇన్‌స్పెక్టర్ గురునాథ్

సమాజ సేవకు పాటు పడాలి



డాక్టర్ షహనాజ్‌ను సత్కరిస్తున్న దామోదర్ గుప్తా

హిమాయత్‌నగర్: ప్రతి ఒక్కరూ సమాజ సేవకు పాటు పడాలని తెలంగాణ రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ కోలేటి దామోదర్ గుప్తా అన్నారు. శనివారం బషీర్‌బాగ్‌లోని దేవోద్ధారక భవన్‌లో డాక్టర్ షహనాజ్ సంఘ సేవకురాలిగా మూడు ప్రపంచ రికార్డులు పొందిన సందర్భంగా భారత్ ఆర్ట్స్ అకాడమీ, ఏబీసీ ఫౌండేషన్ సంస్థల ప్రతినిధి లయన్ డాక్టర్ కె.వి.రమణారావు అధ్యక్షతన ఆత్మీయ సత్కార కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా హాజరైన కోలేటి దామోదర్ గుప్తా, జస్టిస్ అల్తాఫ్ హుస్సేన్ ఆమెను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... సమాజ సేవలో షహనాజ్ ముందు వరుసలో నిలవడం అభినందనీయమన్నారు. ప్రతి ఒక్క మహిళ షహనాజ్‌ను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. దైవాజ్ఞ శర్మ మాట్లాడుతూ నేటి ఆధునిక యుగంలో సేవా కార్యక్రమాలు చేసే వారు చాలా తక్కువ అని, ఇటువంటి మహిళలను ప్రభుత్వాలు ప్రోత్సహించాలన్నారు. లయన్ డాక్టర్ కేవీ రమణారావు మాట్లాడుతూ ప్రైవేట్ స్కూల్లో టీచర్‌గా పనిచేస్తున్న షహనాజ్ స్కాట్ అండ్ గాైడ్స్‌లో ఉచిత శిక్షణ అందిస్తూ చేస్తున్న సేవా కార్యక్రమాలు గుర్తించి అవార్డులు అందజేసినట్లు తెలిపారు. షహనాజ్ మాట్లాడుతూ... భవిష్యత్‌లో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపడతామన్నారు.

సాక్షి సండే క్లాసిఫైడ్స్

Education

■ జనవరి, మార్చి, ఏప్రిల్ పరీక్షల్లో 10th, ఇంటర్, డిగ్రీ, డిప్లొమా, పీజీ 100% పాస్ గ్యారంటీ. ఫెయిలైతే రీకౌంటింగ్ సౌకర్యం ద్వారా పాస్. ఫైన్‌తో అడ్మిషన్స్ కలవు. Ph: 6305979755 [H-793423]

Real Estate

■ ఉచితంగా ప్లాట్లు/భూమిని పొందడానికి సరైన సువర్ణ అవకాశము. ఈ అవకాశం నవంబర్ 30 వరకు మాత్రమే. Hyd సరౌండింగ్. Ph: 8019106121 [H-788348]

COMMERCIAL

■ Kondapur: 365 Sft fully furnished Studio Flats with Rs.15,000 Guaranteed Rentals from Day one 9440427842, 9908080841 [HA-31152]

FOR SALE

■ మియాపూర్ ప్రైమ్ లొకేషన్‌లో డూప్లెక్స్ విల్లాలో నెలకి 2 లక్షల ఆదాయం వచ్చే బ్యూటీపార్లర్ రన్నింగ్‌లో ఉన్న ఫర్నిచర్‌తో సేల్‌కి కలదు. ✆ 73309 49413 [B-1206434]

FLAT FOR SALE

■ 3BHK Flat for sale, Semi Furnished 2 Car Parking at PSR Pride Near Canton Row House, Kompally. Cont: 6302561690 [H-189448]

■ 1 BHK Flat for sale Malkajgiri Vishnupuri colony Modular Kitchen, Fully Interior 3rd Floor No Lift, Only 20 Lakhs. Ph: 9618033817 [H-788209]

■ 3 Bed Room Flats for Sale 400 Yards land [6 Flats only] East Facing Masabtank Cell: 9849306939 [HA-06669]

■ New Flat, Gated Community, Ready to Occupy, 1455 sft, 2 BHK with Car Parking, SMR Vinay Iconia, Kondapur. 8977064455 [H-189434]

■ '0' Kms from SEZ Financial Dist, Gachibowli, Hyd. Luxury Gated Apartments, 2 / 3 / 4 BHK Flats for Sale. Near Google, Amazon etc., Ph : 9849025003. [HA-11785]

■ Newly Constructed 3BHK flat 1,415 sft E/W Ready to occupation @ Hanumannagar near TKR Engg College,Karmanghat, Lift, Generator Ph: 9391021558 [HA-1780]

■ OU Colony, Lanco Hills Road, Aditya Athena, Gated Community, North Facing, 3BHK New Flat, 12th Floor, 2435 Sft, Ready to Occupy, with All Amenities, 2 Car Parking. Ph: 9398810295 [HA-784]

■ 29 Lacks Only in Prime Location East & West Facing Proposed Flats for sale, Car Parking. Get Monthly Rent 20,000/- Ph: 9502937289 [H-189447]

■ Affordable 3BHK Flats in Ready to Occupy Gated Community, Must See Last 2 Flats Available for Sale No GST Call: 9490439711 [H-193247]

■ Amberpet Nr. 6No' Busstop 2.5BHK 3yrs Old W/F 1150 sft, 5th Floor (all amnts) Car Parking 24hrs security CC surveillance. Ph: 9391596339 [HA-606]

■ Affordable 3BHK Flats Near Infosys, Pocharam, Possession Within 6Months Gated Community, Modern Amenities. Visit Model Flats Call: 9700554544 [H-193246]

HOUSE FOR SALE

■ హయత్ నగర్, మునగనూరు బ్యాంక్ కాలనీలో 200 గజాలు S/F 1600 sft. కొత్త ఇల్లు అమ్మకానికి కలదు. కేవలం 99 లక్షలు మాత్రమే. ఫోన్ : 9849688626 [HA-1770]

■ మల్లంపేట్ గ్రా॥ దుండిగల్ మం॥ మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా. 2380 చ.అ. విస్తీర్ణం, 66.62 చ.గ. అవిభాజ్య అవిభక్త స్థల వాటాతో - 3 BHK ఫ్లాట్ - ప్రభుత్వ రంగ బ్యాంక్ ద్వారా వేలం. సం॥: 7386623173, 9440201771 [HA-1342]

■ Vanasthalipuram, Gayatrinagar, W/F, 148 sq.yds. 3 Yrs old, Ground Floor Home, GHMC G+1 Permission, 83 Lakhs only. 9246586878 [H-189437]

■ New House for sale 2BHK Shadnagar bypass Road 140sq.yards ready to move, @46,00,000 Lakhs. 7780577647 [H-189442]

■ AS Rao Nagar, 4 BHK, 2400 sft, E/F, Villa, Home Theatre, Gated Community, Ready to Occupy in 6 Months. 9849969018, 9603988789 [H-189440]

LAND FOR SALE

■ విజయవాడ హైవే రామోజీ ఫిలిం సిటీ దగ్గర R1 జోన్‌లో గల 100 ఎకరాల వెంచర్ ల్యాండ్ అమ్మబడును. ఓన్లీ జెన్యూన్ బయ్యర్స్. సంప్ర: 7702595564 [HA-793383]

■ HMDA & RERA Villa Plots@TCS Adibatla, ORR Exit No.12, On 100Feet Road Facing ICICI Bank Loans Spot Registration. Ph: 9848475375 [H-793525]

LEASE / RENT

■ Godown Rent: 1650 / 1550 S.Ft Sheds rent KLM Shoping Mall Road, Canara Nagar, Very Near Warangal High-way ✆ 98482 70871 [B-2286]

PLOT FOR SALE

■ గజం కేవలం 3000/- మాత్రమే. రామోజీ ఫిలింసిటీ, ఇండస్ట్రియల్ పార్క్ దగ్గరలో అన్ని డెవలప్‌మెంట్స్‌తో ప్లాట్లు అమ్మకానికి కలవు. Ph: 8919577389 [HA-8101]

■ ముంబై హైవే, కంకోల్ టోల్‌గేట్ DTCP చ.గ. రూ.9500/- & ఫాం ప్లాట్స్ రూ.5,500/- నారాయణఖేడ్ రూ.6 లక్షలు 605 చ.గ రైతు బంధు, బీమా వర్తిస్తుంది. ఫోన్: 9291474747 [HA-1794]

■ ECIL- కీసర (Vill)లో ORR Exit నెం-8 ECILకి 12 km ఇళ్ల మధ్యలో అన్ని ఆత్యాధునిక సదుపాయాలతో ఓపెన్ విల్లా ప్లాట్స్ గ॥ కే॥ 23,999/- స్పాట్ రిజి. Ph:9010884728 [H-793607]

■ 2,10 గుంటలు, 1/2ఎ, 1ఎకరం, కందుకూరు ఫార్మసిటీ 200ఫీట్ల రోడ్డుకు 2nd బిట్, Amazon, 300ఎకరాల Govt మెడికల్ కాలేజ్, రెసిడెన్షియల్ లేఔట్ దగ్గర 10లక్షలకే గుంట Ph: 9848475375 [HA-10981]

■ Full Payment ఆఫర్‌లో : 605 గ॥ల ప్లాట్ 3 Lakhs only, రిజి॥ Rs 15K Extra ఉట్‌పల్లి, నాగలిగిద్ద (మం) నారాయణఖేడ్. 9182970057 [H-788470]

■ Farm Land New Venture Each Farm Site 5Guntas (605yds) 2km Warangal Hiway, 60ft BT Road Face, Nr. Yadadri Temple, Raigiri, RRR Launching Offer 3801/-yd. (Fix) Ph: 8309610166 [HA-12536]

■ Diwali Dhamaka Offer:Mumbai High way Facing, DTCP &RERA Approved, Residential Villa Plots @ SADASHIV PET, Clear title, Resale Assurance, Agents welcome Ph :9381832150 [HA-843]

■ Manikonda Panchavati Colony Semi-Commercial 400 Sq.Yad N/F Plot&300 Sq. Yad Residential East &South Corner Plot For Sale. Contact:(9 AM-10 PM) Ph:9246546336. [H-4279]

■ HMDA/DTCP/RERA Villa Plots for sale @Adiballa 27K/yd, Tharamathipet 26K/yd, Nandi-Vanaparthy 11K/Yd, Kadathal 19K/yd. 8919129676 [H-189446]

■ Pride Park, Ameenpur, 2 East Facing Adjacent Plots for Sale, 267 sq.yds & 330 sq.yds. Location: https://bit.ly/myplots. Contact: 6301787721. [H-189435]

■ HMDA & RERA Villa Plots @ TCS Adiballa ORR Exit No.-12 on 100 feet Road Facing ICICI Bank Loans Spot Reg. Ph: 8096007555 [HA-10974]

TO-LET

■ Alwal, Omsai Colony, Opp: Rytu bazar, 3BHK Flat Rithika Apartment 2nd Floor for Rent@15000/- Call: 9948028272/ 9346230348 [H-189621]

■ Mettuguda, Near Metro Station, Main Road, 2BHK (980 sft) 1st floor, N/F, Flat for Office/ Resi. Carparking. Cont: 8125809598 [H-189450]

Services

ASTROLOGY

■ అదృష్ట మంత్రం దురదృష్ట మంత్రం దైవ శక్తిని మానవ శరీరం మీద ప్రాణ ప్రతిష్ట చేసే అదృష్టమంత్రం. నవగ్రహాలు మాత్రమే దేవుళ్ళు అని చెప్పే జ్యోతిష్యం వాస్తు. బర్త్ టైం మస్ట్.10-11AM ✆ 86880 66126 [B-786409]

BUSINESS SERVICE

■ మీ బంగారం బ్యాంకుల్లో గానీ, మార్వాడి షాప్స్, ఏ ఇతర ఫైనాన్స్‌లలో ఉన్నా మా డబ్బు తో విడిపించి మార్కెట్ ధరకు కొనబడును Ph: 9100329739 [H-788202]

BUSINESS OFFER

■ స్టార్ హెల్త్ ఇన్సూరెన్స్‌లో కొత్త పాలసీ కోసం ఫోన్ చేయండి. లేదా ఏజెంట్‌గా జాయిన్ కావటానికి సంప్రదించండి. ఫోన్: 9000543747 [HA-12520]

■ మా బిజినెస్‌లో ప్రతి 45రోజులకి 10లక్షల టర్నోవర్ కలదు. లక్ష నుండి పెట్టుబడులు కావలెను. మంత్లీరిటర్న్స్. Ph: 9381867282 [HA-14121]

■ మీకు తెలిసిన వంట నైపుణ్యంతో మీ ఇంట్లోనే షీరో కిచెన్ ప్రారంభించి స్థిరమైన ఆదాయాన్ని పొందండి. ఉచిత సెమినార్‌లో పాల్గొనేందుకై మీ సిటీ పేరు వాట్సాప్ చెయ్యండి. 6309527444 [H-193281]

■ పెట్టుబడి పెట్టండి, అధిక, లాభాలు పొందండి, మాది అతిపెద్ద సూపర్ మార్కెట్, కిరాణా, బియ్యం, రైస్ మిల్లుల బిజినెస్, పార్ట్నర్స్ కావలెను, అన్ని బిజినెస్‌కి మంచి లాభాలు, సంవత్సరానికి రెట్టింపు లాభం, రిటైర్డైన వారు, ఫైనాన్స్ ఇన్వెస్ట్ వారు, కొత్త వ్యాపారు వారు, బిజినెస్‌లో ఆసక్తి గల వారు డైరెక్ట్: Ph: 8008251356 [HA-1561]

■ Wanted Business Associates for online business. Contact: 9515943023 [HA-14031]

DEALERS

■ Milk Sales Agent & Executives for Buffalo Milk are Required In Twincities Call: KRSNA A2milk Farms Ph: 9502152124 [H-193283]

INSURANCE

■ కోటి రూ॥లు మొత్తం మెచ్యూరిటీ కొరకు, కోటి రూ॥ల తక్షణమే ఇన్సూరెన్స్ కొరకు ప్రతిరోజు 300/- రూ॥లు చొప్పున పొదుపు చేయండి. పెన్షన్, పిల్లల మనీబ్యాక్ LIC పాలసీల కొరకు, కరోనా రక్షక్ హెల్త్ పాలసీ కొరకు, శ్రీరామ్ చిట్స్ & డిపాజిట్ కొరకు సంప్ర: 9246351657. WWW.LICSAMRAT.COM [HA-12503]

HEALTH CARE

AYURVEDIC

■ కేరళ ఆయుర్వేద పంచకర్మ చికిత్స కేంద్రం ప్రారంభించేందుకు ఆసక్తి ఉన్నవారు సంప్ర: మా వద్ద అన్ని వ్యాధులకు ఆయుర్వేదం మందులు దొరుకును. Ph: 7893298095, 9704149595 [HA-30484]

HOME NEEDS

PEST CONTROL

■ చెదలు, బొద్దింకలూ నివారణ డోర్స్, విండోస్ కాబోర్డ్స్ పాడిరాలుట కొత్త ఇంటికి కెమికల్ ట్రీట్‌మెంట్ చేయబడును. నివారణ గ్యారెంటీతో ఫోన్: 9550446581/ 9666566081 [HA-95435]

PERSONAL CARE

CHANGE OF NAME

■ I, Gotla Vincent Premalatha D/o Korna Christopher W/o Gotla Vincent Samuel, 43 years, R/o H.No.38-87/16, Plot No.B10, A.N.Colony, Near Mary Gold School, Sainikpuri X Road, Sec-bad-094. I have changed my Name from Gotla Vincent Premalatha (Old Name) to GOTLA PREMALATHA (New Name) for all records purpose [HA-793486]

■ I, Uttam Kumar Malik S/o Phani Bhusan Mallick R/o Flat No.401, Venkateshwara home, Lecturers Colony, Hayathnagar, Hyd. Changed my name as UTTAM MALLICK. [HA-793431]

■ I Madhavi Padidham w/o, P.Venkat Reddy R/o Villa No.61, Northstar Airport Boulevard, Sardar Nagar, Tukkuguda, Telangana, Pin: 501359 have changed my name to Madhavi Reddy Padidham [H-30212]

LOST

■ I, Rathod Ravindernaik, S/o. Rathod devanand naik. aged: 40 yrs. Occ: Pvt employee. R/o: H.No:1-112/94, Sy.No: 28. Nadigadda thanda. Nr old age home, Miyapur, Serilingampally mandal, Rangareddy District, TS 500049. I have lost my original passport No.S1975121 Date: 25-10-2023. Time: 6.00pm [H-193332]

OLD AGE HOME

■ ఈశ్వర్ హోం కేర్ సర్వీస్ Govt Reg: 357765 24గం॥ వృద్ధులు, పేషెంట్ల సేవకు, బేబీకేర్, ఇంటి/వంటపనికి పని మనుషులను మీ ఇంటికి పంపబడును. 8374551099/ 8977641099 [H-793516]

■ హరే కృష్ణ హోంకేర్. వంట/ఇంటి పనిచేయుటకు వృద్ధులను, పేషెంట్స్‌ను, పిల్లలను 24 గం॥లు చూసుకొనుటకు మీ ఇంటికే కేర్‌టేకర్స్‌ను పంపబడును. హైదరాబాద్. Ph: 9640358899/ 9640158899 [H-793652]

■ వృద్ధులకు, బెడ్‌పేషెంట్స్‌కు, దీర్ఘ వ్యాధులతో ఉన్నవారికి, మానసిక, శారీరక వికలాంగులకు 24గం॥ వైద్య, భోజనం వసతి ఉప్పల్, ECIL, Hyd. సంప్ర: 9949520296, 7981467036. [H-793483]

TOURS & TRAVELS

■ శ్రీలంక శక్తి పీఠం - రామాయణ యాత్ర(6రో) 36K, సింగపూర్-మలేషియా (6రో) 69K, దుబాయ్(5రో) 69K, బాలి (5రో) 69K, వియత్నం - కంబోడియా - థాయిలాండ్ (9రో) 99K. Ph: 7399664466 [H-793551]

■ 17/11/23 జ్యోతిర్లింగాలు, 5 ద్వారకలు, సముద్రంలో శివలింగాలు (గుజరాత్, భావ్ నగర్) '10/12/23 పంచారామాల యాత్ర 3 రో॥ '29/12/23 రామేశ్వరం కన్యాకుమారి యాత్ర. భాస్కరరావు. Ph:9848486847 [HA-12525]

Wanted

■ హయత్‌నగర్‌లో మంచి రన్నింగ్‌లో ఉన్న టిఫిన్ సెంటర్ కమ్ మెస్ లీజుకు ఇవ్వబడును మరియు వంట మాస్టర్ కావలెను. ఫోన్: 9347171086, 8466993354 [HA-793429]

■ పనివారు కావలెను. హైదరాబాద్, బెంగళూరులో ఉండి ఇంటిపని, వంటపని, వృద్ధుల సేవ, పిల్లల పోషణకు స్త్రీలు, కావలెను. సంప్ర॥ 9391912949, 040-40123376. [H-788206]

■ మల్కాజిగిరిలో జ్యూట్/కాన్వాస్ బ్యాగుల కోసం అనుభవజ్ఞులైన లేడీ టైలర్లు కావాలి. శిక్షణ + నెలనెలా జీతం+బస్‌పాస్ Ph: 9063771065 [HA-95430]

■ విజయవాడలో A/C & Coolers రెంటల్ (towerac.com) కంపెనీకి A/C టెక్నీషియన్స్3, డోస్ట్ డ్రైవర్లు-3, హెల్పర్లు-5, 30సం.లోపు జీ:18 - 25,000 ట్రైనింగ్ / భోజనం / వసతి ఫ్రీ. ✆ 91771 77244 [B-1206681]

■ జీవితాంతం ఎక్కువ సంపాదన ఏ పెట్టుబడి లేకుండా కావాలంటే LIC ఏజెంట్‌గా చేరండి. 10th పాస్ అయి ఆడ/మగ పార్ట్/ఫుల్ టైం పనిచేయుటకు సంప్ర: 9246351657 [HA-11793]

■ వంట, ఇంటి పనికి, పిల్లలను, వృద్ధులను, పేషెంట్స్‌ని చూసుకోవడానికి, కేర్‌టేకర్స్, ఆయాలను మీ ఇంటి వద్దకు పంపబడును 20-40 సం. స్త్రీ/పు వర్కర్స్ కావలెను. ఫోన్ : 6309807798, 9121099519 [H-788205]

■ త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్/నర్సులు కావలెను. ఉచిత వసతి + భోజనం. జీతం: 18K. Ph: 9848571888/ 9640400073 [H-189349]

■ ప్రముఖ బ్యాంకింగ్ ఇన్సూరెన్స్ సేవా సంస్థ నందు పార్ట్‌టైం/ఫుల్ టైం పనిచేయుటకు 10th ఆపైన చదివిన వారు కావలెను. ఫిక్స్‌డ్ పేఅవుట్ కలదు. సంప్ర॥ 9985944266 [Y-798284]

■ Urgent Req: ప్రముఖ కార్పొరేట్ కం॥లో వర్క్ చేయుటకు మార్కెటింగ్ ఆఫీసర్ (M/F) & (F) టెలికాలర్స్ కావలెను. నో టార్గెట్, ఫిక్స్‌డ్ సాలరీ + ఇన్సెంటివ్స్, Age: 18-30yrs, Qly: 10th- డిగ్రీ డైరెక్ట్ కంపెనీ జాబ్ సంప్ర: 7386481188 [H-193248]

■ ప్రకృతి ఇన్ ఫ్రా, హైదరాబాద్ బ్రాంచ్ నందు పనిచేయుటకు, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్, మార్కెటింగ్ ఛానల్ పార్టనర్స్ కావలెను. Banjara Hills. Ph: 7569391136 [H-193285]

■ ప్రముఖ డిగ్నిటీ వాటర్ ప్యూరిఫైర్స్ కంపెనీలో M/F సేల్స్ ఎగ్జిక్యూటివ్స్ & టెలికాలర్స్ కావలెను Sal: UP to 1 Lakh: ASPR మార్కెటింగ్ PVT - LTD, DSNR. Ph: 9666889013/ 9390356112 [H-793428]

■ వంట మనిషి కావలెను ప్రముఖ కాలేజీలో పనిచేయుటకు జీతం: 15వేలు - 30వేలు, నిజాంపేట్ రోడ్డు, జేఎన్టీయూ దగ్గర ఫోన్: 8500003437, 9502937699 [HA-30274]

■ హైదరాబాద్‌లో ఇంటిపని వంటపని మరియు పిల్లలను చూసుకొనుటకు 45సం॥లోపు ఆడ పనివాళ్ళు. జీతం: 15,000/-, భోజన వసతి కల్పించబడును. Ph: 8143998280 [HA-14025]

■ Wanted Lady Telecaller knowledge Hindi, Telugu must Ph: 9395559626, 9652334426 [H-95559]

■ Wanted Feild Sales Executive (Only Male). Sal: upto 20K+Inc. Paytm Company Location: Kukatpally, Miyapur, Bachupally, Chandanagar. 9030912345, 6303905761 [HA-637]

■ In KPHB for Medical Agency, Ladies and Executive cum Supply Boys. Salary: 30,000/-, Vehicle must, KRISHI PHARMA, Road No.4. Ph: 9849328601 [H-788397]

■ Wanted Lady high school Science, primary and K.G Teachers Patmos high school Fathenagar near Masjid. Ph: 9177533556/ 9701750441 [HA-95429]

FACULTY TEACHERS

■ Req staff for Inter Mahts, commerce, Civics, Economics, English & Computers (Degree) Salaries upto 60K PM Cont: Sri Chandra College, Champapet. Ph: 9052016313, 9666156313 jobsatsrichandra@gmail.com [H-193269]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

ముమ్మరంగా వాహనాల తనిఖీ



ఫిలింనగర్‌లో వాహనాలు తనిఖీ చేస్తున్న ఫ్లయింగ్ స్క్వాడ్ బృందం

ఫిలింనగర్: నామినేషన్ల ప్రక్రియ పూర్తి కావడం, ఎన్నికల ప్రచారం ఊపం దుకోవడంతో వివిధ పార్టీల అభ్యర్థులు నగదు పంపిణీ చేసే అవకాశం ఉండటంతో పోలీసులు వాహనాల తనిఖీలు ముమ్మరం చేశారు. శనివారం బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, ఫిలింనగర్, పంజగుట్ట, ఖైరతాబాద్, సైఫాబాద్, మాసబ్‌ట్యాంక్, మధురానగర్ పోలీస్ స్టేషన్ల పరిధిలో సుమారు 12 బృందాలు వేర్వేరు చోట్ల వాహనాల తనిఖీలు చేపట్టాయి. కేంద్ర సాయుధ బలగాల పర్యవేక్షణలో ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు ఈ తనిఖీలు చేపట్టాయి. వీడియో సర్వైలెన్స్ బృందాలు తనిఖీ దృశ్యాలను వీడియో తీస్తుండగా కార్లు, బైక్‌లు, అంబులెన్స్‌లను కూడా తనిఖీ చేశారు. ప్రభుత్వ వాహనాలను సైతం ఆపి తనిఖీలు నిర్వహించారు.

బీఆర్‌ఎస్‌లో యువకుల చేరిక

రహమత్‌నగర్: బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాల పట్ల ఆకర్షితులై యువత స్వచ్ఛందంగా పార్టీలో చేరుతోందని జూబ్లీహిల్స్ బీఆర్‌ఎస్ అభ్యర్థి మాగంటి గోపీనాథ్ అన్నారు. బీఆర్‌ఎస్ యూత్ నాయకుడు షేక్ చోటు నేతృత్వంలో కార్మికనగర్‌కు చెందిన యువకులు బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. కార్పొరేటర్ సీఎన్ రెడ్డి, నాయకులు నజీర్, రవిశంకర్, వినోద్‌కుమార్, అరుణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

జంగ్ తెలంగాణ 2023

బీఆర్‌ఎస్‌కు వీఆర్‌ఎస్ ఖాయం: ఏఐవైఎఫ్

హిమాయత్‌నగర్: యువత, విద్యార్థులను మోసం చేసిన బీఆర్‌ఎస్‌కు అసెంబ్లీ ఎన్నికల్లో వీఆర్‌ఎస్ ఖాయమని, యువత, విద్యార్థుల వాగ్దానాలను అమలు చేస్తానన్న కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థులకు ఏఐవైఎఫ్ రాష్ట్ర సమితి సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నట్లు అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శి వలీ ఉల్లా ఖాద్రీ, కె.ధర్మేంద్ర అన్నారు. శనివారం హిమాయత్ నగర్‌లోని సత్యనారాయణ రెడ్డి భవన్‌లో ఏఐవైఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వలీ ఉల్లా ఖాద్రీ, ధర్మేంద్ర 'బీఆర్‌ఎస్ హటావో-తెలంగాణ బచావ్' కరపత్రాన్ని ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ... పేపర్ లీకేజీ, లిక్కర్ మాఫియా, మహిళలకు రక్షణ కల్పించలేని, నిరుద్యోగుల జీవితాలతో చెలగాటమాడుతున్న ప్రభుత్వాన్ని గద్దె దించుదామన్నారు. ఏఐవైఎఫ్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నిర్లకంటి శ్రీకాంత్, రాష్ట్ర ఆఫీస్ బేరర్స్ లింగం రవి, బిజ్జ శ్రీనివాసులు, టి.సత్యప్రసాద్, యుగంధర్, పేరబోయిన మహేందర్, కౌన్సిల్ సభ్యులు మహేందర్, మస్క సుధీర్, ప్రవీణ్, రాజ్‌కుమార్, మాజిద్ తదితరులు పాల్గొన్నారు.

డీఆర్‌ఎస్ సెంటర్‌ను పరిశీలించిన పోలీస్ అబ్జర్వర్

బంజారాహిల్స్: యూసుఫ్‌గూడలోని కోట్ల విజయభాస్కర్‌రెడ్డి స్టేడియంలో ఖైరతాబాద్, జూబ్లీహిల్స్ డీఆర్‌ఎసీ సెంటర్లతో పాటు ఈవీఎంలు భద్రపరిచే స్ట్రాంగ్‌రూమ్‌లు ఏర్పాటు చేశారు. శనివారం ఖైరతాబాద్, జూబ్లీహిల్స్, కార్వాన్, సనతనగర్, గోషామహల్ నియోజకవర్గాల పోలీస్ అబ్జర్వర్ నాయర్ కోట్ల విజయ భాస్కర్‌రెడ్డి స్టేడియం డీఆర్‌ఎసీ సెంటర్‌ను ఆకస్మిక తనిఖీ చేశారు. సీసీ కెమెరాలు పని చేస్తున్నాయో లేదో సరైన చోట్ల ఏర్పాట్లు చేశారా లేదా అన్నదానిపై పరిశీలించారు. టూ టైర్ సెక్యూరిటీని ఆరా తీశారు. స్ట్రాంగ్ రూమ్‌లకు డబుల్ లాక్ ఏర్పాటు చేశారా లేదా పరిశీలించారు. సిబ్బంది విధి నిర్వహణలో ఎంత వరకు అప్రమత్తంగా ఉంటున్నారో అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట జూబ్లీహిల్స్ అసెంబ్లీ నోడల్ అధికారి, ఏసీపీ కె. హరిప్రసాద్, ఖైరతాబాద్ అసెంబ్లీ నోడల్ అధికారి, పంజగుట్ట ఏసీపీ మోహన్‌కుమార్, జూబ్లీహిల్స్ ఇన్‌స్పెక్టర్ పి.రవి ప్రసాద్ పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ చేయొద్దని అమరణ దీక్ష



అమరణ దీక్ష చేపడుతున్న పబ్బతి శ్రీకృష్ణ

లిబర్టీ: రాజ్యాంగాన్ని అవమానిస్తున్న ప్రధాని నరేంద్రమోడీకి గుణపాఠం తప్పదని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు పబ్బతి శ్రీకృష్ణ హెచ్చరించారు. మంద కృష్ణ మాదిగ నేతృత్వంలో నిర్వహించిన వర్గీకరణ సభకు ప్రధాని నరేంద్రమోదీ హాజరైనందుకు నిరసనగా పబ్బతి శ్రీకృష్ణ హైదరాబాద్‌లోని రాష్ట్ర కార్యాలయంలో అమరణ నిరాహార దీక్ష చేపట్టారు. ఈ విషయంలో మాదిగలు మోసపోవద్దని, బీజేపీలోకి మాలలు బయటకు రావాలని తెలంగాణలోనే కాదు మొత్తం దేశంలో బీజేపీని ఓడించాలని ఆయన పిలుపునిచ్చారు. దీక్షలో రాష్ట్ర నాయకులు సంకి ప్రసాద్, అవుట శ్రీను, వికారాబాద్ జిల్లా అధ్యక్షుడు బి.దశరథ్ తదితరులు పాల్గొన్నారు.

బీజేఆర్‌నగర్ బస్తీలో నర్సింగ్‌రావు పర్యటన

ఫిలింనగర్: ఎన్నికల ప్రచారంలో భాగంగా జూబ్లీహిల్స్ డివిజన్ బీఆర్‌ఎస్ సీనియర్ నేత మామిడి నర్సింగ్‌రావు శనివారం ఫిలింనగర్‌లోని బీజేఆర్‌నగర్ బస్తీలో కార్నర్ మీటింగ్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఖైరతాబాద్ బీఆర్‌ఎస్ అభ్యర్థి దానం నాగేందర్‌కు ఓటు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఫిలింనగర్ 18 బస్తీల్లో కోట్లాది రూపాయలు వెచ్చించి డ్రైయినేజీ, రోడ్లు పనులు నాగేందర్ ఆధ్వర్యంలో జరిగాయని గుర్తుచేశారు. ఆయనను గెలిపించుకోకపోతే పథకాలు, అభివృద్ధి ఆగమవుతాయని అన్నారు. గత ఎన్నికల్లో మాదిరిగానే ఈ సారి కూడా కారు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని అన్నారు.

కాంగ్రెస్‌తోనే పేదలకు న్యాయం

- రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయం
- ఖైరతాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి విజయారెడ్డి
- కాంగ్రెస్‌లోకి పెద్ద ఎత్తున చేరిన యువకులు

హిమాయత్‌నగర్/ఖైరతాబాద్: కాంగ్రెస్ పాలనలోనే పేదలందరికీ న్యాయం జరిగిందని, పార్టీ అధినేత్రి సోనియా గాంధీ తెలంగాణ రాష్ట్ర ప్రజల కోసం విడుదల చేసిన 6 గ్యారంటీ పథకాలే కాంగ్రెస్ పార్టీని రాష్ట్రంలో గెలిపిస్తాయని ఖైరతాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి పి.విజయారెడ్డి పేర్కొన్నారు. శనివారం హిమాయత్‌నగర్ డివిజన్‌లోని షంషీర్ బాగ్, రాజ్ మొహల్లా, తారకరామా థియేటర్ ఎదురుగా, కాచిగూడ ఎక్స్ రోడ్స్ పలు ప్రాంతాలలో ఆమె ఇంటింటి ప్రచారం నిర్వహించారు. డివిజన్‌లోని బీఆర్‌ఎస్, బీజేపీల నుంచి పెద్ద ఎత్తున యువత విజయారెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. అనంతరం కాంగ్రెస్ పార్టీ 6 గ్యారంటీల కార్డును ప్రజలకు వివరిస్తూ ప్రచారం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విజయారెడ్డి మాట్లాడుతూ... కాంగ్రెస్ ప్రభుత్వం వస్తే రూ. 500కే గ్యాస్ సిలిండర్ ఇస్తామని, 200 యూనిట్ల వరకు కరెంటు ఉచితంగా ఇస్తామన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం పేదలకు ఇండ్లు కట్టుకోవడానికి రూ. ఆరు లక్షలు ఇస్తామని ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదని ఎద్దేవా చేశారు. ఇప్పుడు ఎన్నికలు వచ్చాయని ఓట్ల కోసం, మరొకసారి ప్రజలను మోసం చేయడానికి వస్తున్నారని పేర్కొన్నారు. ప్రజలందరూ ఈ విషయాన్ని గమనించి బీఆర్‌ఎస్ పార్టీకి తగిన గుణపాఠం చెప్పాలని కోరారు. ఖైరతాబాద్ నియోజకవర్గ మాజీ కార్పొరేటర్లు, పలు డివిజన్ల అధ్యక్షులు, యూత్ కాంగ్రెస్ నాయకులు, ఎన్‌ఎస్‌యూఐ నాయకులు, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు కార్యకర్తలు, బస్తీ వాసులు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

హిమాయత్‌నగర్ డివిజన్‌లో విజయారెడ్డి సుడిగాలి పర్యటన



పార్టీలో చేరిన యువకులతో విజయారెడ్డి

సీడీ ఆవిష్కరణ...

కాంగ్రెస్ హస్తం-ప్రజల నేస్తం పేరుతో రూపొందించిన సీడీని శనివారం ఖైరతాబాద్ డివిజన్‌లోని పార్టీ కార్యాలయంలో విజయారెడ్డి ఆవిష్కరించారు. ఈ సీడీని రవిప్రసాద్‌రెడ్డి రూపకల్పన చేశారు.



సీడీని ఆవిష్కరిస్తున్న విజయారెడ్డి



మహిళకు బొట్టుపెట్టి ఓటు అభ్యర్థిస్తున్న ఖైరతాబాద్ కాంగ్రెస్ అభ్యర్థి విజయారెడ్డి





హిమాయత్‌నగర్ డివిజన్‌లో ప్రచారం చేస్తున్న కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి విజయారెడ్డి

14, 15వ తేదీల్లో 'కేర్'లో ఉచిత డయాబెటిక్ ఫుట్‌స్క్రీనింగ్ క్యాంప్

బంజారాహిల్స్: ప్రపంచ మధుమేహ దినోత్సవం సందర్భంగా బంజారాహిల్స్ రోడ్ నెం 10లోని కేర్ ఆస్పత్రి ఓపీ విభాగంలో ఈ నెల 14, 15 తేదీల్లో ఉదయం 8 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఉచిత డయాబెటిక్ ఫుట్ స్క్రీనింగ్ క్యాంప్ నిర్వహిస్తున్నట్లు ఆస్పత్రి వర్గాలు తెలిపాయి. కోతలు, బొబ్బలు, పుండ్లు, చీముకారడం, దుర్వాసన, నొప్పి, పాదాల్లో ఎరుపు వంటి రంగుతో సహా చర్మం, గోళ్లలో మార్పులతో బాధపడుతున్న రోగులను వైద్యులు పరిశీలిస్తారని తెలిపారు. వివరాలకు ఫోన్: 96660 88000లో సంప్రదించవచ్చన్నారు.

ఇటు దేవుడి పండగ.. అటు ఓట్ల పండగ..



ప్రచారం నిర్వహిస్తున్న కార్పొరేటర్ వెల్దండ

ఫిలింనగర్: ఒక వైపు దీపావళి పండగ సంబురంలో ప్రజలంతా బిజీగా ఉండగా మరో వైపు రాజకీయ నాయకులంతా ఈ నెల 30న జరిగే ఓట్ల పండగ ప్రచారంలో బిజీ అవుతున్నారు. పనిలో పనిగా దీపావళి పండగ ఏర్పాట్లలో నిమగ్నమైన మహిళలను నేతలు కలిసి కారు గుర్తుకు ఓటు వేయాల్సిందిగా విజ్ఞప్తి చేస్తున్నారు. శనివారం జూబ్లీహిల్స్ కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్ డివిజన్ పరిధిలోని పద్మాలయ అంబేద్కర్‌నగర్ బస్తీలో పండగకు పూలు సిద్ధం చేసుకుంటున్న మహిళలను పలకరిస్తూ ముందుకు సాగారు. మీది పండగే... మాది పండగే సార్ అటూ వారు అనడంతో ఒక్కసారిగా అక్కడ నవ్వులు పూశాయి.

మార్కెట్లకు దీపావళి శోభ



పంజగుట్టలో దివ్వెలు కొనుగోలు చేస్తున్న మహిళలు

బంజారాహిల్స్: మార్కెట్లకు దీపావళి శోభ సంతరించుకుంది. వివిధ సామగ్రి కొనుగోళ్ల నిమిత్తం వచ్చిన ప్రజలతో మార్కెట్లన్నీ కిటకిటలాడాయి. ఒక వైపు పూజా సామగ్రి కొనుగోళ్లతో పాటు మరో వైపు బంగారం షాపులు, పటాకుల దుకాణాల్లో కొనుగోళ్ల సందడి కనిపించింది. సాగర్ సొసైటీ మైదానంలో ఏర్పాటు చేసిన పటాకుల దుకాణాల్లో పెద్ద ఎత్తున కొనుగోళ్లు జరిగాయి. మరో వైపు ప్రతి దీపావళికి బంగారం కొనాలనే సెంటిమెంట్ ఉండటంతో సోమాజిగూడతో పాటు జూబ్లీహిల్స్ బంగారం షాపులు కిటకిటలాడాయి.



జూబ్లీహిల్స్‌లో బంగారం షాపులో...



సాగర్ సొసైటీ మైదానంలో..

భళా.. కలర్స్ ఉత్సవ్ మేళా



ఖైరతాబాద్: పీపుల్స్ ప్లాజా వేదికగా ఏర్పాటుచేసిన కలర్స్ ఉత్సవ్ మేళా నగరవాసులను ప్రత్యేకంగా ఆకట్టుకుంటోంది. కుటుంబ సమేతంగా విచ్చేసే వారికి విజ్ఞానంతో పాటు వినోదం, ఆహ్లాదాన్ని అందిస్తున్న కలర్స్ ఉత్సవ్ మేళాను ప్రతి ఒక్కరూ చూడాల్సిందే. స్పేస్ గురించి తెలుసుకోవాలనుకునే వారు ఒక్కసారి ఎగ్జిబిషన్‌ను సందర్శిస్తే కళ్లకు కట్టినట్లుగా చంద్రయాన్-3 రాకెట్ లాంచింగ్, ల్యాండిగ్ దృశ్యాలు చూడవచ్చు. వీటితో పాటు ప్రత్యేంగా ఏర్పాటు చేసిన గేమింగ్ జోన్, షాపింగ్ మాల్స్ ప్రత్యేకంగా ఆకట్టుకుంటున్నాయి. ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన మేళా త్వరలోనే ముగుస్తుందని, ఈ అవకాశాన్ని నగరవాసులు సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకుడు మిర్జా రఫీక్ బేగ్ తెలిపారు.



మేరు కులస్తుల సమస్యలు పరిష్కరించే వారికే మద్దతు

పంజగుట్ట: చేతి వృత్తిదారులైన మేర కులాన్ని బీసీ-డీ నుంచి బీసీ-ఏ లోకి మార్చాలని తెలంగాణ మేరు జాయింట్ యాక్షన్ కమిటీ డిమాండ్ చేసింది. తమ సమస్యలు ఏ పార్టీ పరిష్కరిస్తానని హామీ ఇచ్చే పార్టీకే తెలంగాణలోని రూ. 10 లక్షల మేరు కులస్తుల మద్దతు ఉంటుందని వారు పేర్కొన్నారు. శనివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో మేరు మేనిఫెస్టోను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జేఏసీ చైర్మన్ మునిగల రాము, జంటనగరాల చైర్మన్ ఎస్.విష్ణు, అధికార ప్రతినిధి కె.నరసింహచారి, వ్యవస్థాపకులు ఎస్.వెంకట్రాజన్ మాట్లాడారు. కార్యక్రమంలో నేతలు ఎం.రమేష్, యుగంధర్, ప్రకాష్, జయంత్, సంతోష్ పాల్గొన్నారు.

నిరుద్యోగులూ ఆలోచించి ఓటు వేయండి: వీహెచ్



మాట్లాడుతున్న హనుమంతరావు

పంజగుట్ట: తెలంగాణ రాగానే ఇంటికో ఉద్యోగం, కేజీ టు పీజీ ఉచిత విద్య అని అధికారంలోకి వచ్చిన కేసీఆర్ ఒకతరం నిరుద్యోగులను మోసం చేశారని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత వి.హనుమంతరావు అన్నారు. యువత మరోమారు మోసపోకుండా ఆలోచించి ఓటు వేయాలని ఆయన సూచించారు. శనివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో తెలంగాణ నిరుద్యోగ విద్యావంతుల సంక్షేమ సంఘం ఆవిర్భావ సభ నిర్వహించారు. సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు రంగసాయి భట్టు, వినోద్‌రావులతో కలిసి వీహెచ్ మాట్లాడుతూ... రాష్ట్రం వచ్చిన ఎనిమిదిన్నర సంవత్సరాల తర్వాత 15 నోటిఫికేషన్లు వేసి నిరుద్యోగుల నుంచి రూ. 220 కోట్లు దండుకుని పేపర్ లీకేజీలు, కోర్టు కేసులు వేసి ఒక్క ఉద్యోగం కూడా భర్తీ చేయలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేవలం టీఎస్‌పీఎస్సీలో దరఖాస్తు చేసుకున్న వారే 45 లక్షల మంది ఉన్నారని ఇతర బోర్డుల్లో ఎంతో మంది దరఖాస్తులు చేసుకున్నారని వారు ఇప్పటికైనా ఆలోచించి ఓటు వేయాలని సూచించారు. సమావేశంలో రాంబాబు, గౌతం, శేఖర్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

సదర్ సంబురాలకు సర్వం సిద్ధం

ఖైరతాబాద్: సదర్ ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు ఉత్సవాల నిర్వాహకులు మంగళారపు చౌదరి యాదయ్య యదవ్ అండ్ బ్రదర్స్, ఖైరతాబాద్ నవయుగ యాదవ సంఘం సంయుక్తంగా వెల్లడించారు. శనివారం ఖైరతాబాద్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ... దీపావళి పర్వదినం మరుసటి రోజు ఈ నెల 13న సాయంత్రం నుంచి రాత్రి 10 గంటల వరకు సదర్ ఉత్సవాలను ఖైతాబాద్ లైబ్రరీ చౌరస్తా నుంచి రైల్వే గేటు వరకు ఉత్సవాలను నిర్వహిస్తామన్నారు. ఎన్నికల నియమావళి మేరకు వేడుకలను జరుపుకోవాలని కోరారు. నిర్వాహకులు యాదయ్య యాదవ్, మహేష్‌యాదవ్, రాజు యాదవ్, సుధాకర్ యాదవ్, మధుకర్ యాదవ్, మనోజ్ యాదవ్, ప్రసాద్ యాదవ్ పాల్గొన్నారు.

అడ్రస్ అడిగి మంగళసూత్రం గొలుసు స్నాచింగ్

వెంగళరావునగర్: అడ్రస్ అడిగినట్టు నటిస్తూ మహిళ మెడలోని మంగళసూత్రం గొలుసును లాక్కెళ్లాడు. మధురానగర్ పోలీసుల సమాచారం మేరకు... మధురానగర్‌లోని జి.సుశీల వెస్ట్ శ్రీనివాస్‌నగర్‌కాలనీలోని మాలతి లేడీస్ హాస్టల్‌లో పని చేస్తుంది. శుక్రవారం సాయంత్రం గుర్తు తెలియని యువకుడు వచ్చి పేపర్ తీసుకొచ్చి అడ్రస్ తెలుసా అని అడిగాడు. ఆమె ఆ పేపర్ చూస్తుండగానే ఆమె మెడలోని మంగళసూత్రం తెంచుకుని పోయాడు.

◆ ఉద్యోగం ఇప్పిస్తామంటూ ఆన్‌లైన్‌లో రూ. 25 వేలు కాజేశాడు కేటుగాడు. జవహర్‌నగర్‌కు చెందిన బి.మహేష్ ఆన్‌లైన్‌లో ఉద్యోగం కోసం వెదుకుతుండగా ఈ నెల 5న అతనికి ఫోన్ వచ్చింది. ఆ నెంబర్‌కు రూ. 25 వేలు పంపితే మంచి ఉద్యోగం ఇస్తామని చెప్పారు. ఆ నెంబర్‌కు మహేష్ నగదు పంపాడు. అయితే శనివారం వరకు ఎలాంటి రెస్పాన్స్ లేదు. దాంతో యువకుడు మధురానగర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

అందుబాటులో ఉండేవాడిని.. ఆశీర్వదించండి

ఖైరతాబాద్ బీఆర్‌ఎస్ అభ్యర్థి దానం నాగేందర్



వెంకటేశ్వరకాలనీ డివిజన్ నాగార్జున హిల్స్ జర్నలిస్టు కాలనీ వాసులతో బీఆర్‌ఎస్ అభ్యర్థి దానం నాగేందర్



పంజగుట్ట కాలనీలో కేసీఆర్ మేనిఫెస్టోను ప్రచారం చేస్తున్న కాలనీ మహిళలు

బంజారాహిల్స్: ప్రజలకు 24 గంటలూ అందుబాటులో ఉంటూ అభివృద్ధే లక్ష్యంగా గడచిన అయిదేళ్లు పనిచేశానని ఈ సారి కూడా తనను ఆదరించి ఆశీర్వదించి కారు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని ఖైరతాబాద్ బీఆర్‌ఎస్ అభ్యర్థి దానం నాగేందర్ విజ్ఞప్తి చేశారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రి కేటీఆర్ నేతృత్వంలో హైదరాబాద్ అనూహ్యంగా అభివృద్ధి పథంలో నిలిచిందని అమెరికాలోని ప్రముఖ నగరాల తరహాలో హైదరాబాద్ కూడా అన్ని రంగాల్లో కళకళలాడుతున్నదని తెలిపారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం ఆయన జూబ్లీహిల్స్ డివిజన్ పరిధిలోని నవ నిర్మాణ్ నగర్ కాలనీలో మాజీ కార్పొరేటర్ కాజా సూర్యనారాయణ, వెంకటేశ్వర కాలనీ డివిజన్ పరిధిలోని జర్నలిస్టు కాలనీలో, పంజగుట్ట కాలనీలో కార్పొరేటర్ కవితారెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కాలనీ సమావేశాల్లో పాల్గొన్నారు. సీఎం కేసీఆర్‌ను రెండుసార్లు ఎలా ఆదరించారో ఈసారీ ఆశీర్వదించి హ్యాట్రిక్ సీఎంగా చేయాల్సిన బాధ్యత ఉందన్నారు. ఏ సమస్య ఉన్నా అందుబాటులో ఉంటూ వాటి పరిష్కారానికి కృషి చేస్తున్నానని తెలిపారు. జూబ్లీహిల్స్ మాజీ కార్పొరేటర్ కాజా సూర్యనారాయణ మాట్లాడుతూ... ఎన్నికల్లో తనకు ఎలా ఓటు వేశారో ఈ ఎన్నికల్లో కూడా నాగేందర్‌కు ఓటు వేయాలని, ఆయన గెలుపు తథ్యమని అయితే మెజార్టీ కోసం మీరందరూ ఓటు వేయడానికి ముందుకు రావాలని విజ్ఞప్తి చేశారు. నాగేందర్ గెలిస్తే ఈ సారి మంత్రి పదవి లభిస్తుందని మరింత అభివృద్ధి చేసుకోవచ్చునని అన్నారు.



జూబ్లీహిల్స్ డివిజన్ నవ నిర్మాణ్‌నగర్‌వాసులతో మాట్లాడుతున్న దానం నాగేందర్

రౌడీషీటర్లకు పోలీసుల కౌన్సెలింగ్

బంజారాహిల్స్: ఎన్నికల వేళ ప్రజలు స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకునేందుకు ఎన్నికల అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందులో భాగంగా పోలీసులను అప్రమత్తం చేశారు. రౌడీషీటర్ల కదలికలపై ప్రత్యేక నిఘా ఉంచాలని ఆదేశించారు. దీంతో జూబ్లీహిల్స్ ఏసీపీ హరిప్రసాద్ శుక్రవారం అర్ధరాత్రి జూబ్లీహిల్స్ నియోజకవర్గం పరిధిలోని పలు పోలీస్ స్టేషన్లలో రౌడీషీటర్లుగా నమోదై ఉన్న వారి నివాసాలకు వెళ్లి కుటుంబ సభ్యులతో మాట్లాడి రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇచ్చారు. మొత్తం 25 మంది రౌడీషీటర్ల ఇళ్లకు వెళ్లిన ఆయన వారితో మాట్లాడుతూ... ఎన్నికల సమయంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు పాల్పడకూడదని చిన్న కేసు నమోదైనా జీవితాంతం రౌడీషీట్‌తోనే మనుగడ కొనసాగించాల్సి ఉంటుందని హెచ్చరించారు. రౌడీషీటర్ల రోజువారి కార్యకలాపాలు, కదలికలపై పోలీసులు నిఘా ఉంచాలని గుర్తు చేశారు. తల్లిదండ్రులు కూడా తమ పిల్లలు ఎక్కడికి వెళ్తున్నారో దృష్టిపెట్టాల్సిందిగా పెద్దలకు సూచించారు.



కౌన్సెలింగ్ ఇస్తున్న జూబ్లీహిల్స్ ఏసీపీ కట్టా హరిప్రసాద్

రాష్ట్రంలో మార్పు తప్పదు

ఈసారి బైబై కేసీఆర్‌కు.. అధికారం కాంగ్రెస్‌కు..

రామగుండం, ధర్మపురి, బెల్లంపల్లి విజయభేరి సభల్లో టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి



బెల్లంపల్లి సభకు హాజరైన కాంగ్రెస్ శ్రేణులు

సాక్షి, పెద్దపల్లి/ ధర్మపురి/ సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: రాష్ట్రంలో ప్రజలు మార్పు కోరుకుంటున్నారని, వచ్చే ఎన్నికల్లో కేసీఆర్‌కు బైబై చెప్పి, కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తేవడానికి సిద్ధమయ్యారని టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. రాష్ట్రంలో నిరుద్యోగులు కష్టాలు పడుతున్నారని, పదో తరగతి నుంచి పబ్లిక్ సర్వీస్ కమిషన్ దాకా ఏ పరీక్షలను కూడా సరిగా నిర్వహించలేని దుస్థితి ఉందని మండిపడ్డారు. తెలంగాణ ప్రజలు కేవలం కేసీఆర్ కుటుంబం, చుట్టాలను ముఖ్యమంత్రులు, మంత్రులు చేసేందుకే ఉన్నారా? అని ప్రశ్నించారు. తాము అధికారంలోకి రాగానే ఆరు గ్యారంటీలను కచ్చితంగా అమలుచేస్తామని, చేతి గుర్తుకు ఓటువేసి కాంగ్రెస్‌ను గెలిపించాలని పిలుపునిచ్చారు. శనివారం మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి, పెద్దపల్లి జిల్లా గోదావరిఖని, జగిత్యాల జిల్లా ధర్మపురిలలో నిర్వహించిన కాంగ్రెస్ విజయభేరి సభల్లో ఆయన ప్రసంగించారు. వివరాలు ఆయన మాటల్లోనే..

''బీఆర్ఎస్ ప్రభుత్వం గత పదేళ్లలో చేసిందేమీ లేదు. రాష్ట్రం ఇస్తే ప్రజల జీవన విధానం మారుతుందని, ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని సోనియాగాంధీ భావించారు. కానీ కేసీఆర్ పాలనలో ఈ ఆశలకు పాతరేశారు.

'మేడిగడ్డ'కుంగింది.. 'అన్నారం'పగిలింది

లక్షన్నర కోట్లతో కాళేశ్వరం ప్రాజెక్టు కట్టి నిరుపయోగం. ఇసుక కదిలిందని అధికారులు చెప్తున్నారు. బుద్ధి ఉన్నవారెవరైనా ఇసుక మీద ప్రాజెక్టు కడతారా? పనిమంతుడు పందిరి వేస్తే కుక్క తగిలి కూలిపోయినట్టు ఉంది. రూ.35 వేల కోట్లతో కట్టాల్సిన ప్రాజెక్టును రూ.లక్షన్నర కోట్లకు పెంచారు. సీఎం కేసీఆర్‌కు ఆకలి ఎక్కువ. ఆలోచన తక్కువ. 60ఏళ్ల క్రితం కాంగ్రెస్ నిర్మించిన సాగునీటి ప్రాజెక్టులు ఇప్పటికీ లక్షల ఎకరాలకు నీళ్లు ఇస్తున్నాయి. మూడేళ్ల కింద కట్టిన 'మేడిగడ్డ'కుంగింది 'అన్నారం'పగిలింది. ఈ ప్రాజెక్టులో రూ.లక్ష కోట్ల అవినీతి జరిగింది. అధికారంలోకి రాగానే వాటిని కక్కిస్తాం. ప్రజలను దోచుకుతింటున్న సీఎం కేసీఆర్‌ను ఇంటికి పంపించడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారు.

ఆదిలాబాద్‌ను మోసం చేశారు

వైఎస్సార్ ప్రాణహిత–చేవెళ్ల ప్రాజెక్టును తుమ్మిడిహెట్టి కేంద్రంగా చేపట్టారు. దాన్ని అలాగే కొనసాగిస్తే ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో 1.60లక్షల ఎకరాలకు సాగు నీరందించేది. కానీ సీఎం కేసీఆర్ ఈ ప్రాజెక్టును కాళేశ్వరానికి తరలించి ఆదిలాబాద్ జిల్లాను మోసం చేశారు. 2004లోనే వైఎస్సార్ రైతులకు ఉచిత విద్యుత్‌ను అమల్లోకి తెచ్చారు. ఈ పథకంపై పేటెంట్ కాంగ్రెస్‌దే. ధరణి లేకుంటే రైతుబంధు ఎలాగని కేసీఆర్ అంటున్నారు. మేం అంతకంటే మెరుగైన సాధనం రూపొందించి రైతులను ఆదుకుంటాం.

సింగరేణిలో గెలవలేక..

ఓపెన్‌కాస్ట్ ప్రాజెక్టులను కుర్చీ వేసుకుని మూయిస్తానన్న సీఎం కేసీఆర్.. ఇప్పుడు ఎక్కడికిపోయారు? గనుల్లో ఇసుక, బొగ్గు, బూడిద ఏదీ వదలకుండా దోచుకున్న రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్ బందిపోటు దొంగలా మారారు. ఆయన కేసీఆర్ బిడ్డకు, కల్వకుంట్ల కుటుంబానికి కప్పం కడుతున్నాడు కాబట్టే మళ్లీ టికెట్ ఇచ్చారు. సింగరేణి గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికల్లో గెలిచే సత్తా కేసీఆర్‌కు లేదు. అందుకే కోర్టుకు వెళ్లి వాయిదా తెచ్చుకున్నారు. సింగరేణి కార్మికులకు కేసీఆర్ దొరికితే బొగ్గుబావుల్లో పాతరేస్తారు. గతంలో సింగరేణి మూతపడే స్థితిలో ఉన్నప్పుడు కేంద్ర మాజీ మంత్రి జి.వెంకటస్వామి కేంద్ర ప్రభుత్వం నుంచి ఆర్థికసాయం అందేలా చేసి ఆదుకున్నారనే విషయాన్ని కార్మికులు మరిచిపోవద్దు.

ప్రశ్నిస్తే అక్రమ కేసులు పెట్టిస్తున్నారు.

2018 ఎన్నికల్లో ధర్మపురిలో శ్రీలక్ష్మినరసింహుడి దయతో అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ గెలిచినా.. ఈవీఎంలను మార్పించిన ఘనత మంత్రి కొప్పుల ఈశ్వర్‌కు దక్కింది. ఓట్లను రీకౌంటింగ్ చేయాలని కోర్టు ఆదేశాలిస్తే అధికారులు స్ట్రాంగ్ రూంల తాళాలు పోయాయనడం సిగ్గుచేటు. ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య దుర్మార్గాలు చేస్తున్నారు. మా సభకు కరెంట్ సరఫరా కట్ చేయించారు. ప్రజలు ఎన్నికల్లో మీకు కరెంట్ లేకుండా కట్‌చేస్తారు. ఎమ్మెల్యే బాల్క సుమన్ ఇసుక, సింగరేణి ఉద్యోగాలు, హైదరాబాద్‌లో భూముల కబ్జాలు చేస్తున్నారు. నూరు కేసులు ఉన్నాయని చెప్పిన సుమన్.. ఇప్పుడు వేల కోట్లు ఎలా సంపాదించారు? అవినీతిపై నిలదీసిన ప్రతిపక్షాల నేతలు, కార్యకర్తలపై అక్రమ కేసులు పెట్టిస్తున్నారు.'' అని రేవంత్‌రెడ్డి ఆరోపించారు. గోదావరిఖని సభలో ఎమ్మెల్యే శ్రీధర్‌బాబు, రామగుండం కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి రాజ్‌ఠాకూర్ మక్కాన్‌సింగ్, ఐఎన్‌టీయూసీ సెక్రటరీ జనరల్ జనక్‌ప్రసాద్, ధర్మపురి సభలో ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, కోరుట్ల కాంగ్రెస్ అభ్యర్థి జువ్వాడి నర్సింగరావు, మాజీ ఎంపీ వివేక్ వెంకటస్వామి, బెల్లంపల్లి సభలో మాజీ ఎంపీ వివేక్, నేతలు వినోద్, నల్లాల ఓదెలు, ఏఐటీయూసీ నాయకుడు సీతారామయ్య తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా...

వికలాంగుల కోసం రాష్ట్రమంతా పర్యటించాలి

వీరయ్య వర్మకు ఠాక్రే సూచన



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని వికలాంగులందరి సంక్షేమానికి కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉందని రా ష్ట్ర పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్‌రావ్ ఠాక్రే వెల్లడించారు. వికలాంగుల సంక్షేమానికి కాంగ్రెస్ తీసుకోబోయే చర్యల గురించి వివరిస్తూ వారి ఓట్లను రాబట్టేందుకు రాష్ట్రవ్యాప్త ప్రచా రం నిర్వహించాలని టీపీసీసీ వికలాంగుల విభాగం చైర్మన్ ముత్తినేని వీరయ్య వర్మకు సూచించారు. శనివారం ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో వీరయ్యవర్మ ఠాక్రేను కలిశారు. ఠాక్రే మాట్లా డుతూ వికలాంగ విభాగం ఆధ్వర్యంలో పార్టీ గెలుపు కోసం మరింత కృషి చేయాలన్నారు. వికలాంగ విభాగం చైర్మన్ హోదాలో అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసే అవకాశం దక్కనప్పటికీ నిరాశ చెందవద్దని, రాబోయే కాంగ్రెస్ ప్రభుత్వంలో మంచి ప్రాధాన్యత కల్పిస్తామని ఠాక్రే హామీ ఇచ్చారు.

కాంగ్రెస్‌కు ముస్లింలీగ్ మద్దతు



సాక్షి, హైదరాబాద్: ఈ సారి ఎన్నికల్లో కాంగ్రెస్‌కు మద్దతిస్తున్నట్లు ఇండియన్ యూనియన్ ముస్లింలీగ్ (ఐయూఎంఎల్) ప్రకటించింది. తెలంగాణ ఎన్నికల్లో తాము కాంగ్రెస్ పక్షాన నిలబడాలని నిర్ణయించుకున్నామని, ముస్లింలీగ్ మద్దతుదారులందరూ కాంగ్రెస్ అభ్యర్థులకు ఓట్లేయాలని ఐయూఎంఎల్ కార్యదర్శి ఖుర్రం అనీశ్ ఒమర్ ప్రకటించారు. శనివారం గాంధీ భవన్‌లో ఐయూఎంఎల్ తెలంగాణ అధ్యక్షుడు మహ్మద్ షకీల్, ఏఐసీసీ కార్యదర్శి మన్సూర్ అలీఖాన్‌తో కలిసి మాట్లాడుతూ, తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. బీఆర్ అంబేడ్కర్ మనవడు యశ్వంత్ భీంరావు అంబేడ్కర్ సారథ్యంలోని దళిత ప్రబుద్ధ పార్టీ కూడా కాంగ్రెస్‌కి మద్దతు ప్రకటించింది.


బీజేపీ, బీఆర్ఎస్ ఓటమే లక్ష్యంగా కాంగ్రెస్‌తో పొత్తు

సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ



సాక్షి, హైదరాబారాద్: రాష్ట్రంలో బీజేపీ, బీఆర్ఎస్‌లను ఓడించడమే లక్ష్యంగా కాంగ్రెస్‌తో పొత్తు పెట్టుకున్నామని సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ పేర్కొన్నారు. హైదరాబాద్‌లో శనివారం జరిగిన సీపీఐ రాష్ట్ర సమితి సమావేశంలో ఆయన పాల్గొని ప్రస్తుత రాజకీయ అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా నారాయణ మాట్లాడుతూ...కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల గెలుపునకు పార్టీ శ్రేణులు కృషి చేయాలని కోరారు. సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి మాట్లాడుతూ.. ఎన్నికల నిర్వహణకు రాష్ట్ర స్థాయిలో సమన్వయ కమిటీని ఏర్పాటు చేశామన్నారు. ఈ కమిటీకి సమన్వయకర్తలుగా పార్టీ రాష్ట్ర కార్యదర్శి ఎన్ బాలమల్లేశ్, నర్సింహా వ్యవహరిస్తారన్నారు.

85–95 స్థానాల్లో గెలవబోతున్నాం: మల్లు



సాక్షి, హైదరాబాద్: డిసెంబర్ 3వ తేదీ తర్వాత తెలంగాణలో దీపావళి పండుగ జరగబోతోందని, బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని గద్దె దింపిన ప్రజలు ఆనందోత్సాహాలతో మరోమారు దీపావళి జరుపుకుంటారని టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షుడు, మాజీ ఎంపీ మల్లు రవి వ్యాఖ్యానించారు. త్వరలో జరగబోయే అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ 85–95 స్థానాల్లో విజయం సాధిస్తుందని, తమ పార్టీ అభ్యర్థుల నామినేషన్ల ర్యాలీలే ఈ విషయాన్ని స్పష్టం చేస్తున్నాయని చెప్పారు. శనివారం గాంధీభవన్‌లో కంటోన్మెంట్ కాంగ్రెస్ అభ్యర్థి డాక్టర్ జి.వెన్నెలతో కలిసి విలేకరులతో మాట్లాడుతూ ఈ నెల 30న జరిగే ఓట్లయుద్ధంలో బీజేపీ, బీఆర్ఎస్‌లను ఓడించేందుకు ప్రజలు స్వచ్ఛందంగా తరలిరానున్నారని చెప్పారు.

ధరణి తప్పుల తడకకు కేసీఆర్ అఫిడవిటే నిదర్శనం: షర్మిల



సాక్షి, హైదరాబాద్: ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు మానసపుత్రిక ధరణి తప్పుల తడకని ఆయన సమర్పించిన ఎన్నికల అఫిడవిట్‌తోనే రుజువైందని వైఎస్సార్‌టీపీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల విమర్శించారు. శనివారం ఎక్స్ వేదికగా ధరణే ధైర్యం అని చెప్పడానికి దొరకు ఆయన బందిపోట్లకు సిగ్గుండాలే అని మండిపడ్డారు. ముఖ్యమంత్రికి గుంట భూమి ఎక్కువొచ్చిందంటే ఇక సామాన్యుల సంగతి దేవుడెరుగన్నారు. ధరణిని భూ వివాదాల కోసం కాదు..ముమ్మాటికి దొర భూ దోపిడీ కోసమే తెచ్చుకున్న పథకమని ఆరోపించారు. ధరణి తిప్పలు తప్పాలంటే దొర పాలనను బొంద పెట్టుడు ఒక్కటే మార్గమన్నారు. ఈ ఎన్నికల్ల కారుకు కర్రు కాల్చి వాత పెట్టుడు ఒక్కటే పరిష్కారమని షర్మిల సూచించారు.


రేవంత్ నోరు అదుపులో పెట్టుకోవాలి

మంత్రి తలసాని శ్రీనివాస్
- హైదరాబాద్‌లో 17 నుంచి కేటీఆర్ రోడ్ షోలు
- ఈ నెల 25న హైదరాబాద్‌లో సీఎం కేసీఆర్ సభ



సాక్షి, హైదరాబాద్: టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి తన భాష మార్చుకోవాలని, నోటికి అడ్డూ అదుపు లేని మూర్ఖుడు కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడిగా ఉన్నారని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. ఉన్నత పదవుల్లో ఉన్న వారిపై రేవంత్ వ్యక్తిగత విమర్శలు, దూషణలు చేస్తున్నా కాంగ్రెస్ పార్టీ అధిష్టానం స్పందించక పోవడం విచారకరమన్నారు. తాము కూడా రేవంత్ తరహాలో మాట్లాడగలిగినా, సంస్కారం అడ్డు వస్తోందన్నారు. తెలంగాణ భవన్‌లో శనివారం మంత్రి మీడియాతో మాట్లాడుతూ, ఎన్నికల ప్రచారంలో పార్టీ విధానాలను ప్రజలకు వివరించకుండా, వ్యక్తులపై పరుష పదజాలం ఉయోగించడంపై కాంగ్రెస్ అధిష్టానం స్పందించాలన్నారు. గజ్వేల్‌లో ఈటల, కామారెడ్డిలో రేవంత్ ఓడిపోతామని తెలిసీ.. పార్టీ అధిష్టానాల మెప్పు కోసం ముఖ్యమంత్రిపై పోటీ చేస్తున్నారన్నారు. రెండు సీట్లు కూడా గెలవలేని బీజేపీ, సీఎంగా బీసీలను చేస్తామని ప్రకటించడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఈ నెల 17 నుంచి పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు హైదరాబాద్‌లో రోడ్ షోల్లో పాల్గొంటారని తలసాని శ్రీనివాస్ యాదవ్ వెల్లడించారు. 17 నుంచి చేపట్టే కేటీఆర్ రోడ్‌షోలు అన్ని నియోజకవర్గాల్లో జరుగుతాయని ఈ సందర్భంగా మంత్రి తెలిపారు. ఈ నెల 25న ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు హైదరాబాద్ ఎన్నికల బహిరంగ సభలో పాల్గొంటారని చెప్పారు.

బీసీలు రేవంత్‌ను నమ్మరు : పొన్నాల



సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ విడుదల చేసిన బీసీ డిక్లరేషన్‌కు విశ్వసనీయత లేదని మాజీ మంత్రి పొన్నాల లక్ష్మయ్య విమర్శించారు. గతంలో బీసీ డిక్లరేషన్ విడుదల కోసం అనేక చోట్ల సభల ఏర్పాటుకు ప్రయత్నించిన కాంగ్రెస్, చివరకు ఎన్నికల సమయంలో రేవంత్‌రెడ్డి పోటీ చేస్తున్న కామారెడ్డిలో విడుదల చేసిందని ఎద్దేవా చేశారు. బీఆర్ఎస్ నేతలు దాసోజు శ్రవణ్, ప్రొఫెసర్ శ్రీనివాస్‌రెడ్డితో కలసి శనివారం ఆయన తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడారు. ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో ఒక్క బీసీ అభ్యర్థికి కూడా అవకాశమివ్వని కాంగ్రెస్.. కామారెడ్డిలో బీసీ డిక్లరేషన్ ప్రకటించడం విడ్డూరంగా ఉందన్నారు. బీసీ డిక్లరేషన్ విడుదల కార్యక్రమానికి బీసీ నేతలను ఎందుకు పిలవలేదని ప్రశ్నించారు. కాంగ్రెస్ నుంచి టికెట్ ఆశించిన బాన్సువాడ బీసీ నేత ఆత్మహత్యాయత్నం చేసి చావుబతుకుల మధ్య ఉన్నారన్నారు. కాంగ్రెస్ 22 మంది బీసీలకు టికెట్లు ఇవ్వగా, అందులో ఐదు స్థానాలు డిపాజిట్లు దక్కని పాతబస్తీలోనే ఉన్నాయన్నారు. రేవంత్ రెడ్డి వంటి నేతలను బీసీలు నమ్మరని పేర్కొన్నారు.

హంతకుడే సంతాప సభ పెట్టినట్లుంది : దాసోజు

రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ బీసీ డిక్లరేషన్ ప్రకటించడం హంతకుడే సంతాప సభ పెట్టిన రీతిలో ఉందని బీఆర్ఎస్ నేత దాసోజు శ్రవణ్ విమర్శించారు. కేసీఆర్‌తోనే రాష్ట్రంలో బీసీల అభ్యున్నతి సాధ్యమని, వారికోసం తొమ్మిదేళ్లలో రూ.50 వేల కోట్లు ఖర్చు చేశారని అన్నారు.

నిబంధనలు ఉల్లంఘించి బీఆర్ఎస్ ప్రచారం

కాంగ్రెస్ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీ గౌడ్



సాక్షి, హైదరాబాద్: ప్రభుత్వ భవనాలు, ఆస్తులపైన బీఆర్ఎస్ ఎన్నికల ప్రచారం చేస్తోందని కాంగ్రెస్ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీగౌడ్ అన్నారు. ఇది ఎన్నికల నిబంధనలను ఉల్లంఘించడమేనని పేర్కొన్నారు. శనివారం గాంధీభవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ తలకాయలేని మాటలు మాట్లాడుతున్నారని, యాదవ సోదరులు బర్లు కాచుకుంటూ బతుకుతుండగా తలసాని కుమారులు మాత్రం రాజకీయాలు చేసుకోవాలా అని ఆయన ప్రశ్నించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే బీసీల సంక్షేమం కోసం బీసీసబ్ ప్లాన్ ద్వారా సంవత్సరానికి రూ.20 వేల కోట్లు ఖర్చు చేస్తామని చెప్పారు. కాంగ్రెస్ అధినేత రాహుల్ గాంధీ కుల గణనకు సంపూర్ణ మద్దతు తెలిపారని అన్నారు. మహిళా బిల్లులో రిజర్వేషన్లు ఉండాలని కూడా ఆయన డిమాండ్ చేసినట్లు గుర్తు చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే బలహీన వర్గాలకు మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేస్తుందన్నారు. ముదిరాజ్‌లను బీసీ–డీ నుంచి బీసీ–ఏ జాబితాలోకి మార్చనున్నట్లు పేర్కొన్నారు. గీత కార్మికులకు ప్రతి గ్రామంలో 5 ఎకరాల్లో 90 శాతం సబ్సిడీతో ఈత, తాటి వనాలను ఏర్పాటు చేస్తామన్నారు. అలాగే జనగామ జిల్లా పేరును సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ జిల్లాగా పేరు మార్చనున్నట్లు పేర్కొన్నారు.

విద్యార్థినులకు మెట్రో ప్రయాణం ఉచితం!

- 14 ఏళ్లు నిండి, చదువుకుంటున్న బాలికలకు ప్రత్యేక సదుపాయం
- అమ్మ ఒడి తరహా పథకం అమలు
- వార్డు మెంబర్లకు నెలకు రూ.1,500 గౌరవ వేతనం...
- వాహన చలాన్లు ఏకకాలంలో రద్దు
- హైదరాబాద్ అభివృద్ధికి ప్రత్యేక ప్లాన్
- ప్రజాకర్షకంగా కాంగ్రెస్ హామీలు
- ఈనెల 14న మేనిఫెస్టో ప్రకటన!



సాక్షి, హైదరాబాద్: విద్యార్థినిలకు స్కూటీలు ఇస్తామని, ల్యాప్‌టాప్‌లిస్తామని అంటున్న కాంగ్రెస్ పార్టీ ఆ వర్గానికే మరో కీలక హామీ ఇవ్వబోతోంది. 14 ఏళ్లు నిండి, చదువుకుంటున్న బాలికలందరికీ మెట్రో ప్రయాణాన్ని ఉచితం చేస్తామని చెప్పబోతోంది. పదో తరగతి చదువుకుంటున్న బాలికల నుంచి పీహెచ్‌డీలు చేసే విద్యార్థినుల వరకు అన్ని స్థాయిల్లోని కళాశాలలు, యూనివర్సిటీల్లో చదివే వారికి ఈ సౌకర్యాన్ని వర్తింపజేస్తామని చెపుతోంది. ఈ మేరకు తన ఎన్నికల మేనిఫెస్టోలో హామీలను పొందుపర్చాలని కాంగ్రెస్ పార్టీ నిర్ణయించింది. 'ప్రజా మేనిఫెస్టో'పేరుతో తయారవుతున్న ఈ ప్రణాళిక కోసం కాంగ్రెస్ పార్టీ తన కసరత్తును పూర్తి చేసింది. మాజీ మంత్రి శ్రీధర్‌బాబు నేతృత్వంలోని కమిటీ ఇప్పటికే పలుమార్లు సమావేశమై అనేక అంశాలకు తుది రూపు తీసుకువచ్చింది. కమిటీ రూపొందించిన ముసాయిదా మేనిఫెస్టోను టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్, రాష్ట్ర పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్‌రావ్ ఠాక్రే, పార్టీ వ్యూహకర్త సునీల్ కనుగోలు పరిశీలనకు పంపారని, ఈనెల 14న పార్టీ మేనిఫెస్టో అధికారికంగా విడుదలవుతుందని గాంధీభవన్ వర్గాలు చెపుతున్నాయి. అనివార్య కారణాల వల్ల వాయిదా పడితే ఒక రోజు ఆలస్యమవుతుందని అంటున్నాయి.

ప్రజాకర్షకంగా రూపకల్పన..

ఈసారి ఎన్నికల్లో ఓటర్లను ఆకర్షించే పథకాలకు కాంగ్రెస్ పార్టీ అధిక ప్రాధాన్యమిస్తోంది. ఆరుగ్యారంటీల పేరుతో మహిళలు, వృద్ధులు, పేద వర్గాలకు చెందిన ఓట్లను రాబట్టుకునే పనిలో పడిన కాంగ్రెస్.. మేనిఫెస్టోలో కూడా అన్ని వర్గాల ఓట్లు సంపాదించేలా పథకాలను ప్రతిపాదిస్తోంది. ఆంధ్రప్రదేశ్‌లో అమలవుతున్న అమ్మ ఒడి తరహా పథకాన్ని ప్రతిపాదించే అవకాశాలు కనిపిస్తున్నాయి. అయితే, ఆంధ్రప్రదేశ్ తరహాలో పెద్ద మొత్తంలో కాకుండా రూ.1,000 ఆర్థిక సాయం చేయాలనే ప్రతిపాదనపై మేనిఫెస్టో కమిటీ తీవ్ర కసరత్తు చేసింది. ఎంత మొత్తం ప్రతిపాదించాలన్న దానిపై తర్జనభర్జనలు ఓ కొలిక్కి రావడంతో పీసీసీ అధ్యక్షుడు రేవంత్ పరిశీలనకు ఈ ప్రతిపాదనను పంపినట్టు తెలుస్తోంది. స్థానిక సంస్థల వార్డు మెంబర్లకు నెలకు రూ.1,500 గౌరవవేతనం ఇస్తామనే హామీని కూడా కాంగ్రెస్ ఇవ్వబోతోంది.

హైదరాబాద్‌పై ప్రత్యేక దృష్టి..

ఇక, విశ్వనగరం హైదరాబాద్ అభివృద్ధిపై కాంగ్రెస్ పార్టీ తన మేనిఫెస్టోలో ప్రత్యేక విభాగాన్ని రూపొందిస్తోంది. దినదినాభివృద్ధి చెందుతున్న నగరంలో ట్రాఫిక్ నియంత్రణపై ప్రత్యేక ప్రణాళిక రూపొందిస్తోంది. ఇటు హైదరాబాద్‌తో పాటు అటు రాష్ట్రంలోని ప్రజలందరికీ ఆకర్షణీయంగా ఉండేలా వాహన చలాన్లను ఏకకాలంలో రద్దు చేస్తామని ప్రకటించనుంది. హైదరాబాద్ చుట్టూ నాలుగువైపులా కార్పొరేట్ ఆసుపత్రులు, వరదల తాకిడి నుంచి బయటపడేందుకు లోతట్టు ప్రాంతాల్లో నిలిచే నీరు త్వరగా వెళ్లిపోవడం కోసం లింక్డ్ కెనాల్స్ ఏర్పాటు లాంటి ప్రతిపాదనలతో పాటు మూసీ ప్రక్షాళన అంశాన్ని ప్రధానాంశంగా ప్రస్తావించనుంది. మూసీ చుట్టూ రేడియల్ రోడ్ల నిర్మాణం, నల్లగొండ జిల్లా వరకు మూసీ కనెక్టివిటీ కారిడార్ ఏర్పాటు లాంటి అంశాలను కాంగ్రెస్ పార్టీ తన మేనిఫెస్టోలో ప్రకటించనుందని తెలుస్తోంది.

కాంగ్రెస్ పార్టీని బేరం పెట్టారు

కాంగ్రెస్ పార్టీకి పాల్వాయి స్రవంతి రాజీనామా
- టికెట్లు అమ్ముకున్న నాయకులు గాంధీభవన్ అమ్మేస్తారు
- నేడు ప్రగతిభవన్‌లో బీఆర్ఎస్‌లో చేరనున్న స్రవంతి



సాక్షి ప్రతినిధి, నల్లగొండ/ పంజగుట్ట (హైదరాబాద్): కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత, మాజీ మంత్రి పాల్వాయి గోవర్ధన్‌రెడ్డి కూతురు, ఏఐసీసీ సభ్యురాలు పాల్వాయి స్రవంతి కాంగ్రెస్ పార్టీని వీడారు. ఈ మేరకు శనివారం ఆమె సోనియాగాంధీ, రాహుల్ గాంధీకి తన రాజీనామా లేఖను పంపించారు. తనపై ఉన్న ఒత్తిడి మేరకు బరువెక్కిన హృదయంతో కాంగ్రెస్ పార్టీని వీడాల్సి వచ్చిందని ఆ లేఖలో పేర్కొన్నారు. అనంతరం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో శనివారం విలేకరులతో మాట్లాడుతూ...పేదలు, బడుగు, బలహీనవర్గాలకు అండగా ఉండే కాంగ్రెస్ పార్టీని నిలువెత్తు బేరం పెట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలతో కాకుండా డబ్బుతో నడుస్తుందన్నారు. ఇప్పుడు టికెట్లు అమ్ముకుంటున్న నాయకులు రేపు గాంధీభవన్‌ను కూడా అమ్మేస్తారని అందుకే ఇటువంటి పార్టీలో తాను కొనసాగలేనని చెప్పారు. 2014లో పొత్తులో భాగంగా సీపీఐకి టికెట్ ఇచ్చారని, 2018లో రాజ్‌గోపాల్‌రెడ్డికి ఇస్తే పార్టీ ఆదేశాలమేరకు ఆయన గెలుపుకోసం పనిచేశానని ఇప్పుడు కాంగ్రెస్ పార్టీ చచ్చిపోయింది అని జెండా కిందపడేసిన రాజ్‌గోపాల్‌రెడ్డికి పార్టీలోకి వచ్చిన 24 గంటల్లో టికెట్ కేటాయించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పారాచూట్‌లకు స్థానంలేదన్న పార్టీలో 50 మంది పారాచూట్ అభ్యర్థులకు టికెట్లు కేటాయించారని మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీ అంటే కోమటిరెడ్డి బ్రదర్స్ అన్న రీతిలో వ్యవహరిస్తున్న వారితో ఇమడలేకపోతున్నానని ఆవేదన వ్యక్తం చేశారు. రాజ్‌గోపాల్‌రెడ్డికి వ్యతిరేకంగా ప్రచారం చేస్తానన్నారు. మంత్రులు జగదీశ్వర్‌రెడ్డి, కె.తారకరామారావు తన గౌరవానికి భంగం వాటిల్లకుండా చూస్తామని ఇటీవల ఇచ్చిన హామీ మేరకు బీఆర్ఎస్‌లో చేరాలని నిర్ణయించుకున్నట్లు తెలిపారు. కాగా, ఆదివారం ప్రగతి భవన్‌లో సీఎం కేసీఆర్ సమక్షంలో ఆమె బీఆర్ఎస్ కండువా కప్పుకోనున్నారు.

మళ్లీ రాములమ్మ 'చర్చ'

- కాంగ్రెస్‌లోకి వస్తున్నారని అంటున్న మాజీ ఎంపీ మల్లురవి
- బీజేపీ సభలు, సమావేశాలకు వెళ్లకుండానే అప్పుడప్పుడు విజయశాంతి ట్వీస్టులు



సాక్షి, హైదరాబాద్: మాజీ ఎంపీ విజయశాంతి పార్టీ మార్పు వ్యవహారం మరోమారు చర్చనీయాంశమయింది. శనివారం గాంధీభవన్‌లో కాంగ్రెస్ మాజీ ఎంపీ మల్లురవి చేసిన వ్యాఖ్యలు ఇందుకు కారణమయ్యాయి. తెలంగాణలో రాజకీయ పునరేకీకరణ జరుగుతోందని, విజయశాంతి లాంటి నేతలు కూడా కాంగ్రెస్‌లోకి వస్తున్నారని ఆయన చెప్పడం రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చకు దారితీసింది. అయితే, ప్రధాని నరేంద్ర మోదీ హైదరాబాద్‌కు వచ్చిన సందర్భంగా బేగంపేట విమానాశ్రయానికి వెళ్లి ఆయనకు స్వాగతం పలికిన విజయశాంతి, తాను బీజేపీలోనే కొనసాగుతానని, పార్టీ మార్పుపై జరుగుతున్న ప్రచారం పూర్తిగా అవాస్తవమని, తాను ప్రధానికి స్వాగతం పలకడానికి రావడమే అందుకు నిదర్శనం అని ఆమె వ్యాఖ్యానించడం గమనార్హం.

కొన్నాళ్లుగా ఇదే 'రచ్చ'

రాష్ట్రంలో అధికారంలో ఉన్న బీఆర్ఎస్ పట్ల బీజేపీ అధినాయకత్వం వ్యవహరిస్తున్న తీరుపై కొంతకాలంగా ఆ నేతలు కొందరు గుర్రుగా ఉన్న విషయం విదితమే. ఈ జాబితాలో విజయశాంతి కూడా ఉండడం గమనార్హం. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడిగా ఉన్న బండి సంజయ్‌ను తొలగించడంపై ఆమె అసంతృప్తిగా ఉండడం, ఇటీవల జరుగుతున్న బీజేపీ సభలు, సమావేశాలకు ఆమె గైర్హాజరవుతుండడం రాష్ట్ర రాజకీయ వర్గాల్లో చర్చకు దారితీసింది. బీజేపీ నుంచి కాంగ్రెస్‌లోకి కొందరు కీలక నేతలు వచ్చిన విధంగానే ఆమె కూడా కాంగ్రెస్ పార్టీలోకి వస్తున్నారని కొంతకాలంగా ప్రచారం జరుగుతోంది. ఈ ప్రచారాన్ని ఎక్కడా ఖండించని ఆమె, ఎన్నికలు కీలక దశకు చేరుకున్న తర్వాత కూడా తన మౌనవ్రతాన్ని వీడలేదు. అప్పుడప్పుడు బీజేపీ నాయకత్వంతో విభేదిస్తూ ఆమె పలు వేదికలపై ట్వీస్టులు ఇస్తూనే ఉన్నారు. కాగా, బీజేపీ నాయకత్వం ఆమెను అవమానపర్చిందని, అందుకే అంటీముట్టనట్టుగా ఉంటున్నారని ఆమె సన్నిహితులు చెపుతున్నారు. తెలంగాణ ఉద్యమ నాయకురాలిగా, సినీచరిష్మా కలిగిన క్లీన్ ఇమేజ్ ఉన్న నేతగా ఆమె ఏది మాట్లాడినా పార్టీకి నష్టం కలుగుతుందన్న ఆలోచనతోనే మౌనంగా ఉంటున్నారని, పార్టీకి వ్యతిరేకంగా మాట్లాడడం కన్నా మౌనంగా ఉండడమే మేలనే అభిప్రాయంతో ఆమె కాలం వెళ్లదీస్తున్నారనే చర్చ కూడా ఉంది.

కాంగ్రెస్ గెలిస్తే మంత్రి కంటే అత్యుత్తమ పదవి

- చాలామంది అభ్యర్థులు నా మద్దతుదారులే..
- కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఆసక్తికర వ్యాఖ్యలు



మాడుగులపల్లి: రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ విజయం సాధిస్తే తనకు మంత్రి కంటే అత్యుత్తమ పదవి దక్కే అవకాశం ఉందని ఎంపీ, నల్లగొండ అసెంబ్లీ నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. నల్లగొండ జిల్లా మాడ్గులపల్లి మండలం ఇందుగుల గ్రామ మాజీ సర్పంచ్ కట్టా అనూరాధ శ్రీనివాస్‌రెడ్డితోపాటు పలువురు సీపీఎం, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు శనివారం కోమటిరెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన వారికి కాంగ్రెస్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కోమటిరెడ్డి మాట్లాడుతూ చాలామంది కాంగ్రెస్ అభ్యర్థులు తన మద్దతుదారులేనని, తాను సూచిస్తేనే అధిష్టానం వారికి సీట్లు కేటాయించిందని వెల్లడించారు. ఈసారి అసెంబ్లీ ఎన్నికల్లో పోటీచేసే ఉద్దేశం లేకున్నా కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తేవాలన్న ధ్యేయంతోనే బరిలో నిలిచానని చెప్పారు. తెలంగాణ రాష్ట్ర సాధనకు మంత్రి పదవినే త్యాగం చేశానని, తనకు పదవులు ముఖ్యంకాదని, ప్రజల ఆకాంక్షకు అనుగుణంగా పనిచేయడమే లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు పుల్లెంల సైదులు, నేతలు వేణుగోపాల్ రెడ్డి, కె.శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌కు టీజేఎస్ సంపూర్ణ మద్దతు

ప్రొఫెసర్ కోదండరాం



హుజూరాబాద్: రాష్ట్రంలో కేసీఆర్ నిరంకుశ పాలనను అంతమొందించడమే లక్ష్యంగా తెలంగాణ జనసమితి ఈ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు సంపూర్ణ మద్దతు తెలుపుతోందని టీజేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాం పేర్కొన్నారు. కరీంనగర్ జిల్లా హుజూరాబాద్‌లో శనివారం జరిగిన టీజేఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. తెలంగాణ ఉద్యమ ఆకాంక్షను కేసీఆర్ మరిచిపోయాడని ఆరోపించారు. కమీషన్ల కోసమే ముఖ్యమంత్రి కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మించారని, ఈ నిర్మాణానికి ప్రధాని మోదీ 18 రకాల అనుమతులు ఇచ్చారని అందుకే ఎన్ని ఫిర్యాదులు వచ్చినా విచారణ చేపట్టడం లేదన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 3 వేల పాఠశాలలు మూసేశారని, ప్రభుత్వ ఆస్పత్రుల్లో సరైన వైద్యం అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఊరూరా బెల్టుషాపులు పెట్టి ప్రజలను మందుకు బానిసలుగా మార్చారని ఆరోపించారు. ఉద్యోగ పరీక్ష రద్దు చేసినందునే ప్రవళిక ఆత్మహత్య చేసుకుందని, ప్రభుత్వానికి చెడ్డ పేరు వస్తుందని భా వించిన కేటీఆర్ ప్రవళిక ఆత్మహత్యను తప్పుదోవ పట్టించారని ఆరోపించారు. పీవీ జిల్లా ఏర్పాటుకు అన్ని అవకాశాలున్నా ప్రభుత్వం ఎందుకు చేయ డంలేదని ప్రశ్నించారు.

డీసీపీని బదిలీ చేయండి

ఎంఐఎంకు అనుకూలంగా ఉన్నారని సీఈసీకి మర్రి శశిధర్‌రెడ్డి వినతి



సాక్షి, హైదరాబాద్: నగర డీసీపీ (దక్షిణ మండలం) పి.సాయిచైతన్యను బదిలీ చేయాలని చీఫ్ ఎలక్షన్ కమిషనర్‌కు బీజేపీ ఈసీ వ్యవహారాల కమిటీ చైర్మన్ మర్రి శశిధర్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఎంఐఎం నాయకత్వంతో సన్నిహిత సంబంధాల కారణంగా ఆయన తన విధులను న్యాయబద్ధంగా నిర్వహించే అవకాశం లేదని పేర్కొన్నారు. ఎంఐఎం ఎంపీ అసదుద్దీన్ సిఫారసుకు అనుగుణంగానే ఆయన సౌత్‌జోన్ డీసీపీగా వచ్చారని, వచ్చీరాగానే అసదుద్దీన్ ఆదేశాలకు అనుగుణంగా పనిచేస్తున్నారని ఆరోపించారు. ఎన్నికల సందర్భంగా హైదరాబాద్‌లోని అత్యంత సున్నితమైన ప్రాంతమైన దక్షిణ మండలంలో స్వేచ్ఛగా పోలింగ్ జరిగేందుకు వీలుగా పక్షపాత వైఖరి లేని పోలీసు అధికారిని నియమించాలని కోరారు. ఇటీవల ఎంఐఎం చార్మినార్ ఎమ్మెల్యే కుమారుడు ఇంతియాజ్ అహ్మద్‌ఖాన్ బెదిరింపు వసూళ్లకు పాల్పడుతున్నట్టు సోషల్ మీడియాలో వార్తలొచ్చినా సదరు పోలీసు అధికారి కేసు పెట్టలేదన్నారు. దీనిపై హైదరాబాద్ పోలీస్ కమి షనర్ జోక్యం చేసుకుని కేసు పెట్టారని, ఎన్నికల నియమావళిని ఉల్లంఘించి దీనిపై ఎమ్మెల్యే, అతని కుమారుడు, మద్దతుదారులు నిరసన తెలిపినా డీసీపీ నిర్లక్ష్యపూరితంగా వ్యవహరించారని చెప్పారు. ఈ మేరకు సీఈసీకి శశిధర్‌రెడ్డి వినతిపత్రం పంపించారు.

పీఈటీలకు స్కూల్ అసిస్టెంట్ హోదా

టీపీసీసీ అధికార ప్రతినిధి హర్షవర్ధన్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: ఉన్నత పాఠశాలల్లో పనిచేస్తున్న భాషాపండితులు, పీఈటీలకు సెకండరీ గ్రేడ్ నుంచి స్కూల్ అసిస్టెంట్ స్థాయి కల్పించేందుకు కాంగ్రెస్ పార్టీ నిర్ణయం తీసుకుందని టీపీసీసీ అధికార ప్రతినిధి గాల్‌రెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి వెల్లడించారు. ఈ మేరకు త్వరలో ప్రకటించబోయే ఎన్నికల మేనిఫెస్టోలో కాంగ్రెస్ పార్టీ హామీ ఇస్తుందని శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్‌ను రద్దు చేసి పాత పింఛన్ విధానాన్ని పునరుద్ధరిస్తామనే హామీని కూడా కాంగ్రెస్ పార్టీ ఇవ్వబోతోందని పేర్కొన్నారు.

సాక్షి పెళ్ళిచూపులు

ఆదివారం 12-11-2023

గమనిక

సాక్షి పెళ్ళిచూపులు ఒక వివాహ వేదిక మాత్రమే. ప్రకటనదారులకు సంబంధించి ఎట్టి హామీలకు పత్రిక సాక్ష్యం కాదు. ఈ వేదికలో వచ్చే ప్రకటనల సాధ్యాసాధ్యాలు, వధూవరుల వివరాలను పెండ్లి పెద్దలు స్వయంముగా వెళ్ళి పరిశీలించిన తరువాత నిర్ణయాలు తీసుకోవాలి. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. కావున పాఠకులు ఈ విషయాన్ని గమనించి మీకు తగిన సంబంధాన్ని నిర్ణయించుకోండి.

ఎన్నికల ఏర్పాట్లు పూర్తి చేయండి

నోడల్ అధికారుల సమావేశంలో రోనాల్డ్ రాస్

సాక్షి, సిటీబ్యూరో: పోలింగ్ ప్రక్రియ సజావుగా నిర్వహించేందుకు నోడల్ అధికారులు అన్ని ఏర్పాట్లు వేగవంతంగా పూర్తి చేయాలని హైదరాబాద్ జిల్లా ఎన్నికల అధికారి రోనాల్డ్ రాస్ సూచించారు. నామినేషన్ల పర్వం పూర్తయిన నేపథ్యంలో శనివారం ఎన్నికల నోడల్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పోలింగ్ సిబ్బందికి అవసరమైన వాహనాలను సెక్టార్ల వారీగా సమకూర్చుకోవాలన్నారు. పోలింగ్ విధులు నిర్వహించేవారు ఎక్కడి నుంచి బయలుదేరుతారో తెలుసుకొని అందుకనుగుణంగా ప్రయాణ ప్రణాళిక రూపొందించుకోవాలన్నారు. నియోజకవర్గాల వారీగా ఆర్‌ఓల పరిధిలోని పోలింగ్ కేంద్రాలకు రూట్ మ్యాప్, కమ్యూనికేషన్ ప్లాన్, పోస్టల్ బ్యాలెట్, వాహనాలు, తదితరమైనవి సిద్ధం చేసుకోవాలని చెప్పారు. అన్ని పోలింగ్ కేంద్రాల్లో కనీస మౌలిక సదుపాయాలను కల్పించాలని ఆదేశించారు. ఈ విషయంలో ఫిర్యాదులు వస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఓటర్ ఇన్ఫర్మేషన్ స్లిప్‌ల పంపిణీకి చర్యలు తీసుకోవాలన్నారు. ఓటింగ్ శాతం పెరిగేందుకు విస్తృత అవగాహన, ప్రచారానికి చర్యలు చేపట్టాలని సూచించారు. అందులకు ప్రత్యేకంగా బ్రెయిలీ లిపిలో బ్యాలెట్ ను తయారు చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు.ఎనభై ఏళ్ల పైబడిన వృద్ధులకు ఇంటివద్ద పోలింగ్ నిర్వహించేందుకు అవసరమైన వాహనాలను సిద్ధం చేసుకోవాలని సూచించారు.

కనుల పండువగా సదర్ ఉత్సవాలు

- ఘనంగా మొదలైన సదర్ వేడుకలు
- 'శ్రీకృష్ణ', శేరా బుల్ దున్న రాజాల ప్రదర్శన
- సాంస్కృతిక సమ్మేళనానికి సమున్నత ఆవిష్కరణ
- సదర్ వేడుకల్లో పెద్ద సంఖ్యలో పాల్గొన్న జనం



సాక్షి, సిటీబ్యూరో: సాంస్కృతిక వైవిధ్యాన్ని సమున్నతంగా ఆవిష్కరించే సదర్ ఉత్సవాలు శనివారం ఘనంగా ఆరంభమయ్యాయి. అఖిలభారత యాదవ మహాసభ ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం దీపావళి సందర్భంగా నిర్వహించే ఈ వేడుకలు ముషీరాబాద్‌లోని సత్తర్‌బాగ్‌లో సంఘం ప్రధాన కార్యదర్శి ఎడ్ల హరిబాబు నేతృత్వంలో ఏర్పాటు చేశారు. ఈ వేడుకలకు నగరంలోని పలు యాదవసంఘాలు, వివిధ పార్టీలకు చెందిన నాయకులు హాజరయ్యారు. శనివారం సాయంత్రం నుంచి రాత్రి పొద్దుపోయే వరకు కొనసాగిన దున్నరాజుల ప్రదర్శన సందర్శకులను విశేషంగా ఆకట్టుకుంది. ఈ వేడుకల్లో హర్యానాకు చెందిన శ్రీకృష్ణ, శేరాబుల్ దున్నలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. దేశవ్యాప్తంగా జరిగిన అనేక పోటీల్లో ఈ దున్నలు పాల్గొని పతకాలను సాధించాయని సదర్ నిర్వాహకులు హరిబాబు యాదవ్ తెలిపారు. ప్రతి సంవత్సరం పంజాబ్, హర్యానా,గుజరాత్, తదితర రాష్ట్రాలకు చెందిన భారీ దున్నలను హైదరాబాద్‌కు తరలించి సదర్ ఉత్సవాలను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ముర్రాజాతికి చెందిన ఈ దున్నలను వివిధ రాష్ట్రాల నుంచి నగరానికి తరలించేందుకు, వాటి పోషణకు పెద్ద ఎత్తున ఖర్చు చేయవలసి వస్తుందన్నారు. యాదవుల మధ్య ఐక్యతకు, సంబంధ బాంధవ్యాలను బలోపేతం చేసేందుకు శతాబ్దాలుగా నిర్వహిస్తున్న సదర్ ఉత్సవ సాంప్రదాయాన్ని బలంగా కొనసాగించేందుకే ప్రతి ఏటా క్రమం తప్పకుండా ఈ వేడుకలను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. సదర్ ఉత్సవాల సందర్భంగా దున్నలను ప్రత్యేకంగా అలంకరించారు. మేళ తాళాల మధ్య వేడుకలు కన్నుల పండువగా జరిగాయి.

ఆకట్టుకున్న శ్రీకృష్ణ, శేరా బుల్....

ఈ ఉత్సవాల్లో హర్యానాకు చెందిన ఆరేళ్ల దున్నరాజు 'శ్రీకృష్ణ'తో పాటు శేరాబుల్ దున్నలు కనువిందు చేశాయి. ఇప్పటికే దేశంలోని వివిధ ప్రాంతాల్లో జరిగిన 25 జాతీయ పోటీల్లో పోటీల్లో పాల్గొని విజేతగా నిలవడంతో పాటు ఎన్నో పతకాలను సొంతం చేసుకున్న ఛాంపియన్ శ్రీకృష్ణ గతేడాది కూడా హైదరాబాద్‌లో జరిగిన సదర్ ఉత్సవాల్లో పాల్గొన్నది. 6.6 అడుగుల ఎత్తు, 1900 కిలోల బరువు ఉన్న శ్రీకృష్ణ 10 ఫీట్ల వెడల్పుతో ఎంతో గంభీరంగా ఉంటుంది. దేశంలోనే అతి ఎత్తైన దున్నగా ఇది పేరొందింది. హర్యానాకు చెందిన మేలిరకం ముర్రాజాతికి చెందిన ఈ దున్నరాజు శనివారం నాటి సదర్‌లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. అలాగే ఈ వేడుకల్లో సదర్‌కు సై అంటూ ముందుకొచ్చిన శేరాబుల్ సైతం విశేషంగా ఆకట్టుకుంది. 2000 కిలోల బరువు ఉన్న ఈ దున్న 6.5 అడుగుల ఎత్తు, 10 ఫీట్‌ల వెడల్పు కలిగి ఉంది.ఈ రెండు దున్నలను వేడుకల్లో ప్రదర్శించేందుకు కొద్ది రోజుల క్రితమే నగరానికి తరలించి ప్రత్యేక శిక్షణనిచ్చారు. అంతేకాకుండా ప్రత్యేకమైన ఆహారాన్ని కూడా అందజేస్తున్నట్లు నిర్వాహకులు చెప్పారు. ఆహారంతోపాటు, వ్యాయామం, మస్టర్డ్ ఆయిల్‌తో మాసాజ్‌లు చేసి పోటీలకు సన్నద్ధం చేశారు. ఈ రెండింటితో పాటు నగరంలోని వివిధ ప్రాంతాలకు చెందిన మరికొన్ని దున్నలు కూడా వేడుకల్లో పాల్గొన్నాయి.

ఆహారం ఎంతో ప్రత్యేకం....

సదర్ ఉత్సవాల్లో పాల్గొన్న శ్రీకృష్ణ, శేరాబుల్ దున్నలకు రోజుకు 25 లీటర్ల పాలు, ఎండుఖర్జూరాలు, యాపిల్స్, క్యారెట్‌లు, అరటిపండ్లు వంటి ఆహారాన్ని అందజేశారు. రోజుకు వంద యాపిల్స్ ఇస్తున్నట్లు చెప్పారు. అలాగే కిలో చొప్పున ఖర్జూర, బెల్లం ఇచ్చారు. ఉదయం, సాయంత్రం వాకింగ్‌కు కూడా తీసుకెళ్లారు.ఈ దున్నలకు మసాజ్ చేసేందుకు హర్యానా నుంచి దున్నలతో పాటే వస్తాదులు సైతంహైదరాబాద్‌కు వచ్చారు.

పోలీసవుతా.. దొంగల భరతం పడతా



బంజారాహిల్స్: ఈ చిన్నారి పోలీస్ ఎవరని అనుకుంటున్నారా..? ఈ ఎనిమిదేళ్ల బాలుడు బ్లడ్ కేన్సర్‌తో బాధపడుతూ ఎంఎన్‌జే కేన్సర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. తనకు పోలీస్ కావాలని ఉందని, పోలీస్ స్టేషన్ చూడాలని ఉందని ఓ స్వచ్ఛంద సంస్థను కోరగా వారు ఇలా బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్‌కు తీసుకొచ్చారు. ఆదిలాబాద్ జిల్లాకు చెందిన షామా బేగం-హసేన్ చౌస్‌ల కుమారుడు అర్మాన్ చౌస్. వయసు ఎనిమిదేళ్లు. ఆర్మాన్ ఏడేళ్ల వయసున్నప్పుడు కేన్సర్ ఉందని గుర్తించిన తల్లిదండ్రులు ఎంఎన్‌జే కేన్సర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. యూనిఫాం వేసుకున్న అర్మాన్ శనివారం బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్‌లో సందడి చేశాడు. పోలీసులతో ఆర్మాన్ ఫొటోలు దిగాడు. తాను పెద్దయ్యాక పోలీస్ కావాలని ఉందని పోలీస్ అయి దొంగలను పట్టుకుంటానని ఆర్మాన్ చెప్పాడు. పోలీస్ స్టేషన్ అంతా కలియదిరిగాడు. స్టేషన్‌లోని ఎస్ఐలు ఆర్మాన్‌కు స్వీట్స్ ఇచ్చి అభినందించారు.

అత్యాచారాల్లో సోషల్ మీడియా కోణం

- వాటి ద్వారా పరిచయమై వీడియో చాటింగ్స్
- ఆపై వీడియోలు మార్ఫింగ్ చేసి బెదిరింపులు
- బాలికలపై అఘాయిత్యాల వరకు వ్యవహారం
- వెల్లడించిన నగర కొత్వాల్ సందీప్ శాండిల్య

సాక్షి, సిటీబ్యూరో: 'మీఠా సబ్‌సే బోలియే...' కబీర్ దాస్ చెప్పిన ఈ అంశం ప్రస్తుతం అందరం అనుసరించాల్సిన విషయమని నగర కొత్వాల్ సందీప్ శాండిల్యం అన్నారు. సమాజంలో తోటి వారితోనే కాకుండా కుటుంబీకులు, కడుపున పుట్టిన వారితోనూ ఇలా వ్యవహరించాలని సూచించారు. తద్వారా వారి వ్యవహారాలు, ఇబ్బందులు తెలుసుకోవచ్చని పేర్కొన్నారు. కుటుంబంలో ఈ సుహృద్భావ వాతావరణం దెబ్బతిన్న కారణంగానే యువతన డ్రగ్స్‌కు అలవాటు పడటం, సోషల్‌మీడియాకు బానిసలుగా మారడం జరుగుతోందని అన్నారు. ఇటీవల కాలంలో నగరంలో చోటు చేసుకున్న రెండు అత్యాచారం కేసుల వెనుక సోషల్‌మీడియా కోణం ఉండటం ఆందోళనకరమన్న ఆయన ఒకే తరహాలో ఉన్న ఆ రెండు వేర్వేరు ఉదంతాలను వివరించారు. నగరానికి చెందిన ఇద్దరు బాలికలకు సోషల్‌మీడియా ద్వారా కొత్త వారితో పరిచయం ఏర్పడింది. కొన్నాళ్ళు సజావుగా చాటింగ్ చేసిన ఆ ఇరువురూ ఆపై వీడియో చాట్‌లోకి దింపారు. ఈ బాలికల పైనా తల్లిదండ్రుల పర్యవేక్షణ లేని కారణంగా వాళ్ళు ఈ చాటింగ్ కొనసాగించారు. ఓ దశలో బాలికల వీడియోలు రికార్డు చేసిన ఆ ఇద్దరు కేటుగాళ్ళు వాటిని అశ్లీల వీడియోలతో మార్ఫింగ్ చేశారు. ఆపై వీటిని బాలికలకు చూపించి బ్లాక్ మెయిలింగ్‌కు దిగారు. దీన్ని తట్టుకోలేకపోయిన బాలికలను లోబర్చుకుని అత్యాచారానికి ఒడిగట్టారు. ఈ విషయాన్ని ఓ బాలిక చాలాకాలం ఇంట్లో చెప్పలేకపోయింది. కాలేజీకి కూడా వెళ్ళకుండా ఇంటికే పరిమితమైంది. ఆమెలో వచ్చిన మార్పును గమనించిన తల్లి పదేపదే కొరగా బయటపెట్టింది. అలా విషయం పోలీసు వద్దకు రావడంతో నిందితులు కటకటాల్లోకి చేరారు. పిల్లలు-తల్లిదండ్రుల మధ్య ఉన్న గ్యాప్‌కు ఇదో నిదర్శనంగా మారింది. ఈ పరిణామాల నేపథ్యంలో బాలికలు, యువతులు, మహిళలు సోషల్‌మీడియా విషయంలో అప్రమత్తంగా ఉండాలని సందీప్ శాండిల్య సూచించారు. మేమంతా మీ సోదరులే అని చెప్పిన ఆయన బాధితులుగా మారితే భయపడవద్దని ధైర్యం చెప్పారు. మీరు ఎదుగు తిరగనంత కాలం ఎదుటి వారు వేధిస్తూనే ఉంటారని స్పష్టం చేశారు. బాధితులు ఎవరైనా నేరుగా తనకే 8712660001 నెంబర్‌కు సమాచారం ఇవ్వచ్చని తెలిపారు. తనకు ఉన్న పని ఒత్తిడి కారణంగా ఫోన్ ఎత్తలేకపోవచ్చని, సందేశం ఇస్తే తాను తగిన చర్యలు తీసుకుంటానని భరోసా ఇచ్చారు. అలాగే 9490616555 సహా సిటీ పోలీసు హెల్ప్‌లైన్ నెంబర్ల వద్ద మహిళ కానిస్టేబుళ్ళను ఏర్పాటు చేస్తున్నామన్నారు. బాధితులు ఎవరైనా ఫిర్యాదు చేసినా, సమాచారం ఇచ్చినా వారి వివరాలు పూర్తి గోప్యంగా ఉంటాయి అని పేర్కొన్నారు. ఇటీవల నగరంలో జరిగిన పోలీసు బదిలీలను ప్రస్తావించిన సందీప్ శాండిల్య వాటిలో కొన్ని తప్పక చేశామని, ఎదుటి వారిని అంచనా వేయడంలో తన తప్పూ ఉంచి ఉండవచ్చని పేర్కొన్నారు. బోరబండ ఇన్‌స్పెక్టర్ రవి కుమార్ బదిలీ పై మాట్లాడుతూ... 'ఆయన్ను నా వాహనంలో ఎక్కించుకుని గంటన్నర తిప్పా. 67 మంది రౌడీషీటర్లలో కనీసం ఒక్కరి ఇల్లు కాదు కదా... గల్లీ కూడా చూపించలేకపోయారు. ఇలా అయితే ఎన్నికల క్రతువు పూర్తి చేయడం కష్టమని బదిలీ చేశా. ఎన్నికలు ముగిసిన తర్వాత నేను సీపీగా ఉంటే ఆయనకు మళ్ళీ పోలీసుస్టేషన్‌లో ఎస్‌హెచ్‌ఓగా అవకాశం ఇస్తా' అని వ్యాఖ్యానించారు.

రాష్ట్రంలో ప్రతి రంగాన్ని అగ్రగామిగా నిలిపాం

మంత్రి హరీశ్ రావు



మాట్లాడుతున్న మంత్రి హరీశ్‌రావు

దుండిగల్: తెలంగాణ రాష్ట్రంలో ప్రతి రంగాన్ని అగ్రగామిగా నిలిపామని ఆర్థిక శాఖ మంత్రి హరీశ్ రావు అన్నారు. మేడ్చల్ జిల్లా దుండిగల్ మున్సిపాలిటీ కెఎల్ యూనివర్సిటీ బౌరంపేట క్యాంపస్‌లో ఆపిల్ ఇన్నోవేషన్ కేంద్రాన్ని ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. అనంతరం హరీశ్‌రావు మాట్లాడుతూ ఐటీ పరిశ్రమల ఏర్పాటు, ఉద్యోగాల కల్పనలో దేశంలోనే తెలంగాణ మొదటి స్థానంలో ఉందని, గత ఐదేళ్ల కాలంలోనే 6 లక్షల ఐటీ, పారిశ్రామిక రంగంలో 24 లక్షల ఉద్యోగాలను అందించామన్నారు. వ్యవసాయ రంగంలో రాష్ట్రం వేగంగా అభివృద్ధి సాధిస్తుందని, ప్రభుత్వ ఆస్పత్రులో అత్యాధునిక హంగులతో కార్పొరేట్ స్థాయి వైద్యాన్ని అందిస్తున్నామని, గతంలో 11 స్థానంలో ఉన్న రాష్ట్రం ఇప్పుడు మూడవ స్థానానికి చేరుకుందన్నారు. బీజేపీ చేస్తున్న డబుల్ ఇంజిన్ సర్కార్ విఫలమని, కాంగ్రెస్ నేతలు ఢిల్లీ, కర్నాటక నేతలకు డబ్బులిచ్చి టికెట్లు తెచ్చుకున్నారని విమర్శించారు. తెలంగాణ రాష్ట్ర ప్రజల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని, రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తున్న బీఆర్‌ఎస్ పార్టీని ఆదరించాలని కోరారు. ఇతర పార్టీలకు ఓటు వేస్తే రాష్ట్రం 10 ఏళ్లు వెనక్కి వెళ్తుందని, ఆలోచించి నిర్ణయం తీసుకోవాలన్నారు. కేఎల్ యూనివర్సిటీలో చదువుతున్న నలుగురు విద్యార్థినిలు రూ.50 లక్షల వార్షిక ప్యాకేజీ పొందడం అభినందనీయమన్నారు. యూనివర్సిటీలో ఇంజనీరింగ్ కోర్సుల్లో చేరాలనుకునే విద్యార్థుల కోసం జాతీయ స్థాయిలో డిసెంబర్ 15 నుంచి 18 వ తేదీ వరకు నిర్వహించనున్న ప్రవేశ పరీక్షలు, మెరిట్ విద్యార్థులకు అందించే రూ.100 కోట్ల స్కాలర్‌షిప్ పోస్టర్‌ను మంత్రి ఆవిష్కరించారు. కార్యక్రమంలో కెఎల్ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ డాక్టర్ పార్థ సారథి వర్మ, బౌరంపేట క్యాంపస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కోటేశ్వరరావు, అజీజ్ నగర్ ప్రిన్సిపాల్ డాక్టర్ రామకృష్ణ, యూనివర్సిటీ అడ్మిషన్స్ డైరెక్టర్ డాక్టర్ జె. శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

అధికారం కోసమే కాంగ్రెస్ మైనారిటీ డిక్లరేషన్

– మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఛైర్మన్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న దృశ్యం

సాక్షి, సిటీబ్యూరో: కాంగ్రెస్ ఏదో విధంగా అధికారంలో వచ్చేందుకు మైనారిటీ డిక్లరేషన్ పేరిట ఆచరణ సాధ్యం కాని హామీలతో మైనారిటీలను మభ్యపెడుతోందని తెలంగాణ మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఛైర్మన్ ఇంతియాజ్ ఆరోపించారు. శనివారం హైదరాబాద్ మీడియాప్లస్ ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ మైనారిటీ డిక్లరేషన్ ప్రకటించడం అతిపెద్ద జోక్ గా అభివర్ణించారు. కుల ప్రాతిపదికన జనగణన చేపట్టడం, వాటి ఆధారంగా రిజర్వేషన్లు కల్పిస్తే వర్గ విద్వేషాలు రగిలే ప్రమాదం ఉందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ తన ఆరు హామీలను కాకుండా ప్రజలకు అధికారంలోకి వస్తే సీఎం అభ్యర్థి ఎవరూ? ఐదేళ్ల పదవీకాలం పూర్తి చేస్తామన్న హామీ ఇవ్వగలరా అని ప్రశ్నించారు.

ఎన్నికల్లో వార్ వన్‌సైడే : డాక్టర్ కె.లక్ష్మణ్



ఎన్నికల కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కె.లక్ష్మణ్

ముషీరాబాద్: ఎన్నికల్లో వార్ వన్‌సైడే అని.. బీజేపీ విజయం సాధించడం ఖాయమని రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కె.లక్ష్మణ్ ధీమా వ్యక్తం చేశారు. శనివారం ముషీరాబాద్ కమలానెహ్రూనగర్‌లో బీజేపీ ఎన్నికల కార్యాలయాన్ని డివిజన్ అధ్యక్షుడు బద్రినారాయణ సారథ్యంలో కార్పొరేటర్ సుప్రియనవీన్‌గౌడ్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఎన్నికలు తెలంగాణ రాష్ట్ర భవిష్యత్‌కు ముడిపడి ఉన్నాయని, ప్రజలు అభివృద్ధి కోరుకుంటున్నారని అది బీజేపీతోనే సాధ్యమని అన్నారు.

బీసీలు, మైనారిటీల మధ్య తగాదాకు కాంగ్రెస్ కుట్ర

హోంమంత్రి మహమూద్ అలీ



అజంపురాలో పార్టీ కార్యాలయంలో మాట్లాడుతున్న మహమూద్ అలీ

చాదర్‌ఘాట్: బీసీలకు, మైనారిటీలకు మధ్య తగాదాకు కాంగ్రెస్ పార్టీ కుట్ర పన్నుతోందని.. కాంగ్రెస్ పార్టీ మైనారిటీ డిక్లరేషన్ ఆ విధంగా ఉందని హోం మంత్రి మహమూద్ అలీ ఆగ్రహం వ్యక్తం చేసారు. శనివారం అజంపురాలోని పార్టీ కార్యాలయంలో విలుకరుల సమావేశంలో మాట్లాడుతూ, మైనారిటీలను బీసీ కులగణనలో చేర్చుతామనడం సమంజసం కాదని, ఈ ప్రతిపాదనలు కాంగ్రెస్ వెంటనే విరమించుకోవాలని డిమాండ్ చేసారు. బీసీలకు నష్టం కలిగించే విధంగా ఆ పార్టీ మైనారిటీ డిక్లరేషన్ ఉందని అన్నారు. 2004 నుంచి 2014 వరకు అధికారంలో ఉన్న కాంగ్రెస్ మైనారిటీల సంక్షేమానికి రూ.930 కోట్లు కేటాయిస్తే, 2014–23 మధ్య బీఆర్‌ఎస్ ప్రభుత్వం రూ.10వేల కోట్లు కేటాయించిందన్నారు. 2లక్షలకు పైగా ముస్లిం బిడ్డలకు షాదీ ముబారక్ ద్వారా ఆర్థిక సహాయం అందించామని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ డిక్లరేషన్‌ను మైనారిటీలు గమనించాలని కోరారు. తప్పుడు వాగ్దానాలకు మైనారిటీలు మోసపోవద్దని విజ్ఞప్తి చేసారు. కాంగ్రెస్, బీజేపీ పార్టీలు కుమ్మక్కు అయి నాటాకాలు ఆడుతున్నారని మైనారిటీలకు అసలు కులగణన అవసరం లేదని ఆయన అన్నారు.

క్లుప్తంగా...

శ్రీవారి సేవలో తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి



ఆలయం వెలుపల తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ పి.మాధవీదేవి

తిరుమల: తిరుమల శ్రీవారిని శనివారం తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ పి.మాధవీదేవి దర్శించుకున్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనం అనంతరం రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనాలు అందించగా.. అధికారులు ప్రసాదాలు అందించారు.

సకాలంలో గమ్యం చేరుకునేలా రైళ్ల నిర్వహణ

పండుగల సీజన్ సందర్భంగా ప్రత్యేక దృష్టి సారించిన దక్షిణ మధ్య రైల్వే

సాక్షి, హైదరాబాద్: దీపావళి, ఛత్ పూజల సందర్భంగా ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని వివిధప్రాంతాల మధ్య ప్రత్యేక రైళ్లను నడుపుతున్నట్లు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్వో సీహెచ్ రాకేశ్ శనివారం ఓ ప్రకటనలో వెల్లడించారు. వెయిటింగ్ జాబితాలో ఉన్న ప్రయాణికుల కోసం జనసాధారణ రైళ్లను అందుబాటులోకి తెచ్చినట్లు పేర్కొన్నారు. రైళ్ల నిర్వహణలో ఎలాంటి జాప్యానికి తావులేకుండా, సకాలంలో గమ్యం చేరేవిధంగా ప్రత్యేక పర్యవేక్షణ చేపట్టినట్లు తెలిపారు. పండుగల సీజన్‌ను దృష్టిలో ఉంచుకుని దేశవ్యాప్తంగా అన్ని రైల్వే జోన్‌లలో ప్రత్యేక రైళ్లలో సుమారు 26 లక్షల అదనపు బెర్త్‌లతో ప్రయాణసదుపాయాలను కల్పించినట్లు వివరించారు. ఈ ప్రత్యేక రైళ్ల ద్వారా తెలుగు రాష్ట్రాలతో పాటు, కర్ణాటక, మహారాష్ట్ర, ఒడిశా, పశ్చిమ బెంగాల్, బిహార్, ఉత్తరప్రదేశ్, ఢిల్లీ తదితర రాష్ట్రాలకు కనెక్టివిటీ పెరిగిందన్నారు. ప్రయాణికుల అదనపు రద్దీని అధిగమించేందుకు నిరంతరం పర్యవేక్షించాలని, రైళ్లను సమయానుకూలంగా నడిపేందుకు సకాలంలో చర్యలు తీసుకోవాలని దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్ కుమార్ జైన్ అధికారులను ఆదేశించారు.

క్రైస్తవ వ్యతిరేక కాంగ్రెస్‌ను ఎన్నికల్లో బహిష్కరించాలి

క్రిస్టియన్ పొలిటికల్ ఫ్రంట్ ఆఫ్ ఇండియా కన్వీనర్ జెరూసలేం మత్తయ్య



హిమాయత్‌నగర్: దళిత క్రైస్తవులపట్ల కాంగ్రెస్ నిర్లక్ష్యవైఖరిని ఖండిస్తూ తెలంగాణలోని దళితులు, దళిత క్రైస్తవులు, ఎస్సీ క్రిస్టియన్లు అసెంబ్లీ ఎన్నికల్లో ఆ పార్టీని బహిష్కరించాలని క్రిస్టియన్ పొలిటికల్ ఫ్రంట్ ఆఫ్ ఇండియా కన్వీనర్ జెరూసలేం మత్తయ్య పిలుపునిచ్చారు. శనివారం బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో జరిగిన దళిత క్రైస్తవ రిజర్వేషన్ సాధన సమితి, భారత క్రిస్టియన్ కౌన్సిల్, క్రిస్టియన్ పొలిటికల్ ఫ్రంట్ ఆఫ్ ఇండియా సంయుక్త సమావేశంలో ఆయన మాట్లాడారు. ఖానాపూర్ ఎమ్మెల్యే అభ్యర్థిగా ఎస్టీ క్రిస్టియన్ జాన్సన్ నాయక్‌ను 'ఇతరుడా'అంటూ హేళన చేసినందుకు టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి బహిరంగ క్షమాపణ చెప్పాలని, లేనిపక్షంలో దళిత క్రైస్తవ, లంబాడా క్రైస్తవ సంఘాలతో కలిసి గాంధీభవన్ ముట్టడిస్తామని హెచ్చరించారు. తెలంగాణ కాంగ్రెస్ పార్టీ మైనారిటీ డిక్లరేషన్‌లో దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా అంశాన్ని విస్మరించడం అన్యాయమన్నారు. సమావేశంలో నేతలు నాగళ్ల ఇజ్రాయేల్ పోచయ్య, బిషప్ భాస్కర్ ములకల, శావల జోసెఫ్, పాస్టర్ ఏసు దాసు, రెవరెండ్ ఎర్రోళ్ల జైపాల్, కోమలి, డేవిడ్‌నాయక్ పాల్గొన్నారు.

అన్నిపార్టీలకు ఇవి చివరి ఎన్నికలు: జాజుల



నల్లగొండటౌన్: బీసీలకు జనాభా దామాషా ప్రకారం 60 అసెంబ్లీ స్థానాలు ఇవ్వకుండా ద్రోహం చేస్తున్న అన్ని రాజకీయ పార్టీలకు ఇవే చివరి ఎన్నికలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల వరకు బీసీ రాజకీయ పార్టీని ఏర్పాటు చేసి బీసీ వ్యతిరేక పార్టీలను బొంద పెట్టడానికి కార్యాచరణను రూపొందిస్తామని చెప్పారు. శనివారం నల్లగొండలోని బీసీ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రస్తుతం జరుగుతున్న ఎన్నికలలో బీఆర్ఎస్ 24 స్థానాలు, బీజేపీ 40 స్థానాలు, కాంగ్రెస్ 22 స్థానాలను బీసీలకు కేటాయించి 5 శాతంగా ఉన్న రెడ్లకు, అర శాతంగా ఉన్న వెలమలకు పెద్దపీట వేశాయని విమర్శించారు. బీసీలను జెండాలు మోసేందుకు, ఓట్లు వేసేందుకు మాత్రమే వినియోగించుకుంటున్నాయని ఆరోపించారు. రాజ్యాధికారానికి దూరంగా నెట్టివేయబడుతున్న బీసీలు ఏకం కావాల్సిన అవసరం ఉందని పిలుపునిచ్చారు. రెండురోజులలో సంఘం రాష్ట్ర కార్యవర్గ సమావేశాన్ని ఏర్పాటు చేసి ఎన్నికల్లో బీసీలు ఎటువైపు ఉండాలి, బీసీలకు ద్రోహులు ఎవరు, వ్యతిరేకులు ఎవరు.. అనే అంశాలపై చర్చించి కార్యాచరణ ప్రకటిస్తామని చెప్పారు. సమావేశంలో నాయకులు కట్టెకోల దీపేందర్, లింగంగౌడ్, కనకం శ్యాం, కాశయ్యగౌడ్, శంకర్‌గౌడ్, అంజియాదవ్ పాల్గొన్నారు.

ఆర్టీసీలో 'మానసిక' టెన్షన్!

- డ్రైవర్ మానసిక స్థితి తెలుసుకోకుండానే బస్సు అప్పగిస్తున్న ఆర్టీసీ
- కొంతకాలంగా పెరిగిన బస్సు ప్రమాదాలు
- రెస్ట్ సమయంలో వేడుకలో గడిపి నేరుగా డ్యూటీకి.. లారీని ఢీకొని దుర్మరణం
- ఇటీవల విజయవాడ మార్గంలో బస్సు ప్రమాదం వెనుక డ్రైవర్ నిద్రలేమి?
- డ్రైవింగ్ చేయలేని పరిస్థితిలోనూ విధులకు..
- కుటుంబ వివాదంతో తాగుబోతుగా మారిన డ్రైవర్..
- ఆకస్మిక తనిఖీలో తాగినట్టు గుర్తించిన యంత్రాంగం
- 13 ఏళ్లుగా రిక్రూట్‌మెంట్ లేక డ్రైవర్ల కొరత..
- సెలవులు ఇస్తే సర్వీసులు రద్దు చేయాల్సిన దుస్థితి



ముందు రోజు రాత్రివిధులు నిర్వహించి వచ్చాడు ఆ డ్రైవర్.. మరుసటి రోజు రాత్రి విధులకు వెళ్లేలోపు కనీసం నాలుగు గంటలన్నా నిద్రపోవాలి.. కానీ దగ్గరి బంధువుల ఇంట్లో వేడుకకు వెళ్లాల్సి ఉంది, సెలవులు ఇచ్చే పరిస్థితి లేదు. దీంతో పగటి పూట వేడుకలో గడిపి, 110 కి.మీ. దూరంలోని తానుంటున్న పట్టణం నుంచి సొంత వాహనం నడుపుకుంటూ హైదరాబాద్ వచ్చి విజయవాడ బస్సు తీసుకుని బయలుదేరాడు. దారిలో ఆగి ఉన్న లారీని బస్సు ఢీకొనటంతో మృతి చెందాడు. మరో 9 మంది ప్రయాణికులు తీవ్రంగా గాయపడ్డారు.ఆ డ్రైవర్ కొన్నేళ్లుగా కుటుంబ వివాదాలతో సతమతమవుతున్నాడు.. దాదాపు కుటుంబ సభ్యులు వెలివేసినంత పనిచేశారు.. దీంతో అతని మానసిక స్థితి అదుపు తప్పింది. దూరప్రాంత బస్సు కావటంతో ఇద్దరు డ్రైవర్లు విధుల్లో ఉంటున్నారు. మరో డ్రైవర్ నడుపుతున్నప్పుడు అతను మద్యం సేవిస్తున్నాడు. ఇటీవల ఆకస్మికంగా తనిఖీ చేయగా, ఆ రోజు అధికంగా మద్యం తాగి ఉన్నట్టు తేలి అధికారులు కంగుతిన్నారు. అప్పుడు కాని అతన్ని విధుల నుంచి తప్పించలేదు.

సాక్షి, హైదరాబాద్: ఇది తెలంగాణ ఆర్టీసీలో నెలకొన్న పరిస్థితి. సగటున ఒక్కో బస్సులో 60 మందికిపైగా ప్రయాణికులు ఉంటారు. వారిని క్షేమంగా గమ్యం చేర్చేది డ్రైవరే. కానీ, ఇప్పుడు ఆర్టీసీకి డ్రైవర్లపై పర్యవేక్షణే లేకుండా పోయింది. డ్రైవర్ భద్రంగా బస్సును గమ్యం చేర్చటమనేది డ్రైవింగ్ స్కిల్స్ పైనే కాకుండా, అతని మానసిక స్థితి మీద కూడా ఆధారపడి ఉంటుంది. అందుకే గతంలో డ్రైవర్‌పై నిఘా, పర్యవేక్షణ ఉండేది. కానీ, క్రమంగా నష్టాలను అధిగమించేందుకు ఆదాయంపైనే దృష్టి కేంద్రీకరించటం మొదలయ్యాక ఇది గతి తప్పింది. ఇప్పుడు డ్రైవర్ల కొరత కూడా ఉండటంతో, కచ్చితంగా ఉన్నంత మంది విధులకు వచ్చేలా చూడ్డానికే అధికారులు పరిమితమవుతున్నారు. వారికి గతంలోలాగా సెలవులు కూడా ఇచ్చే పరిస్థితి లేదు. దీంతో విధులు ముగిసిన తర్వాత నుంచి తిరిగి విధులకు వచ్చే వరకు ఆ డ్రైవర్ విషయాన్ని సంస్థ పట్టించుకోవటం లేదు. డ్యూటీకి వచ్చే సమయానికి అతని మానసిక స్థితి ఏంటో కూడా తెలుసుకోలేకపోతున్నారు. మద్యం తాగి ఉన్నాడా లేదా అన్న ఒక్క విషయాన్ని మాత్రమే తేల్చుకుని బస్సు అప్పగిస్తున్నారు.

సెలవులు లేక..

ఒంట్లో కాస్త నలతగా ఉన్నా, విశ్రాంతి సమయంలో నిద్రపోలేని పరిస్థితిలో ఉన్నా, రకరకాల వివాదాలతో మానసికంగా ఆందోళనతో ఉన్నా.. డ్రైవింగ్ సరిగా చేయలేని పరిస్థితి ఉంటుంది. అలాంటి సందర్భంలో తనకు సెలవు కావాలంటూ డ్రైవర్లు అడుగుతారు. అయితే, సెలవు ఇస్తే డ్రైవర్ల కొరత వల్ల సర్వీసునే రద్దు చేసుకోవాల్సి వస్తోంది. దీంతో వారికి సెలవుల్లేక విధులకు హాజరు కావాల్సి వస్తోంది. విజయవాడ మార్గంలో జరిగిన యాక్సిడెంట్‌లో చనిపోయిన డ్రైవర్.. ఆ రోజు నిద్రలేమితో ఉండి కూడా సెలవుకు దరఖాస్తు చేయకుండా డ్యూటీకి హాజరయ్యాడని తెలిసింది.

ఆ విధానమేమైంది..?

- గతంలో ప్రతి డిపోలో స్పేర్ డ్రైవర్లు ఉండేవారు. డ్యూటీ చేయలేని స్థితిలో డ్రైవర్ ఉంటే అతని స్థానంలో మరో డ్రైవర్‌ను పంపే వారు. కానీ 13 ఏళ్లుగా డ్రైవర్ల రిక్రూట్‌మెంట్ లేకపోవటం, రిటైర్మెంట్లు, మరణించడం, పదోన్నతులు.. వంటి కారణాల వల్ల డ్రైవర్లకు కొరత ఏర్పడింది.
- గతంలో డ్రైవర్ల మానసిక స్థితిని తెలుసుకునే విధానం ఉండేది. ఏవైనా కారణాలతో వారు మానసికంగా కుంగిపోతున్నారా అన్నది సంస్థకు తెలిసే ఏర్పాటు ఉండేది. ప్రతి సంవత్సరారంభంలో రోడ్డు భద్రతా వారోత్సవాలు నిర్వహించేవారు. వాటికి డ్రైవర్లు, వారి కుటుంబ సభ్యుల్లో ఒకరు పాల్గొనాల్సి ఉంటుంది. ఈ సందర్భంగా డ్రైవర్ల స్థితిగతులపై ఆర్టీసీకి సమాచారం చేరేది. డ్రైవర్లతోపాటు, వారి కుటుంబ సభ్యులకు కూడా కౌన్సిలింగ్ చేసేవారు. డ్యూటీకి–డ్యూటీకి మధ్య చాలినంత నిద్ర ఉండేలా చూడాలంటూ కుటుంబ సభ్యులకు సూచించేవారు. ఇప్పుడు ఆ వారోత్సవాలు సరిగా నిర్వహించటం లేదు.
- సంవత్సరంలో ఒకసారి ప్రమాదరహిత వారోత్సవాలు నిర్వహించేవారు. ఆ వారంలో ఒక్క బస్సు కూడా ప్రమాదానికి గురి కాకుండా డ్రైవర్లకు ప్రత్యేక అవగాహన కార్యక్రమాలుండేవి. ఇది కూడా వారి నైపుణ్యం, మానసిక స్థితి తెలుసుకునేందుకు ఉపయోగపడేది. ఇప్పుడు దీన్ని నిర్వహించటం లేదు.

వరుస ప్రమాదాలతో..

చాలా విరామం తర్వాత మళ్లీ ఆర్టీసీ డ్రైవర్ల కుటుంబ సభ్యులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని భావిస్తోంది. ఇటీవలి వరుస ప్రమాదాలతో సంస్థలో టెన్షన్ నెలకొంది. డ్యూటీకి వచ్చేప్పుడు సరైన స్థితితో డ్రైవర్లు ఉండేలా చూడాల్సిన బాధ్యత కుటుంబ సభ్యులది అని అధికారులు చెబుతున్నారు. వారు రెస్ట్ సమయంలో తగినంతగా నిద్రపోవటం, సెల్‌ఫోన్లతో ఎక్కువ సేపు గడపకుండా చూడటం, అనవసర వివాదాలతో ఒత్తిడికి గురికాకుండా చూడటం.. లాంటి అంశాలపై కుటుంబ సభ్యులు దృష్టి సారించాలని చెప్పనున్నారు. కానీ, గతంలో ఉన్నట్టు పకడ్బందీ వ్యవస్థ ఏర్పాటు చేస్తే తప్ప ఇది ఫలించే సూచనలు కనిపించటం లేదు. డ్రైవర్లపై పని ఒత్తిడి తగ్గటంతోపాటు డ్రైవింగ్ చేయలేని పరిస్థితి ఉంటే సెలవు ఇచ్చే ఏర్పాటు ఉండాలని నిపుణులు సూచిస్తున్నారు. అది జరగాలంటే, తాత్కాలిక పద్ధతిలోనైనా డ్రైవర్ల రిక్రూట్‌మెంట్ ఉండాలని వారు పేర్కొంటున్నారు.

విలువలు పునఃప్రతిష్ఠించాలి

- లేకుంటే రాష్ట్రంలో అశాంతి, అభద్రత
- సుప్రీంకోర్టు రిటైర్డ్ న్యాయమూర్తి జస్టిస్ సుదర్శన్‌రెడ్డి



హనుమకొండ: విలువల పునఃప్రతిష్ఠాపన జరగకపోతే రాష్ట్రంలో అశాంతి, అభద్రత నెలకొంటుందని.. స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం కాపాడుకోవడానికి మేధావులు, విద్యావంతులు, యువకులు ముందు వరుసలో ఉండాలని సుప్రీంకోర్టు రిటైర్డ్ న్యాయమూర్తి జస్టిస్ సుదర్శన్‌రెడ్డి అన్నారు. తెలంగాణ పీపుల్స్ జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో శనివారం హనుమకొండలో 'పదేళ్ల తెలంగాణ–ప్రజల ఆకాంక్షలు– కర్తవ్యాలు'అనే అంశంపై సదస్సు జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న జస్టిస్ సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వానికి ఆస్తులుండవని, అవి ప్రజలవని అన్నారు. ప్రభుత్వం ట్రస్టీగా మాత్రమే ఉంటుందన్నారు. నిజాం సమయంలో నిరంకుశ పాలన, నిర్బంధానికి, అణచివేతకు వ్యతిరేకంగా తెలంగాణ రైతాంగ పోరాటం జరిగిందన్నారు. ఇలాంటి నేలపై తెలంగాణ ప్రజలు మౌన ప్రేక్షకులుగా ఎలా మారారో ఆలోచించాలన్నారు. తెలంగాణ పీపుల్స్ జాయింట్ యాక్షన్ కమిటీ కన్వీనర్ ప్రొఫెసర్ హరగోపాల్ మాట్లాడుతూ రాష్ట్రంలో మరింత వైభవం రావాల్సి ఉండగా ఉన్న వైభవం కోల్పోయామని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లాలను ముక్కలు చేసి రాష్ట్ర అస్తిత్వాన్ని పాలకులు దెబ్బ తీశారని దుయ్యబట్టారు. తెలంగాణ పేరు చెప్పుకుని గెలిచిన పార్టీ నేడు వేరే పార్టీగా మారిందని అన్నారు. పార్టీలో నుంచి తెలంగాణ పేరు తీసేసి దేని కోసం మీరు కొట్లాడుతున్నారని ప్రశ్నించారు.

బీదర్ కేంద్రంగా 'నిట్రావెట్' దందా

- మత్తుకు బానిసలైన వారికి ఈ 'ఔషధాల' విక్రయం
- హబీబ్‌నగర్ పరిధిలో చిక్కిన ద్వయంతో దొరికిన తీగ
- భారీగా సరుకు తీసుకుని నగరానికి వచ్చిన కర్ణాటక టీం
- వలపన్ని పట్టుకున్న యాంటీ నార్కోటిక్స్ అధికారులు



వివరాలు వెల్లడిస్తున్న సందీప్ శాండిల్య. చిత్రంలో సునీల్‌దత్, చక్రవర్తి గుమ్మి తదితరులు

సాక్షి, హైదరాబాద్: హబీబ్‌నగర్ పోలీసుస్టేషన్ పరిధిలో ఇద్దరు జేబు దొంగల అరెస్టుతో చిక్కిన తీగ లాగితే.. కర్ణాటకలోని బీదర్ కేంద్రంగా సాగుతున్న నిట్రావెట్ టాబ్లెట్స్ అక్రమ దందా వెలుగులోకి వచ్చింది.నగర కొత్వాల్ సందీప్ శాండిల్య, డీసీపీలు సునీల్‌దత్, చక్రవర్తి గుమ్మిలతో కలిసి శనివారం విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. మల్లేపల్లిలోని మాన్గార్ బస్తీకి చెందిన ఎస్.చక్రధారి గుల్బర్గా నుంచి నిట్రావెట్ మాత్రలను అక్రమంగా ఖరీదు చేసి, నగరానికి తరలించి విక్రయిస్తుంటాడు. తీవ్రమైన రక్తపోటు, మధుమేహ వ్యాధులతో బాధపడుతున్న వారికి రాత్రి వేళల్లో సరిగ్గా నిద్రపట్టదు. ఈ కారణంగా వైద్యులు రోగులకు ఈ మాత్రలను ప్రిస్క్రైబ్ చేస్తారు. నార్త్‌జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు గత ఆదివారం చక్రధారిని అరెస్టుచేసి విచారిస్తున్న సమయంలోనే బీదర్‌కు చెందిన బిర్జు ఉపాధ్యాయ వీటిని సరఫరా చేస్తున్నట్లు బయటపెట్టాడు. దీంతో ఈ సమాచారాన్ని టాస్క్‌ఫోర్స్ పోలీసులు టీఎస్ నాబ్‌కు అందించారు.


టీఎస్ నాబ్ సిబ్బందిపై దాడి...

బిర్జు ఉపాధ్యాయపై బీదర్‌లో 13 కేసులతో పాటు రౌడీషీట్ కూడా ఉంది. గుల్బర్గాకు చెందిన సుప్రీత్ నవలే నుంచి 300 టాబ్లెట్స్‌తో కూడిన ఒక్కో బాక్సు రూ.2 వేలకు ఖరీదు చేసి... నగరంతోపాటు మహారాష్ట్ర, గుల్బర్గా, నాందేడ్‌లోని ముఠాలకు రూ.5,500 చొప్పున విక్రయిస్తున్నాడు. ఈ దందాల్లో ఉపాధ్యాయకు అతడి స్నేహితుడు కిషన్ కాంబ్లే సహకరిస్తుంటాడు. చక్రధారి ఇచ్చిన సమాచారం ఆధారంగా టీఎస్ నాబ్‌కు చెందిన ఐదుగురు సభ్యుల బృందం ఉపాధ్యాయ, విశాల్‌లను పట్టుకోవడానికి ఇటీవల బీదర్ వెళ్ళింది. కాంబ్లే కూడా ఉపాధ్యాయ ఇంట్లో ఉండగా ఈ బృందం దాడి చేసింది. అయితే ఉపాధ్యాయ, అతడి కుటుంబ సభ్యులు మారణాయుధాలతో వీరిపై దాడి చేశారు. ఫలితంగా ఎస్సై సి.వెంకటరాములు, కానిస్టేబుల్ నవీన్‌కాంత్‌కు తీవ్ర గాయాలయ్యాయి. దీంతో వారిని హుటాహుటిన నగరానికి తరలించి వైద్యం చేయించారు. ఈ నేపథ్యంలో బీదర్‌లో వాళ్లని పట్టుకోవడం కష్టసాధ్యమని టీఎస్ నాబ్ అధికారులు నిర్ణయించారు. దీంతో దందా చేయడానికి వాళ్లు ఇక్కడికి వచ్చినప్పుడే అరెస్టు చేయాలని పథకం వేశారు. దీని కోసం ఇన్‌స్పెక్టర్లు పి.రమేశ్‌రెడ్డి, డి.సంతోష్‌కుమార్, జీఎస్ డానియల్ తమ బృందాలతో రంగంలోకి దిగారు. సాంకేతిక ఆధారాలను బట్టి నిందితులు భారీ మొత్తం నిట్రావెట్ టాబ్లెట్స్‌తో నగరానికి వస్తున్నట్లు గుర్తించి యాంటీ నార్కోటిక్స్ అధికారులు పట్టుకున్నారు.

'వచ్చే పార్లమెంటు సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లు పెట్టండి'

సాక్షి, హైదరాబాద్: నగరంలో జరిగిన విశ్వరూప సభలో ప్రధాని నరేంద్రమోదీ చేసిన ప్రసంగం 'కొండను తొవ్వి ఎలుకను పట్టినట్టు'గా ఉందని టీపీసీసీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు నాగరిగారి ప్రీతం ఎద్దేవా చేశారు. ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణపై కమిటీ వేస్తామని మోదీ హామీ ఇవ్వడం కాలయాపన కోసమేనని శనివారం ఒక ప్రకటనలో ఆయన విమర్శించారు. నిజంగా ఎస్సీలను వర్గీకరించాలనే చిత్తశుద్ధి బీజేపీకి ఉంటే డిసెంబర్ ఐదో తేదీన మొదలయ్యే పార్లమెంటు సమావేశాల్లో బిల్లు ప్రవేశపెట్టాలని, వర్గీకరణకు కట్టుబడి ఉన్న కాంగ్రెస్ పార్టీ దానికి మద్దతిస్తుందని ప్రీతం పేర్కొన్నారు. కాంగ్రెస్ హయాంలో ఎస్సీ వర్గీకరణపై ఉషామెహ్రా కమిషన్ నియమించిన విషయాన్ని గుర్తుచేశారు.

వృద్ధులకూ పరిహారం ఇవ్వాల్సిందే: హైకోర్టు



సాక్షి, హైదరాబాద్: మల్లన్న సాగర్ నిర్మాణంలో భాగంగా ఇస్తున్న పునరావాసం, పునర్నిర్మాణంలో వృద్ధులకూ పరిహారం చెల్లించాల్సిందేనని రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశించింది. చట్టప్రకారం వారిని ప్రత్యేక కుటుంబంగా పరిగణించాలని తేల్చి చెప్పింది. పునరావాసం, పునర్నిర్మాణం కింద కుటుంబానికి పరిహారం ఇచ్చామని..తమకు ప్యాకేజీ ఇవ్వకపోవడాన్ని సవాల్ చేస్తూ సిద్దిపేట జిల్లా ఏటిగడ్డ కిష్టాపూర్‌కు చెందిన కొందరు వృద్ధులు హైకోర్టులో రెండు పిటిషన్లు దాఖలు చేశారు. ఈ పిటిషన్లపై జస్టిస్ ముమ్మినేని సుధీర్ కుమార్ విచారణ చేపట్టి తీర్పు వెలువరించారు. ఇరుపక్షాల వాదనలను విన్న న్యాయమూర్తి.. చట్టప్రకారం వృద్ధులకు ప్రత్యేకంగా పునరావాస ప్యాకేజీ కింద పరిహారం అందజేయాలని ఆదేశిస్తూ తీర్పునిచ్చారు.

హైదరాబాద్‌కు యునెస్కో గుర్తింపు తెస్తాం

- 2036 నాటికి ఒలింపిక్స్ హౌజ్ ఏర్పాటు చేస్తాం
- భూతల స్వర్గం చేశామని అనం, కానీ చిత్తశుద్ధితో కష్టపడి పనిచేశాం
- రెసిడెన్షియల్ వెల్ఫేర్ సంఘాల సమావేశంలో కేటీఆర్



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి కేటీఆర్

రాయదుర్గం: హైదరాబాద్‌కు యునెస్కో ద్వారా వరల్డ్ హెరిటేజ్ సిటీగా గుర్తింపు తెచ్చేందుకు కృషిచేస్తున్నామని ఐటీ, మున్సిపల్ శాఖల మంత్రి కేటీఆర్ చెప్పారు. నగరంలో ఎన్నో చారిత్రక ప్రదేశాలు, నిర్మాణాలు ఉన్నాయని, ఎన్నింటినో గుర్తించి, ఆధునీకరించామని, భవిష్యత్తులో మరింతగా అభివృద్ధి చేస్తామన్నారు. శనివారం నగరంలోని రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్ల ఆధ్వర్యంలో రాయదుర్గంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడారు. నగరంలో క్రీడారంగానికి ప్రాధాన్యత ఇస్తూ 2036 నాటికి ఒలింపిక్స్ హౌజ్ నిర్మిస్తామని, ఇప్పటికే ఉన్న ఉప్పల్, ఎల్‌బీ స్టేడియాలను మరింత ఆధునీకరించి, కొత్త స్టేడియాలను, స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లను నిర్మిస్తామన్నారు. నగరంలో తాగునీటి సరఫరాను మెరుగుపరుస్తున్నామని, వచ్చే పదేళ్లలో 24 గంటలపాటు తాగునీరు అందేలా చేయాలని, వచ్చే అయిదేళ్ల కాలంలో రోజువారీగా తాగునీరు అందించేలా చర్యలు తీసుకుంటామన్నారు. నగరాన్ని తొమ్మిదిన్నరేళ్లలో భూతల స్వర్గం చేశామని చెప్పమని, కానీ చిత్తశుద్ధితో కష్టపడి ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేశామని చెప్పగలనన్నారు. ప్రతి ఒక్కరూ పోలింగ్ కేంద్రానికి వచ్చి ఓటేసేలా రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్లు కూడా బాధ్యత తీసుకోవాలని పిలుపునిచ్చారు.

జీహెచ్ఎంసీకి మరో ఇద్దరు అదనపు కమిషనర్లు

హైదరాబాద్ అభివృద్ధి కోసం జీహెచ్ఎంసీలో మరో ఇద్దరు కమిషనర్లను నియమించాలనే ప్రతిపాదన ఉందని కేటీఆర్ చెప్పారు. చెరువులు పరిరక్షణ, పర్యవేక్షణ, సుందరీకరణకు ఒక ప్రత్యేక కమిషనర్, పార్కులు, హరిత పరిరక్షణకు మరో ప్రత్యేక కమిషనర్‌ను నియమించాలని భావిస్తున్నట్లు పేర్కొన్నారు. నగరంలో కాలుష్య రహిత రవాణా కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని, మెట్రోను రానున్న కాలంలో 415 కి.మీ.కు విస్తరించేందుకు ప్రణాళిక రూపొందించామని తెలిపారు. లింకురోడ్ల నిర్మాణం చేపట్టి ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా చేస్తున్నామని, సుప్రీంకోర్టు మాజీ చీఫ్ జస్టిస్ ఎన్వీ రమణ ఈ ప్లాన్ చాలా బాగుందని మెచ్చుకున్నారన్నారు.

కల్లు సొసైటీలను కాపాడాలి..

గౌడన్నల సమస్యలను కేటీఆర్‌కు వివరించిన తెలంగాణ గౌడ సంఘం

సాక్షి, హైదరాబాద్: హైదరాబాద్‌లోని కల్లు సొసైటీలను కాపాడాలని తెలంగాణ గౌడ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పల్లె లక్ష్మణ్‌రావు గౌడ్ మంత్రి కేటీఆర్‌ను కోరారు. ఈ మేరకు ప్రగతి భవన్‌లో శనివారం ఆయన మంత్రిని కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా హైదరాబాద్‌లోని 69 కల్లు సొసైటీలపై ఇటీవల జరిగిన నార్కోటిక్స్ అధికారుల దాడుల గురించి వివరించారు. ఈ విషయంపై ఇప్పటికే ఎక్సైజ్ కమిషనర్, డీజీపీ, రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి, నగర కమిషనర్లను కలిసి వినతి పత్రాలను అందజేసినట్లు తెలిపారు. నార్కోటిక్స్ అధికారులు పోలీస్, సీఆర్పీఎఫ్ అధికారులతో కలిసి ఉగ్రవాదులపై దాడులు చేసినట్లుగా తమను భయభ్రాంతులకు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై మంత్రి స్పందిస్తూ, పదేళ్లుగా గౌడ వర్గీయులను కడుపులో పెట్టుకొని ఎలాంటి కష్టాలు రాకుండా చూశామని, ఈ దాడుల వెనుక జాతీయ పార్టీల కుట్ర దాగి ఉందన్నారు. అనంతరం లక్ష్మణరావు గౌడ్ మాట్లాడుతూ గౌడన్నల కోసం అనేక సంక్షేమ పథకాలను తెలంగాణ ప్రభుత్వం తీసుకొచ్చిందని, బీఆర్ఎస్ పార్టీ వెంటే గౌడన్నలు ఉన్నారని ఆయన స్పష్టం చేశారు.

బీజేపీకి భయపడుతున్న కేసీఆర్

- అందుకే కమ్యూనిస్టులతో పొత్తుకు దూరం
- తమ పార్టీకి భయపడి పొత్తుకు దూరమైన కాంగ్రెస్
- ప్రభుత్వానికి వ్యతిరేకంగా రాష్ట్రంలో ఎదురుగాలి వీస్తోంది
- మీట్ ది ప్రెస్‌లో సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం



సాక్షి, హైదరాబాద్: 'కమ్యూనిస్టులను కేసీఆర్ దూరం పెట్టడానికి ప్రధాన కారణం బీజేపీకి భయపడటమే. ఒకవేళ పొత్తు కుదిరితే కమ్యూనిస్టులు ఒకే వేదికపై బీజేపీని విమర్శిస్తారు. ఇది కేసీఆర్‌కు ఇబ్బందికరమైన అంశం. అలా చేస్తే కేసీఆర్‌ను బీజేపీ సహించదు. వచ్చే పార్లమెంటు ఎన్నికల్లో మళ్లీ బీజేపీనే వస్తే ఏమవుతుందోనని కేసీఆర్‌కు భయం పట్టుకుంది'అని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం సంచలన వ్యాఖ్యలు చేశారు. శనివారం టీయూడబ్ల్యూజే నిర్వహించిన మీట్ ది ప్రెస్‌లో కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. బీజేపీ పట్ల బీఆర్ఎస్ వైఖరి మారడం వల్లే ఆ పార్టీతో పొత్తు కుదరలేదన్నారు. ఆ తర్వాత కాంగ్రెస్ తమను సంప్రదించిందని చెప్పారు. తమకు భయపడే కాంగ్రెస్ పొత్తుల విషయంలో కిరికిరి చేసిందన్నారు. కొన్ని జిల్లాల్లో తమ పార్టీ ఉనికినే దెబ్బతీయాలనేది వాళ్ల కుట్ర అని ఆరోపించారు. సీపీఐ, సీపీఎంతో పొత్తు పెట్టుకుంటే కాంగ్రెస్‌కు నష్టమని కాంగ్రెస్ నాయకుడు కోమటిరెడ్డి చేసిన వ్యాఖ్యలపై తమ్మినేని మండిపడ్డారు. రెండు ఎమ్మెల్సీలు ఇస్తామని, అధికారం వస్తే సోనియాతో మాట్లాడి చెరో మంత్రి పదవి ఇప్పిస్తామనడంపై ధ్వజమెత్తారు. 1996లో జ్యోతిబసును ప్రధానిని చేస్తామంటేనే తిరస్కరించిన విషయాన్ని గుర్తుచేశారు.

అధికార పార్టీపై ఎదురుగాలి...

బీఆర్ఎస్ ప్రభుత్వంపై ఈ తొమ్మిదేళ్లలో ప్రజా వ్యతిరేకత ఏర్పడిందని తమ్మినేని అన్నారు. ఈ ప్రభుత్వంపై ప్రస్తుతానికి ఎదురుగాలి వీస్తోందని, అయితే, అధికారం కోల్పోయేంత ఎదురుగాలి వీస్తుందో లేదో చూడాలన్నారు. ఒకవేళ మునుగోడు ఉప ఎన్నికలో బీజేపీ గెలిచినట్లయితే ఇప్పుడు పరిస్థితి మరోలా ఉండేదని చెప్పారు. కాంగ్రెస్‌లో ఇప్పుడు చేరిన అనేక మంది నాయకులు అప్పుడు బీజేపీతో మంతనాలు జరిపిన వారేనన్నారు. బీఆర్ఎస్‌ను ఎవరు ఓడించగలరో ఆలోచిస్తున్నామని, మునుగోడు ఉప ఎన్నిక తర్వాత నిర్ణయం తీసుకుంటామని పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి వంటి వారు చెప్పారన్నారు. మునుగోడులో బీజేపీ గెలిచినట్లయితే ఇప్పుడు కాంగ్రెస్ ఇలా ఉండేది కాదన్నారు. బీఆర్ఎస్ వర్సెస్ బీజేపీ నుంచి ఇప్పుడు బీఆర్ఎస్ వర్సెస్ కాంగ్రెస్‌లా మారిందన్నారు. బీజేపీ ఐదారు సీట్లలో గెలిచే అవకాశముందనీ, అక్కడ ఆ పార్టీని ఓడించే సత్తా ఉన్న బీఆర్ఎస్ లేదా కాంగ్రెస్ లేదా ఇతర లౌకిక ప్రజాతంత్ర అభ్యర్థులకు ఓటేస్తామన్నారు.

మగదేవుళ్ల ఆధిపత్యం

సామాజిక, ఆర్థిక పరిస్థితులు మారడం వల్ల కమ్యూనిస్టులు కొంత వెనుకబడుతున్నారని తమ్మినేని చెప్పారు. కమ్యూనిస్టులు ఇప్పటివరకు ఆర్థిక అంశాలపైనే దృష్టిపెట్టారన్నారు. కడుపు నిండే డిమాండ్లపైనే దృష్టిపెట్టామని, మైండ్‌ను వదిలేశామన్నారు. పార్టీ ఆలోచనా విధానంలో మార్పు రావాలని, సామాజిక అంశాలపై దృష్టి కేంద్రీకరించాలన్నారు. క్యాపిటలిజంలో సజీవ దేవుళ్లు అంటే బాబాలు ఉంటారన్నారు. వెంకటేశ్వరస్వామి, శ్రీకృష్ణుడు వంటి దేవుళ్లంతా ఫ్యూడల్ సమాజంలో భాగమేనన్నారు. ఇంకా వెంకటేశ్వరస్వామి ఆధిపత్యమే ఉందన్నారు. సమాజంలో మగదేవుళ్ల ఆధిపత్యమే ఉందని చెప్పారు. మగ ఆధిపత్యం ఎక్కడున్నా అది ఫ్యూడల్ సమాజమే అవుతుందన్నారు.

వచ్చేసారి పార్టీ రాష్ట్ర కార్యదర్శి మారుతాడేమో...

పార్టీలో ఇంకా కమ్మ, రెడ్డోళ్ల ఆధిపత్యమేనా? జెండాలు మోసేది మాత్రం అణగారిన వర్గాలా అన్న ప్రశ్నపై తమ్మినేని స్పందిస్తూ... 'కమ్యూనిస్టు ఉద్యమం అనేది రెవెల్యూషనరీ మూవ్‌మెంట్. నాలెడ్జ్ లేకుండా ఆ ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్లలేం. కొన్ని వేల సంవత్సరాల వరకు కొన్ని కులాలకు చదువు, జ్ఞానం నిషేధం. నాలెడ్జ్ సంపాదించకుండా అభ్యుదయ ఉద్యమాలకు రావడం అసాధ్యమైన విషయం. ఆస్తి, చదువు సమకూరినప్పుడు అక్కడ విజ్ఞానానికి అవకాశం ఉంటుంది. ఈ చారిత్రక అసమతుల్యతను సరిదిద్దేందుకు కమ్యూనిస్టులు కృషిచేస్తున్నారు. తెలంగాణలో 33 జిల్లాల్లో ఐదారు జిల్లాలు తప్ప ఓసీలు ఎక్కడా సీపీఎం జిల్లా కార్యదర్శులుగా లేరు. ఎస్సీల జనాభా ఎంతుందో అంతమంది జిల్లా కార్యదర్శులున్నారు. బీసీ జనాభా ఎంతుందో అంతకంటే ఎక్కువగా పార్టీ కార్యదర్శులున్నారు. రాష్ట్ర కార్యదర్శి (తమ్మినేని) ఒకడున్నాడు. బహుశా వచ్చేసారి అది కూడా ఆలోచిద్దాం. ఒక్క లీడర్‌ను బట్టి కమ్మ అనడం సరికాదు. పార్టీలో చాలా మార్పులు తెచ్చామని'తమ్మినేని చెప్పారు. సీపీఐ, సీపీఎం ఐక్యమయ్యే అవకాశముందని, అయితే, దానికి సమయం పడుతుందన్నారు.

పండుగ గిఫ్ట్‌ల పేరిట గాలం!

సీజన్‌ను అనుకూలంగా మార్చుకుంటున్న సైబర్ నేరగాళ్లు

అప్రమత్తంగా ఉండాలంటున్న సైబర్ భద్రతా నిపుణులు

సాక్షి, హైదరాబాద్: సైబర్ నేరగాళ్లు పండుగలను సైతం వదలడం లేదు. దీపావళి సందర్భంగా ప్రత్యేక ఆఫర్లు..సర్‌ప్రైజ్ గిఫ్ట్‌ల పేరిట ప్రజలకు గాలం వేస్తున్నారు. వస్తువులు, దుస్తులు, గృహోపకరణాలు, ఎలక్ట్రానిక్ వస్తువులపై భారీ ఆఫర్ల పేరిట ఆన్‌లైన్‌లో నకిలీ ప్రకటనలు గుప్పిస్తున్నారు. ప్రముఖ కంపెనీల పేర్లను వాడుతూ ఫిషింగ్ లింక్‌లు పెడుతున్నట్టు సైబర్ భద్రత నిపుణులు పేర్కొంటున్నారు. పండుగ ఆఫర్ల కోసం అని ఎవరైనా వాటిపై క్లిక్ చేస్తే బ్యాంకు ఖాతా వివరాలు, ఇతర వ్యక్తిగత సమాచారం సేకరించి మోసాలకు పాల్పడుతున్నారని వారు హెచ్చరిస్తున్నారు. ప్రముఖ షాపింగ్‌మాల్స్‌లో ఎలాంటి కొనుగోళ్లు చేయకుండానే గిఫ్ట్ కూపన్స్ వచ్చాయని చెబుతూ బ్యాంకు ఖాతా వివరాలు ఇవ్వాలంటూ ఆశ పెడుతున్నారు. ఇలాంటి ఆఫర్లు, ఉచిత గిఫ్ట్‌ల కోసం ఆశపడవద్దని, అలాంటి ప్రకటనలు సైబర్ నేరగాళ్ల పని అని గుర్తించాలన్నారు.

ఈ జాగ్రత్తలు మరవొద్దు..

- ఉచితంగా ఏదీ, ఎవరూ ఇవ్వరు అన్న సత్యాన్ని గ్రహించాలి. మనం ఎలాంటి కొనుగోలు చేయకుండానే గిఫ్ట్ కూపన్స్ అంటూ వాట్సాప్, టెలిగ్రామ్, ఎస్ఎంఎస్‌ల రూపంలో వచ్చే మెసేజ్‌లకు స్పందించవద్దు.
- అనుమానాస్పద మెసేజ్‌లలోని లింక్‌లపై క్లిక్ చేయవద్దు..అందులో అడిగే వ్యక్తిగత, బ్యాంకు ఖాతా వివరాలు నమోదు చేయవద్దు.
- ఏదైనా ప్రముఖ కంపెనీ లేదా ఈ–కామర్స్ వెబ్‌సైట్ నుంచి గిఫ్ట్ కూపన్లు, ఆఫర్ల పేరిట మెసేజ్‌లు వస్తే..వెంటనే సదరు కంపెనీ లేదా ఈ–కామర్స్ అధికారిక వెబ్‌సైట్‌లో పరిశీలించాలి.
- మనకు వచ్చే మెసేజ్‌లలో కంపెనీల పేర్లలో కొన్ని అక్షరాల తేడాలు ఉండటం, అక్షర దోషాలు ఉన్నట్టు గుర్తిస్తే అది ఫేక్ అని గ్రహించాలి.
- ఆధార్ నంబర్, పాన్ కార్డు, డ్రైవింగ్ లైసెన్స్, బ్యాంకు ఖాతా నంబర్, ఏటీఎం, క్రెడిట్‌కార్డు నంబర్లు, సీవీవీ నంబర్లు, ఓటీపీలు ఎట్టి పరిస్థితుల్లోనూ ఎవరితోనూ పంచుకోవద్దు.
- ఫోన్లు, కంప్యూటర్లలో యాంటీ వైరస్‌లను వాడటం ఉత్తమం.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.